'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 299

మంగళవారం 20-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

అందరికీ అమ్మమ్మ

పిల్లల కోసమే కథలు రాస్తున్నా.. లిటరేచర్ ఫెస్టివల్‌లో సుధామూర్తి - 13లో

ప్లే ఆఫ్స్‌కు బెంగళూరు

డబ్ల్యూపీఎల్‌లో వరుసగా ఐదో విజయం.. 61 పరుగులతో గుజరాత్‌పై గెలుపు -14లో

న్యూస్‌రీల్

యువతిని మోసం చేసిన ఎస్‌ఐకి పదేళ్ల జైలు శిక్ష

యువతిని మోసం చేసిన ఎస్‌ఐకి పదేళ్ల జైలు శిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ గుంటూరు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శరత్ బాబు సోమవారం తీర్పు వెలువరించారు.

16లో

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

5లో

వినుకొండ బస్టాండ్‌లో తొక్కిసలాట

పల్నాడు జిల్లా వినుకొండ ఆర్టీసీ డిపోలో బస్సు ఎక్కేందుకు ఒకేసారి వందలాది మంది ప్రయాణికులు పోటీ పడటంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

16లో

'ఉచితం' పోయింది.. 'స్వచ్ఛందం' బూటకం

పంటల బీమా ఫట్!

చంద్రబాబు సర్కారు నిర్వాకాలు అన్నదాతల పాలిట శాపాలు

ఏపీని బ్లాక్‌లో పెట్టేసిన ఇన్సూరెన్స్ కంపెనీలు

- ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించకపోవడంతో బీమాకు 'నో'
- ప్రస్తుత రబీ సీజన్‌లో స్వచ్ఛంద నమోదు పోర్టల్‌ను ఓపెన్ చేయని కంపెనీలు
- మన రైతులు ప్రీమియం చెల్లించేందుకు కూడా అవకాశం ఇవ్వని వైనం
- గద్దెనెక్కగానే ఉచిత పంటల బీమాను అటకెక్కించిన చంద్రబాబు సర్కార్.. రైతులను భాగస్వామ్యం చేసేందుకు అంటూ తెరపైకి స్వచ్ఛంద పంటల బీమా
- ఏడాది తిరగకుండానే స్వచ్ఛంద బీమాకూ పాడెకట్టిన బాబు సర్కారు
- రైతులకు రూ.3,500 కోట్లకుపైగా బీమా పరిహారం ఎగనామం

2లో

వైఎస్ జగన్ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకం అమలు

రికార్డు స్థాయిలో ఐదేళ్లలో 54.48 లక్షల మందికి రూ.7,802.08 కోట్ల బీమా అందజేత

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన 34.41 లక్షల మంది రైతులకు మరో రూ.3,261.60 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు

డీజీపీ కార్యాలయం గేటు వద్ద బైఠాయించి ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పోలీసుల నిర్లక్ష్యంతోనే

సాల్మన్ హత్య

ఈ దారుణంపై సీబీఐ విచారణ జరిపించాలి

కారకులైన పోలీసులపై చర్య తీసుకోవాలి

సాల్మన్ కుటుంబానికి కోటి నగదు, ఐదెకరాల పొలం, ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్

ఎస్సీలపై జరుగుతున్న దాడులపై వినతిపత్రం ఇచ్చేందుకు డీజీపీ కార్యాలయానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు

- డీజీపీ కలవకపోవడంతో ఏడీజీకి వినతిపత్రం ఇచ్చిన నాయకులు
- చంద్రబాబు పాలనలో దళితుల ప్రాణాలకు రక్షణ లేదంటూ మండిపడ్డ నాయకులు
- సాల్మన్ హత్యపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎస్సీ కమిషన్‌ని ఆశ్రయిస్తామని వెల్లడి
- వారి కుటుంబానికి న్యాయం జరిగేదాకా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టీకరణ

2లో

ఆంధ్రజ్యోతికి భూ నజరానా

రూ.15 కోట్ల విలువైన ఏపీహెచ్‌బీ భూమి 50 సెంట్లు, ప్రభుత్వ భూమి 24 సెంట్లు కేటాయింపు

తొలుత విశాఖ పరదేశిపాలెంలో విలువైన 74 సెంట్లు కేటాయింపు

10లో

నిబంధనలకు విరుద్ధమని తేలడంతో 2020లో ఈ కేటాయింపు రద్దు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఆ భూమికి బదులు మరో భూమి కోరిన ఆంధ్రజ్యోతి

దీంతో ఏపీహెచ్‌బీ భూమి 50 సెంట్లు, ప్రభుత్వ భూమి 24 సెంట్లు కేటాయింపు

ఏపీహెచ్‌బీకి భూమార్పిడి కింద మరోచోట 64 సెంట్లు

మద్యం అక్రమ కేసులో మోహిత్‌కు భారీ ఊరట

గతంలో ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్ నిరవధిక పొడిగింపు

తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు అమల్లో ఉంటుందన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

కౌంటర్‌కు మరో రెండు నెలలు గడువు కోరిన సిట్‌పై అసహనం

ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసేందుకే ఇలా చేస్తున్నారని మండిపాటు

కాలయాపన కోసమే సిట్ పదేపదే వాయిదాలు కోరుతోందని ఘాటు వ్యాఖ్య

- వివరాలు 5లో

నాకు నోబెల్ ఇవ్వలేదు కాబట్టి..

శాంతి గురించి ఆలోచించను!

నార్వే ప్రధానికి పంపిన మెసేజీలో ట్రంప్

గ్రీన్‌లాండ్‌పై ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడి వితండవాదం

- వివరాలు 6లో

వెండి @ రూ. 3 లక్షలు

ఏకంగా రూ. 10 వేలు అప్

మరో కొత్త రికార్డు స్థాయికి బంగారం

రూ. 1,48,100కు జంప్

- వెండి రేటు సోమవారం ఏకంగా రూ. 3 లక్షల మార్కును దాటేసింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ. 10,000 ఎగిసి రూ. 3,02,600 పలికింది. మరోవైపు సిల్వర్‌కి దీటుగా బంగారం ర్యాలీ కూడా కొనసాగుతోంది. 99.9 శాతం స్వచ్ఛత గల పది గ్రాముల పసిడి రేటు న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో రూ. 1,900 పెరిగి సరికొత్త రికార్డు స్థాయి రూ.1,48,100కి చేరింది.

15లో

ఇదండీ సంగతి

ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, యూఏఈ నిర్ణయించాయి. 2032 నాటికి పరస్పర వార్షిక వాణిజ్యాన్ని ఏకంగా రూ.18 లక్షల కోట్లకు (200 బిలియన్ డాలర్లకు) పెంచుకోవాలని తీర్మానించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ప్రధాని నరేంద్ర మోదీ చర్చల సందర్భంగా పలు కీలక ఒప్పందాలు కుదిరాయి.

ఢిల్లీలో యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌కు స్వాగతం పలికి ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న ప్రధాని మోదీ

ద్వైపాక్షిక వాణిజ్యం..

రూ.18 లక్షల కోట్లకు!

6లో

భారత్, యూఏఈ నిర్ణయం.. కీలక రక్షణ భాగస్వామ్యం!

భారత్‌కు 5 లక్షల టన్నుల ఎల్‌ఎన్‌జీ

ప్రధాని మోదీ, నహ్యాన్ కీలక ఒప్పందాలు

యూఏఈ అధ్యక్షునికి మోదీ స్వాగతం

ఆత్మీయ ఆలింగనం, ఒకే కార్లో ప్రయాణం

పలు అంశాలపై గంటకు పైగా చర్చలు

బకాయిలు ఇవ్వరు.. గౌరవ వేతనం పెంచరు!

ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు మొండిచెయ్యి

- ఎన్నికలప్పుడు పెంచుతామంటూ చంద్రబాబు, పవన్ హామీ
- అధికారంలోకి వచ్చాక నిధులివ్వని టీడీపీ కూటమి సర్కారు
- ఎంపీటీసీలకు రూ.56 కోట్లు,, జెడ్పీటీసీలకు రూ.11 కోట్లు బాకీ
- 19 నెలల గౌరవ వేతనం చెల్లించాల్సిన పరిస్థితి
- ప్రతిపక్ష ప్రజాప్రతినిధులని అధికార పార్టీ నేతల కక్ష సాధింపు

3లో



జెడ్పీటీసీలకు గౌరవ వేతనాలు

ఎప్పటిలోగా చెల్లిస్తారు?

కడప జెడ్పీ సీఈవోను నిలదీసిన హైకోర్టు

3లో

ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న నిపుణుల బృందం

సమస్యలు 'ఊట'ంకిస్తూ

ప్రశ్నల వర్షం

- డయాఫ్రం వాల్ ఊట నీటి సమస్య పరిష్కారమైందా?
- మందం తగ్గినా సమర్థంగా పనిచేస్తుందా?
- కఠినశిలలోకి రెండు మీటర్ల లోతు వరకూ వేశారా?
- పోలవరం ప్రాజెక్టు అధికారులను ప్రశ్నించిన విదేశీ నిపుణులు
- నేడు ప్రధాన డ్యాం గ్యాప్-1, గ్యాప్-2లో జరుగుతున్న పనులు మరోసారి పరిశీలన

5లో

క్లుప్తంగా...

మహాకవి యోగి వేమనకు వైఎస్ జగన్ నివాళులు

సాక్షి, అమరావతి: మహాకవి యోగి వేమన జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ''యోగి వేమన శతకం కేవలం పద్యాలు మాత్రమే కాదు... అవి జీవిత సత్యాలు. మనిషి ఆత్మ పరిశీలనకు, జీవన ప్రయాణానికి ఆ పద్యాలు వెలుగు రేఖలు. ''మేడిపండు చూడ మేలిమైయుండు'', ''ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు'', ''ఆత్మశుద్ధి లేని ఆచారమేల'' అంటూ మనిషి మారితేనే సమాజం మారుతుందని శతాబ్దాల క్రితమే చెప్పిన వేమన జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుంటూ హృదయపూర్వక నివాళులు' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో సోమవారం వైఎస్ జగన్ పోస్టు చేశారు.

ఘనంగా వేమన జయంతి వేడుకలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా యోగి వేమన జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి శ్యామల రావు, సీఎం కార్యదర్శి ఏవీ రాజమౌళి తదితరులు యోగి వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ యోగి వేమన పేరు తెలియని తెలుగువారు ఉండరన్నారు. ప్రాథమిక విద్య తెలుగు వాచకంలో వేమన పద్యాలు, పాఠ్యాంశం తప్పనిసరిగా ఉంటాయన్నారు. తెలుగు సాహిత్యంలో వేమన శతకం ఓ కీర్తి కిరీటమన్నారు. సుమారు 1,165 వేమన పద్యాలతో మొదట పుస్తక రూపంలోకి తెచ్చింది బ్రిటీష్ అధికారి సీపీ బ్రౌన్ అని చెప్పారు.

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ

సాక్షి, అమరావతి: విద్యుత్ చార్జీల టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఈ నెల 20వ తేదీ బహిరంగ విచారణ చేపట్టనుంది. మంగళవారం తిరుపతిలో బహిరంగ విచారణ ప్రారంభమవుంది. ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలో, 27న కర్నూలులో విచారణ జరగనుంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఏపీఈఆర్‌సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)పై ఏపీఈఆర్‌సీ ఇన్‌చార్జ్ చైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది. ఇందులో ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజలు అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేయవచ్చు. ఇందుకోసం ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీఈఆర్‌సీ చెప్పడంతో 41 మంది నమోదు చేసుకున్నారు.

నేటి నుంచి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ధర్నా

సాక్షి, అమరావతి: పారిశ్రామిక రాయితీ బకాయిల విడుదల కోసం ఈ నెల 20న మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక రాయితీల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించింది. గత ఆగస్టు నుంచి అనేక పర్యాయాలు ధర్నాలు చేసినా ప్రభుత్వం దిగి రాకపోవడంతో నిరవధిక ధర్నాకు సిద్ధమైనట్లు తెలిపింది.

పిండాలు మీ ఇంటి వద్దే పెట్టుకోండనడం బ్రాహ్మణులను అవమానించడమే

- టీడీపీ విశాఖ దక్షిణ సమన్వయకర్త సీతంరాజు సుధాకర్ అవమానకర వ్యాఖ్యలు
- చంద్రబాబు ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు : చాణుక్య చైతన్య వేదిక

మహారాణిపేట (విశాఖ): పితృ కార్యాల భవనానికి తాళం తీయించాలని అడిగిన పాపానికి 'పిండాలు మీ ఇంటి వద్దే పెట్టుకోండి..' అని విశాఖ దక్షిణ టీడీపీ సమన్వయకర్త సీతంరాజు సుధాకర్ అనడం బ్రాహ్మణులను అవమానించడమేనని చాణుక్య చైతన్య వేదిక ప్రతినిధి నూకల సూర్యప్రకాష్ తీవ్రంగా మండిపడ్డారు. జీవీఎంసీ 30వ వార్డు మహారాణిపేట, మంథావారి వీధిలో 1902 నుంచి దాదాపు 120 ఏళ్లుగా పితృ కార్యాల నిర్వహణకు వినియోగిస్తున్న ఒక ప్రైవేటు భవనానికి ఇప్పుడు అధికార టీడీపీ కార్పొరేటర్ తాళాలు వేయడం, అనుచరులతో వచ్చి దౌర్జన్యం చేయడం పద్ధతి కాదన్నారు. ఇది హిందువుల మనోభావాలపై దాడి చేయడమేనని సోమవారం ఆయనొక ప్రకటనలో ఆరోపించారు. స్థానికుల అభ్యంతరం మేరకే ఈ పనిచేశానని కార్పొరేటర్ చెప్పడం, ఆ విషయాన్ని స్థానిక నాయకులు సమర్థించడం చూస్తుంటే ఇదంతా ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనని అర్థమవుతోందని సూర్యప్రకాష్ పేర్కొన్నారు. పితృ కార్యాలు నిర్వహించుకునే భవనాన్ని మూసివేయడం వల్ల బ్రాహ్మణ సమాజం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో ఇబ్బంది పడుతుందన్నారు. ఇటువంటి బ్రాహ్మణ వ్యతిరేక, హిందూ వ్యతిరేక చర్యల వల్ల, ఇలాంటి నాయకుల వల్ల తెలుగుదేశం పార్టీకి ఎంతో నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ పితృ కార్యాల భవన సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

పంటల బీమా ఫట్!

చంద్రబాబు సర్కారు నిర్వాకాలు అన్నదాతల పాలిట శాపాలు
ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లో పెట్టేసిన ఇన్సూరెన్స్ కంపెనీలు
మన రైతులు ప్రీమియం చెల్లించేందుకు కూడా అవకాశం ఇవ్వని వైనం

నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పి.లింగాపురం గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి గత ఖరీఫ్‌లో 8 ఎకరాల్లో మొక్కజొన్న, 4 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అప్పులు చేసి రూ.4.40 లక్షలు పెట్టుబడి పెట్టారు. అధిక వర్షాలకు తోడు మద్దతు ధరలు లేకపోవడంతో రూ.3 లక్షలకు పైగా నష్టపోయాడు. ఆర్థిక ఇబ్బందులతో పత్తికి రూ.6 వేలు బీమా ప్రీమియం చెల్లించినా ప్రభుత్వం తన వాటా డబ్బులు కట్టకపోవడంతో రైతుకు పైసా కూడా పరిహారం అందలేదు. ఇదే రైతు పైసా ప్రీమియం చెల్లించకపోయినా వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.50 వేల వరకు బీమా పరిహారం అందిందని, సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇచ్చారని గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో అన్ని విధాలుగా నష్టపోయామని ఆక్రోశిస్తున్నారు.



కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జాష్ల తండాకు చెందిన నారాయణ నాయక్ 8 ఎకరాల్లో వేరుశనగ, కంది, మిరప, ఉల్లి పంటలు సాగు చేశారు. ప్రీమియం భారం కావడంతో ఏ ఒక్క పంటకూ బీమా చేసుకోలేకపోయారు. ఈ ఏడాది అధిక వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బీమా పరిహారం కాదు కదా.. కనీసం నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) కూడా అందలేదు. ఉచిత పంటల బీమా పథకం పుణ్యమాని జగన్ ప్రభుత్వంలో పైసా ప్రీమియం చెల్లించకపోయినా ఐదేళ్లలో రూ.1.50 లక్షల వరకు లబ్ధి పొందానని చెబుతున్నారు. తమ గ్రామంలో 60 శాతం మంది రైతులకు రూ.2 లక్షలకు పైగా ప్రయోజనం పొందారని వెల్లడించారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేయడంతో సీమ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, చంద్రబాబు ప్రభుత్వంలో తీరని అన్యాయం జరుగుతోందని మండిపడుతున్నారు.

సాక్షి, అమరావతి: అధికారంలోకి రాగానే ఉచిత పంటల బీమాను ఎగరగొట్టిన చంద్రబాబు సర్కారు.. ఏడాది తిరగకుండానే 'స్వచ్ఛంద పంటల బీమా' పథకానికి సైతం మంగళం పాడేసింది! ప్రీమియం బకాయిలు చెల్లించకుండా చంద్రబాబు సర్కార్ చేతులెత్తేయడంతో జాతీయ స్థాయిలో ఇన్సూరెన్స్ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు కనీసం స్వచ్ఛందంగా ప్రీమియం చెల్లించేందుకు కూడా అనుమతించడం లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్‌ను ఓపెన్ చేసేందుకు సైతం నిరాకరించాయి. దేశవ్యాప్తంగా ఏపీ పరువును మంటగలిపిన చంద్రబాబు సర్కారు రైతులకు పంటల బీమాను పూర్తిగా దూరం చేసింది.

ఉచిత పంటల బీమాను అటకెక్కించి..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాటు పైసా కూడా భారం పడకుండా రైతులకు అండగా నిలిచిన ఉచిత పంటల బీమా పథకాన్ని చంద్రబాబు సర్కారు అధికార పగ్గాలు చేపట్టగానే అటకెక్కించేసింది. ఉచిత పంటల బీమాను ఎగరగొట్టేసి.. 2024 రబీ సీజన్ నుంచి స్వచ్ఛంద నమోదు బీమా పథకాన్ని తెరపైకి తెచ్చింది. రైతులను భాగస్వామ్యం చేయడం ద్వారా మెరుగైన రీతిలో పంటల బీమా అమలు కోసమే ఈ పథకాన్ని తెచ్చామంటూ నమ్మబలికింది. అయితే ప్రీమియం భారం భరించలేక 80 శాతానికి పైగా రైతన్నలు పంటల బీమాకు దూరమైపోయారు. రబీ 2024–25 సీజన్ నుంచి శ్రీకారం చుట్టిన స్వచ్ఛంద బీమా పథకంలో చేరేందుకు ప్రీమియం భారం కారణంగా రైతన్నలు ఆసక్తి చూపకపోవడంతో 48 లక్షల ఎకరాలకు గానూ 9.92 లక్షల ఎకరాలలోసాగైన పంటలకు మాత్రమే బీమా కవరేజ్ దక్కింది. 40 లక్షల మంది రైతులకుగానూ 7.64 లక్షల మంది మాత్రమే బీమా చేయించుకోగలిగారు. ఇక ఖరీఫ్ 2025 సీజన్‌లో దాదాపు 72.90 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా 19.58 లక్షల ఎకరాలకే బీమా కవరేజ్ లభించింది. దాదాపు 50 లక్షల మంది రైతులు పంటలు సాగు చేయగా కేవలం 19.40 లక్షల మంది మాత్రమే పంటలకు బీమా ప్రీమియం చెల్లించగలిగారు.

ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో..

ఉచిత పంటల బీమాకు సంబంధించి ఖరీఫ్–2024 సీజన్‌లో రైతుల వాటాతో కలిపి ప్రభుత్వం రూ.834.44 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించాల్సి ఉంది. ఇక స్వచ్ఛంద బీమా అమలులోకి వచ్చిన తరువాత ప్రభుత్వ వాటా కింద రబీ–2024 సీజన్‌లో రూ.88.07 కోట్లు. ఖరీఫ్–2025 సీజన్‌కు రూ.172.60 కోట్లు చెల్లించాలి. అంతేకాదు.. 2023–24 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి జూన్ 2024 తర్వాత చెల్లించాల్సిన రూ.1,324.33 కోట్ల ప్రీమియం బకాయిలు చంద్రబాబు సర్కార్ ఎగనామం పెట్టింది. ప్రభుత్వ వాటా ప్రీమియం డబ్బులు చెల్లించకపోవడంతో రైతులకు పరిహారం దక్కని దుస్థితి నెలకొంది.

రూ.3,500 కోట్ల బీమా పరిహారానికి దూరం..

చంద్రబాబు ప్రభుత్వం గద్దెనెక్కింది మొదలు ప్రతి సీజన్‌లోనూ కరువు, కాటకాలు, మద్దతు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఓవైపు వర్షాభావ పరిస్థితులు, మరోకవైపు అకాల వర్షాలు, ముంచెత్తిన వరదలతో పంటలు దెబ్బతిన్నాయి. అదే.. ఉచిత పంటల బీమా పథకం అమలులో ఉండి ఉంటే... సకాలంలో చంద్రబాబు ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం వాటా కట్టి ఉంటే 2023–24, 2024–25 వ్యవసాయ సీజన్లకు సంబంధించి కనీసం రూ.3,500 కోట్లకుపైగా బీమా పరిహారం అన్నదాతలకు అంది ఉండేది.

ఫసల్ బీమా జాబితాలో ఏపీ ఔట్..!

చంద్రబాబు ప్రభుత్వం ప్రీమియం బకాయిలు చెల్లించని కారణంగా ప్రస్తుతం రబీ సీజన్‌లో కనీసం బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు కూడా ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు రాలేదు. ఏపీలో తాము ఫసల్ బీమాలో చేరబోమని తెగేసి చెప్పాయి. ఒక విధంగా చెప్పాలంటే.. ఏపీని పూర్తిగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశాయని పేర్కొంటున్నారు. జాతీయ స్థాయిలో ఫసల్ బీమా పరిధిలోకి వచ్చే రాష్ట్రాల జాబితా నుంచి ఏపీని తొలగించాయి. దీంతో ప్రస్తుత రబీ సీజన్‌లో కనీసం పోర్టల్ కూడా తెరవలేదు. చంద్రబాబు సర్కారు నిర్వాకాల ఫలితంగా.. రుణాలు పొందని రైతులే కాదు, రుణాలు తీసుకునేవారు కూడా పంటలకు ప్రీమియం చెల్లించేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో గడిచిన రబీ సీజన్‌లో తెరపైకి తెచ్చిన స్వచ్ఛంద నమోదు పంటల బీమా పథకం ఏడాది తిరక్కుండానే అటకెక్కినట్టైంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులను పంటల బీమా పరిధిలోకి రాకుండా చంద్రబాబు ప్రభుత్వం దగా చేసింది. కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ అయినా సకాలంలో ఇచ్చిందా.. అంటే అదీ లేదు. 19 నెలల్లో కరువు బకాయిలతో సహా రూ.1,100 కోట్లకు పైగా ఎగనామం పెట్టింది.

వైఎస్ జగన్ హయాంలో పైసా భారం పడకుండా..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019–24 మధ్య రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయడమే కాదు.. ఏ సీజన్‌కు చెందిన బీమా పరిహారాన్ని మరుసటి ఏడాది అదే సీజన్ ముగిసేలోగా జమచేసి అండగా నిలిచింది. దేశంలో మరెక్కడాలేని విధంగా ఈ – క్రాప్ నమోదే ప్రామాణికంగా నోటిఫై చేసిన పంటలకు యూనివర్శల్ కవరేజ్ కల్పించింది. ఈ – క్రాప్ ప్రామాణికంగా ఏటా సగటున 1.08 కోట్ల ఎకరాల చొప్పున ఐదేళ్లలో 5.42 కోట్ల ఎకరాలకు బీమా కవరేజ్ కల్పించింది. ఏటా సగటున 50 లక్షల మంది చొప్పున ఐదేళ్లలో రెండున్నర కోట్ల మంది రైతులకు బీమా రక్షణ దక్కింది. ప్రభుత్వ వాటాతో పాటు రైతుల తరపున రూ.3,022.26 కోట్లను ప్రీమియం రూపంలో కంపెనీలకు వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో 30.85 లక్షల మందికి కేవలం రూ.3,411.20 కోట్ల మేర బీమా పరిహారం మాత్రమే అందిస్తే.. 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం 54.55 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.7,802.08 కోట్ల మేర పరిహారాన్ని అందజేసి ఆదుకుంది. ఇక వైపరీత్యాల వేళ పంటలు దెబ్బతిని నష్టపోయిన 34.41 లక్షల మంది రైతులకు మరో రూ.3,261.60 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్ట పరిహారం) జమ చేసింది. ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీని అదే సీజన్ ముగిసేలోగానే జమ చేసి అన్నదాతలకు ప్రతి అడుగులో తోడుగా నిలిచింది.

వైఎస్ జగన్ హయాంలో పంటల బీమాతో లబ్ధి

సీజన్	రైతుల సంఖ్య లక్షల్లో	బీమా మొత్తం (రూ.కోట్లల్లో)
2014-19 బకాయిలు	6.20	715.84
2019-20	9.48	1,252.19
2020-21	13.00	1,739.00
2021-22	15.61	2,977.84
2022-23	10.26	1,117.21
మొత్తం	54.55	7,802.08

జగన్ ప్రభుత్వంలో రూ.50 వేల నష్టపరిహారం వచ్చింది

2022–23లో సుమారు 10 ఎకరాల్లో మిర్చి, పత్తి సాగు చేశా. అప్పట్లో వచ్చిన తుపాన్‌తో పంటలు దెబ్బతిని దిగుబడులు రాలేదు. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా అమలులో ఉండటంతో అదే సీజన్‌లో నా అకౌంటులో సుమారు రూ.50 వేలు పంట నష్టపరిహారం అందింది. దీంతో నేను కోలుకుని మళ్లీ పంటలు సాగు చేసుకోగలిగా.
– రామిరెడ్డి, రైతు, బొడిచర్ల, మార్కాపురం మండలం, మార్కాపురం జిల్లా

బాబు ప్రభుత్వం నిలిపేసింది...

20 ఎకరాల్లో వేసిన మిరప పంట అధిక వర్షాలతో దెబ్బతినగా వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.2.80 లక్షల బీమా పరిహారం వచ్చింది. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని నిలిపివేసింది. రైతులే కట్టుకోవాలన్నారు. ప్రీమియం భారం కావడంతో చెల్లించలేదు. ఖరీఫ్–24లో మిరప పంట దెబ్బతింది.. కానీ పైసా పరిహారం రాలేదు.
– గరికిపాటి పున్నారావు, చిననందిపాడు, పర్చూరు మండలం, బాపట్ల జిల్లా

ఉచిత పంటల బీమాతో భరోసా..



నాకు 2.50 ఎకరాలు పొలం ఉంది. వరి సాగు చేస్తున్నా. రెండేళ్లుగా వరుస వైపరీత్యాల వలన పంట దెబ్బ తినడంతో దిగుబడులు తగ్గిపోయాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో పైసా ప్రీమియం చెల్లించ కుండానే బీమా పరిహారం జమ చేసే వారు. ఉచిత పంటల బీమాతో భరోసాగా ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేయడంతో రైతులకు బీమా దూరమైంది. ఆర్థిక భారం తట్టుకోలేక నేను ప్రీమియం చెల్లించలేదు. ప్రీమియం చెల్లించిన రైతులకు సైతం రెండేళ్లుగా పరిహారం అందలేదు. ఆర్థికంగా చాలా నష్టపోయా.
–కె.పెంచలయ్య, నెల్లిపూడి గ్రామం, వాకాడు మండలం, తిరుపతి జిల్లా

జగన్ హయాంలో రూ.2 లక్షల బీమా పరిహారం

2021లో అధిక వర్షాలకు పంట నష్టం జరగడంతో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఉచిత పంటల బీమా పథకం కింద పెద్ద మొత్తంలో పరిహారం అందించారు. ఐదు ఎకరాల్లో మిరప దెబ్బ తినడంతో ఉచిత పంటల బీమా కింద రూ.2 లక్షల పరిహారం జమ అయ్యింది. అంత మొత్తంలో పరిహారం వస్తుందని ఊహించలేదు. దీంతో పాటు అంతో ఇంతో పంట కూడా చేతికివచ్చింది. నాతో పాటు మా మండలంలోని మిరప రైతులకు లక్షలాది రూపాయల పరిహారం అందింది. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమా ఎత్తేసి ప్రీమియం భారం మోపడంతో రైతులు ఆసక్తి చూపించడం లేదు. ఇప్పుడు బీమా పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదు.
– అశోక్‌రెడ్డి, రైతు, గడేకల్లు, విడపనకల్లు మండలం, అనంతపురం జిల్లా

పోలీసుల నిర్లక్ష్యంతోనే సాల్మన్ హత్య

ఈ దారుణ హత్యపై సీబీఐ విచారణ జరిపించాలి

- కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- సాల్మన్ కుటుంబానికి కోటి నగదు, ఐదెకరాల పొలం, ప్రభుత్వ ఉద్యోగమివ్వాలి
- వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్

డీజీపీ ఆఫీసు వద్ద మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సాక్షి, అమరావతి: పోలీసుల నిర్లక్ష్య వైఖరితోనే మందా సాల్మన్ హత్య జరిగిందని.. సీఎం చంద్రబాబు కుట్రతోనే పక్కా పథకం ప్రకారం సాల్మన్‌ని అతి దారుణంగా పట్టపగలు ఇనుపరాడ్లతో కొట్టి చంపారని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పల్నాడు జిల్లాలోని పిన్నెల్లి గ్రామంలో ఎస్సీ నాయకుడు మందా సాల్మన్ దారుణహత్య నేపథ్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు డీజీపీకి వినతిపత్రం ఇవ్వడానికి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. రాష్ట్రంలో దిగజారిపోతున్న శాంతిభద్రతలు, ఎస్సీలపై జరుగుతున్న దాడులపై డీజీపీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. సాల్మన్‌ది కచ్చితంగా ప్రభుత్వ హత్యేనని, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సాల్మన్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు కోటి రూపాయల పరిహారం, ఐదెకరాల పొలం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు ఈ హత్య ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన నాటినుంచి దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు నిర్వీర్యం అయ్యాయని చెప్పడానికి మందా సాల్మన్ హత్యే తాజా నిదర్శనమని చెప్పారు. కళ్ల ముందు దారుణాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్న పోలీసులు రాబోయే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. డీజీపీకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో డీజీపీ కార్యాలయం గేటు వద్దనే బైఠాయించి ధర్నా చేశారు. దీంతో దిగివచ్చిన పోలీసులు వారిని లోపలికి అనుమతించి ఏడీజీకి వినతిపత్రం ఇప్పించి పంపించారు. ముందస్తు సమాచారం ఉన్నా తమను కలవకపోవడంతో ప్రజాసమస్యలను వినడానికి కూడా డీజీపీకి ఓపిక లేదా అని వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే న్యాయస్థానాలను, జాతీయ మానవహక్కుల సంఘాన్ని (ఎన్‌హెచ్‌ఆర్‌సీని), నేషనల్ ఎస్సీ కమిషన్‌ని ఆశ్రయిస్తామని చెప్పారు. సాల్మన్ కుటుంబానికి న్యాయం జరిగేదాకా వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, మాజీమంత్రులు అంబటి రాంబాబు, వెలంపల్లి శ్రీనివాస్, విడదల రజిని, మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, మల్లాది విష్ణు, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు టి.జె.ఆర్.సుధాకర్‌బాబు, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ, ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయిస్తాం

గతంలో బిహార్‌లో జంగిల్రాజ్ గురించి దేశమంతా మాట్లాడుకునేది. ఇప్పుడు ఏపీలో చంద్రబాబు నేతృత్వంలో అమలవుతున్న దొంగల రాజ్యం, డెకాయిట్ రాజ్యాన్ని ప్రజలు కళ్లారా చూస్తున్నారు. ఎంతోమంది వేధింపులు అనుభవిస్తున్నారు. ఒక్క పిన్నెల్లి గ్రామంలోనే దాదాపు 200 కుటుంబాలను ఊరి నుంచి వెలివేస్తే.. పోలీసు ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం శూన్యం. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఊరి బయటే ఉంటున్న సాల్మన్.. భార్య అనారోగ్యంతో ఉందని వస్తే నిర్దాక్షిణ్యంగా చంపేశారు. కోమాలో ఉన్న వ్యక్తి మీద 324 సెక్షన్ కింద కేసు పెట్టారు. ఆధార్ కార్డులు చూపిస్తేనే శ్మశానానికి అనుమతిస్తామంటూ దిక్కుమాలిన నిర్ణయం తీసుకున్నారు. సాల్మన్ హత్యపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం. ఎన్‌హెచ్‌ఆర్‌సీని, ఎస్సీ కమిషన్‌ని ఆశ్రయిస్తాం. న్యాయం జరిగేదాకా వైఎస్సార్‌సీపీ పోరాటం ఆపదు. సాల్మన్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరపున రూ.5 లక్షల పరిహారం ప్రకటించాం.
– కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

డీజీపీ కనీసం పట్టించుకోలేదు

అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడటానికి వచ్చిన మందా సాల్మన్‌ను టీడీపీ గూండాలు దారుణంగా కొట్టి చంపేశారు. పోలీసుల ఉదాసీన, నిర్లక్ష్యవైఖరి కారణంగానే సాల్మన్ హత్య జరిగింది. సాల్మన్ మీద జరిగిన దాడి గురించి ఫోన్ చేసి చెప్పినా, ఆయన భార్య స్వయంగా వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. పైగా చావు బతుకుల మధ్య ఉన్న సాల్మన్‌పైనే 324 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పోలీసుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేయడానికి ప్రతిపక్ష నాయకులు వచ్చినా డీజీపీ పట్టించుకోలేదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక 15 సార్లకు పైగా వివిధ అంశాలపై ఫిర్యాదు చేయడానికి వచ్చినా డీజీపీ కనీస బాధ్యతగా వ్యవహరించలేదు. సాల్మన్ హత్యపై ఉన్నత స్థాయి విచారణ జరపాలి.
– అంబటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి

సీబీఐ విచారణ జరిపించాలి

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులు ప్రాణాలతో ఉండాలంటే ఊళ్లు వదిలేసి బయట తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. భార్యకు ఆరోగ్యం బాలేదని చూడటానికి వెళ్లిన వ్యక్తిని ఇనుపరాడ్లతో కొట్టి అతి దారుణంగా చంపేశారు. నిందితులను అరెస్ట్ చేయాల్సిన పోలీసులు.. వారిచ్చిన ఫిర్యాదుతో ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య ఉన్న సాల్మన్ మీదనే కేసు పెట్టిన దౌర్భాగ్య పరిస్థితి. సాల్మన్ హత్య పథకం ప్రకారమే జరిగింది. రాష్ట్రంలో దళితులు వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటున్నారన్న కక్షతో వారిని భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా ఈ హత్య జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చాక దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రిపోర్టులు కూడా దేశంలో ఎక్కువ నేరాలు ఏపీలోనే నమోదవుతున్నట్లు వెల్లడిస్తున్నాయి. రెడ్ బుక్ రాజ్యాంగంతో దళిత బిడ్డల్ని వేధిస్తున్నారు.
– మేరుగ నాగార్జున, మాజీ మంత్రి

వైఎస్సార్‌సీపీకి దూరం చేసే కుట్ర

సాల్మన్ దారుణ హత్యపై డీజీపీకి ఫిర్యాదు చేసేందుకు ముందస్తుగా అనుమతి తీసుకుని వచ్చిన మమ్మల్ని ధర్నా చేస్తేగానీ కార్యాలయం లోపలికి అనుమతించలేదు. డీజీపీని కలవడానికి ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు వచ్చినా ఆయనకు సమయం లేకపోయింది. సాధారణ వ్యక్తులతో వ్యవహరించినట్టు కూడా పోలీసులు ప్రవర్తించలేదు. స్థానిక సీఐ, ఎస్ఐల తీరుని వివరించాలని వచ్చిన మమ్మల్ని కనీసం సమస్య చెప్పుకోనివ్వలేదు. వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్న దళితులను దూరం చేయాలన్న కుట్రతోనే పథకం ప్రకారం దళితులపై సీఎం చంద్రబాబు దాడులు చేయిస్తున్నాడు. దళితుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీయాలన్న వ్యూహాలు రచిస్తున్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మీద అట్రాసిటీ కేసు నమోదు చేసి సాల్మన్ కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇచ్చే వరకు వైఎస్సార్‌సీపీ ఉద్యమిస్తుంది.
– టి.జె.ఆర్.సుధాకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

దళితుడిని పట్టపగలు దారుణంగా తలపగలగొట్టి చంపితే ప్రభుత్వం నుంచిగానీ టీడీపీ నుంచిగానీ కనీస స్పందన లేదు. ఎన్నికలొచ్చినప్పుడల్లా పెద్ద మాదిగనని చెప్పుకొనే సీఎం చంద్రబాబు.. మాదిగ కులస్తుడు మందా సాల్మన్‌ని దారుణంగా చంపితే ఎందుకు పట్టించుకోవడం లేదు? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మ విశ్వాసంతో బతికిన దళితులు కూటమి ప్రభుత్వం వచ్చాక బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తోంది. దళితులను దారుణంగా వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి పతనం తప్పదు. సాల్మన్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలి. టీడీపీలో ఉన్న దళిత నాయకులు కూడా చంద్రబాబుపై ఒత్తిడి తేవాలి.
– మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ

అమెరికాకు నో.. కెనడాకే జై

350 శాతం వృద్ధితో తొలిస్థానంలో నిలిచిన కెనడా

- విదేశీ విద్య కోసం మారుతున్న భారతీయ విద్యార్థుల ఎంపిక
- 2024–25లో రెండో స్థానానికి దిగజారిన అమెరికా
- ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి మూడో స్థానంలోకి యూకే
- 2016–2024 మధ్య అవుట్ బౌండ్ విద్యార్థుల్లో వార్షిక వృద్ధి 8.84 శాతం నమోదు

సాక్షి, అమరావతి: విదేశీ విద్యలో భారతీయ విద్యార్థుల ఎంపిక మారుతోంది. దశాబ్దాలపాటు తొలి స్థానంలో నిలిచిన అగ్రరాజ్యం అమెరికాను కాదని పక్కనే ఉన్న కెనడాకు క్యూ కడుతున్నారు. ఫలితంగా విదేశీ విద్యా గమ్యస్థానాల్లో యూఎస్ రెండో స్థానానికి దిగజారిపోయింది. 2024–25 విద్యా సంవత్సరంలో కెనడా తొలిస్థానంలో నిలిచింది. మరోవైపు ఆస్ట్రేలియాను అధిగమించి యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మూడో స్థానానికి ఎగబాకింది. ప్రపంచీకరణ, నాణ్యమైన ఉన్నత విద్య కోసం భారతీయుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఫలితంగా విదేశాల బాటపడుతున్న వారి సంఖ్య అధికం అవుతోంది. అయితే అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య 2016లో 4.24 లక్షలు ఉండగా... 2024 నాటికి 3.38 లక్షలకు పడిపోయింది. ఈ క్రమంలోనే భారత విద్యార్థుల దృష్టి అమెరికాను ఆనుకుని ఉన్న కెనడా వైపు మళ్లుతోంది. అతి తక్కువ కాలంలోనే ఇక్కడ విద్యార్థుల చేరికల్లో భారత్ ఏకంగా 350 శాతం వృద్ధిని కనబరిచింది. 2020లో 1.79 లక్షల నుంచి 2024కు 4.27 లక్షలకు దూసుకెళ్లింది. దీంతో కెనడా అగ్రస్థానంలో కొనసాగుతోంది.

నాణ్యమైన విద్యకే ప్రాధాన్యం

ప్రపంచంలోనే అతి పెద్ద అంతర్జాతీయ మార్కెట్ కలిగిన భారత అవుట్ బౌండ్ విద్యార్థుల్లో 2016–2024 మధ్య ఏకంగా 8.84 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదు కావడం విశేషం. భారతీయ విద్యార్థులు వైద్యం, సాంకేతిక రంగాల్లో నాణ్యమైన విద్యను అందించే దేశాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఫలితంగా భారతీయ విద్యార్థుల విదేశీ విద్య ఎంపికలో ఆస్ట్రేలియా నాలుగేళ్లు (2016–2020) మూడో స్థానంలో స్థిరంగా ఉంది. ఆ తర్వాత ఒడిదుడుకులకు లోనయ్యింది. అయితే 2024లో 1.22 లక్షల విద్యార్థుల స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ నాలుగో స్థానానికి దిగజారింది. ఆస్ట్రేలియాను వెనక్కి నెడుతూ యూకే మూడో స్థానంలోకి వచ్చింది. ఈ దేశంలో 2016లో విద్యను అభ్యసించే భారతీయ విద్యార్థుల సంఖ్య 16,559 నుంచి 2020లో 90,300కి చేరుకోగా 2024 నాటికి ఏకంగా 1.85 లక్షలకు పెరిగింది. దీంతోపాటు యూఏఈ, మధ్య ఆసియా ప్రాంతమైన కిర్గిస్తాన్ కూడా భారతీయ విద్యార్థుల ఎంపిక జాబితాలో చేరాయి. రష్యా, జార్జియా, ఫిలిప్పీన్స్ 2020 నుంచి టాప్–10లో నిలుస్తున్నాయి.



క్లుప్తంగా...

బంగ్లాదేశ్‌లో బందీగా ఉన్న మత్స్యకారులకు విముక్తి

మరో మూడు, నాలుగు రోజుల్లో విశాఖకు..

మహారాణిపేట(విశాఖ): బంగ్లాదేశ్‌లో మూడు నెలలుగా బందీలుగా ఉన్న తొమ్మిది మంది విశాఖ మత్స్యకారులకు ఎట్టకేలకు విముక్తి లభించింది. గతేడాది అక్టోబర్ 22న 'ఎంఎం 735' నంబరు గల బోటులో వేటకు వెళ్లిన వీరు ఇంజిన్ చెడిపోవడంతో అలల తాకిడికి బంగ్లాదేశ్ సరిహద్దుల్లోకి కొట్టుకుపోయారు. ఆ దేశ కోస్ట్‌గార్డులు మత్స్యకారులను అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. అప్పటి నుంచి వారి విడుదలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెకనైజ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్‌తో పాటు అడ్వకేట్ జెనరల్ న్యాయ సాయం అందించారు. దీంతో మత్స్యకారుల విడుదలకు మార్గం సుగమమైందని అసోసియేషన్ నేతలు పి.లక్ష్మయ్య, పీసీ అప్పారావు తెలిపారు. మరో మూడు, నాలుగు రోజుల్లో మత్స్యకారులు స్వస్థలానికి చేరుకోనున్నారని తెలిపారు. బోటు డ్రైవర్ భార్య కొండమ్మకు సంఘం గౌరవాధ్యక్షుడు పీసీ అప్పారావు, అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు పరశురాముడు, కార్యదర్శి సుమంత్ బాలాజీ తదితరులు స్వీటు తినిపించి విషయం తెలిపారు.

ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

పుట్టపర్తి టౌన్/తనకల్లు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పుట్టపర్తి అర్బన్ సీఐ శివాంజనేయులు, తనకల్లు ఎస్ఐ గోపీ, ఇదే పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున తనకల్లు పోలీస్‌స్టేషన్ గేటు ముందు మార్పురివాండ్లపల్లికి చెందిన ఈశ్వరప్పను రాగినేపల్లికి చెందిన ఎర్రి హరి మరో ముగ్గురు కలిసి వేట కొడవళ్లతో నరికి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన పోలీసుల ఎదుటే జరిగింది. దీంతో ఎస్ఐ గోపీని అప్పట్లోనే వీఆర్‌కు పంపారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం తాజాగా హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అలాగే సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకోవడంతో పాటు డబ్బు తీసుకుని హత్య కేసును పక్కదారి పట్టించడం, సత్యసాయి జయంత్యుత్సవాల పేరిట భారీగా వసూళ్లకు పాల్పడడం వంటి ఆరోపణల నేపథ్యంలో పుట్టపర్తి అర్బన్ సీఐ శివాంజనేయులును సస్పెండ్ చేశారు.

12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

మాట్లాడుతున్న నర్సింగరావు

కృష్ణలంక (విజయవాడ తూర్పు): దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో కార్మికులు, రైతులు భాగస్వాములై జయప్రదం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులతో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలు మార్చవద్దని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు ఎంత కోరినా పట్టించుకోలేదన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ సమ్మెను విఫలం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ మంత్రి, రైతు ఉద్యమ నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో భాగంగా రైల్వే, బస్సు, ఆటోలను నిలుపుదల చేయాలన్నారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, అన్ని రంగాల కార్మికులు ముందుండి పోరాడితే సమ్మె విజయవంతం అవుతుందన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, సంఘం రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు మాట్లాడారు.

బకాయిలు ఇవ్వరు.. గౌరవ వేతనం పెంచరు!

ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు చంద్రబాబు సర్కార్ మొండిచెయ్యి

సాక్షి, అమరావతి: సర్పంచ్‌ల నుంచి జెడ్పీ చైర్మన్ల వరకు గ్రామీణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాన్ని పెంచుతామంటూ 2024 ఎన్నికలప్పుడు ఊదరగొట్టిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక వారికి మొండిచెయ్యి చూపించాయి. కనీసం వేతనాలు కూడా చెల్లించలేదు. ఫలితంగా రూ.కోట్లలో వారి బకాయిలు పేరుకుపోయాయి. ఎంపీటీసీలకు ప్రభుత్వం నెలవారీగా ఇచ్చే గౌరవ వేతనమే రూ.మూడు వేలైతే, ఆ చిన్నమొత్తాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేక చతికిలపడుతోంది. దీంతో.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 9,500 ఎంపీటీసీలకు సుమారు రూ.56 కోట్లు బకాయి ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒక్కో ఎంపీటీసీకి ప్రభుత్వం 19 నెలల గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. అలాగే, జెడ్పీటీసీల నెలవారీ గౌరవ వేతనం రూ.6,000ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 660 మందికి దాదాపు రూ.11 కోట్లు బకాయి పడింది.

కూటమి నేతల కక్షసాధింపు..

2021లో జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో దాదాపు 80 శాతం స్థానాలను నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గెలుచుకుంది. అయితే, ఇప్పుడు రాష్ట్రంలో టీడీపీ–జనసేన–బీజేపీల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ప్రతిపక్ష పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతన బిల్లులు పెట్టే విషయంలో కూటమి పార్టీల నేతలు కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం పేరుకు బడ్జెట్‌లో వీరికి నిధుల కేటాయిస్తున్నప్పటికీ వాటి మంజూరు దగ్గరకొచ్చేసరికి మోకాలడ్డుతున్నట్లు ప్రజాప్రతినిధుల సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా ఎంపీటీసీల గౌరవ వేతన బిల్లులను ప్రతి నెలా ఆయా మండల ఎంపీడీఓలు.. జెడ్పీటీసీలకు సంబంధించినవి జెడ్పీ సీఈఓలు సీఎఫ్ఎంఎస్‌లో నమోదుచేయాల్సి ఉంటుంది. కానీ, మార్చిలోపు ప్రభుత్వం ఈ బిల్లులకు సంబంధించిన నగదు విడుదల చేయకుంటే అవి మురిగిపోతాయి. మళ్లీ కొత్త బిల్లులు పెట్టాల్సి ఉంటుంది. అయితే, కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలు ఎంపీడీఓలు, జెడ్పీ సీఈఓలపై ఒత్తిడి తెచ్చి బిల్లులు పెట్టనీయకుండా అడ్డుపడుతున్నారు. మరికొన్నిచోట్ల అధికారులు నమోదుచేసిన బిల్లులకు సకాలంలో నిధులు విడుదలకాక ఆర్థిక ఏడాది చివరిలో అవి మురిగిపోయే పరిస్థితి తలెత్తుతుందని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

గౌరవ వేతనం పెంచి బకాయిలు విడుదల చేయాలి..

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఖజానాని ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పనిచేస్తోంది. పంచాయతీరాజ్ శాఖ ఖజానా ఖాళీ అని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకి చెప్పిన సమాధానమే ఇందుకు నిదర్శనం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కనీసం ప్రజాప్రతినిధులకి జీతాలివ్వడానికి కూడా డబ్బుల్లేకుండా చేసింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎంపీటీసీలు, జెడ్పీటీసీల గౌరవ వేతనం పెంచడంతో పాటు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలి.

– వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు

రూ.కోట్ల భూమి కొల్లగొట్టేందుకు చంద్రబాబు సర్కార్ కుట్ర

- ఔటర్ రింగ్ రోడ్డు భూములకు కేవలం రూ.30 లక్షలు ఇస్తామనడం దారుణం
- రాజధాని రైతులకు ఇచ్చినట్టే పరిహారమివ్వాలి
- మేడికొండూరు మండలం గుండ్లపాలెం వాసుల వినతి

గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మేడికొండూరు మండలం గుండ్లపాలెం రైతులు

లక్ష్మీపురం (గుంటూరు ఈస్ట్): కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొల్లగొట్టాలని చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందని గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం గుండ్లపాలెం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలువైన భూమికి రూ.లక్షల్లో మాత్రమే పరిహారమివ్వాలనుకుంటున్నారని, ఆ కుట్రలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో గుండ్లపాలెం రైతులు వినతిపత్రం అందజేశారు. ఔటర్ రింగ్ రోడ్డు కోసం తీసుకుంటున్న భూములకు అమరావతి రాజధాని రైతుల తరహాలో పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యలు చూస్తుంటే మా గుండెలు ఆగేలా ఉన్నాయని వాపోయారు. ఈ సందర్భంగా పాములపాటి అప్పారావు, శైలజ, పాములపాటి శివరామకృష్ణ, ఇతర రైతులు మీడియాతో మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువ చేసే భూమికి కేవలం రూ.30 లక్షలు పరిహారమిచ్చి తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు చెప్పడం దుర్మార్గమన్నారు. మా పొలాలకు ప్రస్తుత మార్కెట్ విలువకు మించి ప్యాకేజీ ఇవ్వాలని, ఆ భూములే మా పిల్లల భవిష్యత్‌కు ధైర్యమని, ఆ ధైర్యాన్ని దెబ్బతీసేలా చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పాలనలో... తమకు తెలియకుండానే మా పొలాలు తీసుకునేందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మండిపడ్డారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులు తాళలేక తల్లీ, కొడుకు ఆత్మహత్య

బాపట్ల జిల్లా చీరాలలో విషాదం

డీఎస్పీకి వినతిపత్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చీరాల: మైక్రో ఫైనాన్స్ వారి వద్ద డబ్బులు వడ్డీకి అప్పు తీసుకుని తీర్చలేకపోవడంతో వారి వేధింపులు తాళలేక తల్లీ, కుమారుడు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నారు. తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన బాపట్ల జిల్లాలో జరిగింది. చీరాల కొట్లబజారులో ఉంటున్న వేముల సుజాత, కుమారుడు సాయి రైల్వేస్టేషన్ వద్ద చిన్న టిఫిన్ బండి నిర్వహిస్తుంటారు. సుజాత భర్త మరణించడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ఈ క్రమంలో మైక్రో ఫైనాన్సియర్ల వద్ద తీసుకున్న అప్పునకు వడ్డీ పెరిగిపోయింది. వడ్డీ వ్యాపారుల ఒత్తిడి భరించలేక తల్లీ,కుమారుడు ఈ నెల 13న వేటపాలెం మండలం శ్రీనివాసనగర్ సమీప పొలాల్లో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా సుజాత మరణించింది. సాయి ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశాడు. తోటి వ్యాపారి మృతి చెందడంతో సంతాపం తెలుపుతూ సోమవారం చీరాలలో టిఫిన్ బండ్లు మూసివేశారు. కాగా, చీరాలలో చిరువ్యాపారుల నుంచి కొందరు వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తూ వారిని మానసికంగా మనోవేదనకు గురిచేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు చీమకుర్తి బాలకృష్ణ, పార్టీ నాయకులు ఆదివారం చీరాల డీఎస్పీ మొయిన్‌కు వినతిపత్రమిచ్చారు. వడ్డీ వ్యాపారులు, డైలీ ఫైనాన్స్ వ్యాపారులను కట్టడి చేయాలని కోరారు.

మధ్యవర్తిత్వాన్ని మించిన వ్యవస్థ మరొకటి లేదు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్

సాక్షి, అమరావతి /విజయవాడ లీగల్: కక్షిదారులకు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో త్వరితగతిన పరిష్కారం అందించడంలో మధ్యవర్తిత్వాన్ని మించిన సమర్థవంతమైన వ్యవస్థ మరొకటి లేదని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంలో న్యాయవాదులదే ప్రముఖ పాత్ర అని ఆయన వివరించారు. అందుకే న్యాయవాదులకు శిక్షణ తరగతులు చేపట్టామన్నారు. న్యాయవాదులంతా మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. సుప్రీంకోర్టు మీడియేషన్ అండ్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా 'మధ్యవర్తిత్వం' పై న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 19 నుంచి 31 వరకు విజయవాడ కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ సోమవారం జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం ఉద్దేశం–పద్ధతులు అనే అంశంపై 35 మంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. తమిళనాడు హైకోర్టు న్యాయవాదులు, సీనియర్ శిక్షకులు విజయ కమల, సత్యారావు హాజరయ్యారు. న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి హిమబిందు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మరో 400 మంది న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి గుట్టాల గోపి మాట్లాడుతూ.. రెండేళ్లలో ఇది 6వ శిక్షణ కార్యక్రమమని తెలిపారు. అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి సత్యానంద్, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ డిప్యూటీ కార్యదర్శి ఎ.అమర రంగేశ్వరరావు, పలువురు న్యాయాధికారులు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీలకు గౌరవ వేతనాలు ఎప్పటిలోగా చెల్లిస్తారు?

కడప జెడ్పీ సీఈవోను నిలదీసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం, రవాణా భత్యం, కరువు భత్యం వంటి బకాయిలను ఎప్పటిలోగా చెల్లిస్తారో స్పష్టంగా చెప్పాలని జెడ్పీ సీఈవోను హైకోర్టు నిలదీసింది. ఒక్కో సభ్యునికి రూ.2.10 లక్షల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉందని, వీటిని చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కడప జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల చెన్నయ్య, మరో 26 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి సోమవారం మరోసారి విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో జెడ్పీ సీఈవో ఓ మెమోను కోర్టు ముందుంచారు. ఆ వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లింపు విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఈవోను ఆదేశిస్తూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు సకాలంలో వేతనాలు అందుతున్నాయన్నారు. కానీ పిటిషనర్లకు మాత్రం గౌరవ వేతనం, ఇతర భత్యాలను చెల్లించడం లేదని, ఈ విషయంలో నిర్దిష్ట గడువు విధించాలని కోర్టును అభ్యర్థించారు.



జన్మభూమిని మర్చిపోతే చరిత్రహీనులవుతారు

- ఎన్నారై పారిశ్రామికవేత్తల కోసం రూ.50 కోట్లతో కార్పస్ ఫండ్
- జ్యూరిచ్ తెలుగు డయాస్పొరా సమావేశంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: జన్మభూమిని మర్చిపోతే చరిత్ర హీనులవుతారని ప్రవాసాంధ్రులను ఉద్దేశించి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనడానికి దావోస్ చేరుకున్న ఆయన జ్యూరిచ్‌లో తెలుగు డయాస్పొరా సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నారైలు కర్మభూమితో పాటు జన్మభూమికి సేవలందించాలన్నారు. భార్యభర్తలిద్దరూ ఉద్యోగం చేస్తుంటే అందులో ఒకరు ఉద్యోగం.. మరొకరు వ్యాపారం చేయాలన్నారు. ఎన్నారైలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడానికి రూ.50 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటుచేయడంతో పాటు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలను

ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. తెలుగువాళ్లు ఉద్యోగాలు చేసేవారిగా కాకుండా ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరుకోవాలన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు తెలుగువారంతా రావాల్సిందిగా చంద్రబాబు పిలుపునిచ్చారు.

లిక్‌టెన్‌స్టైన్ దేశం స్ఫూర్తితో..

ఇక లిక్‌టెన్‌స్టైన్ అనేది చాలా చిన్న దేశమని, కానీ అది ప్రపంచంలో అత్యంత సంపన్న దేశంగా ఉందని.. దీనికి కారణం టెక్నాలజీని అందిపుచ్చుకోవడమేనని అన్నారు. లిక్‌టెన్‌స్టైన్ దేశం స్ఫూర్తితో తాను క్వాంటం, ఏఐ, స్పేస్, డ్రోన్ టెక్నాలజీ అందిపుచ్చుకోవడంతోపాటు డ్రోన్ల ద్వారా ప్రజలకు, వ్యవసాయ, వైద్య రంగాలకు సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన సంక్రాంతి పోటీల్లో విజేతలకు ముఖ్యమంత్రి బహుమతులు అందచేశారు.

ఈరోస్ ఇన్నోవేషన్ చైర్మన్‌తో భేటీ..

దావోస్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోస్ ఇన్నోవేషన్ సంస్థ చైర్మన్ కిషోర్ లుల్లాతో భేటీ అయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ, డీప్‌టెక్, డిజిటల్ కంటెంట్ ఎకానమీ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా కోరారు. అంతకుముందు.. స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్‌కుమార్‌తో భేటీ అయి అక్కడి ప్రముఖ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని కోరారు. అంతకుముందు.. జ్యూరిచ్ చేరుకున్న ముఖ్యమంత్రికి భారత రాయబారి మృదుల్‌కుమార్, అక్కడి తెలుగువారు స్వాగతం పలికారు. జ్యూరిచ్ విమానాశ్రయంలో సింగపూర్ దేశాధ్యక్షుడు ధర్మన్ షణ్ముగ రత్నం, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, వరల్డ్ బ్యాంకు గ్రూప్ ప్రెసిడెంట్ అజయ్ బంగాలను చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

మాజీ సీఎం నివాసం వద్ద భద్రతా లోపం

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌పై లైట్లు చోరీ | పట్టించుకోని అధికారులు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం వద్ద ప్రభుత్వ భద్రతా లోపం మరోసారి స్పష్టంగా కనిపిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం వద్ద నిత్యం భద్రతను పర్యవేక్షిస్తున్నామని పోలీసు అధికారులు చెబుతున్నా... ఆ ప్రాంతంలో దొంగలు చెలరేగిపోతున్నారు. రోడ్డు వెంబడి ఉన్న ఫుట్‌పాత్ లైట్లు, ఐరన్ గ్రిల్స్‌ను కట్ చేసి తీసుకువెళుతున్నా పోలీసులు గుర్తించలేకపోతున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని భరతమాత సెంటర్ నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం మీదుగా ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వరకు రహదారికి ఇరువైపులా మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో గతంలో రోడ్డు నిర్మించారు. రహదారి ఫుట్‌పాత్ వెంబడి లైట్లను కూడా ఏర్పాటు చేశారు. ఆ లైట్లకు భద్రత కోసం డిజైన్ కలిగిన ఐరన్ గ్రిల్స్‌ను పెట్టారు. కొద్దిరోజులుగా గ్రిల్స్ సహా లైట్లను వచ్చినంత వరకు దొంగలు కట్ చేసి తీసుకెళ్లిపోతున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ తీగలను ఫుట్‌పాత్‌పై వదిలివేయడంతో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పొరపాటున విద్యుత్ సరఫరా అయితే ఫుట్‌పాత్‌పై ప్రయాణించే వారితోపాటు ఉదయం సాయంత్రం వాకింగ్ చేసేవారికి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దర్జాగా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి దొంగిలిస్తుంటే కార్పొరేషన్ అధికారులు గానీ, పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



గ్రిల్స్, విద్యుత్‌లైట్లు దొంగిలించడంతో ప్రమాదభరితంగా మారిన విద్యుత్ వైర్లు

యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూ

చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలోని వసంతాపురం, పేయనపల్లె రైతుసేవా కేంద్రాల వద్ద సోమవారం తెల్లవారుజామున నుంచే యూరియా కోసం రైతన్నలు క్యూ కట్టారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డులను పెట్టి పడిగాపులు కాయాల్సి వచ్చింది. అధికారులు మాత్రం తాపీగా పది గంటలకు కార్యాలయాలకు వచ్చి రైతన్నలకు యూరియా సరఫరా మొదలు పెట్టారు. పేయనపల్లె సమీపంలో కొంత తోపులాటలు జరిగాయి. ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తామని చెప్పడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక బస్తా ఇస్తే ఎలా సరిపోతుందని నిలదీశారు. దీంతో అధికారులు పట్టాదారు పాస్‌బుక్కులు చూసి రెండు బస్తాల యూరియాను పంపిణీ చేశారు.

– గుడిపాల

వసంతాపురం రైతు సేవా కేంద్రం వద్ద పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులను క్యూలో పెట్టిన రైతులు

సాక్షి ఉద్యోగ అవకాశాలు

VIKAS COLLEGE OF ENGINEERING & TECHNOLOGY (Autonomous) NUNNA, Vijayawada Rural

HIRING FOR THE BELOW POSITIONS

Position	Department	Qualification	Experience/Skills Set
Lecturer	ECE/EEE Mathematics/ Physics/Chemistry	B.Tech./M.Tech M.Sc.	Freshers also can apply
NCC Certified Discipline Incharge (Ex-Army preferred)	Admin	Min SSC	Relevant previous experience in educational setup
Librarian & Asst. Librarian	Library	MLise/Blisc	Relevant exp as Librarian
Networking/ IT Admin	IT	B.Tech/ Any degree	Experience in handling server, router, network
Lab Assistants	ECE/CSE	B.E/B.Tech/ Diplomo/ITI	Freshers also can apply
Bus Incharge	Admin	Intermediate Mech	Prior experience in logistics field will be preferred
Campus Incharge	Admin	Intermediate any degree	Prior experience in hospitality or supervisor role
Hostel Warden (Boys/Girls)	Admin	Intermediate any degree	Prior hostel warden experience
Security Guards	Admin	Min SSC	Prior Security guard exp in education institutions

Contact: 94926 41052 (whatsapp)
Interested candidates may send their detailed resume to hiring@vikasinstitutionsnunna.org.

"దేశం, దేశ ప్రజల అవసరాలు, ప్రయోజనాలకు సంబంధం లేని విజయం, లేదా సాధన విలువైనవి కావు.
– సర్ రతన్‌జీ జంషెడ్జీ టాటా

సాక్షి
మంగళవారం, 20 జనవరి 2026

ట్రంప్ ప్రమాదకర పోకడ

వారానికో, పదిరోజులకో తన విధ్వంసక ప్రకటనలతో ప్రపంచాన్ని హడలెత్తించటం అలవాటు చేసుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... ఇప్పుడు దాన్ని నిత్య కృత్యంగా మార్చుకున్నట్టు కనబడుతోంది. డెన్మార్క్‌లో భాగమైన కీలకదీవి గ్రీన్‌ల్యాండ్ దురాక్రమణకు సమాయత్తమవుతూ, అందుకు అభ్యంతరం చెప్పిన యూరోపియన్ యూనియన్(ఈయూ) దేశాలపై వచ్చే నెల 1 నుంచి పదిశాతం సుంకాలు విధిస్తానని బెదిరించి కయ్యానికి కాలుదువ్వారు. మరోపక్క గాజా పునర్నిర్మాణం కోసమంటూ తన ఆధ్వర్యంలో 'శాంతిమండలి'ని ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. ఆ మండలిలో 'ఖరీదైన' సభ్యత్వాన్ని ఇస్తానని భారత్‌తో సహా 60 ప్రపంచ దేశాలకు వర్తమానం పంపారు. ఎనిమిది దశాబ్దాల క్రితం హిట్లర్ రూపంలో తలెత్తి ప్రపంచాన్ని చాప చుట్టేయాలని చూసిన నియంతను వదుల్చుకోవటానికి ఎంత మారణహోమం చవి చూడాల్సి వచ్చిందో, ఎన్ని కోట్లమంది బలిదానాలు చేయాల్సి వచ్చిందో తెలిసి కూడా ఏడాదిగా బుజ్జగింపు ధోరణితో పొద్దుపుచ్చిన దేశాలకూ, ఐక్యరాజ్యసమితికీ తాజా పరిణామాలు ఒక పెద్ద షాక్. తాను ఆశించినట్టు నోబెల్ శాంతి బహుమతి దక్కలేదు గనుక ఇక శాంతి గురించి ఆలోచించాల్సిన అవసరం ట్రంప్‌కు లేదట. అమెరికాకు ఏది ప్రయోజనకరమో అదే చేస్తారట!

గాజాపై ఏర్పాటు చేయదల్చుకున్న శాంతి బోర్డుకు తలాతోకా లేదు. అది గాజాకే పరిమితమై ఉండదట. భవిష్యత్తులో వేరే దేశాల వివాదాల్లో తలదూరుస్తుందట! బోర్డుకు ట్రంప్ జీవితకాల అధ్యక్షుడు. అందులో 'రా రమ్మ'ని పిలిచిన దేశానికి మూడేళ్లపాటు సభ్యత్వం ఇస్తారు. శాశ్వత సభ్యత్వానికైతే వందకోట్ల డాలర్లు చెల్లించాలి. గాజాలో అంతంతమాత్రంగా అందుతున్న సాయాన్ని కూడా ఆపటానికీ, అక్కడ ఉంటున్నవారి కడుపుమాడ్చి వెళ్లగొట్టడానికీ, నరమేధం ఆనవాళ్లు చెరిపేయటానికీ తోడ్పడటమే ఈ బోర్డు ఏర్పాటు ఆంతర్యం. నిజానికి ఈ బోర్డు ఆలోచన భద్రతామండలిది. 2027 చివరి వరకూ ఈ బోర్డు గాజా ఘర్షణలపై దృష్టి సారిస్తుందని భద్రతామండలి మొన్న నవంబర్‌లో ప్రకటించింది. గాజాలో రెండేళ్లపాటు మారణహోమం సాగించిన ఇజ్రాయెల్‌నూ, దానికి ప్రత్యక్షంగా సహకరించిన అమెరికానూ పల్లెత్తు మాట అనని మండలి... దొంగ చేతికి తాళం చెవులు అప్పగించినట్టు గాజాను ఉద్ధరించటానికి పూనుకోవాలని అగ్ర రాజ్యాలను కోరుతూ తీర్మానించింది. ఇంతకూ ట్రంప్ బోర్డూ, ఐక్యరాజ్యసమితి బోర్డూ వేర్వేరా... ఒకటేనా అనేది ఎవరికీ తెలియదు. దిగ్భ్రాంతి నుంచి తేరుకోలేకపోవటం వల్ల కావొచ్చు... సమితి కూడా అస్పష్టంగా మాట్లాడుతోంది. 'సభ్యదేశాలు ఎవరికి నచ్చిన గ్రూప్‌లో వారు చేరొచ్చ'ని సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ చేతులు దులుపుకొన్నారు. అమెరికా అధ్యక్ష పదవే ఇంకో మూడేళ్ల ముచ్చట కాగా, శాంతి బోర్డుకు యావజ్జీవ అధ్యక్షుడెలా కాగలరో అనూహ్యం. ఒక దేశంగా ఇందులో అమెరికా ప్రమేయం కూడా ఉండదా? ఇది ట్రంప్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీయా? ఏమైనా కావొచ్చు. అమెరికా సుంకాలతో బెదిరించినా... ఏ సార్వభౌమాధికార దేశమైనా ఇందులో భాగస్వామ్యానికి అంగీకరించగలదా?

బలహీనంగా కనబడే దేశాలను కించపరచటం, పాదాక్రాంతం చేసుకునేందుకు ప్రయత్నించడం ట్రంప్ నైజం. అమెరికా స్వప్రయోజనాల కోసం నాటో తీసుకొస్తే, భద్రతకు పూచీపడుతుందని నమ్మి అందులో చేరిన ఈ దేశాలు ఇప్పుడు అమెరికాయే దండ యాత్రకు పూనుకోవటాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయి. డెన్మార్క్‌లో స్వయం ప్రతిపత్తి గల గ్రీన్‌ల్యాండ్ పేరుకు ప్రపంచంలోనే పెద్ద దీవి. జనాభా 60,000 మించదు. వివాదం ఎందుకని అప్పగిస్తే అమెరికా హిరణ్యాక్షుడు శాంతిస్తాడన్న నమ్మకం లేదు. అలాంటి హిరణ్యాక్షులు ఇంకా ఇద్దరున్నారు. చైనా తైవాన్‌నూ, రష్యా ఉక్రెయిన్‌నూ కబళించే యత్నం చేస్తాయి. ఇలా కండబలంతో ఎవరికి వారు చెలరేగితే ఈ ప్రపంచం మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. కనుక ఇన్నాళ్ల బుజ్జగింపులకూ స్వస్తిచెప్పి యూరప్ దేశాలు ఇకనైనా దృఢంగా నిలబడాలి. 75 ఏళ్ల చరిత్రలో ఎందుకూ కొరగాని 'నాటో' ఉన్నా ఊడినా ఒకటేనన్న తెలివి తెచ్చుకుని, ప్రతీకార సుంకాలతో జవాబీయాలి. గాజా శాంతిబోర్డు పైనా ఛీత్కారాలు వెల్లువెత్తాలి. అప్పుడు మాత్రమే ట్రంప్ దారికొస్తారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.విదియ రా.2.29 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** శ్రవణం ప.1.29 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** సా.5.15 నుండి 7.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.53 నుండి 9.35 వరకు తదుపరి రా.10.54 నుండి 11.44 వరకు, **అమృత ఘడియలు:** రా.3.27 నుండి 5.04 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం: 5.44
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

నీ బలం!

నువ్వేదైనా, దేశానికి ఉపయోగపడే పని చేయాలనుకుంటే దాని పరిణామాల గురించి ఆలోచించకు. పరిణామాల గురించి ఆలోచిస్తే నువ్వా పని ఎప్పటికీ చేయలేవు. ఒక దేశం తనను కాపాడుకునేంత బలంగా ఉండాలంటే, నీ బలాన్ని కూడా అందులో చేర్చాలి.
– అజిత్ దోవల్, జాతీయ భద్రతా సలహాదారు

గుణాలు

మానవాళి గత 5,000 ఏళ్లుగా తెలివితేటలు, కష్టించే తత్వం, నిజాయతీ, విధేయత, అన్నిటి కంటే ముఖ్యంగా... ప్రేమ, నమ్మకం అనే గుణాలతో మాత్రమే ప్రతిఫలం పొందుతూ వస్తోంది. కనుక మనకు కూడా ఇవన్నీ ఉండాల్సిందేనని గుర్తించండి.
– ఫరీద్ జకరియా, పొలిటికల్ కామెంటేటర్

మర్చిపో!

నీ కెరీర్‌లోని మొదటి ఐదు సంవత్సరాలు అన్నీ మర్చిపో. గర్ల్‌ఫ్రెండ్ వద్దు. బాయ్‌ఫ్రెండ్ వద్దు. అమ్మ వద్దు. నాన్న వద్దు. నీ ఉద్యోగమే నీకు అన్నీ! అంచనాలను అందుకోవటమే కాదు, అంచనాలను కూడా మించిపోవాలి. అప్పుడే నువ్వు నిలదొక్కుకుంటావు.
– మనీష్ మెహ్రోత్రా, సెలబ్రిటీ షెఫ్

శరీరం

రేసు ముగిసేలోపు మీ శరీరం వందసార్లు ఆపమని చెబుతుంది. కానీ నా మనసుకు ఆ శక్తి ఉందని మీ శరీరానికి చెప్పటమే మీ పని. స్టీపుల్ ఛేజ్, లేదా హర్డిల్స్ రేస్‌లో ప్రతి క్షణం లయబద్ధంగా ఉండాలి. మీ దృష్టి హెచ్చుతగ్గులయిందా... ఇక మీరు వేగం కోల్పోయినట్లే!
– నవీన్ కుమార్, రేస్ అథ్లెట్

లంచ్ బ్రేక్

భారతదేశానిది ఆకర్షణీయమైన అభివృద్ధి కథ. మన దేశం బహుశా ఇప్పుడు 5 రోజుల టెస్ట్ మ్యాచ్‌లో మొదటి రోజు భోజన సమయం దగ్గర ఉండి ఉండొచ్చు. 25 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థ 33 రెట్లు అభివృద్ధి చెందినప్పటికీ, ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది.
– విక్రమ్ సాహూ, బ్యాంక్ ఆఫ్ అమెరికా చీఫ్ ఎగ్జిక్యూటివ్

అంతొద్దు!

ఒక బిలియన్ డాలర్ల స్టార్టప్‌ను నిర్మించటానికి ప్రయత్నించే ముందు, ఒకటి నుండి మిలియన్ వరకు ఆదాయాన్ని సంపాదించటంపై దృష్టి పెట్టండి. లేదంటే, ఒక్క 'హైకింగ్' కూడా చేయకుండా ఏకంగా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించటానికి ప్రయత్నించినట్లే అవుతుంది.
– ఆంద్రూ గజ్దెకీ, స్టార్టప్‌ల అడ్వైజర్

అందరినీ కలుపుకొంటేనే అభివృద్ధి

అభిప్రాయం

డా॥ తమ్మా కోటిరెడ్డి

సమాజంలో అణగారిన వర్గాల ప్రజలను సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వాములను చేయడం ద్వారా సమానత్వంతో కూడిన అభివృద్ధిని సాధించడమే సామాజిక సమ్మిళితత్వం. ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు, పేదరిక నిర్మూలనపై దృష్టి సారించడం, భూసంస్కరణల అమలు; 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పట్టణ స్థానిక సంస్థలను పటిష్ఠపరచటం వంటి చర్యలు సామాజిక సమ్మిళితత్వం సాధించటంలో పూర్తిగా విజయవంతం కాలేకపోయాయి. అనేక ప్రాంతాలలో ఇప్పటికీ కుల ఆధారిత వివక్ష, అవస్థాపనా సౌకర్యాల అందుబాటులో వ్యత్యాసాలు, అసంఘటిత రంగంలో ఉపాధి అధికంగా ఉండటం లాంటి అంశాలు సామాజిక సమ్మిళితత్వానికి అవరోధంగా నిలుస్తున్నాయి.

వివిధ రాష్ట్రాల చర్యలు

కుల, మత, రాజకీయ వివక్షకు తావు లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో 2019–24 మధ్య అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక రంగాలలో సంస్కరణలను ప్రవేశ పెట్టింది. సామాజిక ఇంజినీరింగ్‌లో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యంతోపాటు కౌన్సిల్, స్థానిక సంస్థలలో నామినేషన్ కోటాలో ప్రాధాన్యమిచ్చింది. దేశ చరిత్రలోనే నిలిచిపోయే విధంగా విప్లవాత్మకమైన చర్యలను విద్య, ఆరోగ్య రంగాలలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంబించింది. తెలంగాణలో దళిత బంధు, ఆసరా పెన్షన్లు, గొర్రెల పంపిణీ, శిశు ఆరోగ్య సంరక్షణతో పాటు ఇటీవలి ప్రభుత్వం మహిళలు, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా ఆరు గ్యారెంటీలతో అనేక ప్రోత్సాహకాలను ప్రకటించింది.

తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 5వ తరగతి వరకు విద్యనభ్యసించే వారిలో పౌష్టికాహారం పెంపు, డ్రాపవుట్ రేట్ తగ్గింపు లక్ష్యంగా ఆర్థికంగా వెనుకబడిన, గిరిజన ప్రాంతాలలో ముఖ్యమంత్రి ఉదయం అల్పాహార పథకం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించే 6 నుండి 12వ తరగతి బాలికలకు నెలవారీ రూ. 1,000 ఆర్థిక సహాయం వంటి చర్యలను చేపట్టింది. వృద్ధులు, వితంతు వులు, అంగవైకల్యం కలిగినవారు, పేద ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా కేరళ ప్రభుత్వం ప్రారంభించిన సామాజిక భద్రతా మిషన్ సత్ఫలితాలనిచ్చింది. భూమి హక్కు, విద్య అందుబాటుకు కేరళ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది.

ఢిల్లీ ప్రభుత్వం అల్పాదాయ, అణగారిన వర్గాల ప్రజలకు ఒక పరిమితి వరకు ఉచిత విద్యుత్, నీరు అందించడం; ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత ట్రీట్‌మెంట్ కోసం ప్రజల ఆదాయ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచడం, వికలాంగులకు పెన్షన్ లాంటి చర్యలు



◆ ఆర్థిక సర్వే 2024-25 ప్రకారం, దేశంలో స్వయం ఉపాధిలో నిమగ్నమయిన వారి నెలవారీ ఆదాయం రూ. 13,279గా నమోదు కావడాన్ని బట్టి వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయపరమైన అసమానతలు స్పష్టమవుతున్నాయి.

చేపట్టింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మూడు కోట్ల మంది స్వయం సహాయక బృందాల సభ్యులతో ఆర్థిక సాధికారత పెంపు, ఎస్టీ, ఎస్సీ యువతలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ పెంపు లాంటి చర్యలు చేపట్టింది.

గుజరాత్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల బాలికల్లో పాఠశాల నమోదు నిష్పత్తి పెంచడానికి చర్యలతోపాటు, మల్టీపర్పస్ మహిళా సంక్షేమ కేంద్రాలను ప్రారంభించింది. బిహార్ ప్రభుత్వం మహిళల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రతి మహిళ అకౌంట్‌లో రూ. 10,000 జమ చేయడం, సామాజిక భద్రతా పెన్షన్‌లను అందిస్తున్నది.

ఆచరణలో విఫలం

వివిధ కార్యక్రమాల ప్రభావం వలన విద్యావకాశాలు మెరుగయినప్పటికీ, ఉన్నత విద్యలో ఇప్పటికీ లక్షిత వర్గాల ప్రజల నమోదు తక్కువగా ఉండటం, సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటం, ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు అల్పాదాయ వర్గాలకు అనుకూలంగా ఉన్నప్పటికీ వాటి ప్రభావం వివిధ ప్రాంతాల మధ్య వేరుగా ఉండటం స్పష్టమవుతున్నది.

భూసంస్కరణలు ఆచరణలో విఫలమయ్యాయి. లబ్ధిదారులకు పంపిణీ చేసిన భూమి ఆర్థిక కమతంగా లేకపోవడం వలన ఆ యా వర్గాల ప్రజల జీవన ప్రమాణంలో మార్పు సంభవించలేదు. మార్చి 2003 నాటికి 56.73 లక్షల లబ్ధిదారులకు 52.93 లక్షల ఎకరాల భూమిని పునఃపంపిణీ చేయడం జరిగింది. మొత్తం లబ్ధిదారులలో ఎస్టీల వాటా 15 శాతం కాగా, ఎస్సీల వాటా 36 శాతం.

దేశంలోని మొత్తం వ్యవసాయ భూమిలో 2 శాతం మాత్రమే భూసంస్కరణలలో భాగంగా పంపిణీ చేయడం జరిగింది.

ఆర్థిక సర్వే 2024–25 ప్రకారం, దేశంలో స్వయం ఉపాధిలో నిమగ్నమయిన వారి నెలవారీ ఆదాయం రూ. 13,279గా నమోదు కావడాన్ని బట్టి వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయపరమైన అసమానతలు స్పష్టమవుతున్నాయి. లాక్‌డౌన్ తర్వాతి కాలంలో గ్రామీణ వ్యవసాయేతర వేతన రేటులో ఏ విధమైన పెరుగుదల లేకపోగా వ్యవసాయ వేతనాలలో 2 శాతం మాత్రమే పెరుగుదల ఏర్పడింది. దళితులు, ఆదివాసీలలో ఆయుఃప్రమాణం ఉన్నత వర్గాలతో పోల్చినప్పుడు 3 నుండి 5 సంవత్సరాలు తక్కువ.

ప్రపంచ అసమానత నివేదిక 2026 ప్రకారం జాతీయాదాయంలో 58 శాతం సంపన్నులైన మొదటి 10 శాతం ప్రజలలో కేంద్రీకృతం కాగా, చివరి 50 శాతం ప్రజల వాటా 15 శాతం మాత్రమే. మొదటి 1 శాతం ప్రజల వాటా మొత్తం సంపదలో 40 శాతం. ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతం కాగా, ఎస్సీ వర్గాల వారిలో ఇది 23 శాతం, ఎస్టీ వర్గాల వారిలో కేవలం 17.2 శాతం. శిశు మరణాల రేటు సగటు ప్రతి వెయ్యి జననాలకు 29.2 కాగా, ఎస్సీలలో 39.6గా ఉంది. అయిదు సంవత్సరాల లోపు మరణాల రేటు సగటు ప్రతి వెయ్యి జననాలకు 33.2 కాగా, ఎస్సీలలో ఇది 45.9.

విధానాలు ఎలా ఉండాలి?

అయితే, సుస్థిర ఆర్థిక విధానాలకు పూర్తిగా తిలోదకాలిచ్చి అధికంగా సంక్షేమంపై దృష్టి సారిస్తే మాత్రం పనిచేసే వయస్సుగల జనాభాను నిరుత్సాహపరుస్తుంది. పటిష్ఠమైన ఉత్పాదకతతో కూడిన శ్రామిక శక్తి, మార్కెట్ అవకాశాల పెంపు, సామాజిక స్థిరత్వాన్ని పెంపొందించే విధానాలు ఆర్థిక వృద్ధి వేగవంతం కావడానికి దోహద పడతాయి. సంక్షేమం లక్ష్యంగా అవలంబించే సమ్మిళిత సాధన విధా నాలను ఆర్థికాభివృద్ధి, నాణ్యమైన సేవలు, సామాజిక మార్పుతో అనుసంధానపరచాలి. సుస్థిరతకు మద్దతు నిచ్చే పటిష్ఠమైన ఆర్థిక వృద్ధి జరగనప్పుడు, సంక్షేమం మాత్రమే నాణ్యతతో కూడిన ఉపాధి, మార్కెట్ అందుబాటుకు దారి తీయదు. వ్యక్తుల సామర్థ్యాన్ని వినియోగించుకోవడానికి లింగ సంబంధిత; జాతులు, అంగ వైకల్యం కల్గినవారి మధ్య అసమానతలు తొలగించే ఆర్థిక విధానాలు అవసరం. పురోగామి పన్ను విధానం, కనీస వేతనాల చట్టాలు, సామాజిక భద్రతా పథకాలు అల్పాదాయ వర్గాల వ్యయార్హ ఆదాయ పెరుగుదలకు దారి తీసి స్వదేశీ వినియోగ మార్కెట్‌ను విస్తృత పరచగలవు. తద్వారా సమష్టి డిమాండ్ పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. వ్యాపార అభివృద్ధికి మద్దతు ఇవ్వడం ద్వారా చిన్న వ్యాపారాలు వృద్ధి చెంది నూతన వ్యవస్థాపకులు పెరుగుతారు. సమీకృత పట్టణ ప్రణాళిక, సమ్మిళిత ఫైనాన్స్ సేవలు, శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన విధానాలు అవసరం.

వ్యాసకర్త వైస్ ఛాన్స్‌లర్ (ఇన్‌ఛార్జ్),
ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్

దురాక్రమణ కోరలు చాస్తున్న అమెరికా

సందర్భం



బొల్లిముంత సాంబశివరావు

గ్రీన్‌ల్యాండ్ సహజ వనరుల వేటలో అమెరికా తన సామ్రాజ్యవాద కోరలను చాస్తోంది. వెనిజులాపై దాడులు, అక్కడి పాలకుడు మదురో నిర్బంధాన్ని ప్రపంచమంతా నిరసిస్తున్నా, అమెరికా తన పంథా మార్చుకోలేదు. వెనిజులా తర్వాత తన తదుపరి లక్ష్యం గ్రీన్‌ల్యాండేననీ, ఆ ప్రాంతాన్ని తమ దేశంలో విలీనం చేసుకుంటామనీ ట్రంప్ బాహాటంగానే ప్రకటించారు. ఒకవేళ గ్రీన్‌ల్యాండ్ అంగీకరించని పక్షంలో సైనిక బలగాలతో ఆక్రమిస్తామని బెదిరించడం ఆ దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. ఈ మేరకు రిపబ్లికన్ సభ్యులు అమెరికా ప్రతినిధుల సభలో గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా 51వ రాష్ట్రంగా గుర్తించాలంటూ బిల్లును కూడా ప్రవేశ పెట్టారు.

గ్రీన్‌ల్యాండ్ వాసులు ఆర్కిటిక్ కెనడా నుండి కొన్ని వేల ఏళ్ల క్రితమే దఫదఫాలుగా అక్కడికి వలస వచ్చి స్థిరపడ్డారు. 1814లో ఇది డెన్మార్క్ వలస ప్రాంతంగా మారింది. అయితే, అక్కడి ప్రజల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 1979లో స్వయం పాలన, 2009లో స్వయం ప్రతిపత్తి లభించాయి. ప్రస్తుతం విదేశీ వ్యవహారాలు, రక్షణ

◆ గ్రీన్‌ల్యాండ్ ఆక్రమణను వ్యతిరేకిస్తున్న ఎనిమిది యూరప్ దేశాలపై (డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్, యూకే) ఫిబ్రవరి 1 నుంచి 10 శాతం సుంకాలను విధించనున్నట్టు ట్రంప్ హెచ్చరించారు.

రంగం మినహా మిగిలిన అన్ని అంశాలపై గ్రీన్‌ల్యాండ్ ప్రభుత్వానికే పూర్తి అధికారం ఉంది. సుమారు 56,480 మంది జనాభా ఉన్న ఈ చిన్న దేశం ఇప్పుడు సంపూర్ణ స్వాతంత్ర్యం ఆశిస్తోంది.

ఖనిజ సంపదపై కన్నేసి...

ఇక్కడ ఖనిజ సంపద అపారంగా ఉండటంతో అమెరికా దానిపై కన్నేసింది. నియోడిమియం, ప్రాసియోడిమియం వంటి అరుదైన ఖనిజాలతో పాటు యురేనియం, బంగారం, వజ్రాలు, రాగి, ఇనుము, నికెల్ నిల్వలు ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. చైనా తర్వాత ప్రపంచంలోనే అత్యధిక ఖనిజ సంపద కలిగిన ప్రాంతంగా గ్రీన్‌ల్యాండ్ గుర్తింపు పొందింది. అమెరికా జియొలాజికల్ సర్వే లెక్కల ప్రకారం, ప్రపంచం మొత్తానికి ఆరు నెలల పాటు సరిపోయే చమురు నిల్వలు ఈ భూభాగంలో ఉన్నాయి. ఈ సంపదను చేజిక్కించుకోవడం ద్వారా ఖనిజ రంగంలో చైనా ఆధిపత్యాన్ని దెబ్బతీయవచ్చని అమెరికా వ్యూహరచన చేస్తోంది.

2019లో గ్రీన్‌ల్యాండ్‌లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, శిలాజ ఇంధన ఉత్పత్తిని అరికట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకుంది. అంతకు ముందు ప్రభుత్వం మైనింగ్‌కు అనుకూలంగా ఉండేది. ఈ నేపథ్యంలో గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేస్తామన్న ట్రంప్ ప్రకటనను డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడెరిక్సెన్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది అసంబద్ధమైన ప్రతిపాదననీ, ప్రజల అభీష్టాన్ని గౌరవించాలనీ హితవు పలికారు. ఒకవేళ అమెరికా దౌర్జన్యానికి దిగితే నాటో కూటమి విచ్ఛిన్నం అవుతుందని హెచ్చరించారు. గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడెరిక్ నీల్సన్ సైతం అమెరికా కంటే డెన్మార్క్‌తోనే తమకు భద్రత ఉంటుందని స్పష్టం చేశారు.

రష్యా, చైనా ఆక్రమిస్తాయన్న నెపంతో గ్రీన్‌ల్యాండ్ సంపదను అమెరికా దోచుకోవాలని చూస్తోంది. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కి, దేశాల స్వాతంత్ర్యాన్ని కాలరాసే ఈ సామ్రాజ్యవాద దురహంకారం గర్హనీయం. గ్రీన్‌ల్యాండ్ ప్రజల స్వేచ్ఛను అన్ని దేశాలూ గౌరవించాలి. సామ్రాజ్యవాద శక్తులు ప్రజల తిరుగుబాటు ముందు తలవంచక తప్పదు. చరిత్రలో అనేకసార్లు అమెరికా ఒక 'కాగితపు పులి' అని నిరూపితమైంది. గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా ఆధిపత్య పోరును యావత్ ప్రపంచం ముక్తకంఠంతో వ్యతిరేకించాలి.

వ్యాసకర్త రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

ఆత్మగౌరవ చిహ్నంపై అలక్ష్యం

ఇన్ బాక్స్

ఆత్మగౌరవ ప్రతీకగా విజయవాడ నడిబొడ్డున సామాజిక న్యాయ మహా శిల్పం కొలువుదీరింది. 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ఈ అద్భుత కట్టడం రూపుదిద్దుకుంది. 2024 జనవరిలో ప్రారంభమైన ఈ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదు, యావత్ ప్రజల గుండెల్లో నిలిచిపోయే చారిత్రక సంపద. దేశవ్యాప్తంగా ప్రజలు దీనిని ఒక 'సామాజిక న్యాయ పుణ్యక్షేత్రం'గా భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి కూడా పర్యాటకులు ఇక్కడికి తరలివస్తున్నారు. రాజ్యాంగ విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రతి ఒక్కరికీ అందాలనీ, అణగారిన వర్గాలకు సైతం సమన్యాయం చేకూరాలనే ఆశయంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. నాణ్యమైన విద్య, వైద్యం, 'ఒక్క ఓటు – ఒకే విలువ' అనే అంబేడ్కర్ సిద్ధాంతాలను ఈ శిల్పం ప్రతిబింబిస్తుంది.

ప్రభుత్వాలు మారినా ప్రజల ఆస్తులు, ఆత్మగౌరవ చిహ్నాలు భద్రంగా ఉండాలి. అయితే 2024లో ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాంగణంపై విష ప్రచారం మొదలైంది. ముఖ్యమంత్రులు ఇక్కడ అడుగుపెడితే పదవులు పోతాయనే మూఢ నమ్మకాలను ప్రచారం చేయడం శోచనీయం. గత ముఖ్యమంత్రి పేరుతో ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేయడం ద్వారా కొందరు వ్యక్తులు స్మృతి వనం పట్ల తమకున్న ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారు. పచ్చదనంతో కళకళలాడాల్సిన నర్సరీలను ధ్వంసం చేసి, ఆ ప్రాంగణంలో 'డ్వాక్రా బజార్' పేరిట దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ఈ గ్రీన్ ప్రాజెక్టు అంద హీనంగా మారుతోంది.

పర్యాటక కేంద్రంగా విలసిల్లాల్సిన చోట అశ్రద్ధ రాజ్యమేలుతోంది. గుజరాత్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' (సర్దార్ పటేల్ విగ్రహం) కోసం ప్రభుత్వం దాదాపు రూ. 3,000 కోట్లు ఖర్చు చేసింది. దాని నిర్వహణకు ఏటా రూ. 44 కోట్ల వరకు నిధులు కేటాయిస్తోంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో అంబేడ్కర్ విగ్రహం, లైబ్రరీ, మినీ థియేటర్ వంటి వాటన్నింటికీ కలిపి కేవలం 404.35 కోట్లు మాత్రమే కేటాయించారు. నిర్వహణ కోసం అంచనా వేసిన రూ. 35 లక్షల నిధులను కూడా విడుదల చేయకపోవడం గమనార్హం. రాజ్యాంగ నిర్మాత పట్ల నేటి పాలకులకు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. అసంపూర్ణంగా ఉన్న పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం వెంటనే వెయ్యి కోట్లు కేటాయించాలి. 25 ఏళ్ల నిర్వహణ బాధ్యతను పటిష్ఠం చేస్తూ శాశ్వత ప్రాతిపదికన ఇంజినీర్లను, సిబ్బందిని నియమించాలి.

– డా॥ బోరుగడ్డ సుబ్బయ్య । అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్రా యూనివర్సిటీ



ఐహిక వాంఛానురక్తి

మనిషి ఇహలోకంలో పొందే సుఖాలు, సౌకర్యాల కోసం రకరకాలుగా ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఒక్కోసారి ఈ ప్రయత్నంలో విచక్షణను కోల్పోతాడు. ఈ ఐహిక వాంఛల మీదకు మనిషి మనసు ఎప్పుడూ వెళుతూనే ఉంటుంది. ఒక కోరిక తీరిన వెంటనే మరొక కోరిక పుడుతూనే ఉంటుంది. మనిషిని ఈ భౌతిక వాంఛలు జీవితాంతం ఎలా వెంటాడుతాయో 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ తమ 'శ్రీగిరి శతకం'లో హృద్యంగా చెప్పారు:

కోరి కబేలాకు మందగా దోలికొని పోవుచుండ / దారి ప్రక్కన యున్న పచ్చిగడ్డిపై దారాడు పసుల
తీరుగా నున్నది జనుల భోగాశ! తెలివి సర్వమ్ము / చూర పుచ్చెదవు, శ్రీశైల మల్లికార్జున మహాలింగా!

జంతువులను మందగా కబేళా తీసుకుని పోయేటప్పుడు కూడా అవి దారి పక్కన ఉండే పచ్చగడ్డిని పళ్లతో కరిచి తినే ప్రయత్నాన్ని మానవు. అటువంటిదే మనుషుల భోగాశ. అది కూడదన్న జ్ఞానాన్ని కూడా హరుడు హరిస్తాడు. భోగాశ అంటే సంపద, విలాసవంతమైన జీవనశైలి, ఇంకా అరిషడ్వర్గాలు, భవబంధాలు ఇత్యాదులు. వీటి ఆకర్షణ, సమ్మోహన శక్తి అంతా ఇంతా కాదు.

ఈ ఐహిక వాంఛలనే అయస్కాంతం నుంచి బయటపడటానికి మనిషి తన సర్వ శక్తులనూ ఉపయోగించాలి. సాధన చేయాలి. భగవత్ చింతన వైపు దృష్టి మళ్ళించాలి. భవబంధాలకు తగినంత ప్రాధాన్యమివ్వాలి; కానీ వాటినుంచి బయటకు రాలేనంత అనుబంధం పెంచుకోకూడదు. ఈ బంధాలు, అనుబంధాలు, సుఖాలు, మనిషికి తన బతుకును అర్థవంతం చేసుకునే దిశలో పెద్ద అవరోధం అవుతాయి. ఇది ఒక ఊబి లాంటిది. దీని నుండి ఎంత బయటకు రావాలని ప్రయత్నిస్తుంటే అంతగా కూరుకుపోతాడు. పారమార్థిక దృష్టిని అలవరుచుకోవటానికి కఠిన సాధన చేయటమే మార్గం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

కండక్టర్ వద్ద డబ్బులు మాయం

పోలీస్‌స్టేషన్‌కు చేరిన బస్సు

ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాణ్యం: నంద్యాల నుంచి బనగానపల్లె వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కండక్టర్ వద్ద నగదు చోరీకి గురైంది. సోమవారం మధ్యాహ్నం నంద్యాల బస్టాండ్ నుంచి బయలు దేరిన బస్సు పాణ్యం సమీపంలోకి వచ్చే సరికి కండక్టర్ రాజేశ్వరి వద్ద ఉన్న రూ.6,500 నగదు మాయం అయింది. వెంటనే గుర్తించిన ఆమె విషయం డ్రైవర్‌కు చెప్పి బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు ప్రయాణికులతో పాటు లగేజీలను తనిఖీ చేశారు. అయితే ఓ మహిళ వద్ద అదే మొత్తంలో నగదు ఉండడంతో విచారిస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు.

గుండె లబ్‌'డప్పు'

ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆందోళన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో అర్హులైన డప్పు కళాకారులందరికీ ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా పెన్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా వందలాది మంది డప్పు కళాకారులు డప్పు వాయిస్తూ నిరసన తెలియజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళితులు తరతరాలుగా డప్పు కళను వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారని, వీరు తరతరాలుగా వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు. డప్పు కళాకారులందరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. రీసర్వే పేరుతో పెన్షన్ల తొలగింపునకు పూనుకుంటున్న సర్కారుపై ధ్వజమెత్తారు. అలాగే ఐడెంటిటీ కార్డులు, డప్పు, డ్రెస్, గజ్జెలు వంటివి పంపిణీ చేయాలని, డప్పు పండుగ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా కల్పించాలని, రవాణా చార్జీల్లో రాయితీ ఇవ్వాలని డప్పు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధునిక శిక్షణ ఇప్పించాలని కోరారు. ఇళ్లు లేని కళాకారులకు ఇళ్లు, రెండెకరాల భూమి కేటాయించాలని కోరారు. అనంతరం డీఆర్వో లక్ష్మీ నరసింహంకు వినతి పత్రం అందజేశారు.

25 నుంచి హైదరాబాద్‌లో ఐద్వా జాతీయ మహాసభలు

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్నాయి. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపం మెయిన్ హాల్‌లో జరిగే ఈ మహాసభల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి వేలాది మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభల్లో ఐద్వా అఖిల భారత ప్యాట్రన్ బృందా కారత్, అఖిల భారత అధ్యక్షురాలు పీకే శ్రీమతి టీచర్, ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, కోశాధికారి ఎస్.పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధాసుందర రామన్‌లతో పాటు నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ఢిల్లీ సంస్థతో డీల్

వెంటిలేటర్లు, అనస్థీషియా వర్క్‌స్టేషన్స్, ఇతర పరికరాల కొనుగోలు టెండర్‌ను సాగదీస్తున్న ప్రభుత్వ పెద్దలు

- రూ.40 కోట్లతో పరికరాల కొనుగోళ్లలో ఢిల్లీ సంస్థతో మిలాఖత్
- గత ప్రభుత్వంలో అర్హత కూడా సాధించని ఢిల్లీ సంస్థ
- లైఫ్ సేవింగ్ పరికరాల కొనుగోళ్లలో ఉన్నతాధికారులు, నేతల కాసుల వేట

సాక్షి, అమరావతి: 'ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదు. కమీషన్లే మాకు ముఖ్యం' అన్నట్టు వ్యవహరిస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. డీల్ కుదుర్చుకున్న సంస్థకే వైద్య పరికరాల కొనుగోలు కాంట్రాక్ట్ కట్టబెట్టేందుకు నెలల తరబడి టెండర్ ప్రక్రియను సాగదీస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, తీవ్ర అనారోగ్యం పాలై కొనఊపిరితో కొట్టుమిట్టాడే రోగుల చికిత్సకు అవసరమయ్యే వెంటిలేటర్లు, ఇతర లైఫ్ సేవింగ్ పరికరాల కొనుగోళ్ల కాంట్రాక్ట్‌ను ఢిల్లీ సంస్థకు కట్టబెట్టి కమీషన్లు దండుకునేలా కూటమి నేతలు, కొందరు ఉన్నతాధికారులు డీల్ కుదుర్చుకున్నారు. ఏకంగా రూ.40 కోట్ల పరికరాల కొనుగోళ్ల కాంట్రాక్ట్‌ను తాము అనుకున్న సంస్థకు మాత్రమే కట్టబెట్టేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.

వెంటిలేటర్ మిషన్

గత ఏడాది టెండర్లు పిలిచినా

యూజీ, పీజీ సీట్ల పెంపు కోసం విశాఖ, తిరుపతి, ఒంగోలు, విజయవాడ బోధనాస్పత్రులకు 20 వెంటిలేటర్లు, 36 అనస్థీషియా వర్క్ స్టేషన్స్, 48 ఓటీ ల్యాంప్స్ కొనుగోలుకు గతేడాది ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్ఐడీసీ) టెండర్లు పిలిచింది. వీటి విలువ రూ.20 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ టెండర్ ద్వారా ఖరారు చేసిన ధరలతో రెండింతలు ప్రభుత్వాస్పత్రులకు పరికరాలు సరఫరా చేసే అవకాశం కాంట్రాక్ట్ సంస్థకు లభిస్తుంది. గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాస్పత్రులతో పాటు కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌లు 70కి పైగా వెంటిలేటర్లు, 10కిపైగా అనస్థీషియా వర్క్‌స్టేషన్లను ఇప్పటికే ఏర్పాటు చేయాల్సి ఉంది. రూ.40 కోట్ల విలువైన ఈ పరికరాల కొనుగోళ్లలో భారీ మొత్తంలో కమీషన్లు పొందడానికి కూటమి నేతలు, వైద్య శాఖలోని ఉన్నతాధికారులు స్కెచ్ వేశారు. గంపగుత్తగా కాంట్రాక్ట్‌ను ఢిల్లీకి చెందిన సంస్థకు కట్టబెట్టేందుకు 9 నెలలుగా టెండర్ ప్రక్రియను సాగదీస్తూ వస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వెంటిలేటర్ల కొనుగోలు ఆలస్యం అవుతుండడంతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆస్పత్రుల నుంచి డీఎంఈకి నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపల్స్‌తో వైద్యశాఖ మంత్రి నిర్వహించిన సమావేశంలోనూ కేజీహెచ్ సహా పలు ఆస్పత్రుల అధికారులు ఆ అంశాన్ని లేవనెత్తారు.

ఓటీ ల్యాంప్స్



అనస్థీషియా వర్క్‌స్టేషన్

పాత టెండర్ రద్దుచేసి..

వాస్తవానికి హై ఎండ్ ఓటీ ల్యాంప్స్ కొనుగోలుకు గత ప్రభుత్వంలోనే టెండర్లు పిలిచారు. ఆపరేషన్ థియేటర్‌లో రోగులకు సర్జరీ చేస్తున్నప్పుడు రికార్డు చేసి, థియేటర్‌కు వెలుపల ఉండే వైద్య విద్యార్థులు మానిటర్ ద్వారా వర్చువల్‌గా వీక్షించడానికి వీలుగా అప్పట్లో నిబంధనలు రూపొందించారు. ఆ టెండర్లలో ప్రస్తుతం చక్రం తిప్పుతున్న ఢిల్లీ సంస్థ దాఖలు చేసిన బిడ్ కనీస అర్హతకు నోచుకోలేదు. హై ఎండ్ పరికరాలు సరఫరా చేసే సత్తా సదరు సంస్థకు లేకపోవడంతో బిడ్‌ను తిరస్కరించారు. ఇలా ఉండగా అదే సంస్థకు వెంటిలేటర్లు, అనస్థీషియా వర్క్ స్టేషన్స్‌తో పాటు ఓటీ ల్యాంప్స్ సరఫరా కాంట్రాక్ట్ కట్టబెట్టేందుకు అప్పటివరకూ వేరుగా ఉండే ఓటీ ల్యాంప్స్ టెండర్‌ను రద్దు చేశారు. మూడింటికీ ఒకే టెండర్‌ను గతేడాది మేలో పిలిచారు. సంస్థకు మేలు చేయడం కోసం ఓటీ ల్యాంప్స్‌కు వీడియో రికార్డింగ్ సౌకర్యం ఉండాలనే నిబంధనను తొలగించారు. మిగిలిన పరికరాల కొనుగోళ్ల నిబంధనల్లోనూ సదరు సంస్థకు మేలు జరిగేలా సవరణలు చేశారు. బిడ్ స్క్రూటినీ అనంతరం గత నెలలో ఢిల్లీ సంస్థ పరికరాల డెమో ఇచ్చినట్టు సమాచారం. ఈ సందర్భంగా టెండర్ నిబంధనలకు విరుద్ధమైన అనస్థీషియా వర్క్ స్టేషన్లను చూపినట్టు తెలుస్తోంది. వర్క్‌స్టేషన్ ఒక కంపెనీ, మానిటర్ మరో కంపెనీకి చెందినవి చూపినట్టు తెలుస్తోంది. టెండర్లలో పాల్గొనే సంస్థల పరికరాలకు ప్రాక్టికల్‌గా డెమో ఇవ్వాలని నిబంధనలున్నాయి. అయితే వెంటిలేటర్లకు ప్రాక్టికల్ డెమో నిర్వహించకుండానే డీఎంఈ అధికారులు అనుమతిచ్చారనే విమర్శలున్నాయి. వెంటిలేటర్లు, ఓటీ ల్యాంప్స్, అనస్థీషియా వర్క్‌స్టేషన్లకు వేర్వేరుగా టెండర్లు పిలిస్తే ఆయా విభాగాల్లో ఎక్కువ తయారీ సంస్థలు పాల్గొంటాయి. తద్వారా వాటి మధ్య పోటీ ఏర్పడి తక్కువ ధరకు నాణ్యమైన పరికరాల కొనుగోలు చేసే వీలుంటుంది. ఈ విషయం తెలిసినా అధికారులు, ప్రభుత్వ పెద్దలు నిబంధనల్ని పక్కనపెట్టి ఢిల్లీ సంస్థతో బేరాలు కుదుర్చుకునేందుకే తహతహలాడుతున్నారు.

మద్యం అక్రమ కేసులో మోహిత్‌కు భారీ ఊరట

- గతంలో ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్ నిరవధిక పొడిగింపు
- తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు అమలులో ఉంటుందన్న సుప్రీంకోర్టు ధర్మాసనం
- కౌంటర్‌కు మరో రెండు నెలలు గడువు కోరిన సిట్‌పై అసహనం
- ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసేందుకే ఇలా చేస్తున్నారని మండిపాటు
- కాలయాపన కోసమే సిట్ పదేపదే వాయిదాలు కోరుతోందని ఘాటు వ్యాఖ్య

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ/తిరుపతి రూరల్: మద్యం అక్రమ కేసులో నిందితుడిగా ఉన్న వైఎస్సార్ సీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిరవధికంగా పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఆయనకిచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్ అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ కేసులో అదనపు కౌంటర్ దాఖలు చేయాలనుకుంటే చేయవచ్చునంటూ సీఐడీ సిట్‌కి రెండు నెలల గడువునిచ్చింది. ఆ తరువాత ఆ అదనపు కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు మోహిత్‌కు నెల రోజుల సమయం ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్దేశపూర్వక జాప్యానికి తప్పు..

ఈ కేసు విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తీరును సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. మోహిత్ ముందస్తు బెయిల్ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయడానికి ఇప్పటికే నెలల తరబడి సమయం తీసుకున్న ప్రాసిక్యూషన్, ఇప్పుడు అదనంగా మరో రెండు నెలల సమయం కోరడంపై అసహనం వ్యక్తం చేసింది. కౌంటర్ దాఖలు చేసిన తర్వాత కూడా 'ఇంకా పరిశీలించాల్సిన అంశాలు ఉన్నాయి' అని చెప్పడం విచారణను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడానికేనని మండిపడింది. 'మైదానంలో క్రీడాకారుడు ఎలాగైతే ఆటను సాగదీయాలని చూస్తాడో, ఇక్కడ ప్రాసిక్యూషన్ కూడా అదే పద్ధతిని అనుసరిస్తోంది.' అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. కేవలం విచారణను కాలయాపన చేసేందుకే ప్రాసిక్యూషన్ పదేపదే వాయిదాలు, సమయం కోరుతోందని ధర్మాసనం తేల్చి చెప్పింది.

కౌంటర్ దాఖలులో సిట్ జాప్యం

మద్యం కేసులో 39వ నిందితునిగా ఉన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో గత ఏడాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ గత ఏడాది అక్టోబర్ 7న తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ మోహిత్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం మోహిత్‌రెడ్డికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ అక్టోబర్ 10న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మోహిత్ ముందస్తు బెయిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ సిట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను గత ఏడాది డిసెంబర్ 1కి వాయిదా వేసింది. ఆ రోజున కేసు విచారణకు రాగా, కౌంటర్ దాఖలుకు సిట్ మరో నెల రోజుల సమయం కోరింది. దీంతో సుప్రీంకోర్టు కేసు విచారణను జనవరి 19కి వాయిదా వేసింది. తాజాగా సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం, కౌంటర్ దాఖలు చేయడానికి సిట్ మరో రెండు నెలల సమయం కోరడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో మోహిత్‌రెడ్డికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు పొడిగించింది. సిట్ కోరినట్లు కౌంటర్ దాఖలుకు రెండు నెలల సమయం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకానిలో శ్రీ మల్లేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన న్యాయమూర్తి దంపతులు రాహు కేతు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఉప కమిషనర్ స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

వక్ఫ్ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదు

- చంద్రబాబు ప్రభుత్వం వక్ఫ్ భూములు కొట్టేయడానికి దొంగ జీఓలు ఇస్తోంది
- గుంటూరులో 72 ఎకరాలను ఐటీ కంపెనీకి కేటాయిస్తూ ఇచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలి
- ధర్నా చౌక్‌లో ముస్లిం ఐక్యవేదిక నిరసన

నిరసన తెలుపుతున్న ముస్లిం ఐక్యవేదిక ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంజుమన్ ఇస్లామియా సంస్థకు చెందిన భూములను ఐటీ కంపెనీలకు కేటాయిస్తూ చంద్రబాబు సర్కార్ జారీ చేసిన జీఓను రద్దు చేయాలని ముస్లిం ఐక్యవేదిక డిమాండ్ చేసింది. గుంటూరులోని అంజుమన్ ఇస్లామియా సంస్థకు చెందిన 72 ఎకరాల భూమిని ఐటీ కంపెనీకి కేటాయించడాన్ని నిరసిస్తూ సోమవారం విజయవాడ ధర్నాచౌక్‌లో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రైతు ఉద్యమనేత వడ్డే శోభనాద్రీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ప్రతినిధులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ అలీ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం దొంగ జీఓలతో వక్ఫ్ భూములను కొట్టేయడానికి పన్నాగం పన్నుతోందన్నారు. అంజుమన్ ఇస్లామియా భూములను బడా వ్యాపార వేత్తలకు ధారాదత్తం చేస్తోందన్నారు. ముస్లిం సంస్థలకు చెందిన స్థిరాస్తులను లాక్కునేందుకు ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి తగినగుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వక్ఫ్ భూములు అమ్మకానికి, దానం చేయడానికి ఏ ప్రభుత్వానికీ అధికారం లేదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ భూములు అమ్ముకోవడానికి చట్ట సవరణ చేసి కమిటీలో ఇతర కులస్తులకు, కలెక్టర్లకు అవకాశం కల్పించిందన్నారు. మంత్రి లోకేశ్ గుంటూరులో ఉన్న 72 ఎకరాల భూమి ఐటీ కోసం అంటున్నాడని, రాజధానిలో అభివృద్ధి కోసం 1640 ఎకరాలు ప్రభుత్వం తీసుకుందని, అందులో కొన్ని ఎకరాల్లో ఐటీ కంపెనీలు పెట్టొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం కార్యదర్శి బాజీ బాబా, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్, రాష్ట్ర కార్యదర్శి గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బడే మియా, ముస్లిం ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు సలావుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, రాష్ట్ర అధికార ప్రతినిధులు సయ్యద్ ఖలీల్, మైనార్టీలు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

పదిమందికి గాయాలు

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గొల్లప్రోలు (పిఠాపురం): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. గొల్లప్రోలు పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కొందరు శ్రీకాకుళం నుంచి ఆదివారం రాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక కత్తిపూడి – పామర్రు 216 జాతీయ రహదారిపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు సత్తెమ్మ తల్లి గుడి వద్ద బస్సు బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో భీమవరానికి చెందిన ఏఎస్‌వీఎస్ మూర్తి, కలిగిటి దిలీప్, కరుణ విశాల్, కలిశెట్టి మల్లీశ్వరి, కలిశెట్టి దీపిక, విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన ఎ.ప్రియాంక, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన బీరా రవికుమార్, సీహెచ్ రవళి, నరసాపురానికి చెందిన ఎల్లూరి విష్ణువర్ధన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులకు పిఠాపురం, కాకినాడ ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఘటనా స్థలాన్ని పిఠాపురం సీఐ శ్రీనివాస్ పరిశీలించారు.

తిరుమలలో ఏనుగుల గుంపు సంచారం

గోగర్భం డ్యాం వద్ద వాహనాలు నిలిపేసిన అటవీ శాఖ అధికారులు

తిరుమల: తిరుమలలోని పాపవినాశనం రోడ్డుపై సోమవారం ఏనుగుల గుంపు కలకలం రేపింది. తిరుమల నుంచి పాపవినాశనం వెళ్లే మార్గంలో ఉన్న పార్వేటి మండపం సమీపంలో సోమవారం ఉదయం ఏనుగుల గుంపు సంచారాన్ని భద్రతా సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే అటవీశాఖ సిబ్బంది అప్రమత్తమై ఆ మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తులను అక్కడికి అనుమతించడం లేదు. ఏనుగులు రహదారిపైకి రాకుండా భద్రతా సిబ్బంది జాగ్రత్తగా వాటిని అడవిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు. కొంతసేపటి తర్వాత ఏనుగుల గుంపు సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతి సంక్రాంతికి మోసం చేస్తున్న చంద్రబాబు

- ఐఆర్ లేదు, డీఏ బకాయిల చెల్లింపు అంతకన్నా లేదు
- పీఆర్సీ వేయాలనే ధ్యాస లేకుండా తాత్సారం
- డీఏ బకాయిలు మూడువిడతల్లో ఇస్తామని అరకొరగా విదిలింపు
- ఉద్యోగులకు రూ.34 వేల కోట్లు బకాయిలుంటే ఇచ్చింది రూ.1,100 కోట్లు
- దీనికే ఉద్యోగులు సంబరాలు చేసుకుంటున్నారని ఈనాడు, ఆంధ్రజ్యోతి కట్టుకథలు
- ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం ప్రతి సంక్రాంతికి ఉద్యోగులను మోసం చేయడమే అలవాటుగా మార్చుకుందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెద పండుగకైనా ఐఆర్ ఇవ్వకపోతుందా అని, డీఏ ప్రకటిస్తుందేమోనని ఉద్యోగులు ఎదురుచూసి అలిసిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను ఊరించి ఉసూరుమనిపించడంలో మాత్రమే ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తోందని ఎద్దేవా చేశారు. గత ఏడాది సంక్రాంతి కానుకగా పోలీసులకు రెండు సరెండర్ లీవ్ బిల్లులు చెల్లిస్తామని ప్రకటించి.. కేవలం ఒకటి మాత్రమే ఇచ్చి రెండోది ఇవ్వకుండా మోసం చేసిందని గుర్తుచేశారు. ఆ తర్వాత దీపావళికి స్వయంగా సీఎం చంద్రబాబు మరోసారి పోలీసులకు సరెండర్ లీవ్ బిల్లు చెల్లిస్తామని ఇచ్చిన హామీని కూడా గాలికొదిలేశారన్నారు. చివరికి ఈ సంక్రాంతికి కూడా ప్రభుత్వం పోలీసులకు మొండిచెయ్యి చూపించిందని తెలిపారు.

ఓపీఎస్ ఉద్యోగులకు గత ప్రభుత్వమే ఇచ్చింది

'ఇప్పుడు కూడా సీపీఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ అరియర్ బిల్స్ చెల్లిస్తామని ప్రకటించి.. చెల్లింపులు చేయకుండా మరోసారి నట్టేటముంచింది. డీఏకి సంబంధించి 30 నెలల బకాయిలు పెండింగ్ ఉన్నాయి. వీటిని మూడువిడతల్లో ఓపీఎస్ ఉద్యోగులకు జీపీఎఫ్ అకౌంట్లలోకి జమచేసి, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రూపంలో చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఈ బకాయిలను గత ప్రభుత్వమే ఓపీఎస్ ఉద్యోగులకు మూడువిడతలను మొత్తం వారి జీపీఎఫ్ అకౌంట్లకు జమచేసింది. ఇప్పుడు కేవలం సీపీఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన 2018 జూలై డీఏ బకాయిలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ డీఏ చెల్లింపులకు కూడా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని పాటించటంలేదు. చిత్రవిచిత్రంగా కొందరికి ఒక్కవిడత నగదు కూడా జమకాలేదు. కొందరికి ఒకవిడత, కొందరికి రెండువిడతలు, ఇంకొందరికి మూడువిడతలు, అక్కడక్కడా ఒకరిద్దరికి ఆరువిడతలు కూడా జమైనట్టు తెలిసింది. నెల్లూరులో టీచర్లకు, యూనివర్సిటీ ఉద్యోగులకు, డాక్టర్లకు ఇలా అనేక రంగాల్లో వారికి డీఏ బకాయిలు పడలేదు. వాస్తవాలు ఇలా ఉంటే.. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి కొన్ని పత్రికలు ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.70 వేలు – రూ.80 వేలు జమైనట్టు, ఉద్యోగులు సంబరాలు చేసుకుంటున్నారని ప్రజలను తప్పుదోవ పట్టించే వార్తలు రాయడం సిగ్గుచేటు. ఉద్యోగులకు రూ.34 వేల కోట్ల బకాయిలు ఉంటే అందులో కేవలం రూ.1,100 కోట్లు చెల్లిస్తామనగానే ఉద్యోగులు ఎగిరి గంతేసి సంబరాలు చేసుకుంటున్నారా? ఉద్యోగులకు 20 నెలలు అయినా ఐఆర్ ఇవ్వలేదు, కనీసం పీఆర్సీ వేయలేదు. పోలీసులకు రికార్డు స్థాయిలో ఐదు సరెండర్‌లీవ్ బిల్లులు పెండింగ్ ఉంటే, పెన్షనర్లకు 20 నెలలుగా గ్రాట్యుటీ చెల్లించని ప్రభుత్వాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ కథనాలు ప్రచురించడం సమంజసం కాదు' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగులకు 2018 జూలై, 2019 జనవరి డీఏల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

సమస్యలు 'ఊట'ంకిస్తూ ప్రశ్నల వర్షం

పోలవరం ప్రాజెక్ట్ అధికారులను ప్రశ్నించిన విదేశీ నిపుణులు బృందం

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రధాన డ్యాం గ్యాప్–2లో నిర్మిస్తున్న డయాఫ్రం వాల్ పనుల నాణ్యతకు సంబంధించి అధికారులపై విదేశీ నిపుణులు ప్రశ్నలవర్షం కురిపించారు. డయాఫ్రం వాల్‌లో ఉత్పన్నమైన బ్లీడింగ్(ఊట నీటి) సమస్యను పరిష్కరించారా? సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారం 1.5 మీటర్ల మందంతో 0.3 శాతం టోలరెన్స్(విచలనం, భ్రమణం)తో డయాఫ్రం వాల్ నిర్మించాల్సి ఉండగా.. ఒక ప్యానల్‌ను మరో ప్యానల్‌తో జత చేసినప్పుడు మందం 0.9 మీటర్ల కంటే తగ్గుతోంది కదా.. మందం తగ్గినా డయాఫ్రం వాల్ సమర్థంగా పనిచేస్తుందా? కఠిన శిలతో కూడిన రాతి పొరలోకి రెండు మీటర్ల మేర ప్యానళ్లు దింపి డయాఫ్రం వాల్ వేశారా? లేదా? అంటూ అధికారులను ప్రశ్నించారు. ఐఐటీ(తిరుపతి) నిపుణులతో కలిసి రూపొందించిన మెథడాలజీ ప్రకారం డయాఫ్రం వాల్ పనులు చేశామని.. ఊట సమస్య పరిష్కారమైందని అధికారులు చెప్పారు. డయాఫ్రం వాల్ నాణ్యత పరీక్షల ఫలితాల నివేదికలను విదేశీ నిపుణులకు అధికారులు అందజేశారు.

షీప్ ఫుట్ రోలర్‌తో చేస్తే బాగుంటుంది

సీన్ హించ్ బెర్జర్, డేవిడ్ బి పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కోలతో కూడిన విదేశీ నిపుణుల బృందం సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ప్రధాన డ్యాం గ్యాప్–1, గ్యాప్–2లలో జరుగుతున్న పనులను తీరుతెన్నులను క్షుణ్ణంగా చూసింది. పనులు చేస్తున్న తీరుపై చర్చించింది. డి–హిల్ వద్ద గ్రౌటింగ్ పనులను పరిశీలించింది. అనంతరం అధికారులతో విదేశీ నిపుణులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటిదాకా చేసిన పనుల తీరుపై పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విదేశీ నిపుణులకు వివరించారు.

గ్యాప్–1 పనులను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

ప్రధాన డ్యాం గ్యాప్–2లో డయాఫ్రం వాల్ పనులు 89 శాతం పూర్తయ్యాయని.. ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి చేస్తామని ఎస్ఈ రామచంద్రరావు వివరించారు. ప్రధాన డ్యాం పనుల్లో మట్టి, రాళ్లను పొరలు పొరలుగా వేసి.. ఎలా రోలింగ్ చేస్తున్నారని విదేశీ నిపుణులు ప్రశ్నించారు. ప్లాట్ రోలర్లు, వైబ్రేట్ రోలర్ల ద్వారా రోలింగ్ చేస్తున్నామని అధికారులు వివరించారు. షీప్ ఫుట్ రోలర్‌లతో రోలింగ్ చేస్తే ప్రధాన డ్యాం పటిష్టంగా ఉంటుందని నిపుణులు సూచించారు. నమూనాగా నిర్మించిన ప్రధాన డ్యాం పనుల్లో షీప్ ఫుట్ రోలర్ వాడితే ఫలితాలు సరిగ్గా రాలేదని.. అందుకే ప్లాట్, వైబ్రేట్ రోలర్లు వినియోగిస్తున్నామని అధికారులు వివరించారు. డయాఫ్రం వాల్‌కు సమీపంలో ప్లాస్టిక్ క్లే ఉన్న ప్రాంతంలో షీప్ ఫుట్ రోలర్‌తో పనులు చేస్తే బాగుంటుందని నిపుణులు సూచించారు. మంగళవారం ప్రధాన డ్యాం గ్యాప్–1, గ్యాప్–2లలో జరుగుతున్న రోలింగ్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనుల డాక్యుమెంటేషన్‌ను మరింత పక్కాగా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, కేంద్ర జలసంఘం అధికారులు సరబ్జిత్ సింగ్ భక్షి, మనీష్ రాథోర్, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్త, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వీఎస్ రామారావు, ఎన్ఐఆర్ఎం డైరెక్టర్ అజయ్‌కుమార్ నైతాని, సీడీఓ చీఫ్ ఇంజనీర్, పోలవరం నిర్మాణ సంస్థ మేఘా ఏజెన్సీ జీఎం గంగాధర్, డీజీఎం మురళి, పలు విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి

పెద్దపంజాణి: చిత్తూరు జిల్లా పెద్ద పంజాణి మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతంలో సోమవారం ఒంటరి ఏనుగు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పలమనేరు రేంజ్ కీలపట్ల బీట్‌లోని కోగిలేరు సమీపంలోని కల్లుపల్లి నారాయణరెడ్డి మామిడి తోటలో మగ ఒంటరి ఏనుగు మృతి చెందిందని చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజు తెలిపారు. ప్రాథమికంగా విద్యుదాఘాతం వల్లే ఏనుగు మృతి చెందిందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం శవపంచనామా నిర్వహిస్తామని చెప్పారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, పలమనేరు, పుంగనూరు ఎఫ్ఆర్వోలు నారాయణ, శ్రీనివాసులు, తహసీల్దార్ హనుమంతు సిబ్బంది ఉన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
చీఫ్ ఇంజనీర్ ఆఫీస్
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.60/D3/CE/TTD/2025-26 Dt: 18-01-2026

TTD ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో **ముప్పై ఏడు (37)** పనుల కోసం ఇ–ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ–టెండర్లు కోరబడుచున్నవి: SE-II: NIT నం.954 నుండి 972/SE-II/2025-26 (19 పనులు), EE-I: NIT నం.135 నుండి 137/EE-I/2025-26 (3 పనులు), EE-IX: NIT నం.70/EE-IX/2025-26 (1 పని), DE(Elec)-I: NIT నం.287 నుండి 294/DE(Elec)-I/ 2025-26 (8 పనులు), DE(Elec)-II: NIT నం.505 నుండి 510/DE(Elec)-II/2025-26 (6 పనులు). వివరాల కోసం **www.tirumala.org** కి లాగాన్ చేయండి మరియు పని వివరాల కోసం **https://tender.apeprocurement.gov.in** కు లాగిన్ చేయండి.

TTD-40021/10/2025-PRO SEC (Adv.No.367) Dt: 19-01-2026 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
ప్రధాన కార్యాలయం : గుంటూరు
టెండరు కోరుతూ ప్రకటన
జనరల్ మేనేజర్, ప్రధాన కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, గుంటూరు.

ద్వైపాక్షిక వాణిజ్యం

రూ.18 లక్షల కోట్లకు!

భారత్, యూఏఈ నిర్ణయం
- కీలక రక్షణ భాగస్వామ్యం!
- భారత్‌కు 5 లక్షల టన్నుల ఎల్‌ఎన్‌జీ
- మోదీ, నహ్యాన్ కీలక ఒప్పందాలు
- యూఏఈ అధ్యక్షునికి మోదీ స్వాగతం
- ఆత్మీయ ఆలింగనం, ఒకే కార్లో ప్రయాణం
- పలు అంశాలపై గంటకు పైగా చర్చలు

సోమవారం యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌తో తన నివాసంలో మోదీ చర్చలు

న్యూఢిల్లీ: ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, యూఏఈ నిర్ణయించాయి. 2032 నాటికి పరస్పర వార్షిక వాణిజ్యాన్ని ఏకంగా రూ.18 లక్షల కోట్లకు (200 బిలియన్ డాలర్లకు) పెంచుకోవాలని తీర్మానించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ప్రధాని నరేంద్ర మోదీ చర్చల సందర్భంగా పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. సోమవారం నహ్యాన్ కుటుంబసమేతంగా భారత్‌లో పర్యటించారు. మోదీ ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి మరీ ఢిల్లీలోని పాలెం విమానాశ్రయంలో ఆయనకు స్వయంగా స్వాగతం పలికారు. కరచాలనం అనంతరం అధినేతలిద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. తర్వాత చర్చల నిమిత్తం లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని అధికార నివాసానికి మోదీ, నహ్యాన్ ఒకే కారులో వెళ్లడం విశేషం! కొన్నేళ్లుగా యూఏఈతో బలపడుతూ వస్తున్న భారత బంధానికి ఈ సన్నివేశం అద్దం పట్టిందని చెబుతున్నారు. 2023–24లో ఇరు దేశాల నడుమ 84 బిలియన్ డాలర్ల మేరకు వర్తకం జరిగింది.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే

నహ్యాన్, మోదీ చర్చల సందర్భంగా భారత్, యూఏఈ నడుమ వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం దిశగా కీలక ముందడుగు పడింది. దానితో పాటు అంతరిక్ష మౌలిక సదుపాయాల అభివృద్ధిపైనా ఒప్పందం కుదిరింది. వీటి విధివిధానాల ఖరారుకు తదితరాలకు సంబంధించిన లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు జరిగాయి. దీర్ఘకాలిక ప్రాతిపదికన భారత్‌కు యూఏఈ ఏటా 5 లక్షల టన్నుల ఎల్‌ఎన్‌జీ సరఫరా చేసేలా కూడా ఒప్పందం కుదిరింది. గుజరాత్‌లోని ధొలెరాలో ఏర్పాటైన స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో యూఏఈ పెట్టుబడులు పెట్టనుంది. అధినేతలు ఇరువురూ తొలుత ఏకాంతంగా సమావేశమయ్యారు. రక్షణ మొదలుకుని వర్తకం, ఇంధనం, ప్రాంతీయ భద్రత తదితర అంశాలపై లోతుగా చర్చించారు. సీమాంతర ఉగ్రవాదాన్ని వారు ముక్తకంఠంతో ఖండించారు. వాటికి ప్రోత్సాహం, ఆర్థిక మద్దతు ఇచ్చేవారిని కూడా శిక్షించాల్సిందేనని పునరుద్ఘాటించారు. ఆహార భద్రత, వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం తదితరాలపై ఈ సందర్భంగా ఒప్పందాలు జరిగాయి. కృత్రిమ మేధ రంగంలో పరస్పరం మరింతగా సహకరించుకోవాలని నేతలు నిర్ణయానికి వచ్చారు. అనంతరం ఇరు దేశాల బృందాలు కూడా చర్చల్లో పాల్గొన్నట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ తెలిపారు. చర్చల వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఇందుకోసం దుబాయ్ యువరాజు షేక్ హందాన్ బిన్ మొహమ్మద్ బిన్ మక్తోమ్, ఇతర రాజ కుటుంబీకులు, మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన భారీ బృందం నహ్యాన్‌తో పాటు వచ్చినట్టు ఆయన వివరించారు. అధినేతల సమక్షంలో ఇరు బృందాలు పలు ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నట్టు చెప్పారు. వ్యవసాయ రంగం ఒప్పందంతో భారత రైతులకు లబ్ధి చేకూరడంతో యూఏఈకి ఆహార భద్రత లభిస్తుందని మిస్రీ తెలిపారు. పౌర అణు ఇంధన రంగంలో భాగస్వామ్య అవకాశాలను ఇరుదేశాలు మరింతగా అన్వేషించనున్నట్టు చెప్పారు. అలాగే 'డేటా ఎంబసీ'ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలిస్తాయన్నారు. తమ చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగినట్టు మోదీ పేర్కొన్నారు. నహ్యాన్‌ను తన సన్నిహిత మిత్రునిగా సంబోధించారు. ''విమానాశ్రయానికి వెళ్లి నా సోదరునికి స్వాగతం పలికా. భారత్, యూఏఈ మధ్య బలమైన మిత్ర బంధానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ పర్యటన అద్దం పడుతోంది''అంటూ ఎక్స్ పోస్టులో ప్రధాని పేర్కొన్నారు. ఇరుదేశాల నడుమ ఇప్పటికే కీలకమైన ఒప్పందాలెన్నో కుదిరాయి. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం, స్థానిక కరెన్సీలోనే చెల్లింపుల వ్యవస్థ, ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం వంటివి వాటిలో ఉన్నాయి.

పశ్చిమాసియాపైనే చర్చ?

పశ్చిమాసియా ప్రాంతంలో నానాటికీ పెచ్చరిల్లుతున్న ఉద్రిక్తతలపైనే మోదీ, నహ్యాన్ ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. ఇరాన్‌లో ఆందోళనలు, నిరసనలు నానాటికీ మిన్నంటుతుండటం తెలిసిందే. వాటికి ఇప్పటికే కనీసం 5 వేల మందికి పైగా బలయ్యారు. అవసరమైతే ఇరాన్‌పై దాడికి కూడా వెనకాడబోమన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో ఉద్రిక్తతలు ఓ దశలో తారస్థాయికి చేరాయి. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం పూర్తిగా ముగియలేదు. వీటికి తోడు యెమన్ కారణంగా యూఏఈ కూడా సోదర దేశమైన సౌదీ అరేబియాపై ఇటీవలే కత్తులు దూయాల్సి వచ్చింది. యెమన్‌లోని ముకల్లా పోర్టును యూఏఈ దన్నుతో స్థానిక సాయుధ గ్రూపు చెరబట్టడంతో సౌదీ ఆగ్రహించి ఆ పోర్టుపై క్షిపణి దాడులకు దిగింది. సౌదీ హెచ్చరికలతో యెమన్ నుంచి యూఏఈ తన సేనలను ఉపసంహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఫోన్లలో మాట్లాడేందుకు కుదరని పలు 'అత్యవసర'అంశాలపై చర్చల నిమిత్తమే నహ్యాన్ హుటాహుటిన భారత్ వచ్చినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అవేమిటన్నది మాత్రం సస్పెన్స్‌గానే మిగిలింది. పశ్చిమాసియా ప్రాంతంలో భారత్‌కు యూఏఈ అత్యంత సన్నిహిత మిత్ర దేశం. కరోనా సమయంలో భారత్ తక్షణం స్పందించి అత్యవసరమైన వ్యాక్సీన్లు తదితరాలను యూఏఈకి భారీగా సరఫరా చేసింది. నాటినుంచీ ఇరుదేశాల బంధం మరింత బలపడింది.

ప్రయాణం 6 గంటలు... పర్యటన 1.45 గంటలు!

నహ్యాన్ తాజా పర్యటనకు దౌత్య కోణంలో అత్యంత ప్రాధాన్యత ఉన్నట్టు చెబుతున్నారు. అయితే, ఈ పర్యటనలో విపరీతమైన ఆసక్తికి కారణంగా నిలిచిన విశేషం మరొకటుంది. అదేమిటంటే, నహ్యాన్ పర్యటన కేవలం అక్షరాలా గంటా నలభై ఐదు నిమిషాల పాటు మాత్రమే కొనసాగడం! అబుదాబి నుంచి ఢిల్లీకి విమాన ప్రయాణ సమయమే 3 గంటలకు పైగా ఉంటుంది. నహ్యాన్ సోమవారం సాయంత్రం 4 గంటల 20 నిమిషాలకు పాలెం విమానాశ్రయంలో దిగారు. 4.45కు మోదీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. తిరిగి సాయంత్రం 6 గంటల 5 నిమిషాలకు యూఏఈకి పయనమయ్యారు. అంటే భారత్‌లో గడిపింది కేవలం 1.45 గంటలు. అందుకోసం రానూ పోనూ నహ్యాన్ 6 గంటలకు పైగా ప్రయాణం చేశారు! ఒక దేశాధినేత అధికారిక పర్యటన కేవలం ఇంత తక్కువ సమయం పాటు జరగడం అసాధారణమేనని దౌత్య నిపుణులు అంటున్నారు. ''నహ్యాన్ రాక ఏదో వేరే దేశ పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో జరిగిన బాపతు కాదు. కేవలం మోదీతో భేటీ అయ్యేందుకే ఆయన యూఏఈ నుంచి బయల్దేరి వచ్చారు. బహుశా అతి ముఖ్యమైన అంశంపై అత్యవసరంగా చర్చించాల్సిన అవసరమే ఇందుకు దారితీసి ఉంటుంది'' అని వారు అభిప్రాయపడుతున్నారు. మోదీ ఆహ్వానం మేరకే నహ్యాన్ భారత పర్యటనకు వస్తున్నట్టు విదేశాంగ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

నహ్యాన్‌తో కలిసి ఒకే కార్లో మోదీ

ఊయల ఊగారు!

నహ్యాన్‌కు మోదీ బహుమతులు

యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌కు ప్రధాని మోదీ పలు అరుదైన కానుకలు అందజేశారు. గుజరాతీ కళాకారులు అత్యంత నైపుణ్యంతో తయారు చేసిన చెక్క ఊయల, కశ్మీర్‌కు చెందిన పష్మీనా శాలువా తదితరాలు వీటిలో ఉన్నాయి. ఈ సందర్భంగా నేతలిద్దరూ సంప్రదాయ దుస్తుల్లో ఊయలపై కూర్చుని అలరించారు. కశ్మీరీ శాలువాను తెలంగాణలో తయారు చేసిన వెండి పెట్టెలో పెట్టివ్వడం విశేషం. నహ్యాన్‌తో పాటు వచ్చిన ఆయన తల్లి, ఇతర రాజకుటుంబ సభ్యులకు కూడా శాలువాలతో పాటు కశ్మీరీ కుంకుమ పువ్వు తదితరాలను మోదీ అందజేశారు.

కమల దళపతి నితిన్ నబీన్

- ఏకగ్రీవంగా ఎన్నిక
- నేడు ప్రమాణస్వీకారం
- అతి పిన్న వయస్కునిగా రికార్డు
- తొలి బిహారీ సారథి కూడా ఆయనే
- అగ్నిపరీక్షగా బెంగాల్ ఎన్నికలు

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ నూతన అధ్యక్షునిగా బిహార్‌కు చెందిన పార్టీ యువ నేత నితిన్ నబీన్ సిన్హా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పదవి చేపట్టిన వారిలో అతి పిన్న వయస్కునిగా 45 ఏళ్ల నబీన్ రికార్డు సృష్టించారు. అంతేగాక బిహార్ నుంచి వచ్చిన తొలి బీజేపీ అధ్యక్షుడు కూడా ఆయనే కావడం విశేషం! మంగళవారం ఉదయం 11 గంటలకు బీజేపీ 12వ అధ్యక్షునిగా నబీన్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా పదవీకాలం ముగియడం తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియలో భాగంగా కీలకమైన నామినేషన్ల ప్రక్రియ ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ముగిసింది. నబీన్ ఒక్కరి తరఫునే నామినేషన్లు దాఖలవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. మంగళవారం ఈ మేరకు లాంఛనంగా ప్రకటన వెలువడనుంది. నబీన్ ప్రస్తుతం బీజేపీ తాత్కాలిక అధ్యక్షునిగా ఉండటం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ సంతకంతో కూడిన నబీన్ నామినేషన్ సెట్టును నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్ తదితరులు రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్‌కు సమర్పించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, నయాబ్‌సింగ్ సైనీ, ప్రమోద్ సావంత్, పెమా ఖండు, పుష్కర్ సింగ్ ధామి, బీజేపీ అగ్ర నేతలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నబీన్ తరఫున బీజేపీ రాష్ట్ర శాఖలు కూడా ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశాయి. అలా మొత్తం 37 సెట్ల నామినేషన్లు దాఖలైనట్టు లక్ష్మణ్ వివరించారు. నబీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బిహార్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నబీన్‌కు రానున్న పశ్చిమబెంగాల్ సహా పలు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నడపడం అగ్నిపరీక్షగా నిలవనుంది.

తొలిసారి అద్వాణీ, జోషీ లేకుండా!

బీజేపీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియకు పార్టీ కురువృద్ధులు లాల్‌కృష్ణ అద్వాణీ, మురళీ మనోహర్ జోషీ గైర్హాజరయ్యారు. అధ్యక్ష ఎన్నికల ఓటర్ల జాబితాలో కూడా వారి పేర్లు లేవు. ఇలా జరగడం బీజేపీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. 1980 నుంచీ ఇప్పటిదాకా జరిగిన 11 మంది అధ్యక్షుల ఎన్నికల్లో వారు భాగస్వాములుగా ఉంటూ వచ్చారు. అయితే అద్వాణీ, జోషీ ప్రస్తుతం ఢిల్లీ బీజేపీ శాఖ నుంచి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఢిల్లీ శాఖకు సంస్థాగత ఎన్నికలు జరగాల్సి ఉంది. దాంతో అధ్యక్ష ఎన్నికల ఓటర్ల జాబితాలో వారి పేర్లు చేర్చేందుకు వీల్లేకుండా పోయిందని బీజేపీ వర్గాలు తెలిపాయి.

యంగెస్ట్ ప్రెసిడెంట్‌గా!

న్యూఢిల్లీ: 26 ఏళ్లకే ఎమ్మెల్యే. 45వ ఏటే బీజేపీ వంటి అతి పెద్ద పార్టీకి జాతీయ అధ్యక్షుడు. ఆ ఘనత సాధించిన అతి పిన్న వయస్కునిగా రికార్డు. నితిన్ నబీన్ రాజకీయ ప్రస్థానం తొలినుంచీ ఆసక్తికరమే. ఆయన ఎన్నికతో బీజేపీ పగ్గాలు రెండో తరం చేతికి అందినట్టయింది.నిజానికి బీజేపీలో జాతీయ స్థాయి ప్రముఖ నేతల జాబితాలో నబీన్ పేరు ఎప్పుడూ పెద్దగా లేదు. అలాంటి నేతలకు ఏకంగా అధ్యక్ష పగ్గాలు అందడం అనూహ్యమనే చెప్పాలి. నబీన్ జన్మించింది బీజేపీ పురుడు పోసుకున్న 1980లోనే కావడం విశేషం. ఆయన జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన కాయస్థ కులస్తుడు. యువకుడే అయినా పాలన, పార్టీ సంస్థాగత నిర్మాణ వ్యవహారాలు తదితరాల్లో అపార అనుభవం ఆయన సొంతం. నబీన్ రాజకీయ ప్రస్థానం బీజేపీ యువజన విభాగమైన యువమోర్చాతో మొదలైంది. నబీన్ కుటుంబానికి ఆరెస్సెస్‌తో సన్నిహిత బంధముంది. ఆయన తండ్రి నబీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కూడా బీజేపీ నాయకుడే. పట్నా వెస్ట్ ఎమ్మెల్యేగా ఉంటూ 2006లో మరణించారు. దాంతో జరిగిన ఉప ఎన్నికలో నబీన్ ఏకంగా 60 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అప్పటినుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు! 2023లో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సహ ఇన్‌చార్జిగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ పార్టీని విజయపథంలో నడిపి జాతీయ నాయకత్వాన్ని మెప్పించారు. తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఛత్తీస్‌గఢ్‌లో 11 స్థానాలకు గాను బీజేపీ ఏకంగా 10 సీట్లు నెగ్గేలా చేశారు. బీజేపీ అధ్యక్ష పదవికి నడ్డా వారసునిగా పలువురు ప్రముఖుల పేర్లు విన్పించినా, పార్టీ నాయకత్వం మాత్రం అనూహ్యంగా నబీన్ వైపు మొగ్గింది. గత డిసెంబర్ 16న ఆయనను తాత్కాలిక అధ్యక్షునిగా ప్రకటించింది. మంగళవారం ఆయన నుంచి నబీన్ లాంఛనంగా బీజేపీ అధ్యక్ష పగ్గాలు అందుకోనున్నారు. ఆయనకు భార్య దీప్‌మాలా శ్రీవాత్సవ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కీలకమైన పశ్చిమబెంగాల్‌తో పాటు తమిళనాడు, కేరళ, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని విజయపథంలో నడపాల్సిన గురుతర బాధ్యత నబీన్ భుజస్కంధాలపై ఉంది.

ఫిబ్రవరి 8న జపాన్‌లో ఎన్నికలు

ప్రధాని సనే తకాయిచీ అనూహ్య నిర్ణయం

టోక్యో: జపాన్ ప్రధానమంత్రి సనే తకాయిచీ అనూహ్య నిర్ణయం తీసుకు న్నారు. పార్లమెంట్‌ను రద్దు చేసి, తక్షణమే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సోమవారం టోక్యోలో జరిగిన మీడియా సమావేశంలో తకాయిచీ ఈ విషయం ప్రకటించారు. పార్లమెంట్‌లోని శక్తివంతమైన దిగువ సభను ఈ నెల 23వ తేదీన రద్దు చేస్తానని వెల్లడించారు. ఫిబ్రవరి 8వ తేదీన ఎన్నికలు నిర్వహించడం ద్వారా తమకున్న ప్రజామద్దతును దిగువ సభలో అత్యధిక మెజారిటీ సాధించేలా మల్చుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. 'ఇది అత్యంత కఠినమైన నిర్ణయం. ప్రజలతో కలిసి జపాన్ పురోగమనాన్ని ఖరారు చేసే నిర్ణయం. తకాయిచీ ప్రధాని పదవికి అర్హురాలా, కాదా? అన్నది ప్రజలు తేల్చే నిర్ణయం'అని ఆమె వ్యాఖ్యానించారు. గతేడాది అక్టోబర్ 21వ తేదీన దేశ మొట్టమొదటి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తకాయిచీకి, ఆమె కేబినెట్‌కు ప్రజల మద్దతు ఉంది. అయితే, ఆమె లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ(ఎల్‌డీపీ) మాత్రం ప్రజాదరణలో వెనుకబడింది. అయిదేళ్ల కాలంలో ప్రధానిగా పీఠం ఎక్కిన నాలుగో ఎల్డీపీ నేత తకాయిచీ. దీంతో, ఆకస్మిక ఎన్నికల వ్యూహం ఏమేరకు ఫలిస్తుందన్నది తెలియాల్సి ఉంది. దిగువ సభలోని 465 మంది సభ్యుల ఎన్నికకు సంబంధించిన ప్రచారం ఈ నెల 27వ తేదీ నుంచి మొదలుకానుంది. 1955 నుంచి జపాన్‌లో అత్యధిక కాలం ఎల్డీపీయే అధికారంలో ఉంది. ఈ పార్టీకి దిగువ సభలో 199 మంది సభ్యుల బలముంది. మాజీ ప్రధాని షింజో అబే శిష్యురాలిగా తకాయిచీకి పేరుంది. షింజో అబే తర్వాత అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకురాలుగా తకాయిచీ నిలిచారు.

స్పెయిన్‌లో రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ

- 39 మంది మృతి, 100 మందికి పైగా గాయాలు
- గాయపడినవారిలో 30 మంది పరిస్థితి విషమం
- మొదటి రైలు పట్టాలు తప్పడంతో ప్రమాదం

మాడ్రిడ్: స్పెయిన్‌లో సోమవారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొనడంతో 39 మంది మృతి చెందారు. దాదాపు వందమందికి పైగా గాయపడ్డారు. వారిలో 30 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం మలగా నుంచి మాడ్రిడ్‌కు వెళ్తున్న ఒక హైస్పీడ్ రైలుకు ఆడమూజ్ సమీపంలో ప్రమాదం జరిగింది. మొదటి రైలు వెనుక భాగం పట్టాలు తప్పి.. పక్కనే మరో రైలు ట్రాక్‌పై పడింది. ఎదురుగా వస్తున్న రెండో రైలును ఢీకొట్టింది. దీంతో రెండో రైలులోని మొదటి రెండు బోగీలు ట్రాక్‌పై నుంచి 4 మీటర్ల కిందకి పడిపోయాయి. ఈ రైలు ముందు భాగానికి అత్యంత తీవ్రమైన నష్టం వాటిల్లింది. కొన్ని బోగీలు నాలుగు మీటర్ల కట్ట కిందకు పడిపోయాయి. కొన్ని మెలి తిరిగిపోయాయి. ప్రమాద సమయంలో రెండు రైళ్లలో కలిపి దాదాపు 400 మంది ప్రయాణికులున్నారు. కొందరు ప్రయాణికులు ఎమర్జెన్సీ సుత్తులు ఉపయోగించి కిటికీలను పగలగొట్టుకుని బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అత్యవసర సేవా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇంకా వందల మంది ప్రయాణికులు శిథిలాల కింద ఉన్నారు. వారిని వెలికితీసే పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదం కారణంగా మాడ్రిడ్, అండలూసియన్ నగరాలైన కార్డోబా, సెవిల్లె, మలగా, హుయెల్వా మధ్య హై–స్పీడ్ సర్వీసులను సోమవారం నిలిపివేశారు. రైలు పట్టాలు తప్పినప్పుడు గంటకు 179 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. 'ఒక క్షణం భూకంపం వచ్చినట్లు అనిపించిందని, రైలు పట్టాలు తప్పింది' అని పట్టాలు తప్పిన రైలులో ఉన్న జర్నలిస్ట్ సాల్వడార్ జిమెనెజ్ తెలిపారు. మొదట పట్టాలు తప్పిన రైలు ప్రైవేట్ కంపెనీ ఇర్యోకు చెందినది. తీవ్రంగా నష్టపోయిన రెండో రైలు స్పెయిన్ ప్రభుత్వ రైలు కంపెనీ రెన్‌ఫెకు చెందినది.

హైస్పీడ్ రైలు నెట్‌వర్క్..

స్పెయిన్ యూరప్‌లో అతిపెద్ద హై–స్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న దేశం. మాడ్రిడ్, బార్సిలోనా, సెవిల్లె, వాలెన్సియా, మలగాతో సహా ప్రధాన నగరాలను కలుపు తూ 3,000 కిలోమీటర్లకు పైగా ప్రత్యేక ట్రాక్‌లు న్నాయి.

పట్టాలు తప్పి చెల్లాచెదురైన బోగీలు, సహాయ చర్యల్లో సిబ్బంది

వాణిజ్య యుద్ధం ఎవ్వరికీ మంచిది కాదు

ట్రంప్ టారిఫ్ బెదిరింపులపై యూకే ప్రధాని స్టార్మర్

లండన్: గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకునే క్ర మంలో యూరప్ దేశాలపై అమెరికా అధ్యక్షు డు ట్రంప్ చేస్తున్న తీవ్ర ఒత్తిడులపై యూకే ప్రధాని కీర్ స్టార్మర్ తనదైన శైలిలో స్పందించారు. అమెరికా, యూకే ఎప్పటిలా గానే సన్నిహిత మిత్ర దేశాలుగా కొనసాగు తాయన్న ఆయన..వాణిజ్య యుద్ధం వల్ల ఎవ్వరికీ లాభం కలగదన్నారు. సోమవారం ఆయన అత్యవసర మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రీన్‌లాండ్‌ను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ ప్రయత్ని స్తున్నారంటూ వస్తున్న వార్తలను ఖండించారు. మిత్ర దేశాలపై టారిఫ్‌లను అస్త్రంగా ప్రయో గించడం పూర్తిగా తప్పన్నారు. అదే సమయంలో, యూకే జాతీయ ప్రయోజనాల పరిరక్షణే తన బాధ్యతన్నారు. 'అందుకే, భాగస్వామ్యం, వాస్తవాలు, పరస్పర గౌరవం ప్రాతిపదికగా ఈ సమస్యపై పరిష్కారం కనుగొనే క్రమంలో ఆదివారం ట్రంప్‌తోపాటు యూరప్ దేశాల నేతలు, నాటో సెక్రటరీ జనరల్‌తో ఫోన్‌లో మాట్లాడా. ఎందుకంటే, బలమైన కూట ములు తమ ఉమ్మడి ప్రయోజనాలను ఆ విధంగానే కాపాడుకుంటాయి'అని వ్యాఖ్యా నించారు. ట్రంప్‌తో క్రమం తప్పక మాట్లాడు తూనే ఉంటానన్న స్టార్మర్..విభేదాలున్నా లేనట్టుగా నటించడం కాదు, వాటిని ముఖా ముఖి చర్చించి పరిష్కరించుకోవడమే పరిణతి చెందిన కూటముల లక్షణమని చెప్పారు.

బాధ్యతాయుత దేశాల సూచీ

భారత్‌కు 16వ స్థానం

న్యూఢిల్లీ: బాధ్యతాయుత దేశాల సూచీ (ఆర్‌ఎన్‌ఐ)లో భారత్ 16వ స్థానంలో నిలిచింది. సింగపూర్‌కు తొలి స్థానం, స్విట్జర్లాండ్‌కు రెండో స్థానం దక్కాయి. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం ఆఎన్‌ఐని విడుదల చేశారు. ఇందుకోసం మొత్తం 154 దేశాలను మదింపు చేశారు. ఈ గ్లోబల్ ఇండెక్స్‌లో డెన్మార్క్ మూడో స్థానంలో నిలవగా సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ అట్టడుగున చోటు దక్కింది. దాయాది పాకిస్తాన్‌కు సూచీలో 90వ స్థానం దక్కింది. అగ్ర రాజ్యం అమెరికాకు 66, చైనా 68వ స్థానంలో నిలవడం విశేషం.

నాకు నోబెల్ ఇవ్వలేదు కాబట్టి.. శాంతి గురించి ఆలోచించను..!

- నార్వే ప్రధానికి పంపిన మెసేజ్‌లో ట్రంప్
- గ్రీన్‌లాండ్‌పై ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడి వితండవాదం

ఓస్లో: గ్రీన్‌లాండ్ అంశంపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ నార్వే ప్రధానమంత్రి జొనాస్ గహ్ర్ స్టోర్ ఒక ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. నోబెల్ శాంతి బహుమతిని, గ్రీన్‌లాండ్‌తో ముడిపెడుతూ అమెరికా అధ్యక్షుడు తనకో సందేశం పంపారని చెప్పారు. 'నోబెల్ శాంతి బహుమతి నాకు లభించలేదు. కాబట్టి, శాంతి గురించి మాత్రమే మాట్లాడాల్సిన బాధ్యత ఎంతమాత్రం నాకు లేదు'అని అందులో ట్రంప్ పేర్కొన్నట్లు తెలిపారు. 'ఎనిమిదికి పైగా యుద్ధాలను ఆపినందుకుగాను నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వకూడదని మీ దేశం నిర్ణయించింది. అందుకే ఇకపై కేవలం శాంతి గురించి మాత్రమే ఆలోచించాల్సిన బాధ్య త నాకు ఉందని అనుకో వడం లేదు. శాంతికి ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుంది, కానీ, ఇప్పుడు అమెరికాకు ఏది మంచిది, ఏది సరైనది అనే దానిపైనే నేనిప్పుడు ఆలోచిస్తా. గ్రీన్‌లాండ్‌పై మాకు పూర్తి, సమగ్ర నియంత్రణ ఉంటే తప్ప ఈ ప్రపంచం సురక్షితంగా ఉండదు'అని ఆయన అందులో పేర్కొన్నట్లు జొనాస్ వివరించారు. ట్రంప్ నోబెల్ వాదనపై జొనాస్.. 'నోబెల్ శాంతి బహుమతి ఎంపిక బాధ్యత నార్వేజి యన్ నోబెల్ కమిటీయే తప్ప నార్వే ప్రభు త్వం కాదు. కమిటీ ఒక స్వతంత్ర విభాగం. అందులోని ఐదుగురు సభ్యులను నార్వే పార్లమెంట్ నియమిస్తుంది'అని వివరించారు.

పండుగలప్పుడు ఛార్జీల పెంపా?

- విమానయాన సంస్థల తీరుపై సుప్రీంకోర్టు విస్మయం
- తాము జోక్యం చేసుకుంటామని వ్యాఖ్య

న్యూఢిల్లీ: పండుగల రద్దీని అవకాశంగా తీసుకుని విమాన ప్రయాణ ఛార్జీలను అమాంతంగా పెంచేయడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. చార్జీలను ఆకస్మిక పెంచి విమానయాన సంస్థలు సాగిస్తున్న దోపిడీపై జోక్యం చేసుకోక తప్పదని స్పష్టం చేసింది. ప్రైవేట్ విమానయాన సంస్థలు ఆకస్మికంగా పెంచుతున్న చార్జీలు, అదనపు రుసుములను నియంత్రించడానికి తగు మార్గదర్శకాలను రూపొందించాలంటూ దాఖలైన పిల్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'మేం ఈ విషయంలో కచ్చితంగా జోక్యం చేసుకుంటాం. కుంభమేళా, ఇతర పండగల సమయాల్లో ప్రయాణికులను ఎలా దోచుకుందీ చూశాం. తాజాగా, ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్, జోథ్‌పూర్‌లకు చార్జీలను ఆకస్మికంగా పెంచేశారు'అని ధర్మాసనం పేర్కొంది. విమాన ప్రయాణ చార్జీల్లో పారదర్శకత, ప్రయాణికుల హక్కుల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలంటూ సామాజిక కార్యకర్త లక్ష్మీనారాయణన్ వేసిన పిటిషన్‌పై గతేడాది నవంబర్ 17వ తేదీన విచారణ చేపట్టిన ధర్మాసనం..కేంద్రం, డీజీసీఏ తదితరులకు నోటీసులు జారీ చేసింది. సోమవారం విచారణ సందర్భంగా సమాధానం ఇచ్చేందుకు మరింత గడువు కావాలని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్ కోరడంతో ధర్మాసనం తదుపరి విచారణను ఫిబ్రవరి 23వ తేదీకి వాయిదా వేసింది. ఎకానమీ క్లాస్ ప్రయాణికులకు గతంలో 25 కిలోల వరకు లగేజీని ఉచితంగా తీసుకెళ్లే అవకాశం ఉండగా ప్రైవేట్ విమానయాన సంస్థలు దాన్ని 15 కిలోలకు ఏకపక్షంగా తగ్గించి వేశాయని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రస్తుతం విమాన చార్జీలను, ఇతర అదనపు రుసుములను సమీక్షించేందుకు గానీ, గరిష్ఠ పరిమితిని నిర్ణయించేందుకు గానీ అధికారం ఏ వ్యవస్థకూ లేకపోవడంతో విమానయాన సంస్థలు వివిధ రూపాల్లో ప్రయాణికులను దోచుకుంటున్నాయని ఆరోపించారు.

6 గంటలకుపైగా విజయ్‌ను ప్రశ్నించిన సీబీఐ

సాక్షి, చెన్నై: తమిళనాడులో గత ఏడాది సెప్టెంబర్ 27న 41 మంది ప్రాణాలను బలిగొన్న కరూర్ తొక్కిసలాట ఘటనలో తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ చీఫ్, నటుడు విజయ్‌ను ఇరికించే కుట్ర జరుగుతోందన్న వార్త ఇప్పుడు తమిళనాట ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇసకేస్తే రాలనంత జనం వచ్చారని తెల్సి కూడా ప్రసంగాన్ని వెంటనే ముగించి జనాన్ని పంపేయకుండా సుదీర్ఘ ప్రసంగాలు చేశారని, అందుకే జనం అక్కడే ఉండిపోవడంతో తొక్కిసలాట జరిగిందన్న కోణంలో నేరాభియోగాలు మోపాలని, ఆ చార్జ్‌షీట్‌లో విజయ్ పేరును చేర్చాలని సీబీఐ భావిస్తోందని వార్తలు వెలువడ్డాయి. విజయ్‌తోపాటు అదనపు డీజీపీ, మరో తమిళనాడు సీనియర్ పోలీస్ అధికారి పేర్లనూ చార్జ్‌షీట్‌లో చేర్చాలని సీబీఐ భావిస్తోందని వార్తలు వెలువడ్డాయి. దీనిపై సీబీఐ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణలో భాగంగా సోమవారం సైతం విజయ్‌పై సీబీఐ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఏకధాటిగా ఆరు గంటలకుపైగా ఆయనను ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన సమన్ల మేరకు విజయ్ ఢిల్లీ లోధీ రోడ్‌లోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఉదయం 10.20 గంటలకువచ్చారు. ర్యాలీని ఏ తరహాలో చేయాలని ప్రణాళిక వేశారు?. షెడ్యూల్ సమయం కంటే చాలా ఆలస్యంగా ఎందుకు ర్యాలీకి రావాల్సి వచ్చింది? జనం విపరీతంగా వచ్చారని తెల్సి కూడా ప్రసంగాన్ని ఎందుకు కొనసాగించారు?. జనం అదుపుతప్పుకున్నారని అర్థమయ్యాక కూడా జనాన్ని కట్టడిచేసే చర్యలను మీ పార్టీ శ్రేణులు ఎందుకు తీసుకోలేదు? వంటి పలు రకాల ప్రశ్నలకు విజయ్ నుంచి సమాధానాలు రాబట్టినట్లు తెలుస్తోంది. అయితే కొన్నింటికి సమాధానం చెప్పిన విజయ్ మరికొన్నింటికి వివరణ ఇచ్చేందుకు గడువు కోరినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. విచారణ తర్వాత సాయంత్రం ఐదు గంటలకు ఆఫీస్‌ను నుంచి బయటకు వచ్చి తాను బసచేస్తున్న హోటల్‌కు వెళ్లిపోయారు. ఈ కేసులో ఫిబ్రవరి రెండో వారంలో సీబీఐ తన తొలి నేరాభియోగ పత్రాన్ని కోర్టులో సమర్పించనుంది.

సోమవారం ఢిల్లీలో విచారణ అనంతరం సీబీఐ కార్యాలయం బయట విజయ్

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 38.0486 టీఎంసీలు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4000, మోడల్ ధర రూ.3400 వరకు పలికింది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 552.00 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 46,428 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పేద రోగుల సేవలో జింకానా

- గుంటూరు జీజీహెచ్‌కు రూ.100 కోట్ల విరాళం
- గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల దాతృత్వం
- పూర్వ వైద్య విద్యార్థుల విరాళాలతో మాతా శిశు సంరక్షణ కేంద్రం
- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే నిర్మాణం ప్రారంభం
- ప్రస్తుతం తుది దశకు చేరుకోవడంతో ఈ నెల 30న ప్రారంభానికి సన్నాహాలు
- రూ.20 కోట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ ఉమా గవిని
- రూ.10 కోట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ పాదిల ప్రసాద్

ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా వైద్య విద్యార్థులంతా ఒక సంఘంగా ఏర్పడి చదువుకున్న మాతృ సంస్థ రుణం తీర్చుకుంటూ సంస్థ అభివృద్ధికి అవిరళ కృషి చేస్తున్నారు. ఆ సంఘం పేరే జింకానా. గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్లంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడి తాము చదువుకున్న కళాశాలను మరిచిపోకుండా అభివృద్ధికి కృషి చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. గుంటూరు వైద్య కళాశాల అల్యూమిని ఆఫ్ నార్త్ అమెరికా (జింకానా) 1981లో ఏర్పడింది. సుమారు 2,500 మంది పూర్వ విద్యార్థులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. వీరంతా ప్రతి ఏడాది గుంటూరు వైద్య కళాశాలకు, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి అభివృద్ధికి విరాళాలు అందజేస్తున్నారు. – గుంటూరు మెడికల్

గుంటూరు జీజీహెచ్‌లో, వైద్య కళాశాలలో ఏళ్ల తరబడి అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు నిధులు వెచ్చిస్తున్న జింకానా తాజాగా జీజీహెచ్‌లో ఎంసీహెచ్ (మాతా శిశు సంరక్షణ కేంద్రం) వార్డు నిర్మాణం కోసం రూ. 100 కోట్లు కేటాయించింది. భవన నిర్మాణం పూర్తవడంతో ఈనెల 30న ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. జింకానా ఆధ్వర్యంలో కళాశాల, ఆసుపత్రికి ప్రతీ ఏడాది నిధులు అందుతున్నా 2004లో కళాశాలలో జింకానా ఆడిటోరియం నిర్మాణంతో పూర్వ విద్యార్థుల సేవలు వెలుగులోకి వచ్చాయి. సుమారు రూ.2.50 కోట్లతో 850 సీటింగ్ సామర్థ్యంతో జింకానా ఆడిటోరియం నిర్మించారు. 2009లో రూ.35 కోట్లతో డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ, ట్రామా సెంటర్ భవన నిర్మాణం జరుగ్గా అందులో రూ.20 కోట్లు జింఖానా సభ్యులు విరాళంగా అందజేశారు. డాక్టర్ పాదిల ప్రసాద్ ఒక్కరే రూ. 5 కోట్లు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు రావడంతో పాదిల ప్రసాద్ భవన నిర్మాణం జరిగింది. ప్రపంచ స్థాయి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్స్ నిర్మించడంతో డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేయడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

ప్రారంభానికి సిద్ధమవుతున్న ఎంసీహెచ్ వార్డు

తాజాగా ఎంసీహెచ్ నిర్మాణం

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మాతా శిశు మరణాలు తగ్గింపే లక్ష్యంగా గుంటూరు జీజీహెచ్‌లో మాతా, శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్ వార్డు) నిర్మించాలని నిర్ణయించాయి. సుమారు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఎంసీహెచ్ నిర్మాణం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభమై చివరి దశకు చేరుకుంది. భవన నిర్మాణం చేపట్టేందుకు ఉన్న అడ్డంకులన్ని తొలగిపోయేలా గత ప్రభుత్వం చేయూతనివ్వడంతో జింఖానా సభ్యులు రూ. 100 కోట్లు విరాళం ఇచ్చి భవన నిర్మాణం పూర్తి చేశారు. గతంలో జీజీహెచ్‌లో డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్ నిర్మాణం కోసం రూ. 5 కోట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ పాదిల ప్రసాద్ ఎంసీహెచ్ వార్డు నిర్మాణం కోసం మరో రూ. 5 కోట్లు విరాళం ఇచ్చారు. అతేకాకుండా డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌పైన రెండంతస్తులు నిర్మాణం చేసేందుకు రూ. 10 కోట్లు విరాళం అందజేశారు. జింకానా సభ్యుల్లో 200 మంది విరాళాలు అందించారు. వీరిలో అత్యధికంగా డాక్టర్ ఉమ గవిని రూ. 20 కోట్లు అందజేయడంతో ఆమె భర్త డాక్టర్ కానూరి రామచంద్రరావు పేరుతో ఎంసీహెచ్ వార్డు నిర్మాణం చేస్తున్నారు. డాక్టర్ కె.వెంకట్రావు, రమాదేవి వాసిరెడ్డి దంపతులు రూ.4.3 కోట్లు, డాక్టర్ మువ్వా వెంకటేశ్వరరావు, వేదవతి దంపతులు రూ.4 కోట్లు, తాతినేని గోపాలరావు రూ. 4 కోట్లు ఎంసీహెచ్ నిర్మాణం కోసం అందజేశారు.

ఎంసీహెచ్ ప్రత్యేకతలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా లేని విధంగా మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) 600 పడకలతో ఐదంతస్తులు భవనాన్ని నిర్మించారు. అప్పుడే పుట్టిన పసికందులకు, గర్భిణులు, బాలింతలకు కార్పొరేట్ వైద్యసేవలు ఎంసీహెచ్ వార్డులో ఉచితంగా అందనున్నాయి. ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో నిర్మించిన అత్యాధునిక మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు తొమ్మిది ఉన్నాయి. 29న జింకానా సభ్యులంతా ఎంసీహెచ్ వార్డులో హాజరు కానున్నారు.

జింకానా దేశానికే ఆదర్శం

గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ అభివృద్ధే ధ్యేయంగా జింకానా పనిచేస్తోంది. విదేశాల్లో ఉన్న పూర్వ వైద్య విద్యార్థులంతా ప్రతిరోజూ తాము చదువుకున్న కళాశాలకు విరాళాలు ఇస్తున్నారు.ప్రతి ఏడాదీ కళాశాల లో అత్యధిక మార్కులు సాధిస్తున్న మెడికోలకు, వైద్యులకు అవార్డులు, పారితోషికాలను అందజేస్తూ వైద్య విద్యను ప్రోత్సహిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింకానా పేరుతో మాతృసంస్థ అభివృద్ధికి చేస్తున్న సహాయాన్ని చూసి దేశ వ్యాప్తంగా పలు కళాశాలల వారు ఆదర్శంగా తీసుకుని తమ మాతృసంస్థలను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావడం జింకానా గొప్పతనానికి నిదర్శనమని చెప్పుకోవచ్చు.

– డాక్టర్ యశస్వి రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్, గుంటూరు

డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్

జింకానా ఆడిటోరియం

న్యూస్‌రీల్

ఇండో-ఇజ్రాయెల్ ప్రాజెక్టును పరిశీలించిన ఇజ్రాయెల్ ప్రతినిధి

నకరికల్లు: నకరికల్లు మండలం నర్సింగపాడు సమీపంలోని బాలాజీనగర్‌తండా వద్ద నిర్మాణ దశలో ఉన్న ఇండో–ఇజ్రాయెల్ అగ్రికల్చర్ ప్రాజెక్టు పనులను ఇజ్రాయెల్ దేశపు పొలిటికల్ అఫైర్స్ సెక్రెటరీ సారా వోల్గా మెలిండా ఎనౌస్కి సోమవారం పరిశీలించారు. అగ్రికల్చర్ ట్రెనింగ్ సెంటర్, ఫార్మర్స్ హాస్టల్ తదితర పనుల పురోగతి, నిధుల వినియోగం, ప్రాజెక్టు ఎప్పటికి అందుబాటులోకి వస్తుందన్న అంశాలపై హార్టికల్చర్ అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ మునిరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు వేగవంతంగా సాగుతున్నాయని వివరించారు. ఆమె వెంట జిల్లా హార్టికల్చర్ అధికారి వి.వెంకట్రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు శ్రీవాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

తెనాలి: శ్రీవాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మంగళవారం తెనాలిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఘనంగా నిర్వహించనున్నారు. సంబంధిత ఆహ్వానపత్రికను వాసవి యూత్, తెనాలి నాయకులు సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. 'శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై వాసవీ యూత్, తెనాలి నాయకులు హర్షం వ్యక్తంచేశారు. తెనాలి బోసురోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగే అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవానికి అందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. వాసవీ యూత్ నాయకులు నాళం రజనీకుమార్, కొప్పురావూరి కిషోర్, కనమర్లపూడి శ్రీనివాస్, మాజేటి బదరికిరణ్, చీమకుర్తి సతీష్, దేసు రవి, వలివేటి సురేష్, పొన్నూరు తుక్కయ్య, పాల్గొన్నారు.

లాయర్స్ వాయిస్ క్యాలెండరు ఆవిష్కరణ

తెనాలి: ప్రముఖ హైకోర్టు న్యాయవాది నారపరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో 'లాయర్స్ వాయిస్' మాస పత్రిక విజయవాడ కేంద్రంగా గత పదేళ్లుగా నడుస్తోంది. ఆ పత్రిక ఆధ్వర్యంలో 2026 సంవత్సర కేలండర్‌ను సోమవారం స్థానిక గంగానమ్మపేటలోని నవోదయ విద్యా నికేతన్‌లో ఆవిష్కరించారు. నవోదయ విద్యా నికేతన్ కరెస్పాండెంట్ రాంబాబు, వివేకానంద అసోసియేట్స్ (జాబ్ కాన్సల్టెన్సీ) చైర్మన్ నాగిశెట్టి సాయిచరణ్, లాయర్స్ వాయిస్ ఎడిటర్ ఎన్.రాజారెడ్డి పాల్గొన్నారు. రాంబాబు, సాయిచరణ్ మాట్లాడుతూ రాజారెడ్డి ఆధ్వర్యంలో పదేళ్లుగా పత్రికను నడపడం సంతోషంగా ఉందన్నారు.

ప్రకృతి వ్యవసాయ మహిళకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు రావాలంటూ కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన ఎ.స్వాతికి ఆహ్వానం అందింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ 2016 నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తూ వివిధ రకాల దేశీయ వరి రకాలు భర్తతో కలిసి 20 ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పూర్తిగా పాటిస్తూ ఎటువంటి ఎరువులు, పురుగుమందులు వాడకుండా రసాయన రహిత వ్యవసాయం చేస్తున్నారు. స్వాతి సోమవారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను పీజీఆర్ఎస్ హాలులో కలిసింది. కలెక్టర్ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు అధికారి రాజకుమారి స్వాతిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అర్జీల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి

పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- పీజీఆర్ఎస్‌లో 195 అర్జీలు స్వీకరణ

లక్ష్మీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లలో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలితో కలసి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్‌లో వస్తున్న అర్జీలను పరిశీలించారు. మొత్తం 195 అర్జీలు అందాయి. రెవెన్యూ క్లినిక్‌లో అందిన అర్జీలను కలెక్టర్ పరిశీలించారు. రెవెన్యూ క్లినిక్‌కు నాలుగు కౌంటర్‌లు ఏర్పాటుచేశారు. పీజీఆర్ఎస్‌లో అందిన కొన్ని అర్జీల వివరాలు ఈవిధంగా ఉన్నాయి..

- వట్టిచెరుకూరు మండలం చదుల్లమూడికి చెందిన చిలుకూరి గోపినాథ్ అర్జీని సమర్పిస్తూ తన వ్యవసాయ భూమి దేవదాయ శాఖ భూమిగా నమోదైందని, విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.
- గుంటూరు తూర్పు మండలం కొత్తపేటకు చెందిన కుర్రాల వెంకటరమణ వినతిపత్రం సమర్పిస్తూ ఏపీ టిడ్కో గృహం కోసం చెక్కు నగర పాలక సంస్థకు అందజేశానని, ఇప్పటి వరకూ గృహం మంజూరు చేయలేదని తెలిపారు.
- తెనాలి మండలం పెదరావురు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ శివరామకృష్ణ అర్జీని సమర్పిస్తూ తన భూమి 22(ఏ)లో నమోదై ఉందని, దానిని తొలగించి న్యాయం చేయాలని కోరారు.

డీఆర్వో శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, డీపీఓ బి.వి.నాగసాయికుమార్, డీఆర్‌డీఏ పీడీ వి.విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి.సత్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గాభాయి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు పాల్గొన్నారు.

మొక్కజొన్న తోటలో తెగుళ్ల దిగులు

- తెనాలి మండలంలో 20 వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పైరు
- ఖరీఫ్ వరిలో మోంథా, దిత్వా తుఫాన్‌ల దెబ్బకు నిండా మునిగిన రైతాంగం
- రబీ పంటలకు సరైన గిట్టుబాటు ధర రాకుంటే అప్పుల ఊబిలోకి రైతులు

గుడివాడలో మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోమసుందరపాలెంలో ఏపుగా పెరిగిన మొక్కజొన్న

తెనాలి టౌన్: ఆరుగాలం కష్టించే రైతుకు పండించిన పంట చేతికి వచ్చి అమ్ముకునే వరకు గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. తెనాలి మండలంలో దాదాపు 20 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేపడితే ఆదిలోనే మోంథా , పంట చేతికి వచ్చే సరికి దిత్వా తుఫాన్‌లు ముంచేశాయి. ఎకరాకు రూ. 30 వేల నుంచి 35 వేల కౌలు చెల్లించి రూ.10వేల నుంచి రూ.15వేలు పెట్టుబడి పెట్టి దిగుబడి రాక సరైన గిట్టుబాటు ధర లేక వరి పైరు వేసిన రైతులు డీలా పడ్డారు. ఎకరాకు 20 నుంచి 25 వేల రూపాయలు నష్టం చవి చూశారు. రబీ సాగుగా ఈ ప్రాంతంలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర చేపట్టారు. ప్రస్తుతం 30 నుంచి 40 రోజుల దశలో జొన్న, మొక్కజొన్న పైరు ఉంది. మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. మూడు తడుల నీళ్లు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు ఖర్చు అవుతుందని వివరించారు. మార్చి చివరి వారం, ఏప్రిల్ నెలలో పంట చేతికి వస్తుందని అన్నారు. జొన్న, మొక్కజొన్నకైన ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

మొవ్వాకులో కత్తెర పురుగు

కత్తెర పురుగు .. సమగ్ర యాజమాన్య పద్ధతులు

మొక్కజొన్న సాగు చేసే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, పురుగు ఉధృతి అధికంగా ఉంటే యాజమాన్య పద్ధతులతో నివారించకుంటే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో సుధీర్‌బాబు సూచించారు.

నియంత్రణ చర్యలు చేపట్టాలి

మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు నివారణకు పెరోమోన్ ట్రాప్స్, ట్రైక్రోగామా ఈ రెండిటిలో ఒకటి వినియోగించాలి. అదే విధంగా లీటర్ నీటిలో ఎమామెక్టిన్ బెంజోయేట్ 5ఎస్‌జీ 0.4 గ్రాములు, లీటర్ నీటిలో క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సీ 0.4 మిల్లీలీటర్, లీటర్ నీటిలో స్పైనెటోరామ్ 11.7 ఎస్‌సీ 0.5 మి.లీ వినియోగించాలని సూచించారు.

– మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు

మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులు ప్రారంభం

గుంటూరు లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. శిక్షకులుగా సుప్రీం కోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ కేరళ నుంచి లాల్ వారియర్ అడ్వకేట్, మధ్యప్రదేశ్ నుంచి మిస్ నీనా ఖరే అడ్వకేట్‌లను నియమించారు. మొదటిరోజు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణచక్రవర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- తొలుత జిల్లా ప్రధాన న్యాయమూరి సాయికళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం అనుకున్న స్థాయిలో జరగడం లేదన్నారు. దానికి న్యాయబద్ధమైన కారణాలు ఉన్నాయని తెలిపారు.
- మధ్యవర్తిత్వంలో స్థిరాస్తి, వివాహ సంబంధ వివాదాల, వాణిజ్య పరమైన వివాదాలు ప్రథమ స్థాయిలోనే పరిష్కరించడం తేలికని తెలిపారు. భవిష్యత్తులో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించడానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి

- శిక్షణకు వచ్చిన న్యాయవాదులంతా మధ్యవర్తిత్వంలో నైపుణ్యాన్ని పెంచుకొని సుప్రీం కోర్టు అంచనాలకు తగినట్టు మధ్యవర్తిత్వంలో భాగస్వాములు కావాలన్నారు.
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం మధ్యవర్తిత్వాన్ని సమర్థంగా, సులభతరం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. అధునాతన పద్ధతులలో మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.
- మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన న్యాయవాదులు మొత్తం 33 మంది పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

దుగ్గిరాల: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. దుగ్గిరాలలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద రైతులు సోమవారం యూరియా కోసం క్యూలైనులో బారులు తీరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు రైతులను వారి కష్టాలు గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పనులు మానుకొని యూరియా కోసం నిత్యం లైనులో నిల్చోవాల్సి రావడం దారుణం అని అన్నారు. ఆధార్ కార్డుకి ఐదు కట్టలు ఇవ్వటం, సిఫార్సు ఉంటే ట్రాక్టరు నిండా తీసుకెళుతున్నారని అన్నారు. డీఏపీ లిక్విడ్ కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని షరతులు పెట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎరువులను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు, వెంటేశ్వరరావు, జానీ, లక్ష్మణరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంఈవై ఇళ్ల నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జిల్లాలో పీఎంఈవై ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయల సేవలు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లే–అవుట్లు లోని ఆప్షన్ 1, 2లోని ఇళ్ల నిర్మాణాలు ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తయ్యేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

సరస్ మేళా విజయం... ప్రజలది

సరస్ మేళా విజయం ప్రజలదేనని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సరస్ మేళా విజయవంతం కావడం పట్ల సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరులో సరస్ మేళా గొప్ప విజయవంతమైందన్నారు. సరస్‌లో 343 ప్రదర్శన శాలలు ఏర్పాటు చేసి రూ.25 కోట్లకు పైగా విక్రయాలు చేశారని తెలిపారు. ఇది జాతీయ స్థాయి కార్యక్రమం అన్నారు. గుంటూరు ప్రజలు విజయవంతం చేయడంలో గొప్ప భాగస్వామ్యం వహించారని ప్రశంసించారు.

వీడియో సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,138
అమ్మకాలు	50,289
నిల్వ	10,036

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,000–19,000
నంబరు–5	13,500–19,000
341	14,000–22,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	12,000–18,500
341	13,000–20,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	12,500 – 16,500
బాడిగ–355	13,500 – 18,000
దేవనూరు డీలక్స్	14,000 – 23,000
ఆర్మూర్	12,000 – 15,300
తాలుకాయలు	5,500 – 8,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	12,000–15,500
బాడిగ – 355	12,000–17,800
తాలు	5,500 – 8,200

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 294

కొమ్ములు : 918 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
13,450	13775	13,775

కాయలు : 151 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
13,400	13,725	13,400

మొత్తం అమ్మకాలు : 333.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

జిల్లా ఏఆర్ డీఎస్పీగా సంకురయ్య

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు మొక్క అందజేస్తున్న ఏఆర్ డీఎస్పీ సంకురయ్య

నగరంపాలెం: జిల్లా ఏఆర్ డీఎస్పీగా కె.సంకురయ్య సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని ఏఆర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఆయన ఆర్ఎస్ఐగా విధుల్లో చేరారు. 2014లో ఆర్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. అప్పటి నుంచి 2019 వరకు గుంటూరు రూరల్ జిల్లా ఆర్ఐగా విధులు నిర్వర్తించారు. 2019 నుంచి 2022 వరకు సీఏఆర్ విజయవాడలో విధులు నిర్వర్తించగా, 2022లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. అనంతరం నంద్యాల, విజయవాడ, అక్టోపస్ మంగళగిరి డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ గుంటూరు ఏఆర్ డీఎస్పీగా బదిలీయ్యారు. అనంతరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించారు.

పెళ్లిళ్ల పేరుతో మోసం

పోలీస్ ప్రజా వినతుల పరిష్కార వేదికలో మహిళల ఫిర్యాదు

బాధితుల మొరను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : ఒకరికి తెలియకుండా ఒకరిని పెళ్లాడిన నిత్య పెళ్లి కొడుకుపై బాధిత మహిళలు ఫిర్యాదు చేశారు. పెళ్లి కాలేదని చెప్పి రెండు వివాహాలు చేసుకున్నాడని వాపోయారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదిదారులతో మాట్లాడి, వారి వినతులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అనంతరం బాధితుల ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు..

గత ఏడాది మార్చి 15న కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తెలిసిన వ్యక్తులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా. నెలలు గడిచినా పట్టించుకోలేదు. నాలుగైదు నెలలు తర్వాత కుమార్తె వేరే మొబైల్‌ఫోన్ నుంచి ఫోన్ చేసి మాట్లాడింది. ఆ ఫోన్ నంబర్‌ను పోలీసుల దృష్టికి తీసుకెళ్లాను. కనీసం ఆ ఫోన్ ఎవరిది, ఏ ఏరియా నుంచి వచ్చిందనేది ఆరాతీయలేదు. అప్పటి నుంచి పలుమార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఒకే ఒక్క కుమార్తె కావడంతో గారాబంగా పెంచుకున్నా. ఏడాది నుంచి కుమార్తె ఆచూకీ తెలియరాలేదు. కుమార్తె చిరునామా గుర్తించగలరు.

– దివ్యాంగుడు పి.ఏసోబు, ఆర్.అగ్రహారం

మాయమాటలతో పెళ్లిళ్లు చేసుకున్నాడు..

గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్డులో నివసించే ఓ వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని చెప్పి 2017లో ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న శారదా కాలనీకి చెందిన ఓ యువతికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఒక బాబు సంతానం. అదే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి 2023లో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. అయితే రెండో భార్య ప్రసవం సమయంలో పుట్టింటికి వెళ్లింది. ఆమెకు కూడా బాబు పుట్టాడు. పలుమార్లు అత్తారింటికి తీసుకెళ్లాలని రెండో భార్య భర్తకు విన్నవించినా ఆలకించలేదు. ఈ క్రమంలో సహజీవనం చేశానని న్యాయవాది ద్వారా నోటీసులు పంపించినట్లు రెండో భార్య వాపోయింది. దీంతో భర్త గురించి ఆరాతీయగా, మొదట్లోనే పెళ్లయిందని తెలిసింది. ఇరువురు వేర్వేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తున్నామని బాధిత మహిళలు వాపోయారు.

బైబిల్ మిషన్ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు

- 25 నుంచి 27వ తేదీ వరకు మహోత్సవాలు
- భక్తుల కోసం భారీ పందిళ్లు
- కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యూల్ కిరణ్

పెదకాకాని: దైవజనులు ఫాదర్ ఎం.దేవదాస్ బయలుపరిచిన బైబిల్ మిషన్ 88వ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసినట్టు బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యూల్ కిరణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భక్తులకు సకల సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళ, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ మహాసభలకు తరలివస్తారన్నారు. అలానే సింగపూర్, మలేషియా, అమెరికా, దుబాయ్ వంటి తదితర దేశాల నుంచి భక్తులు, దేవుని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో మహోత్సవంలో పాల్గొంటారన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్ మిషన్ ప్రాంగణంలో సువిశాల పందిరిలో ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ మధ్యాహ్నం వరకు మహోత్సవాలు జరుగుతాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తిరిగి సాయంత్రం 6:00 నుంచి రాత్రి 10 గంటల వరకు దైవ వర్తమానాలు అందిస్తారన్నారు. ఏసుప్రభువు చూపిన ప్రేమ, దయ, జాలి, త్యాగం క్షమా గుణం వంటి లక్షణాలను ప్రతి ఒక్కరూ అలవరుచుకునేందుకు మహోత్సవాల ప్రాంగణం దోహదపడుతుందన్నారు. 26 సంవత్సరాలుగా బైబిల్ మిషన్ మహోత్సవాలను అధ్యక్షునిగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవాల వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి. జాన్ దేవదాసు , సెక్రటరీ రెవరెండ్ కె. ప్రశాంత్ కుమార్ , జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి. సుధాకర్, రెవరెండ్ జి. ఆగమనరావు , రెవరెండ్ ఎం. ఆర్. గవర్నింగ్ బాడీ సభ్యులు సారధ్యంలో వివిధ కమిటీల కృషితో ఈ ఏడాది మహోత్సవాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ వివరించారు.

బైబిల్‌మిషన్ మహోత్సవాల కోసం ఏర్పాటు చేసిన భారీ పందిళ్లు

సమాజాన్ని జాగృతం చేసిన యోగి వేమన

జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు

నివాళులర్పిస్తున్న జిల్లా ఏఎస్పీ హనుమంతు

నగరంపాలెం: సమాజాన్ని జాగృతం చేసిన మహానుభావుడు యోగి వేమన అని జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో యోగి వేమన జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీ హనుమంతు మాట్లాడుతూ యోగి వేమన బోధించిన నీతి సూత్రాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. యోగి వేమన ప్రజాకవిగా, సామాజిక సంస్కర్తగా సమాజంలో విశిష్ట స్థానం సంపాదించుకున్నారని అన్నారు. కుల, మత భేదాలు, మూఢనమ్మకాలను రూపుమాపేందుకు ఆయన తన పద్యాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని తెలిపారు. సమానత్వం, మానవ విలువలు, నైతికతలను సమాజంలో పెంపొందించడంలో వేమన చేసిన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు (ఎస్‌బీ), సుంకరయ్య (ఏఆర్), ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాస్, ఏఓ జగన్నాథరావు, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం కావాలి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : గణతంత్ర వేడుకలకు సిద్ధం కావాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గణతంత్ర వేడుకలపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకలు తుళ్లూరు మండలం రాయపూడిలో జరుగుతున్నాయన్నారు. ఈ వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. సీఆర్‌డీఏ, అన్ని శాఖల ప్రధాన కార్యాలయాలతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆయా శాఖలకు సూచించిన మేరకు శాఖల అభివృద్ధిని తెలియజేసే శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తాగు నీరు, పారిశుధ్యం పక్కాగా ఉండాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

మీ అబ్బాయి చదువు మా బాధ్యత..

బడి మానేసిన విద్యార్థి తండ్రికి కోన శశిధర్ కౌన్సెలింగ్

ఆటిజం సెంటర్‌ను పరిశీలిస్తున్న కోన శశిధర్, ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: 'పిల్లలను చదివించుకుంటే వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది, కుటుంబం కూడా మెరుగైన ప్రయోజనం పొందుతుంది, మీ అబ్బాయిని పనికి కాదు.. బడికి పంపండి. చదివించే బాధ్యతను మేం తీసుకుంటాం'.. ఇది బడి బయటి పిల్లాడి తండ్రితో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్న మాటలు. సోమవారం ఆయన సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావుతో కలిసి గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలో చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఆటిజం సపోర్ట్ సెంటర్'ను పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించి సెంటర్ అందిస్తోన్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆదే పాఠశాలలో గతంలో చదువుకుని కొద్దిరోజులుగా బడికి రాని ఓ విద్యార్థి గురించి ఆరా తీశారు. ఆ విద్యార్థి బడి మానేసి మెకానిక్ పనికి వెళ్తున్నాడని తెలుసుకున్నారు. వెంటనే ఆ విద్యార్థి తండ్రి నాగమల్లేశ్వర రావును పిలిపించి మాట్లాడగా, 'చదువు కంటే పని చేసుకుంటే డబ్బులొస్తాయి?' అని సమాధానమిచ్చారు. అయితే, బడికి వెళ్లి చదువుకుంటే పిల్లాడి భవిష్యత్తు బాగుటుందని, చదువు ద్వారా ప్రయోజనాలను వివరించి కౌన్సెలింగ్ చేశారు. దీంతో రేపటి నుంచి బాబుని బడికే పంపిస్తానని, పనికి పంపనని సదరు విద్యార్థి తండ్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి ఓఎస్డీ వెంకట రమణ పాల్గొన్నారు.

బడి మానేసిన విద్యార్థి తండ్రి నాగమల్లేశ్వరరావుతో మాట్లాడుతున్న కోన శశిధర్

సాహిత్య సేవలు స్ఫూర్తిదాయకం

ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

సత్యనారాయణకు సత్కారం

నగరంపాలెం: తెలుగు వాడైన యూపీ ఏసీబీ ఏడీజీపీ కిల్లాడి సత్యనారాయణ సాహిత్య సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సిహెచ్. ద్వారకాతిరుమలరావు అన్నారు. నగరంపాలెం బొమ్మిడాల ఆర్యవైశ్య వసతి సమావేశ మందిరంలో విశ్వనాథ సాహిత్య అకాడమీ, మెట్టు సత్యనారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మెట్టు సత్యనారాయణరెడ్డి స్మారక సాహిత్య పురస్కారం సభ ద్వారా ప్రముఖ సాహితీవేత్త రచయిత కిల్లాడి సత్యనారాయణను సత్కరించారు. ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ సాహిత్యపరంగా ఉన్నతంగా రాణించి, కీర్తి గడించడం తెలుగు వారికి గర్వకారణమని అన్నారు. సభకు సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షుడు వహించగా, కిల్లాడి సత్యనారాయణ సాహిత్య ప్రస్థానంపై కవి డాక్టర్ సుంకర గోపాలయ్య సాహిత్య సమీక్ష నిర్వహించారు. సభలో వీవీఐటి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఎస్వీ రామారావు, మెట్టు సత్యనారాయణరెడ్డి, రెడ్డి విద్య కళాశాల ప్రిన్సిపల్ సెట్లం చంద్రమోహన్, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీతలు డాక్టర్ పాపినేని, పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ సీహెచ్.సుశీలమ్మ, డాక్టర్ నాగరాజ్యలక్ష్మి, బండ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే రౌడీషీట్లు తెరుస్తాం

సత్తెనపల్లి: ప్రజాశాంతికి భంగం కలిగించేలా గొడవలకు పాల్పడేవారి పై రౌడీషీట్ తెరుస్తామని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు హెచ్చరించారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో సోమవారం పోలీసుల కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని మొత్తం నలుగురు సీఐలు, 10 మంది పోలీసులు, 80 మంది కానిస్టేబుళ్ల కలిసి గ్రామంలో ఇంటింటికి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. ప్రధానంగా గొడవలు చేసే వారిని గుర్తించి వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. గంజాయి స్వీకరించే వారిపై ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా పోలీసుల దృష్టికి తీసుకువచ్చి సహకరించాలన్నారు. సోదాల్లో సరైన పత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలు, రెండు కొడవళ్ళు, రెండు గొడ్డళ్లను సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరితో కలిసి ఎలాంటి గొడవలకు పాల్పడబోమని, అసాంఘిక కార్యక్రమాలు పోలీసుల దృష్టికి తీసుకువస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సత్తెనపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎం. హైమారావు, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు ఉన్నారు.

21న హుండీ కానుకల లెక్కింపు

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు కార్యక్రమం ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఎగువ, దిగువ సన్నిధులతో పాటు ఘాట్‌రోడ్‌లో ఉన్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీలను 21వ తేదీ ఉదయం 9 గంటలకు లెక్కింపు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

యోగి వేమన రచనలు స్ఫూర్తిదాయకం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెనీ క్రిస్టినా, జ్యోతిబసు, ఏఓలు, సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: తన రచనలతో సమాజాన్ని జాగృతం చేసిన యోగి వేమన చిరస్మరణీయుడని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి, తత్వవేత్త యోగి వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ యోగి వేమన రచనలు ప్రస్తుత తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, పరిపాలనాధికారులు నిర్మల భారతి, రత్నబాబు, పూర్ణచంద్రారెడ్డి, మల్లేశ్వరరావు, నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువతి బలవన్మరణం

చిలకలూరిపేట టౌన్: తల్లి మందలించిందన్న చిన్న కారణంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఎలుకల మందు తిని ప్రాణాలు విడిచిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పట్టణంలోని ఆదిఆంధ్ర కాలనీకి చెందిన బోగుమళ్ల అనురాధ (18) ఈ నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల నివారణకు వాడే 'పేస్టు' తినింది. మరుసటి రోజు ఆమెకు తీవ్రమైన జ్వరం రావడంతో అనుమానం వచ్చిన తల్లి పావని గట్టిగా నిలదీయగా అసలు విషయం బయటపడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. ప్రకాశం జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన మరియదాసు, పావని కుటుంబం మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం చిలకలూరిపేటకు వలస వచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పసి బిడ్డను వదిలేసిన గుర్తు తెలియని వ్యక్తి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : మూడు రోజుల పసిబిడ్డను గుంటూరు పట్టాభిపురంలోని మాతృశ్రీ అనాథ ఆశ్రమంలో వదిలేసి వెళ్ళిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు సుమారు మూడు రోజుల పసి బిడ్డను ఆశ్రమం బయట వదిలేసి వెళ్ళడంతో ఏడుపు విన్న ఆశ్రమం నిర్వాహకులు సీఐకు సమాచారం తెలియజేశారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.

కెనరా బ్యాంక్ Canara Bank భారత ప్రభుత్వ రంగ సంస్థ A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ, ఏపీ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తులు అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 16.02.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయింపబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు ఋణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 16.02.2026, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 16.02.2026, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 16.02.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

క్ర. నెం	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయడమైనవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ. లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	గుంటూరు మెయిన్ బ్రాంచ్ M/s అవె మారియా ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీమతి ఇనగంటి అనిత, శ్రీ ఇనగంటి లాల్ సాహెబ్, శ్రీ తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీ షేక్ జాన్ సాహెబ్, శ్రీ షేక్ సైదా వి తేది 13.01.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 4,34,80,024.35 + వడ్డీ + ఇతర ఖర్చులు.	ఆస్తి నెం.1: గుంటూరు జిల్లా, గుంటూరు, వట్టిచెరుకూరు మండలం, చముళ్లమూడి గ్రామం & గ్రామపంచాయతీ, చముళ్లమూడి, డి. నెం: 255, డోర్ నెం.2-19, చముళ్లమూడి మెయిన్ రోడ్డు దగ్గర, డాక్యుమెంట్ నెం. 6736/1981, తేది 29-05-1981 ప్రకారం 172.00 చ॥గ॥ విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు డీడ్ ప్రకారం.	రూ. 9.80 లక్షలు	రూ. 0.98 లక్షలు
	ఆస్తి నెం.2: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్–జిల్లా, వట్టిచెరుకూరు మండలం, కట్రపాడు పంచాయతీ పరిధి, కట్రపాడు గ్రామం,డి. నెం.177/C నందు మొత్తం ఎ. 0.42 సెంట్లలోనున్న 239.00 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.		రూ.4.47 లక్షలు	రూ. 0.44 లక్షలు
	ఆస్తి నెం.3: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్–జిల్లా, వట్టిచెరుకూరు మండలం, కట్రపాడు పంచాయతీ పరిధి, కట్రపాడు గ్రామం, డి. నెం.177/C నందు మొత్తం ఎ. 0.42 సెంట్లలోనున్న 1399.70 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.		రూ.26.18 లక్షలు	రూ. 2.618 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 28.01.2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695

* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది.
బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను రిజర్వు ధర 50 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 50,000/-గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 1,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 14.01.2026, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41166

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 83338 33368

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■ గుంటూరు సిటీలో పనిచేయుటకు లేడీస్ జంట్స్ గార్డ్స్ కావలెను. అర్హత: టెన్త్, ఇంటర్, 12గం॥ డ్యూటీ. జీతం: 14,000–15000. సంప్ర॥ 9502087373

■ గుంటూరులో బస్‌స్టాండ్ ఎదురు మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: 10th–డిగ్రీ, వర్క్ టైం: 9am–5.30pm, శాలరీ : 8500–9000/- సంప్ర॥ 9889398775

■ గుంటూరు, మంగళగిరి, సత్తెనపల్లి, ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & గుంటూరు ఆఫీసులో DTP ఆపరేటర్ కావలెను. 9866618811, 8886618877

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంతి ఉద్యోగులు, హౌస్‌వైఫ్స్ 10th పాస్ 50 సం॥పై వయస్సువారు కావలెను. 70367 61665

■ గుంటూరు జిన్నాటవర్ సెంటర్ రామా ఎంటర్‌ప్రైజెస్ నందు పనిచేయుటకు 2సం॥ సేల్స్ అనుభవం కల్గిన లేడీ కావలెను. అర్హత: ఇంటర్ టైం: 3 to 9.30, జీతం: 10వేలు. ఉదయం 8 – 9లోపు సంప్ర॥ 9441665758

■ సిరి స్వీట్స్ షాపు నందు ఆటో కం కారు నడుపుటకు డ్రైవర్ కావలెను. జీతం: 15 - 20వేలు భోజన వసతి కలదు. మా బ్రాంచ్ బృందావన్ గార్డెన్స్. సంప్ర॥ 8374815999

■ Wanted experienced Telicallers / Computer Operators(F) Education Consultancy, Lakshmipuram, Sal: 15k to 20k, Qul: Degree, Contact: 9052975353

■ తుమ్మల పాలెం ప్రముఖ కంపెనీలోకి మేల్ సెక్యూరిటీ గార్డ్స్&ASO కావలెను .మంచి జీతం PF/ESI Q:10th, ఇంటర్ 26రో 8గం॥ వ.48లోపు 6300521289

■ బిజినెస్ మేనేజర్స్ / బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్ మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30సం॥లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.comకు పంపగలరు.

■ డైరెక్ట్ జాయినింగ్: సూపర్‌వైజర్స్, డ్రైవర్స్, మెస్ ఇన్‌ఛార్జి, స్టోర్ ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ Ex.ఆర్మీ, ITI (Dip. All) కా. (రూం+భో) PF+ESI జీ: 18 to 32 ✆ 85019 22079

■ మా కంపెనీ కాల్స్ మెస్సేజ్ చేయుటకు రికార్డ్స్ రాయుటకు యువతి / యువకులు కావలెను. జీ 18K Q. 10th పైన ఎన్ని డిగ్రీ, వర్క్ ఫ్రం హోమ్ 7989325728

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమం HYDలో పని చేయుటకు,నర్సులు, కాంపౌండర్స్, లేడి ఆఫీస్ అసిస్టెంట్స్ ఆయాలు, వార్డ్ బాయ్స్ భార్యా భర్తలు కావలెను.8985114453, 9391036931

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారులు టీవీ లేదా క్లెయిమ్స్ వంటి వాటితో ఈ దినపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రిజర్వేషన్ వర్గాలకు వరం

మంగళగిరి టౌన్: రిజర్వేషన్ వర్గాలకు చెందిన అభ్యర్థులు జనరల్ కేటగిరి కటాఫ్ మార్కులు కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే వారిని జనరల్ సీట్లలో సర్దుబాటు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం రిజర్వేషన్ వర్గాలకు వరమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుల కేశన శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ లేని ఓపెన్ కేటగిరి అనేది రిజర్వేషన్ వర్తించని వర్గాల కోసం ఏర్పాటు చేసిన కోటా కాదని.. అది ప్రతిభ మాత్రమే ప్రాతిపదికగా ఉన్న అభ్యర్థుల సమూహం కోసం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్ని విభాగాల్లో స్థానాల భర్తీకి ఇదే విధానాన్ని ఖచ్చితంగా అమలు జరిపి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి సామాజిక న్యాయంతో పాటు సమన్యాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నట్టల నివారణకు మందు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మున్నంగి శివకుమారి ప్రారంభించారు. శిబిరంలో 30 పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశవ్యాధి చికిత్సలు, ఎద ఇంజెక్షన్లు చేసినట్లు పశువైద్యాధికారి షేక్. పీర్ అహ్మద్ తెలిపారు. దూడలకు నట్టల నివారణ మందు, జ్వరాలు, పారుడు రోగం వచ్చిన పశువులకు సంబంధించి పాడి రైతులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎ.శివయ్య, బి.శ్రీనివాసరెడ్డి, ఎం.రాము, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్.వినీల, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

దుగ్గిరాల: కోడి పందేలకు అని వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గిరాల గ్రామానికి చెందిన తెనాలి నాగేంద్రబాబు(30) నాలుగు రోజుల కిందట కోడి పందేలకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లారు. సోమవారం నాడు కూడా నాగేంద్రబాబు ఇంటికి రాకపోవడంతో భార్య సుహాసిని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. నాలుగు రోజుల కిందట కోడి పందేలకు వెళుతున్నానని చెప్పి వెళ్లిన తన భర్త నేటికీ ఇంటికి రాలేదని ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరవి పేర్కొన్నారు.

నూనె గింజల సాగుతో లాభాలు

మేడికొండూరు: ఏరువాక కేంద్రం గుంటూరు వారి ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా పాలడుగు గ్రామంలో నువ్వు పంటలో సమగ్ర యాజమాన్యంపై సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం, సమన్వయకర్త డాక్టర్ ఎ.మనోజ్ మాట్లాడుతూ.. రైతులందరూ ఒకే పంట పండించడం వల్ల సరైన గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారని అన్నారు. సాగు ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటగా నువ్వులలో తక్కువ పెట్టుబడితో మేలైన దిగుబడులు పొందవచ్చని తెలియజేశారు. అనంతరం రైతులకు జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ మురళి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సీల్డ్ కొటేషన్‌లకు ఆహ్వానం

మంగళగిరి టౌన్: మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్‌లలో ప్రాసెసింగ్ చేయగా వచ్చిన వ్యర్థాలను కొనుగోలు చేయడానికి అనుభవజ్ఞులైన సంస్థల నుంచి సీల్డ్ కొటేషన్‌లకు ఆహ్వానం పలుకుతున్నట్లు మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీం బాష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాస్టిక్, రబ్బర్, మెటల్, పేపర్, క్లాత్, కార్డ్ బోర్డ్, ఈ వేస్ట్, గ్లాస్ తదితర ఘన వ్యర్థాలను వేరువేరుగా కొనుగోలు చేయడానికి ఆరు నెలల కాలానికి సీల్డ్ కొటేషన్‌లు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 19వ తేదీ నుంచి సీల్డ్ కొటేషన్‌లు స్వీకరిస్తున్నామని.. ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటల వరకు సీల్డ్ కొటేషన్‌లను స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు తెరవనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బాధితుడికి ఎల్ఓసీ చెక్కు అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ చెక్కును స్థానిక టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. తాడేపల్లి 7వ వార్డుకు చెందిన మన్యంచర్ల రవికుమార్ తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని.. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5,25,570లు మంజూరు కాగా ఆసుపత్రికి వెళ్లి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) చెక్కును రవికుమార్ కుటుంబ సభ్యులకు అందజేశామని తెలిపారు. బాధితుని కుటుంబ సభ్యులు చెక్కు మంజూరుకు సహకరించిన మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 9వ వార్డు ప్రధాన కార్యదర్శి నక్కా సువర్ణరాజు, రాఘవులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి ముసుగులో బినామీలకు కట్టబెట్టే యత్నం

రైతులతో మాట్లాడుతున్న రామచంద్రరావు

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన విలువైన భూములను అభివృద్ధి ముసుగులో బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్రరావు యాదవ్ ఆరోపించారు. మంగళగిరి మండలం చినకాకానిలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములను సోమవారం ఆయన పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములను ఐటీ కంపెనీల పేరుతో బలవంతంగా సేకరించడాన్ని స్థానిక రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. సుమారు 70 ఏళ్లుగా వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న 71 ఎకరాల భూమిని ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ భూములపై వందలాది మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారని.. భూముల నుంచి వచ్చే ఆదాయంతో అంజుమన్ ఇ ఇస్లామియా వంటి సంస్థలు ఉచిత విద్యతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేశారు. అధికార బలంతో రాష్ట్ర ల్యాండ్ బ్యాంకును దుర్వినియోగం చేసి భూముల కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ రజా, ముస్లిం సమైక్య వేదిక ఉపాధ్యక్షులు మౌలా బేగ్, అబ్దుల్ కలాం, అన్సారీ, ఆరిఫ్, హుస్సేన్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, స్థానిక రైతులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌తో సిక్కిం విద్యార్థులు

మంగళగిరి టౌన్: రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సిక్కిం క్యాంపస్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న 60 మంది విద్యార్థులు ఏపీ ఎస్ఆర్ఎం క్యాంపస్‌ను సందర్శించారు. వర్సిటీలో సోమవారం విద్యార్థుల క్యాంపస్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా సతీష్‌కుమార్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మేధో, మనో వికాసం కోసం ఇండస్ట్రియల్ విజిట్ ఏర్పాటు చేశామని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో పరిశోధనా ల్యాబొరేటరి, తరగతి గదులు, బోధనా పద్ధతులు, క్రీడా సదుపాయాలు వంటివి స్వయంగా చూసి అవసరమైన జ్ఞానాన్ని సొంతం చేసుకోవాలన్నారు. సిక్కిం యూనివర్సిటీ విద్యార్థుల బృందానికి నేతృత్వం వహించిన డాక్టర్ మనీష, డాక్టర్ విశ్వజిత్, డాక్టర్ దినేష్‌లు రెండు వారాల తమ ప్రణాళికలను సతీష్‌కుమార్‌కు వివరించారు. సిక్కిం విద్యార్థులకు వెల్‌కమ్ కిట్లు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్, డైరెక్టర్లు గురుప్రీత్ సింగ్, అనూప్‌సింగ్, సుస్మితా సింగ్, పంకజ్ బల్వేరియా తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి మోర్తోట సుబ్బారావు

మాట్లాడుతున్న మన్నూరు భాస్కరయ్య

తాడేపల్లి రూరల్: రజక కుటుంబ సభ్యుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ధన్యజీవి మోర్తోట సుబ్బారావు అని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరజీవి చిట్యాల ఐలమ్మ కల్యాణ మండపంలో మోర్తోట సుబ్బారావు ప్రథమ వర్ధంతిని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రజక వృత్తిదారుల సంఘం సభ్యుడిగా చేరి జిల్లా ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగి, తాడేపల్లి నగర మాజీ అధ్యక్షులుగా మోర్తోట పనిచేశారని పేర్కొన్నారు. తాడేపల్లిలో నిర్మాణం జరుగుతున్న చిట్యాల ఐలమ్మ కల్యాణ మండపం స్థలం భూ కబ్జాదారుల ఆక్రమణలకు గురికాకుండా కాపాడి ఆ స్థలంలో కల్యాణ మండప నిర్మాణం కోసం అహర్నిశలు ప్రయత్నాలు చేశారని గుర్తుచేశారు. సుబ్బారావు ఆశయాలను కొనసాగిస్తూ ఐలమ్మ కల్యాణ మండపం నిర్మాణం పూర్తిచేయాలని అన్నారు. రజక వృత్తిదారుల సమస్యలను తమ సమస్యగా నిర్ణయించుకొని సంఘం కార్యక్రమాలను జయప్రదం చేయించడంలో సుబ్బారావు చురుకుగా పనిచేశారని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈమని రామారావు, పాగోలు శ్రీనివాసరావు, సాంబశివరావు, కొత్తపల్లి వీరాంజనేయులు, శ్యామ్, భరత్, వీరాంజనేయులు, ఉండవల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారావు కుమారుడు మోర్తోట శ్రీనివాసరావు, కుమార్తెలు నాగమణి, రమ్యశ్రీ, అల్లుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ ఐఐసీ కార్యాలయం వద్ద ధర్నా

మంగళగిరి టౌన్: ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక రాయితీల విడుదల కోసం మంగళవారం మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎస్సీ ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్ ఇన్సెంటివ్ జాయింట్ యాక్షన్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాయితీల కోసం పలు విధాల ఆందోళన కార్యక్రమాలు ఇప్పటికే పలుమార్లు నిర్వహించామని.. ప్రభుత్వం ఎప్పటికప్పుడు మభ్యపెడుతూ వస్తోందని అన్నారు. గత ఆగస్టు నుంచి నేటి వరకు మూడుసార్లు సచివాలయ ముట్టడి, పలు దఫాలుగా ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ధర్నాలు, నిరసన దీక్షలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. డిసెంబరు 13వ తేదీ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి భరత్ హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారని పేర్కొన్నారు. సంక్రాంతి రాయితీలు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించిన మంత్రి భరత్ మాట తప్పారని విమర్శించారు. రాయితీలు విడుదల చేసేంత వరకు ధర్నా కార్యక్రమం కొనసాగుతుందని, రాయితీలు పొందాల్సిన ప్రతి ఒక్క పారిశ్రామిక వేత్త ఈ ధర్నాలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ధర్నాకు ఎస్సీ ఎస్టీ పారిశ్రామిక వేత్తలు తరలి రానున్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దుగ్గిరాల: ఇంట్లో ఉన్న వ్యక్తి తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన దుగ్గిరాల మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలువూరు గ్రామానికి చెందిన లోకం నాగరాజు(46) ఇంట్లో నిద్రిస్తున్నారు. ఉదయం నాగరాజును చూడగా అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎటువంటి కారణాలు లేకుండా మృతి చెందడంపై మృతుడి తండ్రి పలు అనుమానాలను వ్యక్త పరిచారు.
ఘటనపై తండ్రి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వెంకటరవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రెయిన్ సమస్యను పరిష్కరిస్తాం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణం మహానాడులోని డ్రెయిన్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. మహానాడు రోడ్డు నంబరు 21లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రెయిన్ పారుదల లేక దోమలతో ఇబ్బంది పడుతున్నామని.. తాగునీటి సౌకర్యం, వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని.. చెత్త సేకరణకు ప్రతిరోజు సిబ్బంది రావడంలేదని అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే డ్రెయిన్ సమస్యను పరిష్కరించి, వాటర్‌పైపులైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

'జయం మనదే' కార్యక్రమానికి విద్యార్థుల ఎంపిక

దుగ్గిరాల: జయం మనదే కార్యక్రమానికి మండలం నుంచి 26 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో-1, 2 అధికారులు శ్రీనివాసరావు, కృష్ణారావు తెలిపారు. సోమవారం దుగ్గిరాల మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం నుంచి వారు మాట్లాడారు. జిల్లా మొత్తంగా 271 మంది విద్యార్థులకు గానూ ఎస్ఏత్రీ మార్కుల ఆధారంగా మండలంలోని 26 మంది విద్యార్థులను ఎంపిక చేశామని అన్నారు. రేవేంద్రపాడు పాఠశాల నుంచి 13 మంది.. పెద్దకొండూరు పాఠశాల నుంచి ఐదుగురు, పెదపాలెం నుంచి ముగ్గురు, దుగ్గిరాల బాలికల పాఠశాల నుంచి ముగ్గురు, దుగ్గిరాల బాలుర పాఠశాల నుంచి ఒకరు, పెనుమూలి నుంచి ఒకరు చొప్పున మొత్తం 26 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులకు 22వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

పశువైద్య శిబిరం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక

గేదెకు చూడి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మౌనిక

తెనాలిటౌన్: ఈ నెల 19 నుండి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పెదరావూరు పశు వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. రూరల్ మండలం బుర్రిపాలెం, కఠెవరం గ్రామాల్లో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించారు. మొత్తం 85 పశువులకు వైద్య సేవలందించినట్లు చెప్పారు. గేదెలు, ఆవులు,దూడలకు నట్టల నివారణ మందు వేసినట్లు వెల్లడించారు. ఈ నెల 31వరకు కొనసాగే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్‌లో 8 అర్జీలు

తెనాలి: ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు చెప్పారు. స్థానిక కొత్తపేటలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి నాలుగు అర్జీలు రాగా, పంచాయతీ రాజ్ పరిధిలోనివి రెండు, విద్యుత్, మున్సిపాలిటీకి చెందిన సమస్యలపై ఒక్కో అర్జీ చొప్పున మొత్తం ఎనిమిది అర్జీలు వచ్చాయని శ్రీధర్‌బాబు తెలిపారు. ఆయా అర్జీలను సంబంధిత విభాగాలకు పంపి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దైవభక్తితో పాటు దేశ భక్తి ఉండాలి

బాపట్ల జిల్లా ధర్మప్రచారక్ శంకరరావు

మాట్లాడుతున్న హేమశంకరరావు

తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ దైవ భక్తితో పాటు దేశ భక్తి కలిగి ఉండాలని బాపట్ల జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమ శంకరరావు అన్నారు. స్థానిక నెహ్రూరోడ్డులోని గోవర్ధనస్వామి దేవాలయంలో సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు పాల్గొని మాట్లాడారు. జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారతమాతకు పూజలు చేసి దేశ భక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తితో పాటు దేశ భక్తిని కలిగి ఉండాలని చెప్పారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం మన రాజ్యాంగాన్ని అమలు పరచిన రోజుగా గుర్తు చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, తెనాలి సబ్ డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్‌కుమార్, నగర కన్వీనర్ కోనపురెడ్డి బైరాగి తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించకుంటే ఆందోళన చేస్తాం

అయితానగర్ సమాధుల తోట సాధన కమిటీ

తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న కమిటీ నాయకులు

తెనాలి: పట్టణ అయితానగర్‌లో అడుగు ఖాళీస్థలం కూడా లేని సమాధుల తోటకు ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలం కేటాయించాలని కోరుతూ స్థానిక సబ్‌కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అయితానగర్‌లోని సమాధుల తోట పూర్తిగా నిండిపోవటంతో మృతదేహాల అంత్యక్రియలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యంత అమానవీయమైన ఈ పరిస్థితిని అధికారులకు వివరిస్తూ వెంటనే కొత్త సమాధుల తోటకు స్థలం కేటాయించాలని గతేడాది సెప్టెంబరు 22న తెనాలి సబ్ కలెక్టర్, మండల తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌ను కలిసి వివరించి. వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజల నుంచి 5 వేల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. ఇంతకాలం గడిచినా ఎటువంటి స్పష్టమైన చర్యలు లేకపోవటంతో మళ్లీ సోమవారం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే సమాధుల తోటకు స్థలం కేటాయించి, మృతుల గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అయితానగర్ సమాధుల తోట సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సమస్యను ఇంకా నిర్లక్ష్యం చేస్తే న్యాయపరమైన, ప్రజాస్వామ్య నిరసనలు చేపడతామని స్పష్టంగా తెలియజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి నియామకానికి దరఖాస్తులు

తెనాలిటౌన్: ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి పరిధిలోఅంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాళ్ళ నియామకానికి ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పి.విజయగౌరి ఒక ప్రకటనలో తెలిపారు. కోపల్లె గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త, పెదరావూరు, సంగంజాగర్లమూడి, చావావారిపాలెం, బుర్రిపాలెం, నందివెలుగు, జాకీర్‌హుస్సేన్‌నగర్, కఠెవరం గ్రామాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. కొల్లిపర మండలంలోని సిరిపురం, అన్నవరం, కొత్తబొమ్మువానిపాలెం, కుంచవరం గ్రామాల్లో తక్కువ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. తెనాలి మున్సిపాలిటీ పరిధిలో 31, 33, 38 వార్డుల పరిధిలో అంగన్‌వాడీ సహాయకులు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 15 అంగన్‌వాడీ సహాయకులు, ఒక కార్యకర్త నియామకం కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీల సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు 7వ తరగతి పాసై ఉండి 35 ఏళ్ల వయస్సు కలిగి వివాహితురాలై ఉండటంతో పాటు స్థానికురాలే ఉండాలని సూచించారు. ఈనెల 28 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు తెనాలి ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలి

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు సుభాని, నాగేశ్వరరావు, సాంబశివరావు, ఖాసింలతో కలిసి సందర్శించి మద్దతు తెలియజేసి ఆయన మాట్లాడారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 412వ రోజుకు చేరుకున్నాయని.. ప్రభుత్వం కార్మికుల సమస్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బాషా, ఎం.సాంబశివరావు, రిబ్కా, రమాదేవి, సువర్ణ, ఇమాంబి, శారమ్మ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు. దీక్షల్లో దానయ్య, ఏసోబు, పిచ్చయ్య, దాసు, ఆదినారాయణ కూర్చున్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న రామస్వామి యాదవ్, ఉపాధ్యాయులు

దుగ్గిరాల: ఎస్టీయూ ఏపీ వారు అందించే బుల్లెట్ మెటీరియల్‌ను విద్యార్థులు వినియోగించుకుని ఉత్తమ మార్కులు సాధించాలని ఎస్టీయూ మండల అధ్యక్షులు ఉన్నం ప్రసాద్ తెలిపారు. సోమవారం దుగ్గిరాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించిన మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టి.రామస్వామి యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. విలువైన మెటీరియల్ ఉచితంగా అందించిన వారికి హెచ్ఎం జయరత్న వాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీధర్, బి.మరియదాసు, బ్రహ్మయ్య, రాంబాబు, బాజీ, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమన పద్యాల్లో నీతిని గ్రహించాలి

వేమన పీఠం వ్యవస్థాపకులు కొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి

పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

మున్నంగి (కొల్లిపర): విద్యార్థి దశ నుండి ప్రతి విద్యార్థినీ, విద్యార్థి వేమన పద్యాలను చదివి అందులోని నీతిని గ్రహించి జీవితంలో ఆచరించాలని మున్నంగి వేమన పీఠం వ్యవస్థాపకులు కొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో వేమన పీఠం ఆధ్వర్యం లో విశ్వకవి యోగి వేమన జయంతి వేడుకలు వివేకానంద విద్యా మందిర్ పాఠశాలలో, అంగన్ వాడీ కేంద్రాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషకు, సంస్కృతికి, సమాజానికి వేమన చేసిన కృషిని వివరించారు. వేమన పద్యాలను చదివి అందులోని నీతిని అలవర్చుకోవాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, మూఢచారాలను విడనాడాలని కోరారు. వేమన సాహిత్యాన్ని, భాషా మాధుర్యాన్ని, సామాజిక అభ్యుదయాన్ని ఇప్పటి మరియు భావి తరాలకు చేర్చటమే లక్ష్యంగా వేమన పీఠం, మున్నంగి స్థాపించటం జరిగిందని, వేమన సాహిత్యానికి సంబంధించి వివిధ పరిశోధకులు వ్రాసిన అరుదైన వందకు పైగా పుస్తకాలను సేకరించి వేమన గ్రంథాలయం ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచటం జరిగిందని ఆసక్తి కలవారు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు, పిల్లలకు వేమన సాహిత్యాన్ని వివరించి, మిఠాయిలను, విశ్వకవి యోగి వేమన పద్యాలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరేంద్ర బాబు ,కొల్లిపర మండల నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ అధ్యక్షుడు శ్రీ బొంతు అశోక్ రెడ్డి, వేమన మఠం మున్నంగి ధర్మ కర్త శ్రీ బొంతు శివ రామిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్

75 వాహనాలు జప్తు

స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలిరూరల్: మాదక ద్రవ్యాల నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా సోమవారం తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకే డీఎస్పీ బి. జనార్ధనరావుతో పాటు సీఐలు, ఎస్ఐలు, 100 మంది పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని టిడ్కో గృహాల సముదాయంలో జల్లెడ పట్టారు. ఎలాంటి పత్రాలు లేని 75 వాహనాలను సీజ్ చేశారు. సీఐ నాయబ్ రసూల్, ఎస్ఐ కె. ఆనంద్ సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి విక్రయాలు, వినియోగం, ఇంకా వివిధ రకాల అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నదే సంకల్పం కార్యక్రమ ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. వాహనాల తనిఖీలో పత్రాలు లేని 75 వాహనాలను సీజ్ చేశామని, వాటి పత్రాలు చూపితే వాహనదారులకు అప్పగిస్తామని, లేనిపక్షంలో వాటిని సీజ్ చేసి రవాణా శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. మాదకద్రవ్యాల వినియోగం నిర్మూలించేందుకు, అల్లర్లు, రౌడీ మూకల ఆట కట్టించి, కాలనీపై ప్రజల్లో ఉన్న చెడు అభిప్రాయాన్ని తొలగించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాలనీవాసులు పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంకల్పం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ సీఐలు మల్లికార్జునరావు, రాముల నాయక్, సాంబశివరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గతంలో జర్నలిస్టులకు ఎంతో స్వేచ్ఛ ఉండేది

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాజీ సలహాదారు, ది ఎకనామిక్స్ టైమ్స్ మాజీ ఎడిటర్ డాక్టర్ సంజయ బారు



పంజాగుట్ట: గతంలో జర్నలిస్టులకు ఎంతో స్వేచ్ఛ ఉండేదని, ఏదైనా స్వేచ్ఛగా రాసే వారని, కానీ ఇప్పుడు ఏం రాయాలో, ఏం రాయకూడదో ఆలోచించడంలోనే సమయం సరిపోతుందని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మీడియా సలహాదారు, ది ఎకనామిక్స్ టైమ్స్ మాజీ ఎడిటర్ డాక్టర్ సంజయ బారు అన్నారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో 'అనుభవాలు- జ్ఞాపకాలు' ఉపన్యాసాల పరంపర పునఃప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ బారు తన అనుభవాలు, వివిధ పత్రికల్లో ఎడిటర్‌గా, రెసిడెంట్ ఎడిటర్, పొలిటికల్ వార్తలు రాసిన రోజులు, ప్రధాని సలహాదారుగా చేసిన రోజులు గుర్తు చేసుకున్నారు. గతంలో ప్రధానికి వ్యతిరేకంగా కూడా వార్తలు రాసే స్వేచ్ఛ ఉండేదని, ప్రస్తుత పరిస్థితుల్లో భయపడుతున్నారని, అప్పట్లో తాను ప్రధానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే మా చైర్మన్ రాయకు అని చెప్పేవారు కాదని, యజమానులు జర్నలిస్టులకు ఇచ్చే గౌరవం అలా ఉండేదన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో యువతను జర్నలిజంలోకి రావొద్దా.. మీ సలహా ఏమిటని ఒక జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తాను యువకుడిగా ఉన్నప్పుడు ఎవరి సలహా తీసుకోలేదని, అందుకే తాను కూడా ఎవరికీ సలహా ఇవ్వనని పేర్కొన్నారు. వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు దాసు కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ పాత్రికేయులు ఉడయవరులు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మందుపాతర పేలి యువకుడి మృతి

బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాలు లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ఒక యువకుడు మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా కస్తూరుపాడుకు చెందిన కుహ రామి సోమవారం సమీప అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబును గమనించకుండా తొక్కడంతో అది పేలగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీల అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చారు.

'సుప్రీం తీర్పు రిజర్వేషన్ వర్గాలకు ఓ వరం'

సాక్షి, అమరావతి: రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు జనరల్ కేటగిరీ కటాఫ్ మార్కుల కన్నా ఎక్కువ సాధించినప్పుడు, వారిని ఓపెన్ కేటగిరీ కింద సర్దుబాటు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రిజర్వేషన్ వర్గాల పాలిట వరం అని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా పోస్టులు కేటాయిస్తున్నప్పుడు ప్రతిభావంతులైన రిజర్వ్‌డ్ వర్గాల వారికి ఆ అవకాశం దక్కనీయకపోవడం రాజ్యాంగాన్ని ధిక్కరించడమే అవుతుందన్నారు. ఈ కారణంతో ఇప్పటివరకు ప్రతిభావంతులైన రిజర్వ్‌డ్ అభ్యర్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరిగిందన్నారు.

డిజిటల్ లావాదేవీలతో పాటు పెరుగుతున్న మోసాలు

సాక్షి, అమరావతి: దేశంలో డిజిటల్ చెల్లింపు లావాదేవీలు పెరుగుతుండటంతో డిజిటల్ చెల్లింపు మోసాలు, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మోసాలు వంటివి కూడా పెరిగాయని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. గత ఐదేళ్లలో 48.02 లక్షల యూపీఐ దేశీయ మోసాలు జరిగాయని, ఈ ఘటనల్లో మొత్తం రూ.3,688 కోట్ల నగదు మోసానికి గురైందని తెలిపింది. లావాదేవీల మోసాలు, చెల్లింపు సంబంధిత మోసాలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎప్పటికప్పుడు వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. వీటిలో కస్టమర్ మొబైల్ నంబర్, పరికరం మధ్య పరికర బైండింగ్, పిన్ ద్వారా రెండు కారకాల ప్రామాణీకరణ, రోజువారీ లావాదేవీల పరిమితి తదితరాలున్నాయని వివరించింది. అన్ని బ్యాంకులకు ఎన్‌పీసీఐ ఆధారిత నమూనాలను ఉపయోగించి హెచ్చరికలను రూపొందించడానికి, లావాదేవీలను తిరస్కరించడానికి మోసం పర్యవేక్షణ పరిష్కారాన్ని అందిస్తున్నట్లు తెలిపింది. బ్యాంకులు కూడా సైబర్ క్రైమ్ నివారణపై అవగాహన ప్రచారాలు చేపడుతున్నాయని పేర్కొంది.



ఆంధ్రజ్యోతికి భూ నజరానా

ఎప్పుడో ఇచ్చిన భూమికి ప్రత్యామ్నాయంగా ఇప్పుడు మరో భూమి

సాక్షి, అమరావతి: మీడియా ముసుగులో నిరంతరం తనకు భజన చేసే తోక పత్రిక ఆంధ్రజ్యోతి (ఆమోద పబ్లికేషన్స్)కి చంద్రబాబు విశాఖలో అప్పనంగా రూ.15 కోట్ల విలువైన 74 సెంట్ల భూమిని కట్టబెట్టారు. 2012లో విశాఖపట్నం రూరల్ మండలం పరదేశిపాలెంలో ఆమోద పబ్లికేషన్స్ కార్యాలయం నిర్మాణం కోసం ప్రభుత్వం 1.5 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ భూమిని వినియోగించకపోవడం, ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా కేటాయింపు జరిగినట్లు నిర్ధారణ అవడంతో 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. దీనిపై ఆ సంస్థ కోర్టుకెక్కగా గత ఏడాది నవంబర్ 29న ఈ భూ కేటాయింపుపై చట్టప్రకారం ముందుకెళ్లాలని తీర్పు ఇచ్చింది. దీన్ని సాకుగా చూపి చంద్రబాబు ప్రభుత్వం గతంలో ఇచ్చిన భూమికంటే ఎక్కువ విలువైన భూమిని ఇటీవల ఉచితంగా ఆంధ్రజ్యోతికి కేటాయించింది. ఇందుకోసం ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మరింత విలువైన భూమిని ఆ సంస్థ నుంచి వెనక్కి తీసుకుని మరీ ఆమోద పబ్లికేషన్స్‌కి ఇస్తూ డిసెంబర్ 12న రెవెన్యూ శాఖ జీఓ ఎంఎస్ నంబర్ 492 జారీ చేసింది.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Lands – Visakhapatnam District – Alienation of Government land to an extent of Ac.0.24 Cents and Ac.0.50cts of APHB land, total admeasuring Ac.0.74 cts in at Paradesipalem (V), Visakhapatnam Rural (M) & Visakhapatnam District in favour of Aamoda Publications Private Limited, Visakhapatnam, in lieu of their (Aamoda Pvt Ltd) earlier alienated land (vide G.O.MS.No.251, Revenue (Assn.II) Dept., Dt:28.06.2017) of Ac:0.74 cts out of Ac:1.50 Cts which was covered in National Highway Buffer Zone, on free of cost subject to the certain conditions in addition to the conditions under BSO-24 and G.O.Ms No.571, Revenue (Assn.I) Dept., dt: 14.09.2012–Orders-Issued

REVENUE (LANDS.I) DEPARTMENT

ఆంధ్రజ్యోతికి భూమి కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు

ఆఘమేఘాల మీద నడిచిన ఫైలు.. 12 రోజుల్లో క్లియర్

అత్యంత విలువైన పరదేశిపాలెంలోని భూమిపై కన్నేసిన ఆంధ్రజ్యోతి ఎండీ తమ సంస్థ కార్యాలయం కోసం ఇవ్వాలని కోరడంతో 2012లో అప్పటి ప్రభుత్వం 1.5 ఎకరాలు కేటాయించింది. కానీ అందులో ఎటువంటి నిర్మాణం చేయలేదు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఆమోద పబ్లికేషన్స్‌కు భూమి కేటాయించినట్లు పలువురు స్థానికులు 2020లో ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దానిపై విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు జరగడంతోపాటు కేటాయించిన 8 ఏళ్ల తర్వాత కూడా దాన్ని వినియోగించలేదని తేల్చి ఆ కేటాయింపును రద్దు చేసింది. దీనిపై ఆమోద పబ్లికేషన్స్ హైకోర్టును ఆశ్రయించింది. గత ఏడాది నవంబర్ 29వ తేదీన హైకోర్టు దీనిపై తీర్పు ఇచ్చి చట్టానికి అనుగుణంగా మళ్లీ కేటాయింపును పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది. ఇంతలో ఆంధ్రజ్యోతి మరింత విలువైన భూమిని కోరింది. పరదేశిపాలెం వద్ద ఇచ్చిన భూమిలో 74 సెంట్లు జాతీయ రహదారుల శాఖ బఫర్ జోన్‌లో ఉంది కాబట్టి వినియోగించుకోలేకపోయామని, ప్రత్యామ్నాయంగా పరదేశిపాలెం సర్వే నంబర్ 168/3లోని ప్రభుత్వ భూమి 24 సెంట్లు, సర్వే నంబర్ 203/2లో ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 50 సెంట్లు కావాలని కోరింది. దీంతో చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు మేలు చేయడానికి ఫైలును బుల్లెట్ రైలులా నడిపించింది. గతంలో రద్దు చేసిన భూమి కాకుండా మరింత విలువైన హౌసింగ్ బోర్డు భూమి ఇచ్చేందుకు అంగీకరించింది. వెంటనే సర్కారు పెద్దలు హౌసింగ్ బోర్డును ఒప్పించారు. అందుకు ప్రతిగా హౌసింగ్ బోర్డుకు సర్వే నంబర్ 168/1లో 64 సెంట్ల ప్రభుత్వ భూమిని మార్పిడి (ఎక్స్ఛేంజ్) కింద ఇచ్చేందుకు ఒప్పించారు. కోర్టు తీర్పు రావడానికి ముందే అక్టోబర్ 30వ తేదీన జరిగిన ఏపీఎల్ఎంఏ (ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ) సమావేశంలో ఈ భూమార్పిడి ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

పరదేశిపాలెంలో ఆంధ్రజ్యోతికి కేటాయించిన భూమి

కోర్టు తీర్పు రాకుండానే ఈ కేటాయింపుపై నిర్ణయం జరిగిపోయిందనడానికి ఇదే నిదర్శనం. ఇప్పుడు కోర్టు తీర్పును సాకుగా చూపి భూమి ఇచ్చేశారు.

ఒకపక్క భూములకు సంబంధించి లక్షలాది సమస్యలు రెవెన్యూ కార్యాలయాల్లో పేరుకుపోయి ఉన్నా పట్టించుకోని చంద్రబాబు.. తన అస్మదీయ ఎల్లో మీడియా అధినేతల్లో ఒకరైన రాధాకృష్ణకు మాత్రం కోట్ల రూపాయల విలువైన భూమిని రోజుల వ్యవధిలో కేటాయించేశారు. నవంబర్ 29న కోర్టు తీర్పురాగా, 12 రోజుల్లోనే దానిపై ఆయన కోరిన విధంగా వేరే చోట, వేరే సంస్థ భూమిని తీసుకుని మరీ ఇచ్చేశారు. భూములకు సంబంధించి ఇలాంటి తీర్పులు వేలల్లో ఉన్నా, వాటివైపు కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు... ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఫైలును నిబంధనలు పక్కనపెట్టి మరీ ఆఘమేఘాల మీద ఆమోదించేలా చేశారు.

వేదిక ఏదైనా చంద్రబాబుకు జగన్నామ స్మరణే

జగన్‌ను తిట్టేందుకు ఎన్టీఆర్ వర్ధంతి వేదికే / వైఎస్ జగన్ క్రెడిబిలిటీ ప్రజలకు తెలుసు

వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీమంత్రి కన్నబాబు

కాకినాడ రూరల్: వేదిక ఏదైనా, సందర్భం ఎలాంటిదైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తలచుకోవడానికి, తిట్టుకోవడానికి, శాపనార్థాలు పెట్టడానికే చంద్రబాబు వాడుకుంటున్నారని, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని కూడా అలాగే వాడుకున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీమంత్రి కురసాల కన్నబాబు విమర్శించారు. కాకినాడలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో ఎవరికి క్రెడిబిలిటీ ఉందో ప్రజలందరికీ తెలుసన్నారు. విశ్వసనీయతకు మారుపేరులా పనిచేసింది, చెప్పింది చెప్పినట్టు నెరవేర్చింది ఎవరో తెలుసని చెప్పారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటుపొడిచి అధికారం నుంచి దింపేసిన ఘటన మొదలు నేటివరకు జరిగిన అన్నింటిపైనా క్రెడిబిలిటీ గురించి మాట్లాడాలని సూచించారు. చంద్రబాబు తనను వెన్నుపోటు పొడిచారని ఎన్టీఆర్ బాధపడిన రోజుల నుంచి చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటివరకు మాట్లాడుకోవాలని అన్నారు.

హామీలు నెరవేర్చడమా, ఎగ్గొట్టడమా.. ఏది క్రెడిబిలిటీ?

హామీలిచ్చి నెరవేర్చడం క్రెడిబిలిటీ అంటారా.. ఎగ్గొట్టడం క్రెడిబిలిటీయా? చెప్పినమాటపై నిలబడటాన్ని, కరోనా వంటి కష్టకాలంలో సైతం చెప్పింది చేసిన నాయకుడికి క్రెడిబిలిటీ ఉంటుందంటారా లేక హామీలిచ్చి, ప్రజలను మోసం చేసిన వారిని క్రెడిబిలిటీ ఉన్న నాయకుడని ఎవరైనా అంగీకరిస్తారా? అని కన్నబాబు ప్రశ్నించారు. జగన్ మంచి పనులు తనవని, తన చెడ్డ పనులు జగన్‌వని ప్రచారం చేస్తూ చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. 'రైతు రుణ మాఫీ మొదలు 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలెన్ని అమలయ్యాయి? మళ్లీ 2024లో ఇచ్చిన సూపర్ 6 హామీల్లో ఎన్ని అమలయ్యాయి? వీటిని నిలబెట్టుకోలేపోవడాన్ని క్రెడిబిలిటీ అంటారా? జగన్‌మోహన్‌రెడ్డి గురించి పచ్చి అబద్ధాలు మాట్లాడి, ఎన్నికల్లో మూడుపార్టీలు కూటమి కట్టి అధికారంలోకి వచ్చాయి. ఒక శక్తిమంతుడైన నాయకుడిని ఓడించేందుకు కూటమి కట్టి అది క్రెడిబిలిటీగా చెప్పుకొంటున్నారు. రూ.1,750 కోట్లతో నిర్మించాలనుకున్న ఎన్టీఆర్ విగ్రహం గురించి, ఆ నిధుల గురించి ఎన్టీఆర్ వర్ధంతి వేదిక నుంచి చెబుతారనుకున్నాం. అవేమీ చెప్పలేదు. రాష్ట్రంలోని భూములను కప్పు టీ కన్నా తక్కువ ధరకు ధారాదత్తం చేస్తున్నారు. భూముల్లో మాఫియా చేసే మీరు.. జగన్ హయాంలో స్కామ్‌లు జరిగాయని ఎలా చెబుతున్నారు? విశాఖలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు అవసరం లేని 500 ఎకరాలు వెనక్కి తీసుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది. చంద్రబాబు మాత్రం వాళ్లకే 500 ఎకరాలు కట్టబెట్టారు. అమరావతిలో ఏం చేశారో అందరికీ తెలుసు. మీకున్నది మీడియా బలమే. జగన్‌కు సొంత మీడియా ఉందంటున్నారు. మీకు ఎన్ని మీడియాలున్నాయో ప్రజలకు తెలుసు. టీవీ-5, ఏబీఎన్, ఈనాడు మోస్తుంటే చంద్రబాబు రాజకీయం నడిపిస్తున్నారు. కాకినాడలో గ్రీన్‌కో కంపెనీ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తామే తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. దీనికి 2023లో జగన్ హయాంలోనే ఎంవోయూ జరిగింది' అని పేర్కొన్నారు.

సంక్రాంతి కమ్మవారి పండుగ అనడం సిగ్గుచేటు

సంక్రాంతి కమ్మవారి పండుగ అని చెప్పుకోవడం సిగ్గుచేటని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పండుగలు కులాల వారీగా ఉండవని, మతాల వారీగా జరుగుతాయని గుర్తుచేశారు. 4, 5 శతాబ్దాల నుంచే సంక్రాంతి పండుగ జరుపుకొంటున్నట్లు అనేక ఆధారాలున్నాయని చెప్పారు. రైతులు, ప్రజలు, మహిళలు, యువతకు ఏవిధంగా సేవ చేయాలనే ఆలోచన కంటే జగన్‌పై బురద వేయడమే పని అన్నట్లు చంద్రబాబు పనిచేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఇప్పటికైనా జగన్నామ స్మరణ మానుకుని ప్రజలకు కావల్సిన పాలన అందించాలని కన్నబాబు సూచించారు.

సాల్మన్ హత్య కేసు నిందితుల అరెస్టు

14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి

సాక్షి, నరసరావుపేట/గురజాల : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్త మందా సాల్మన్ హత్య కేసులో నిందితులను పల్నాడు జిల్లా పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. నిందితులు మోటమర్రి పేతురు, మోటమర్రి కాంతారావును పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి ప్రవల్లిక ముందు ఆదివారం అర్ధరాత్రి ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను పోలీసులు గురజాల సబ్‌జైలుకు తరలించినట్టు సమాచారం. ఈ వ్యవహారం మొత్తాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు సాల్మన్ 2024లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి గ్రామం వదిలి బయట జీవిస్తున్నారు. భార్యకు అనారోగ్యంగా ఉండటంతో చూడటానికి ఇటీవల వచ్చిన సాల్మన్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ రౌడీ మూకలు ఈ నెల 10న ఇనుపరాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. మృత్యువుతో పోరాడిన సాల్మన్ ఈ నెల 15న గుంటూరు జీజీహెచ్‌లో తుది శ్వాస వదిలాడు. దాడికి కారణమైన వారిపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో మాచవరం పోలీసులు తొలుత ఐపీసీ సెక్షన్ 324తో కేసు నమోదు చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ, దళిత సంఘాలు పోలీసుల తీరును తప్పుపట్టడంతో కేసును తప్పనిసరి పరిస్థితుల్లో హత్య కేసుగా మార్చారు. నిందితులు మోటమర్రి పేతురు, మోటమర్రి కాంతారావును అరెస్ట్ చేయడంలో సైతం పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ నెల 10న దాడి జరిగితే తీరిగ్గా 18న గుట్టుచప్పుడు కాకుండా కోర్టులో ప్రవేశపెట్టారు.

వ్యక్తిగత కక్షలంటూ తప్పుదోవ

ఇదిలా ఉంటే వ్యక్తిగత కక్షలంటూ పోలీసులు కేసును తప్పుదోవ పట్టించే యత్నంచేస్తున్నారు. వాస్తవానికి మందా సాల్మన్, నిందితులు మోటమర్రి పేతురు కుటుంబాల మధ్య గతంలో ఎటువంటి వివాదాలు, గొడవలు లేవు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు పిన్నెల్లి గ్రామంలో ఉండటానికి వీలులేదన్న కక్షతోనే టీడీపీ నేత పేతురు కావాలనే మందా సాల్మన్‌పై దాడిచేసి హత్య చేశాడు. అయితే పోలీసులు మాత్రం దీన్ని వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారు. సోమవారం గురజాల డీఎస్పీ కార్యాలయం విడుదల చేసిన ప్రెస్‌నోట్ ఈ విషయానికి బలం చేకూరుస్తోంది. సాల్మన్ హత్య వ్యక్తిగత కక్షలతోనే జరిగిందని గత రెండు మూడు రోజులుగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని, ఇతర టీడీపీ నేతలు చెబుతున్న విషయాన్నే పోలీసులు ప్రెస్‌నోట్‌లో వెల్లడించడం విమర్శలకు తావిస్తోంది. అయితే పోలీసులు, టీడీపీ నేతలు ఎవరూ ఆ వ్యక్తిగత కక్షలు ఏమిటో చెప్పడంలో మాత్రం విఫలమయ్యారు. చిన్న చిన్న కేసులకు సైతం విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ముఖాలకు ముసుగులు తొడిగి నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టే పోలీసులు ఈ కేసులో నిందితులను అత్యంత గోప్యంగా ఆదివారం అర్ధరాత్రి రిమాండ్‌కు పంపడం విస్తుగొలుపుతోంది. గురజాల డీఎస్పీ కార్యాలయం నుంచి సోమవారం ఉదయం స్థానిక వాట్సప్ గ్రూప్‌లో ప్రెస్‌నోట్ విడుదల చేసి వదిలేశారు.

తల్లి చేసిన పనికి కొడుకు బలి

- భర్తపై కోపంతో ఎలుకల మందు కలిపిన కూల్‌డ్రింక్ కొద్దిగా తాగిన మహిళ
- ఆ తర్వాత బాటిల్ వంటింట్లో పెట్టి నిద్రకు ఉపక్రమణ
- మొత్తం బాటిల్ తాగేసిన ఐదేళ్ల కుమారుడు

భీమవరం: భర్తపై కోపంతో భార్య కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొంటే.. ఆ విషయం తెలియక దానిని తాగి కుమారుడు మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాలుడి తల్లి కొద్ది మొత్తంలో దానిని తాగినప్పటికీ ఆమెకు ఎలాంటి హాని జరగలేదు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన మన్యం వెంకట సుబ్బారావు తన భార్య లక్ష్మితో కలసి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణం బలుసుమూడిలో నివాసముంటున్నాడు. వారికి ఇద్దరు సంతానం. ఈనెల 16న సుబ్బారావు బయటికి వెళ్లేందుకు ప్రయాణమవుతున్న సమయంలో అతని భార్య లక్ష్మి సాయంత్రం షాపింగ్‌కు వెళ్లడం కోసం త్వరగా ఇంటికి రావాలని చెప్పింది. అయితే సుబ్బారావు ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. దీంతో కోపగించిన లక్ష్మి కూల్‌డ్రింక్ బాటిల్లో ఎలుకల మందు కలుపుకొని కొద్దిగా తాగి మిగిలినది వంటింట్లో పెట్టి నిద్రపోయింది. అయితే కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపిన విషయం తెలియని ఆమె ఐదేళ్ల కుమారుడు మహారుద్ర కాంత్ (5) దానిని తాగి నిద్రపోయాడు. తెల్లవారుజామున రుద్రకాంత్ వాంతులు చేసుకోవడంతో ఎలుకల మందు కలిపిన కూల్‌డ్రింక్ తాగినట్టు గ్రహించి అతన్ని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ ఘటనపై బాలుడి తండ్రి వెంకట సుబ్బారావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్ఐ రామారావు తెలిపారు.

టీడీపీ కూటమికి వ్యతిరేకంగా మాట్లాడితే ప్రాణం తీస్తారా?

- వైఎస్సార్‌సీపీకి ఓటేసినందుకే మందా సాల్మన్ హత్య
- వైఎస్ జగన్‌ను అభిమానించడం నేరమా?
- ఆయనకు ఓటు వేస్తే ఊరి నుంచి బహిష్కరిస్తారా?
- రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు ఆగ్రహం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, టీడీపీకి, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ప్రాణాలు తీస్తామన్న తరహాలో పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జూపూడి మీడియాతో మాట్లాడుతూ .. ''వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంతో సుభిక్షంగా వర్ధిల్లింది. అందుకే 2024 ఎన్నికల్లో కూటమి కుయుక్తులతో గెలిచినా 41శాతం మంది వైఎస్సార్‌సీపీని ఆదరించారు. వైఎస్ జగన్‌ను అభిమానించడం తప్పా.. అదేమైనా నేరమా? ఆయనకు ఓటేస్తే ఊరి నుంచి వెలివేస్తారా? ప్రాణాలు తీస్తారా? వైఎస్సార్‌సీపీకి ఓటేసినందుకే పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లిలో మందా సాల్మన్ హత్య జరిగింది. ఎన్నికలైన వెంటనే ఆయనను ఊరి నుంచి కూటమి నేతలు బహిష్కరించారు. భార్య అనారోగ్యంతో ఉందని తెలుసుకుని సొంతూరు వస్తే రాడ్లతో కొట్టి చంపారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదు. అహంకారాన్ని నెత్తికెక్కించుకున్న పాలకులను దళిత ఉద్యమాల ద్వారా కింద పడేసిన చరిత్రను మరిచిపోవద్దు. ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యే. ఈ హత్యపై సీబీఐ దర్యాప్తు కోరుతూ, డీజీపీకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన మా పార్టీ నాయకులకు అనుమతి ఇవ్వలేదు. చివరకు ఆఫీస్‌లోకి కూడా అనుమతించలేదు. మా నాయకులు ధర్నా చేయడంతో, చివరకు అనుమతించారు. కానీ, డీజీపీ మాత్రం కలవలేదు. అంటే దళితులపై దాడులు జరుగుతుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోదా? కూటమికి వ్యతిరేకంగా మాట్లాడితే ప్రాణం తీస్తారా?'' అని జూపూడి ధ్వజమెత్తారు.

30న నిరుద్యోగ రణభేరి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చలో విజయవాడ నిరుద్యోగ రణభేరి నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు తెలిపారు. విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో నిరుద్యోగ రణభేరి వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్,పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల ముందు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మాట నీటి మూటే అయిందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని, నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వై.బాబి, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ లంకా గోవిందరాజులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు గండి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) 2023 జూలై నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా, నేటికీ కమిషన్‌ను నియమించకపోవడం దురదృష్టకరమని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో కనీసం మధ్యంతర భృతి ప్రకటించకుండా ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు ప్రభుత్వం గండి కొడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత డిసెంబర్ నాటికి 3 డీఏలు పెండింగ్‌లో ఉండగా, జనవరిలో ఇవ్వాల్సిన దాంతో కలిపి మొత్తం 4 డీఏలు పెండింగ్‌లో ఉండడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని, లేదంటే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలించాలి

వైఎస్సార్ టీచర్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: విద్యార్థులకు డ్రగ్స్ అందకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరపు జాలిరెడ్డి, షేక్ జంషీద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల అనంతపురంలో పాఠశాల విద్యార్థులు డ్రగ్స్ వినియోగిస్తూ తమ జీవితాలు నాశనం చేసుకున్న పరిస్థితి వెలుగు చూసిందని, రాష్ట్రంలో ఇలాంటి సంస్కృతి లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన సుమోటోగా తీసుకొని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని పాఠశాలల్లో డ్రగ్స్ నియంత్రించాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

'డీఈవో పోస్టులు భర్తీ చేయండి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న డీఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలు లేక పాలన కుంటుపడుతోందని చెప్పారు. డైట్ లెక్చరర్ల సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, వారి స్థానాల్లో అర్హులైన సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు డైట్ లెక్చరర్లుగా పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై కేంద్ర గెజిట్ విడుదలైనందున ఏకీకృత సర్వీస్ నిబంధనలపై ఉన్న ఆంక్షలు తొలగిపోయినట్లేనని, దీనికి చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీ హెచ్ఎంలకు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ ఖాళీల్లో పదోన్నతులు కల్పించాలని కోరారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు

అర్హులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ డిమాండ్

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో అర్హులకు అన్యాయం జరుగుతోందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆరోపించింది. దీనిపై సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి అర్హులకు పోస్టులు దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించినట్టు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా... ఒక్క అభ్యర్థికీ దరఖాస్తు తీసుకున్నట్టు రసీదు ఇవ్వలేదన్నారు. అదేమని అడిగితే వివరాలు వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు. కానీ, వెబ్‌సైట్‌లో ఎలాంటి సమాచారం లేదన్నారు. ఇది పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నాయకులు చెప్పిన వారికి పోస్టులు కట్టబెట్టేందుకే ఈవిధంగా మాయ చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వచ్చిన దరఖాస్తుల పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచి, నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.

Why is it necessary to excrete waste products



LIFE PROCESSES - EXCRETION

Excretion: Nature's Way of Keeping Living Organisms Clean and Healthy"

Excretion is a vital life process that helps organisms remove harmful metabolic wastes from their bodies. In human beings, excretion is carried out by the excretory system consisting of the kidneys, ureters, urinary bladder, and urethra. The kidneys filter blood to remove nitrogenous wastes like urea, excess salts, and water, forming urine in microscopic units called nephrons.

This process helps maintain homeostasis by regulating water balance, salt concentration, and pH of the blood. Other organs such as the lungs (carbon dioxide) and skin (sweat) also play a role in excretion.

In plants, excretion is simpler as they do not have specialized excretory organs. Waste substances like oxygen, carbon dioxide, and excess water are removed by diffusion through stomata and lenticels. Excess water is eliminated by transpiration. Some waste products are stored in leaves, bark, and fruits, which are later shed. Plants also excrete wastes in the form of gums, resins, latex, and tannins.

Thus, excretion in both plants and animals is essential to remove toxic wastes and ensure proper functioning of life processes.

ONE MARK QUESTIONS

1. What is excretion?

Ans: Excretion is the process of removal of metabolic waste products from the body.

2. Which nitrogenous waste is mainly excreted in humans?

Ans: Urea.

3. What is the functional unit of the kidney?

Ans: Nephron.

4. Name the blood vessel that brings blood to the nephron.

Ans: Afferent arteriole.

5. Which part of the nephron is involved in filtration of blood?

Ans: Glomerulus.

6. Which process in the nephron is non-selective?

Ans: Ultrafiltration.

7. Name the structure where urine is temporarily stored.

Ans: Urinary bladder.

8. What waste is excreted through sweat?

Ans: Excess salts, water, and small amounts of urea.

9. Why is it necessary to excrete waste products

Ans: These waste products are toxic and hence need to be removed from our body.

10. If the toxic wastes are not removed in urine what happens?

Ans: It causes uremia it causes serious health condition

TWO MARKS QUESTIONS

1. Write slogans to create awareness on organ donation.

1. "Donate Organs, Save Lives."
2. "Be a Hero, Give the Gift of Life."
3. "One Donor Can Save Many Lives
4. "Give Life After Life, Donate Organs."

2. How do plants manage their wastes?

1. Waste can be stored in old leaves, bark, or wood.
2. Plants release some wastes as gums, resins, or latex.
3. Some wastes are converted into useful substances for the plant.

3. Describe how the kidney filters blood and forms urine.

Kidneys filter blood in the glomerulus to remove waste like urea.

Filtrate passes through tubules, where useful substances are reabsorbed, and waste forms urine, which is excreted via the ureters.

4. What questions will you ask about kidney diseases and the maintenance of healthy kidneys if you have a chance to meet a nephrologist?

1. How can I prevent formation of stones in kidney?
2. What is kidney failure?
3. How much water should I drink per day?

5. Compare the functioning of alveoli in the lungs and nephrons in the kidneys with respect to their structure and functioning.

1. Alveoli in the lungs and nephrons in the kidney are the smallest structural units of these organs.
2. Alveoli provide the maximum surface area for the exchange of gases in the lungs and nephrons provide the maximum surface area for the diffusion of water, minerals, and waste in the kidneys.

6. Name the main nitrogenous waste in the human blood. How is it removed from the blood?

1. Urea is the main nitrogenous waste in human blood.
2. The kidneys filter the blood and remove wastes like the urea, unwanted salts, and excess water out of the body in the form of a yellow liquid called urine.

7. Write a slogan to create awareness about organ donation among the people.

1. Give the gift of life, be an organ donor
2. Be a hero, donate your organs

8. Differentiate between excretion and egestion

1. Excretion removes metabolic wastes; egestion removes undigested food.
2. Excretion involves kidneys; egestion involves the alimentary canal.

9. Why is reabsorption important in the nephron?

Reabsorption helps in conserving useful substances like glucose, amino acids, salts, and water back into the blood.

FOUR MARKS QUESTIONS

1. Evaluate the use of dialysis in kidney failure patients.

Dialysis is a life-saving treatment for kidney failure patients because:

It **removes waste products,** excess salts, and water from the blood.

It **mimics kidney function** when kidneys are damaged or non-functional.

It helps maintain the **chemical balance** in the body.

There are two types: **hemodialysis and peritoneal dialysis.**

Though effective, it is **time-consuming, expensive,** and needs regular sessions.

It allows patients to **survive and stay healthy** until a kidney transplant is possible

2. Read the paragraph carefully and answer the following questions?

Kidneys are vital organs for survival. Several factors like infections, injury or restricted blood flow to kidneys reduce the activity of kidneys. This leads to accumulation of poisonous wastes in the body, which can even lead to death. In case of kidney failure, an artificial kidney can be used. An artificial kidney is a device to remove nitrogenous waste products from the blood through dialysis.

i) What are the factors that reduce the activity of kidneys?
Infections, injuries to the kidneys

ii) What is an artificial kidney?
It is a device to remove nitrogenous waste from blood through dialysis

iii) Name the process involved in artificial kidneys?
Dialysis

iv) What happens when the functioning of kidneys is reduced?
Accumulation of poisonous wastes in the body

3. How the plants get rid of their waste material?

1. Leaves- Some waste is removed through leaves when they fall off.
2. Stems - Waste can be stored in stems or bark.
3. Roots - Some waste is released into the soil through roots.
4. Fruits and flowers - Waste may be stored in fruits or flowers and removed when they fall.
5. Excretion in other forms- Some plants store waste as gums, resins, or latex.

4. What of questions would you like to ask if you get a chance to meet a nephrologist.

1. How can we keep our kidneys healthy?
2. What are the early signs of kidney problems?
3. How does drinking less water affect kidneys?
4. Can kidney damage be treated or reversed?
5. What foods are good or bad for kidneys?
6. How do doctors treat kidney failure?

5. (a) Name four types of metabolic wastes produced by humans.
(b) Name any two human excretory organs other than kidney.

(a) Four types of metabolic wastes produced by human are urea, carbon dioxide, water and salts.

(b) Two human excretory organs other than kidneys are:

(i) Lungs: They help to eliminate carbon dioxide.

(ii) Liver: It is an excretory organ as it converts harmful amino acids to harmless urea and hemoglobin of worn-out RBCs to bilirubin and biliverdin that can be excreted out of the body.

6. **Draw a diagram of human excretory system and label kidneys, ureters on it.**



7. **Draw a well-labelled diagram of structural and functional unit of kidney.**



EIGHT MARKS QUESTIONS

1. **What are nephrons? How is a nephron involved in the filtration of blood and formation of urine?**
   1. Nephrons are the functional unit of kidney. Each kidney has about one million nephrons.
   2. Each nephron consists of a cup-shaped structure called Bowman's capsule containing a bunch of capillaries called glomerulus.
   3. Bowman's capsule leads into tubular structure which ultimately joins the transverse collecting tubule.

   Filtration of blood and formation of urine in nephron involves the following steps:

   (i) The blood along with waste and excess water is brought to kidney by renal arteries. Blood is filtered from the blood capillaries into Bowmans capsule.

   (ii) As the nephric filtrate passes through the tubular part of nephron, useful substances like glucose, amino acid, mineral ions, water, etc., are reabsorbed by blood capillaries surrounding the nephron.

   (iii) Tubular secretion occurs mainly in the renal tubule and the collecting duct of the nephron where additional wastes are excreted from the blood stream into the filtrate.

   (iv) The fluid that flows through collecting tubule is urine which consists of water, urea, uric acid, mineral ions like sodium, potassium, chloride, phosphates, etc..

2. **Explain the Structure of Nephron with the help of diagram?**
   1. The nephron is the structural and functional unit of the kidney.
   2. Each kidney contains about one million nephrons.
   3. A nephron consists of a renal corpuscle and a renal tubule.
   4. The renal corpuscle is made up of Bowman's capsule and a network of capillaries called the glomerulus.
   5. Blood enters the glomerulus through the afferent arteriole and leaves through the efferent arteriole.
   6. The renal tubule begins with the proximal convoluted tubule.
   7. It continues into the loop of Henle and then the distal convoluted tubule.
   8. The distal tubule opens into the collecting duct, which carries urine towards the renal pelvis.



A NEAT LABELED DIAGRAM OF NEPHRON

3. **Describe excretion in plants and animals.**
   1. Excretion is the process of removing waste products formed during metabolism.
   2. Animals possess specialized organs like kidneys for excretion.
   3. In humans, nitrogenous wastes are removed in the form of urea.
   4. Lungs help in excreting carbon dioxide and water vapour.
   5. Skin excretes excess salts and water through sweat.
   6. Plants do not have specialized excretory organs.
   7. Plants remove gaseous wastes through stomata and lenticels.
   8. Some wastes in plants are stored in leaves, bark, or fruits and later removed.

4. **Explain the process of urine formation in humans.**
   1. Urine formation takes place in the nephrons of the kidneys.
   2. The first step is ultrafiltration, which occurs in the glomerulus.
   3. During ultrafiltration, blood is filtered under high pressure.
   4. The filtrate contains water, urea, salts, glucose, and amino acids.
   5. The second step is selective reabsorption in the renal tubules.
   6. Useful substances are reabsorbed back into the blood.
   7. The third step is tubular secretion where extra wastes are added to the filtrate.
   8. The remaining fluid forms urine and is transported to the urinary bladder.

5. **Describe the structure and functioning of the human kidney.**
   1. The human kidney is a bean-shaped organ that helps in removing metabolic wastes from the blood.
   2. Each kidney contains about one million functional units called nephrons.
   3. Blood enters the nephron through the afferent arteriole into the glomerulus.
   4. Ultrafiltration occurs in the glomerulus where waste materials are filtered from the blood.
   5. The filtrate then passes through the renal tubule where selective reabsorption takes place.
   6. Useful substances like glucose, salts, and water are reabsorbed into the blood.
   7. Additional wastes are added to the filtrate by tubular secretion.
   8. The final urine is collected in the collecting ducts and passed to the urinary bladder.

P. Neelakantaiah
ZPHS Karakambadi,
Tirupati Dist.

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. **The main function of excretion in humans is to**
   A. digest food
   B. remove metabolic wastes
   C. transport oxygen
   D. regulate body temperature
2. **The nitrogenous waste excreted mainly by humans is**
   A. Ammonia B. Uric acid
   C. Urea D. Nitrate
3. **Which structure is the functional unit of the kidney?**
   A. Neuron B. Nephron
   C. Alveolus D. Villus
4. **Ultrafiltration of blood takes place in the.......**
   A. Loop of Henle
   B. Collecting duct
   C. Glomerulus
   D. Proximal tubule
5. **Which of the following substances is selectively reabsorbed in the nephron?**
   A. Urea
   B. Oxygen
   C. Glucose
   D. Carbon dioxide

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్

"నా ఫ్రెండ్‌కు ఫోన్ చేస్తే 'ఇప్పుడు రాకు, సీరియల్ చూస్తున్నా' అంది. అమ్మమ్మలు నానమ్మలు సీరియల్స్ చూస్తుంటే పిల్లలకు ఎవరు కథలు చెప్తారని పిల్లల కోసం రాయడం మొదలుపెట్టాను. అలా దేశానికే 'ఆచి' (అమ్మమ్మ) అయ్యాను" అన్నారు సుధామూర్తి. 50 ఏళ్ల వయసులో రాయడం మొదలుపెట్టి తన 50వ పుస్తకం వెలువరించిన సందర్భంగా 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో వేలాది ప్రేక్షకులతో ఆమె మాట్లాడారు. తన మనవరాలిని దృష్టిలో పెట్టుకుని పిల్లలందరి కోసం కథలెలా రాస్తున్నారో వివరించారు.

అందరికీ అమ్మమ్మ

'మా కాలం అమ్మమ్మలు, నానమ్మల్లా ఇప్పటి అమ్మమ్మలు, నానమ్మలు లేరు. వాళ్లు సీరియల్స్‌తో బిజీగా ఉన్నారు. కుంకుమ్ తన అత్తగారిని మెప్పిస్తుందా లేదా అని వారి టెన్షన్. కుంకుమ్ ఒక పాత్ర అట. లేదంటే వాళ్లకు వాట్సప్ గ్రూపులున్నాయి. వాటిలో బిజీగా ఉంటున్నారు. మరి పిల్లలకు మంచి విషయాలు ఎవరు చెప్పాలి... ఎలా చెప్పాలి... ఇప్పటికే మైక్రో ఫ్యామిలీల వల్ల పిల్లలు అమ్మమ్మలతో, నానమ్మలతో గడపడం లేదు. ఉన్న అమ్మమ్మలేమో బిజీ. పిల్లల గురించి చాలా నిర్లక్ష్యం సాగుతోంది. అందుకనే పిల్లల కోసం కథలు రాయడం మొదలుపెట్టాను. ఇప్పటికి 50 పుస్తకాలు రాస్తే వాటిలో 30 పిల్లల కోసమే. అందుకే పిల్లలందరూ నన్ను 'ఆచి' అని పిలుస్తున్నారు. అలా దేశానికే బామ్మనయ్యాను' అని హర్షధ్వానాల హోరు మధ్య సుధామూర్తి చెప్పారు.

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో తన 50వ పుస్తకం 'ది మేజిక్ ఆఫ్ లాస్ట్ ఇయర్ రింగ్స్' వెలువడ్డ సందర్భంగా ఆమె మాట్లాడారు.

మనవరాలి కోసం

'లండన్‌లో పెరుగుతున్న నా ఇద్దరు మనవరాళ్లలో ఒక మనవరాలు అనుష్కకు అక్కడకు వెళ్లినప్పుడల్లా కథలు చెప్పేదాన్ని. ఆ అమ్మాయి లాంటి పాత్ర 'నూని' ని సృష్టించి ఆ పాత్రతో ఒక ట్రయాలజీ రాస్తున్నాను. మొదటి భాగం 'ది మేజిక్ ఆఫ్ ది లాస్ట్ టెంపుల్'లో మన పిల్లలకు తెలియాల్సిన ఆర్కియాలజీ గురించి చెప్పాను. మన దేశంలో ఆర్కియాలజీ ద్వారా తెలుసుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. మన దేశం పురావస్తు శాస్త్రాన్ని పట్టుగొమ్మ. సైన్స్, టెక్నాలజీ చదువులో ఎలాగూ ఉంటుంది. ఆర్కియాలజీ ద్వారా గతాన్ని తెలుసుకోమని ఎవరు చెప్తారు?

అందుకే ఆ భాగం రాశాను. రెండో భాగం 'ది మేజిక్ ఆఫ్ లాస్ట్ ఇయర్ రింగ్స్' రాశాను. ఇది మన దేశ బాలలకు పార్టిషన్ గురించి తెలియాలని రాశాను' అన్నారామె.

సునాక్ కుటుంబం కాందిశీకులే

'నా మనవరాలి వంటి పిల్లలకు దేశ విభజన గురించి ఎందుకు చెప్పాలనుకున్నానంటే నా అల్లుడు రిషి సునాక్ కుటుంబం కూడా కాందిశీకులే. వాళ్లు పాకిస్తాన్ నుంచి దేశ విభజన సమయంలో కట్టుబట్టలతో వలస వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత నైరోబీలో స్థిరపడి అక్కడి నుంచి కూడా యు.కెకు కట్టుబట్టలతో వలస రావాల్సి వచ్చింది. కాలి కింద నేల లేకపోవడం అంటే ఏమిటో, నేలతో పాటు భాష, సంస్కృతిని కూడా కోల్పోవడం అంటే ఏమిటో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. అయితే ఇది నెగెటివ్ ఇంపాక్ట్ ఇచ్చేదిలా కాకుండా గతంలో పెద్దవాళ్లు చేసిన తప్పును ఇప్పుడు మనం చేయకూడదు... విభజనలు, విడదీయడాలు ఎవరికీ మంచివి కావు అని అర్థమయ్యేలా చెప్పడానికే ఈ పుస్తకం రాశాను. మూడవ భాగం నార్త్ ఈస్ట్ రాష్ట్రాల గురించి రాస్తాను. వాటి గురించి పిల్లలకు ఎవరూ సరిగా చెప్పరు' అన్నారామె.

జీవితం సులభం చేయకండి

ఇవాళ తల్లిదండ్రులు పిల్లలకు అడిగింది సమస్తం అందచేస్తున్నారు. దాంతో వారికి జీవితం ఇంత సులభమనే భావన కలిగిస్తున్నారు. జీవితం ఎంత మాత్రం సులభం కాదు. దానికి దానివైన ఎగుళ్లు, దిగుళ్లు, ఆనందాలు, బాధలు ఉంటాయి. పిల్లల్ని వాటికి ప్రిపేర్ చేయాలి. నా కొడుకు చిన్నప్పుడు కింద పడితే లేపి 'నడిచిన వాడే పడతాడు. కాళ్లు ఉన్నది నడవడానికి. పడితే లేచి ముందుకు సాగడానికి' అని చెప్పేదాన్ని. పిల్లలకు సమస్యలే రాకుండా చూడాలనుకోవడం సరి కాదు' అన్నారామె.

రచయితలు కావాలనుకున్న పిల్లలందరూ బాగా పుస్తకాలు చదవాలని, మంచి రచయితలందరూ మంచి పాఠకులని సూచించారామె.

- జైపూర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

బ్యూటిప్

బాగా మగ్గిన అరటి పండును మెత్తగా చిదిమి ముఖానికి, మెడకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇది పొడి చర్మానికి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది, మెడ నల్లగా ఉంటే క్రమంగా ఆ నలుపు వదులుతుంది.

కిచెన్ టిప్

- పాత్రల మీద మరకలు పోవాలంటే తడి వస్త్రాన్ని బేకింగ్ సోడాలో అద్ది తుడవాలి.
- స్టీలు కప్పులు లేదా గ్లాసులకు కాఫీ, టీ మరకలు పడితే ఉప్పు కలిపిన నీటితో కడగాలి.
- నాన్‌స్టిక్ పాత్రలు కాని పాన్‌లను శుభ్రం చేయాలంటే వాటిని వేడి నీటితో నింపి ఒకగంట సేపు అలాగే ఉంచాలి. తరువాత మామూలుగా డిటర్జెంట్‌తో రుద్ది కడగాలి.

వీకెండ్ అన్నది ఎప్పుడూ సంతోషదాయకమూ, ఆనందకరమే కాకపోవచ్చు. శని, ఆదివారాలు ఎలాగూ సెలవురోజులేగా కాస్తంత ఎంజాయ్ చేద్దాం అనే భావన ఒక్కోసారి ఆరోగ్యానికి చేటు తెచ్చిపెట్టవచ్చు. వారాంతపు వ్యవహారాలతో వచ్చే ఆరోగ్య సమస్యలేమిటి, వాటికి పరిష్కారాలేమిటన్న విషయాలతో..

హెల్త్‌కిది.. వీక్... ఎండ్..!

ప్రత్యేక కథనం నేడు 'సాక్షి' హెల్త్ ప్లస్ ఈపేపర్‌లో....

అందరి లాగే తను కూడా ఆ గ్రామానికి కోడలిగా వచ్చింది. తన భర్తతో, కుటుంబంతో సంతోషంగా బతకాలనుకుంది. అంతలోనే భర్తను కోల్పోవడంతో తన బిడ్డతో ఒంటరిగా మిగిలిపోయింది. కానీ ఆ విషాదంలోనే ఉండిపోకుండా తన ఊరికి ఏదైనా సహాయం చేయాలనుకుంది. ఎన్నో కష్టాలను ఎదుర్కొని గ్రామ సర్పంచ్‌గా గెలిచింది. పర్యావరణ హితమైన ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. ఊరిని ప్రగతి మార్గంలో నడిపించింది. అదే నేడు తనను, తన ఊరిని గొప్పస్థానంలో నిలబెట్టింది. అంతేకాదు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డును అందుకోవడంతో పాటు, రూ. 1 కోటి నగదు బహుమతిని సైతం సొంతం చేసుకునేలా చేసింది. ఆమే .. యోగేశ్వరి శత్రుగన్ చౌదరి.

మొక్కవోని లక్ష్యమే వృక్షాలై...

యోగేశ్వరి శత్రుగన్ చౌదరి

మహారాష్ట్రలోని గోండియా జిల్లా, సడక్ అర్జుని తాలూకాకు చెందిన దవ్వా గ్రామం సరికొత్త చరిత్ర సృష్టించింది. పర్యావరణ హిత కార్యక్రమాలలో ముందుండే గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయతీ అవార్డు పొందిన గ్రామంగా నిలిచింది దవ్వా. ఇదంతా ఆ ఊరి సర్పంచ్ యోగేశ్వరి శత్రుగన్‌చౌదరి వల్లే సాధ్యమైందని ఆ గ్రామ ప్రజలు చెబుతున్నారు.

అనుకోని విషాదం

ఇంటర్ పూర్తి చేసిన యోగేశ్వరి 2003లో దవ్వా గ్రామానికి కోడలిగా వచ్చింది. అనంతరం భర్త సహకారంతో బీఏ., బీఈడీ, డీఈడీ చేసి ఓ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరింది. అంతలోనే భర్త మరణించడంతో.. యోగేశ్వరి జీవితంలో అంధకారం అలుముకుంది. అయితే ఈ విషాదంలోనే ఉండిపోకుండా అభివృద్ధిలో అట్టడుగున ఉన్న తన ఊరికోసం ఏమైనా చేయాలనుకుంది. ఆ ఆలోచనతోనే ఊరి ప్రజల సహకారంతో సర్పంచ్‌గా గెలిచింది.

లక్షాపదహారు వేల మొక్కలు నాటింది

యోగేశ్వరి పర్యావరణ హితమైన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. గ్రామంలోని నిస్సారమైన నేలలో నీటిని పారించి పంటలు పండించింది. గ్రామపరిధిలోని ఖాళీ స్థలాలలో సుమారు 1,16,000 మొక్కలను నాటి ఆ ప్రాంతాన్ని పచ్చదనంతో నింపేశారు. గ్రామంలోని 400 ఇళ్లకు పైగా సోలార్‌గ్రిడ్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం ద్వారా జీరో వేస్ట్ లక్ష్యాన్ని చేరుకున్నారు. రైతుల కోసం ప్రత్యేక ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి, రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. గ్రామం కోసం చేపట్టిన పనులన్నీ పారదర్శకంగా ఉండటం కోసం భువన్ యాప్ ద్వారా జియో–ట్యాగింగ్ చేశారు.

పుత్రోత్సాహం...

ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనంటారు. అలా ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ తాను ఆ ఉద్యోగం సాధించిన విషయాన్ని తల్లికి చెప్పిన తీరు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ నెటిజన్ల ప్రశంసలు పొందుతోంది.

మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాకు చెందిన గోపాల్ సావంత్ ఓ పేద కుటుంబానికి చెందిన వ్యక్తి. కుటుంబానికి ఆసరాగా తన తల్లి కుడాల్‌నగర్ వద్ద రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతుంటుంది. తన తల్లి కష్టాన్ని బాల్యం నుంచి చూసిన గోపాల్ సావంత్ కఠోర దీక్షతో, కృషితో సీఆర్‌పీఎఫ్ జవానుగా ఎంపికయ్యాడు. అయితే ఈ సంతోషకరమైన విషయాన్ని తన తల్లికి చెప్పిన విధానమే పలువురి మన్ననలు పొందుతోంది. గోపాల్ తన తల్లికి ఇంటి వద్ద చెప్పకుండా.. ప్రతిరోజూ ఆమె రోడ్డు పక్కన కూరగాయలు విక్రయించే ప్రాంతానికి వెళ్లి చెప్పాడు. ఆ విషయం చెప్పగానే ఆ తల్లి భావోద్వేగానికి లోనై, నీళ్లు నిండిన కళ్లతో కొడుకును గుండెలకు హత్తుకుంది. ఇదంతా ఓ వ్యక్తి వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. ఈ వీడియోని ఇప్పటి వరకు 1.2 కోట్ల మందికి పైగా వీక్షించారు. తల్లీ, కొడుకుల అనుబంధానికి ఫిదా అయిపోతూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జనవరి 19న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,48,717	1,48,350	1,46,240	1,48,350	1,45,500	1,46,730
బంగారం (22 క్యారెట్లు)	1,32,967	1,33,550	1,34,050	1,37,565	1,33,860	1,34,500
వెండి	3,01,680	3,00,000	3,18,000	3,00,000	2,96,000	3,18,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

ఉత్తరాషాఢ కార్తె: జనవరి 24 వరకు
శ్రవణ కార్తె: 25 నుంచి

రైతును ఎటువంటి ఎరువూ అడగకపోగా.. తనే పోషకాల పంట పండించి ఇచ్చే అత్యంత అరుదైన, ఎన్నో సుగుణాలున్న అద్భుతమైన మొక్క 'కాంఫ్రే'. బోరేజ్ కుటుంబం. సింఫిటమ్ జాతి. యూరప్, ఆసియాలకు చెందినది. ఆ ప్రాంతం అంతటా 40 జాతులు నమోదయ్యాయి. ఇంగ్లండ్‌లో దీనిపై ఇద్దరు వ్యక్తులు విస్తృతంగా పరిశోధనలు చేశారు.

ఈ మొక్కే ఒక ఎరువుల ఫ్యాక్టరీ!

చేపలు ఇవ్వటం కన్నా చేపలు పట్టటం నేర్పితే ఎక్కువ మేలు జరుగుతుందన్నది నానుడి. అదే విధంగా రసాయనిక ఎరువులను రైతులకు ఇవ్వటానికి బదులు 'ఎరువుల ఫ్యాక్టరీ' వంటి అద్భుత మొక్కలను రైతులకు ఇస్తే ఎంతో మేలు జరుగుతుందంటున్నారు నిపుణులు. ఆ విదేశీ మొక్క పేరే 'కాంఫ్రే'!

చిన్న దుంప తెచ్చి ఒక్కసారి నాటితే చాలు.. కనీసం పదేళ్లు వేగవంతంగా పెరుగుతూ ఎన్‌పీకే ఎరువులతో కూడిన ఆకులను 'కాంఫ్రే' మొక్క నిరంతరాయంగా ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది. ఆకులు 20-25 రోజులకోసారి కోతకు వస్తూనే ఉంటాయి. అందుకే దీన్ని 'డైనమిక్ న్యూట్రియంట్ ఎక్యుములేటర్' అంటారు

పంటలు, పండ్ల తోటల్లో గడ్డి పెరగకుండా పోషకాలను పండించే కవర్ క్రాప్‌గా పెంచుకోవచ్చు. ఆకులు కోసి ఆచ్ఛాదనగా వెయ్యొచ్చు. ఆకులను ఊరబెట్టి ద్రావణాన్ని గ్రోత్ ప్రమోటర్‌గా వాడొచ్చు

పశువులకు, కోళ్లకు, పందులకు పోషకవంతమైన మేతగానూ కాంఫ్రే ఆకులు ఉపయోగపడతాయి

జహీరాబాద్‌కు చెందిన పర్మాకల్చరిస్టులు నర్సన్న, పద్మకు 'కాంఫ్రే' సాగులో అనుభవం ఉంది

కాంఫ్రే మొక్కల నుంచి ఏడాదికి 16-18 సార్లు ఆకులు కోసుకోవచ్చన్నారు

ప్రభుత్వం రసాయనిక ఎరువులకు బదులు అద్భుతమైన ఈ మొక్కను ఇంగ్లండ్/ఆస్ట్రేలియా నుంచి తెప్పించి ఇస్తే మేలని సూచిస్తున్నారు

రెండు అడవి కాంఫ్రే జాతుల సంకరంతో 'రష్యన్ కాంఫ్రే' (సింఫిటమ్ అప్లాండికమ్) హైబ్రిడ్ జాతి రూపొందింది. ఈ మొక్కల విశిష్ట ప్రయోజనాలను తొలుత గుర్తించిన వ్యక్తి హెన్రీ డబుల్‌డే (1810–1902). అతను ఈ మొక్కను ఆహారం, పశువులు, కోళ్ల మేత పంటగా విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన తర్వాత లారెన్స్ డి హిల్స్ (1911–1991) ఆ కృషిని కొనసాగించారు. 1950వ దశకంలో ఇంగ్లండ్‌లోని బోకింగ్ అనే గ్రామంలో కాంఫ్రే పరిశోధన కేంద్రంలో 21 రకాల కాంఫ్రే జాతులపై హిల్స్ ప్రయోగాలు చేశారు. పోషకాలు అధికంగా ఉండే మేలైన రకాన్ని గుర్తించి 'బోకింగ్ 14 కాంఫ్రే' అని పేరు పెట్టారు.

ఎన్‌పీకే ఎరువులతో కూడిన ఆకులు

చిన్న దుంప తెచ్చి ఒక్కసారి నాటితే చాలు.. కనీసం పదేళ్లు వేగవంతంగా పెరుగుతూ ముఖ్యమైన పోషకాలతో కూడిన ఆకులను 'కాంఫ్రే' మొక్క నిరంతరాయంగా ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది. కాంఫ్రే ఆకుల్లో నత్రజని, ఫాస్ఫరస్, ఫాస్ఫేట్ (ఎన్‌పీకే ఎరువులు) పుష్కలంగా ఉండటం విశేషం. ఈ మొక్క పెద్ద మొత్తంలో ఆకులను ఉత్పత్తి చేస్తుంది. 20–25 రోజులకోసారి పోషకాలతో నిండిన ఆకులు కోతకు వస్తూనే ఉంటాయి. కోసిన ప్రతిసారీ మొక్క మళ్లీ వేగంగా పెరుగుతుంది. అందుకే దీన్ని 'డైనమిక్ న్యూట్రియంట్ ఎక్యుములేటర్' అని పిలుస్తారు. మల్చింగ్ పచ్చిరొట్ట ఉత్పత్తికి ఇది అద్భుతమైన వనరు.

16–18 సార్లు ఆకుల కోత

మొక్కలకు ఎంత బాగా నీరు పోసి పోషిస్తారు అనే దానిపై ఆధారపడి సంవత్సరానికి 16 నుంచి 18 సార్లు కత్తిరించవచ్చని కాంఫ్రే మొక్కల పెంపకంలో అనేక దశాబ్దాల అనుభవం గల ప్రముఖ పర్మాకల్చరిస్టులు కొప్పుల నరసన్న, పద్మ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. తోటల్లో ప్రతి పండ్ల చెట్టు పక్కన ఈ మొక్క నాటితే చాలన్నారు.

కాంఫ్రే వేర్లను కొన్ని అడుగుల లోతు వరకు చొప్పిస్తుంది. రెండు మీటర్ల లోతు వరకు దీని వేర్లు వెళ్తాయట. ఇతర మొక్కలకు అందనంత లోతు నుంచి పోషకాలు కాంఫ్రే ఆకుల ద్వారా నేలపైకి వస్తాయి. ఈ ఆకులను మల్చింగ్‌గా వేయటం లేదా కంపోస్టుగా మార్చి పంటలకు వేయటం ద్వారా ఆ పోషకాలు ఇతర పంటలకు అందించవచ్చు. కాంఫ్రే ఆకులను పొడి చేసి కూరగాయ మొక్కలు, పండ్ల చెట్లకు వేయొచ్చు. పచ్చి ఆకులను నేరుగా ఆచ్ఛాదనగా వేసుకోవచ్చు లేదా కాంఫ్రే ఆకులను తరిగి నీటిలో అనేక వారాల పాటు ఊడబెట్టి ద్రావణాన్ని తయారు చేసి వాడుకోవచ్చు.

ఎండ, నీడ, నీరు ఉండాలి

ఏ రకమైన నేలల్లో అయినా కాంఫ్రే పెరుగుతుంది. అయితే, తేమ ఆరిపోకుండా ఉండే సారవంతమైన నేలలకు అనువైనది. పీహెచ్ 6.5–8.5 మధ్య ఉండాలి. 6–7 మధ్య పీహెచ్ ఉన్న నేలల్లో ఇది బాగా పెరుగుతుందని చెబుతున్నారు. మన ఉష్ణమండలంలో ఇది పెరగాలంటే పాక్షికంగా చెట్టు నీడ అవసరం. కొంతసేపు ఎండ కూడా అవసరమే. అదేమాదిరిగా నీటి తేమ నిరంతరం ఉండేలా చూసుకోవాలి అని నరసన్న, పద్మ తెలిపారు. కూరగాయ తోటలు, పండ్ల తోటలు, కలప తోటల్లో సాళ్ల మధ్య కాంఫ్రేని నాటుకోవచ్చు. నీటి ఎద్దడిని తట్టుకునే కాంఫ్రే వంగడాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. వాటిని గుర్తించి మన దేశంలోకి దిగుమతి చేసి, రైతులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవటం ఉపయోగకరం.

అత్యంత అరుదైన మొక్క కాంఫ్రే

కాంఫ్రే అరుదైన అద్భుత మొక్క. భూసారం పెంపొందించటానికి చాలా బాగా ఉపయోగపడుతుంది. కోళ్లు ఈ ఆకులను ఇష్టంగా తింటాయి. విరిగిన ఎముకలను కట్టించటానికి కూడా ఇది ఉపయోగమే. చలి దేశాల నుంచి తీసుకొచ్చి 1987 నుంచి కాంఫ్రే మొక్కలను గత ఏడాది వరకు పెంచాం. ఆదిలాబాద్ దగ్గర మా పొలంలో ఒక ఎకరంలో పూర్తిగా కాంఫ్రే ఉండేది. మన వాతావరణానికి ఈ మొక్క అలవాటు పడింది. చాలామంది రైతులకు ఇచ్చాం. చాలామంది రైతులకు ఇచ్చాం. అయితే, మేం వేరే పనిలో ఉండి ఒక సంవత్సరం అంతగా శ్రద్ధ పెట్టలేదు. మొక్కలన్నీ చనిపోయాయి. కాంఫ్రే మొక్కల ఆకులు నేలపై మల్చింగ్ చేసే వాళ్లం. ఆకులతో ద్రావణం తయారు చేసి కూరగాయలు, పండ్ల చెట్ల పోషణ కోసం వాడేవాళ్లం. కంపోస్టులో వాడేవాళ్లం. 6–7 అంగుళాల ఎత్తు పెరుగుతుంది. ఏడాదికి 16–18 సార్లు ఆకులను కత్తిరించి వాడుకోవచ్చు. అల్లం మాదిరిగా దీనికి పాక్షికంగా ఎండ, నీడ కావాలి. నీరు రోజూ ఇవ్వాలి. పావెకరంలో 500 మొక్కలు పెట్టొచ్చు. పండ్ల చెట్లకు పక్కనే పెరుగుతూ పోషకాలు అందించే నర్స్ ప్లాంట్‌గా కాంఫ్రే పనికొస్తుంది. ఆకు గరుకుగా నూగుతో కూడి ఉండటం వల్ల అతి త్వరగా 3 రోజుల్లోనే కుళ్లి మట్టిలో కలిసిపోతుంది. మనుషులకే కాదు పశువులకూ బోన్‌సెట్టర్‌గా ఉపయోగపడుతుంది. వ్యవసాయానికి, పశుపోషణకు ఎన్నో విధాలుగా ఉపయోగపడే ఈ మొక్కలను ప్రభుత్వం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి దేశాల నుంచి తెప్పించాలి. మన వాతావరణానికి సరిపడే కాంఫ్రే జాతులను దిగుమతి చేసుకొని రైతులకు అందించాలి. మన దేశంలో కూడా ఇటువంటి లక్షణాలున్న మొక్కలు ఉండే ఉంటాయి. మన శాస్త్రవేత్తలు పరిశోధించాలి.

- కొప్పుల నరసన్న, పద్మ, సహ వ్యవస్థాపకులు, అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ, జహీరాబాద్
మొబైల్: 94408 26722

పశుగ్రాసంగానూ పనికొస్తుంది

కాంఫ్రే ఆకులను పశుగ్రాసంగా సుదీర్ఘ కాలంగా ఉపయోగిస్తున్నారు. లారెన్స్ డి హిల్స్ ఈ అంశంపై పుస్తకాలు రాశారు. తాజా ఆకులను పందులు, గొర్రెలు, కోళ్లు ఇష్టంగా తింటాయి. కానీ పశువులు, కుందేళ్ళు, గుర్రాలు వాడిపోయిన ఆకులను మాత్రమే తింటాయని హిల్స్ పేర్కొన్నారు. ఈ మొక్కకు గంట ఆకారంలో పువ్వులు పూస్తాయి. అనేక జాతుల తేనెటీగలు, కందిరీగలు, సాలె పురుగులు ఇతర మిత్ర పురుగులకు ఈ మొక్కలు ఆవాసం కల్పిస్తాయి. బూజు తెగులును నివారించడానికి కాంఫ్రే ఆకుల ద్రావణాన్ని ఉపయోగించవచ్చని పరిశోధన సూచిస్తుంది. ఇంగ్లండ్‌లో ఒక పర్మాకల్చరిస్టు అంచనా ప్రకారం.. అక్కడి వాతావరణంలో మొక్కకు 5.5 కిలోల బరువైన ఆకులను ఒక ఏడాదిలో





కోసుకోవచ్చు. 10 మీటర్ల పొడవు 4 అడుగుల వెడల్పు గల ఎత్తు మడిలో అడుగు– అడుగున్నర దూరంలో 52 మొక్కలు వేస్తే ఏడాదిలో 286 కిలోల ఆకు వస్తుంది. ఈ ఆకు ద్వారా పొటాషియం 2.08 కిలోలు, నత్రజని 104 కిలోలు సమకూరుతుందని అంచనా. వాతావరణాన్ని బట్టి, నేల సారాన్ని బట్టి ఇది మారుతుంది.

విరిగిన ఎముకలను కట్టుకునేలా చేసే ఔషధ గుణాలు కాంఫ్రే ఆకుల్లో ఉన్నాయి. ఈ ఆకులను మనుషులు కూడా గతంలో తినేవారు. నొప్పులు తగ్గుతాయని కషాయం తాగేవారు. అయితే, లివర్‌పై దుష్ప్రభావం ఉంటుందని 20 ఏళ్ల క్రితం పరిశోధనల్లో తేలింది.

అవెర్రోవా బిలింబి. బిలింబి అంటారు. ఆగ్నేయాసియాకు చెందిన ఉష్ణమండల కూరగాయ. ఫిలిప్పీన్స్, మలేసియా, ఇండోనేసియా వంటి దేశాల్లో బాగా వాడుతున్నారు. ప్రత్యేకమైన ఘాటైన పులుపు,

విభిన్న రుచుల బిలింబి

ఉప్పు కలగలిసిన రుచి, బహుముఖ ఉపయోగాల కారణంగా మన దగ్గర కూడా ప్రాచుర్యంలోకి వస్తోంది. ఆగ్నేయాసియా వంటకాల్లో దీన్ని విస్తృత శ్రేణి వంటకాల్లో ముఖ్యంగా సినిగాంగ్ (పుల్లని సూప్), ఊరగాయలు, పానీయాలు, జామ్‌లు, సాస్‌లు, కూరలు వంటి సాంప్రదాయ వంటకాలలో ఇది కీలకం. వంటకాలలో పులుపు, ఉప్పదనం కోసం కలుపుతుంటారు. ఆగ్నేయాసియా వంటశాలల్లో బిలింబి చాలా కాలంగా ప్రధానమైనదిగా ఉన్నప్పటికీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా నెమ్మదిగా ప్రజాదరణ పొందుతోంది. అన్యదేశ జాతులు, రుచులపై పెరుగుతున్న ఆసక్తి వల్ల బిలింబికి ప్రాధాన్యం పెరుగుతోంది.

బిలింబి చెట్టు వేగంగా 10 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. కాయ పొడుగ్గా, ఆకుపచ్చగా ఉంటుంది. చిన్న కీర దోసకాయలా కనిపిస్తుంది. పండిన తర్వాత పసుపు లేదా లేత ఆకుపచ్చగా మారుతుంది. విటమిన్ సి వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మానికి మేలు చేస్తుంది. సూర్యకాంతి బాగా అవసరం. దీన్ని పెంచడం సులభం. విత్తనం పెట్టిన 2–3 వారాల్లో మొలుస్తుంది. నర్సరీలో 6–8 నెలలు పెరిగిన మొక్కలను పొలంలో లేదా గార్డెన్‌లో నాటుకోవాలి. చెట్లు విస్తారంగా పెరగటానికి అవకాశం ఇస్తూ 3–4 మీటర్ల దూరంలో నాటుకోవాలి. చెట్ల నుంచి కొమ్మలు కత్తిరించి కూడా నాటుకోవచ్చు. 15–20 సెం.మీ. కొమ్మలు కత్తిరించి ట్రేలో నాటుకోవాలి. 4–6 వారాల తర్వాత కొమ్మలు వేరుపోసుకుంటాయి. 6–8 నెలలు పెరిగిన మొక్కలను పొలంలో నాటుకోవాలి. ఒక్కరోజు బీరు పోకుండా మొక్కలకు నీరు పోస్తూ ఉండాలి. ముఖ్యంగా మొక్కలు చిన్నగా ఉన్నప్పుడు నీరు తప్పనిసరిగా ఇవ్వాలి. ఎరువులను తగినంతగా వేస్తుంటే చెట్టు బాగా పెరుగుతుంది. తోటల్లో లేదా ఇంటిపంటల్లో కూడా ప్రత్యేక రుచులను అందించే బిలింబి చెట్లు నాటుకుంటే ఆనందం, ఆరోగ్యం చేకూరతాయి.

బంగ్లాదేశ్ ఆడకపోతే స్కాట్లాండ్‌కు అవకాశం!

టి20 ప్రపంచ కప్‌లో తాము ఆడే మ్యాచ్‌లను భద్రతాకారణాలతో భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) చేస్తున్న డిమాండ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తుది నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యంలో మ్యాచ్‌ల వేదిక మార్పు సాధ్యం కాదని ఐసీసీ పదేపదే చెబుతున్నా... బీసీబీ మాత్రం తమ మంకు పట్టును వీడటం లేదు. దీంతో ఈ విషయంపై కఠినంగా వ్యవహరించాలని ఐసీసీ భావిస్తోంది. ఈ నెల 21న దీనిపై ఐసీసీ స్పష్టమైన ప్రకటన ఇవ్వనుంది. తాము వరల్డ్ కప్ ఆడాలా లేదా అనేది బంగ్లాదేశ్ ఆలోపు నిర్ణయం తీసుకోవాలని ఐసీసీ హెచ్చరించింది. లేదంటే టోర్నీ నుంచి బంగ్లాదేశ్‌ను తప్పించి ప్రస్తుత ఐసీసీ ర్యాంకింగ్స్ ప్రకారం తర్వాతి స్థానంలో ఉన్న స్కాట్లాండ్‌కు అవకాశం ఇస్తామని కూడా చెప్పేసింది. తమ గ్రూప్‌ను మార్చి ఐర్లాండ్ మ్యాచ్‌ల స్థానంలో శ్రీలంకలో మ్యాచ్‌లు ఆడించాలని బీసీబీ చేసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనకు కూడా అంగీకరించేది లేదని ఐసీసీ జవాబిచ్చింది. భారత్–శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న టి20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది.



భారత్ నెత్తిన మిచెల్ పిడుగు

- టీమిండియాపై చెలరేగిన న్యూజిలాండ్ బ్యాటర్
- కీలక ప్రదర్శనతో వన్డే సిరీస్‌ను గెలిపించిన ఘనత

130, 134, 17, 63, 84, 131 నాటౌట్, 137... భారత్‌పై గత 7 వన్డేల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డరైల్ మిచెల్ స్కోర్లు ఇవి. టీమిండియాపై మ్యాచ్ అనగానే చెలరేగిపోయే అతి తక్కువ మంది ఆటగాళ్ల జాబితాలో ఇప్పుడు అతను కూడా చేరాడు. మొత్తంగా భారత్‌పై ఆడిన 11 వన్డే ఇన్నింగ్స్‌లలో 4 సెంచరీలు, 2 అర్ధసెంచరీలు సహా ఏకంగా 74.10 సగటుతో అతను 741 పరుగులు సాధించాడు. ఏబీ డివిలియర్స్ ఒక్కడే భారత్‌లో భారత్‌పై ఇంతకంటే ఎక్కువ (5) సెంచరీలు నమోదు చేయగలిగాడంటే మిచెల్ ప్రదర్శన విలువను చెప్పవచ్చు. ఒంటిచేత్తో అతను తన టీమ్‌కు తొలిసారి భారత గడ్డపై వన్డే సిరీస్ అందించి కివీస్ హీరోగా మారాడు.

- సాక్షి క్రీడా విభాగం

భారత్‌లో భారత్‌పై మిచెల్ చెలరేగిపోవడం వెనక తీవ్ర సాధన, పట్టుదల ఉన్నాయి. 2023 వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా భారత్ లీగ్ మ్యాచ్, సెమీ ఫైనల్‌లలో రెండుసార్లూ వందకు పైగా స్ట్రయిక్ రేట్‌తో అతను శతకాలు బాదాడు. కానీ ఈ రెండు మ్యాచుల్లోనూ టీమిండియా అలవోక విజయాలు సాధించింది. ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీలో కూడా లీగ్ మ్యాచ్‌లో విఫలమైన తర్వాత ఫైనల్లో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు బరిలోకి దిగి అతను హాఫ్ సెంచరీ చేశాడు. అయితే పరిస్థితిని బట్టి బాగా నెమ్మదిగా ఆడిన మిచెల్ మన స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తీవ్రంగా తడబడ్డాడు. తన ఇన్నింగ్స్‌లోని 101 బంతుల్లో అతను 96 బంతులు స్పిన్నర్ల బౌలింగ్‌లోనే ఆడాడు! అయితే నలుగురు భారత స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోలేక 52 పరుగులే చేయగలిగాడు. ఈ మ్యాచ్‌లో కూడా కివీస్ ఓడింది.

సిరీస్‌కు సిద్ధమై...

భారత్‌తో వన్డే సిరీస్‌కు ముందు మిచెల్ అన్ని రకాలుగా సిద్ధమయ్యాడు. ఈసారి తాను వ్యక్తిగతంగా మెరుగైన ప్రదర్శన కనబర్చడమే కాదు. టీమ్‌ను కూడా గెలిపించాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. భారత్ తరహాలో నెమ్మదైన పిచ్‌లు ఉండే లింకన్, మౌంట్ మాంగనీలలో ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేశాడు. ముఖ్యంగా స్పిన్నర్లపై ఎదురుదాడికి చాలా మంది స్టార్ బ్యాటర్లు వాడే ఆయుధం 'స్వీప్ షాట్'ను గంటలకొద్దీ ఆడాడు. రివర్స్ స్వీప్‌ల సాధన దీనికి అదనం. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే మరో పద్ధతి ముందుకు దూసుకొచ్చి బౌలర్ మీదుగా లాఫ్టెడ్ షాట్ ఆడటం. రాజ్‌కోట్ వన్డేలో ఇది చాలా బాగా కనిపించింది. జడేజా, కుల్దీప్‌లను అతను అలవోకగా ఎదుర్కోవడంతో భారత్ సమస్య పెరిగింది. కుల్దీప్ తొలి ఓవర్లోనే సిక్స్‌తో మొదలు పెట్టిన మిచెల్ ...అతని బౌలింగ్‌లో ఆడిన 32 బంతుల్లో 50 పరుగులు రాబట్టడం విశేషం. కివీస్ ఇంత అలవోకగా లక్ష్యాన్ని ఛేదించడం దిగ్గజం సునీల్ గావస్కర్‌ను కూడా ఆశ్చర్యపర్చింది. వన్డేల్లో కుల్దీప్ ఒక సిరీస్‌లో ఇంత చెత్త ప్రదర్శన (60.66 సగటు) తొలిసారి నమోదు చేశాడంటే అందుకు మిచెల్ కారణం.

అన్ని ఫార్మాట్‌లలో...

న్యూజిలాండ్ జట్టులో మూడు ఫార్మాట్‌లలో రెగ్యులర్ సభ్యుడిగా ఉన్న ఆటగాళ్లలో మిచెల్ కూడా ఒకడు. ఏడాదిన్నర క్రితం భారత్‌పై 3–0తో క్లీన్‌స్వీప్ చేసిన టెస్టు టీమ్‌లో అతను కూడా ఉన్నాడు. అదే స్ఫూర్తితో తాము వన్డే సిరీస్ కూడా గెలవడం సంతోషానిచ్చిందని మిచెల్ చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో తన కెరీర్ ఆరంభంలో స్పిన్ ప్రదర్శనను అతను గుర్తు చేసుకున్నాడు. న్యూజిలాండ్‌తో పాటు జూనియర్ స్థాయిలో పెర్త్‌లో ఎక్కువగా క్రికెట్ ఆడిన మిచెల్‌కు స్పిన్ అంటే మొదటి నుంచీ సమస్యే. ఎప్పుడో 2013లో అండర్–19 జట్టు సభ్యుడిగా భారత్, శ్రీలంక పర్యటలకు వచ్చి ఘోరంగా విఫలమైన అనంతరం అతను మళ్లీ పోటీలోకి వచ్చేందుకు చాలా సమయం పట్టింది. దాదాపు ఏడేళ్ల కెరీర్‌లో ఇప్పటికి 184 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అతను తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. టీమ్‌లో ప్రస్తుతం కీలక సభ్యుడిగా ఎదిగిన మిచెల్... ఐపీఎల్‌లో ఒక సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు, మరో ఏడాది చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక్కడ ఆడటం మాత్రమే కాదు, భారీ సంఖ్యలో ప్రేక్షకుల మధ్యలో ఆడిన అనుభవం తన ఆటను రాటుదేల్చిందని చెప్పాడు.

ప్లే ఆఫ్స్‌కు బెంగళూరు

డబ్ల్యూపీఎల్‌లో వరుసగా ఐదో విజయం

- 61 పరుగులతో గుజరాత్‌పై గెలుపు
- మెరిపించిన గౌతమి నాయక్
- కూల్చేసిన సయాలీ, డిక్లెర్క్

వడోదర: బెంగళూరు... అదే జోరు! నవీ ముంబైలో ఇప్పటికే ముంబై, యూపీ, ఢిల్లీ, గుజరాత్ ఇలా డబ్ల్యూపీఎల్ ప్రత్యర్థులన్నింటిపై విజయాలు సాధించింది. ఇప్పుడు వేదిక వడోదరకు మారినా... రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తీరేం మారలేదు! రెండో రౌండ్ విజయాలనూ మొదలుపెట్టింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో సోమవారం జరిగిన పోరులో స్మృతి మంధాన సారథ్యంలోని ఆర్‌సీబీ 61 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. వరుసగా ఐదో విజయంతో బెంగళూరు జట్టు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గౌతమి నాయక్ (55 బంతుల్లో 73; 7 ఫోర్లు, 1 సిక్స్) దంచేసింది. రిచా ఘోష్ (20 బంతుల్లో 27; 3 సిక్స్‌లు) వేగంగా పరుగులు చేసింది. స్మృతి మంధాన (23 బంతుల్లో 26; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. జెయింట్స్ బౌలర్లలో కాశ్వీ గౌతమ్, ఆష్లే గార్డ్‌నర్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 117 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (43 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరిగా పోరాడింది. సయాలీ సత్‌గరే (3/21), నదిన్ డిక్లెర్క్ (2/17) చావుదెబ్బ తీశారు. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) గార్డ్‌నర్ (బి) రేణుక 1; స్మృతి మంధాన (ఎల్బీడబ్ల్యూ) (బి) గార్డ్‌నర్ 26; జార్జియా వోల్ (బి) కాశ్వీ 1; గౌతమి (బి) గార్డ్‌నర్ 73; రిచా ఘోష్ (సి) గార్డ్‌నర్ (బి) సోఫీ డివైన్ 27; డిక్లెర్క్ (నాటౌట్) 4; రాధ (సి) భారతి (బి) కాశ్వీ 17; శ్రేయాంక (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1–2, 2–9, 3–69, 4–138, 5–142, 6–170. **బౌలింగ్:** రేణుక 4–0–23–1, కాశ్వీ గౌతమ్ 4–0–38–2, ఆష్లే గార్డ్‌నర్ 4–0–43–2, హ్యాపీ కుమారి 1–0–10–0, సోఫీ డివైన్ 4–0–25–1, జార్జియా వేర్‌హామ్ 1–0–13–0, తనూజ 2–0–20–0. **గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్:** బెత్ మూనీ (బి) సయాలీ 3; సోఫీ డివైన్ (సి) వోల్ (బి) సయాలీ 0; అనుష్క (సి) రాధ (బి) డిక్లెర్క్ 18; కనిక (బి) బెల్ 0; ఆష్లే గార్డ్‌నర్ (సి) రావత్ (బి) సయాలీ 54; కాశ్వీ (బి) రాధ 4; జార్జియా వేర్‌హామ్ (సి) సయాలీ (బి) డిక్లెర్క్ 2; భారతి (సి) హారిస్ (బి) శ్రేయాంక 14; తనూజ (నాటౌట్) 11; రేణుక (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 117. వికెట్ల పతనం:** 1–3, 2–4, 3–5, 4–34, 5–48, 6–56, 7–97, 8–103. **బౌలింగ్:** లారెన్ బెల్ 4–1–23–1, సయాలీ 4–0–21–3, డిక్లెర్క్ 4–0–17–2, రాధ యాదవ్ 4–0–34–1, శ్రేయాంక 4–0–19–1.

జొకోవిచ్ 'సెంచరీ' – ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 100వ విజయం సాధించిన సెర్బియా టెన్నిస్ దిగ్గజం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అలాంటి సినిమా తీయాలనేది నా కల

- సుధాకర్ చెరుకూరి

''రెగ్యులర్ రవితేజగారి సినిమాల్లా కాకుండా పండగకి ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లాగా తీసుకురావాలనే ఉద్దేశంతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాన్ని ప్రారంభించాం. ఈ సినిమాని ప్రేక్షకులు అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్నారు. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కి సంక్రాంతి సీజన్‌లో డిమాండ్ ఉంటుందని ఈ సంక్రాంతితో మరోసారి రుజువైంది. సెకండ్ వీక్ నుంచి మా మూవీ రన్ ఇంకా అద్భుతంగా ఉండబోతోంది. ఇలాంటి సినిమాలు మరిన్ని చేయాలని ఉంది'' అని నిర్మాత సుధాకర్ చెరుకూరి తెలిపారు. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న రిలీజ్ అయింది. ఈ సందర్భంగా సోమవారం సుధాకర్ చెరుకూరి విలేకరులతో మాట్లాడుతూ–''సంక్రాంతి ప్రేక్షకుల ముందుకు రావాలనే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ని మొదలుపెట్టాం. కేవలం 65 రోజుల్లోనే అనుకున్న బడ్జెట్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. మా సినిమాకి ప్రేక్షకుల నుంచి చాలా అద్భుతమైన స్పందన వచ్చింది. అలాగే డిస్ట్రిబ్యూటర్స్, బయ్యర్స్ కూడా చాలా సంతోషంగా ఉండటం మాకు ఎంతో ఆనందంగా ఉంది. సంక్రాంతికి విడుదలైన 'ది రాజా సాబ్, మనశంకర వరప్రసాద్‌గారు, 'భర్త మహాశయులకు విజ్ఞప్తి, అనగనగా ఒకరాజు, నారీ నారీ నడుమ మురారి' సినిమాలన్నీ విజయం సాధించడం గొప్ప విషయం ఇది. ఈ సినిమా ప్రమోషన్స్‌కి రవితేజగారు, కిషోర్, డింపుల్ హయతి, ఆషిక... ఇలా అందరూ చాలా సపోర్ట్ చేశారు. ఇండస్ట్రీలో అందరూ గొప్పగా చెప్పుకునే సినిమా ఒకటి తీయాలనేది నా కల. ఆ కల 'ది ప్యారడైజ్' చిత్రంతో తీరిపోతుందనే నమ్మకం ఉంది. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే కలిసి చేస్తున్న సినిమా అద్భుతంగా వస్తోంది. నానిగారి 'ది ప్యారడైజ్' మూవీ తర్వాత చిరంజీవిగారి సినిమా మొదలుపెడతాం. అలాగే కిషోర్ తిరుమలగారి దర్శకత్వంలో ఒక లవ్ స్టోరీ చేయబోతున్నాం. నాకు 'అరుంధతి' లాంటి సినిమా చేయాలని ఉంది. అలాంటి కథపై ప్రయత్నాలు జరుగుతున్నాయి. నేను నిర్మించిన 'కేజేక్యూ' మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది'' అని చెప్పారు.

ఆకాశంలో ఒక తార

సాత్విక

దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. ఈ సినిమా ద్వారా సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఆమె నటించిన సాత్విక క్యారెక్టర్ టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో బహు భాషా నటుడిగా తనదైన గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన నటిస్తోన్న మరో డిఫరెంట్ మూవీ 'ఆకాశంలో ఒక తార'. చక్కని కథాంశంతో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు పవన్ సాధినేని. అర్థవంతమైన కథలను ఎంచుకునే దుల్కర్ సల్మాన్ అభిరుచికి తగ్గట్లు, డైరెక్టర్ పవన్ సాధినేని క్రియేటివిటీ కలిసి ఒక ప్రత్యేకమైన, గుర్తుండిపోయే సినిమాగా 'ఆకాశంలో ఒక తార' రూపొందుతోంది. ఇప్పటి వరకు మా సినిమా 80 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది వేసవిలో చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ సినిమాని తెలుగు, హిందీ, తమిళ్, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నాం'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్, కెమేరా: సుజిత్ సారంగ్.

అది నిజం కావాలి

- రష్మికా మందన్నా

''నా జీవితంలో జరిగిన ప్రతి విషయం నుంచి ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటాను'' అని హీరోయిన్ రష్మికా మందన్నా అంటున్నారు. నటిగా తన కథల ఎంపిక, పారితోషికం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు రష్మిక. ఆమె మాట్లాడుతూ–''హీరోయిన్‌గా ప్రేక్షకులకు వినోదాన్ని అందించడమే నా పని. ఎలాంటి భాషా పరమైన హద్దులు లేకుండా, అందరికీ నచ్చే చిత్రాలు చేయడానికే ప్రయత్నిస్తుంటాను. కొంతమంది ప్రేక్షకులకు లవ్‌స్టోరీ సినిమాలు ఇష్టం. ఇంకొంతమంది వాణిజ్య చిత్రాలను ఇష్టపడతారు. అందుకే కమర్షియల్, లవ్ స్టోరీ, ఉమెన్ సెంట్రిక్... ఇలా విభిన్న రకాల జానర్స్‌లో సినిమాలు చేస్తున్నాను. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం కోసమే వైవిధ్యమైన కథలను ఎంచుకుంటున్నాను. ఇకపై కూడా ఇలానే ముందుకు సాగుతాను. ఇక స్పెషల్ సాంగ్స్ చేయడంపైనా నాకు ఆసక్తి ఉంది. కాకపోతే ఆ చిత్రంలో నేనే హీరోయిన్‌గా ఉండాలి. లేదంటే.. ఇండస్ట్రీలో ఉన్న ఓ నలుగురు డైరెక్టర్స్ సినిమాల్లో మాత్రం లీడ్ రోల్ కాకపోయినా స్పెషల్ సాంగ్ చేస్తాను. అలాగే ఇండస్ట్రీలో ఎక్కువ పారితోషికం తీసుకునే నటిని నేనే అనుకుంటున్నారు.. అయితే ఇది నిజం కాదు. కానీ, అది నిజం కావాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు.

కొరియన్ కనకరాజు ఫిక్స్

వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న చిత్రానికి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారు మేకర్స్. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. జనవరి 19న వరుణ్ తేజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ మూవీకి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ని ఖరారు చేసి, గ్లింప్స్ ద్వారా రిలీజ్ చేసింది చిత్రయూనిట్. ''కొరియన్ కనకరాజు'లో వరుణ్ తేజ్ ఇంతకుముందెన్నడూ చేయని వైవిధ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమా కోసం కంప్లీట్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారాయన. రితికా నాయక్ చక్కని నటనతో ఆకట్టుకుంటారు. సత్య తనదైన టైమింగ్‌తో నవ్వులు పండిస్తారు. వినోదం, యాక్షన్, హారర్‌ని మేళవిస్తూ మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్నారు. ఈ వేసవిలో సినిమాని విడుదల చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఎస్. తమన్, కెమేరా: మనోజ్ రెడ్డి కాటసాని.

అన్ని అర్హతలు ఉన్న సినిమా ఇది

- నరేష్ వీకే

పవిత్ర, నరేష్, శ్రీవిష్ణు, విశ్వనాథ్, సజ్జన్

నరేష్ విజయ్ కృష్ణ (నరేష్ వీకే) ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'శుభకృత్ నామ సంవత్సరం'. ఎస్ఎస్ సజ్జన్ దర్శకత్వంలో ఎస్వీ పిక్చర్స్, అవిష్క డ్రీ ప్రొడక్షన్స్‌పై డీఆర్ విశ్వనాథ్ నాయక్ నిర్మిస్తున్నారు. సోమవారం జరిగిన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌కు హీరో శ్రీ విష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు, నిర్మాత రాజేష్ దండా, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అతిథులుగా హాజరై, ఈ సినిమా విజయం సాధించాలని మాట్లాడారు. ఈ సందర్భంగా నరేష్ వీకే మాట్లాడుతూ–''మంచి కంటెంట్, చాలా వేరియేషన్స్ ఉన్న చిత్రం ఇది. డ్రామా, సస్పెన్స్, ట్రావెల్ అద్భుతంగా ఉంటాయి. విజయం సాధించే అన్ని అర్హతలు ఈ చిత్రానికి ఉన్నాయి. చిత్ర పరిశ్రమలో నేను అడుగు పెట్టి 54వ ఏడాది ఇది. ఇప్పటికీ ఇంత బిజీగా ఉన్నానంటే నా హీరోలు, దర్శక–నిర్మాతలు, పెద్దవాళ్ల ఆశీర్వాదం'' అన్నారు. ''ఈ చిత్రంలో నరేష్‌గారు డిఫరెంట్ క్యారెక్టర్ చేస్తున్నారు'' అని చెప్పారు సజ్జన్. ''చాలా మంచి కథతో వస్తున్నాం'' అని పేర్కొన్నారు విశ్వనాథ్ నాయక్. ''ఈ సినిమాను తెలుగు, కన్నడ భాషల్లో చేయడం నాకు ఆనందాన్ని ఇచ్చింది'' అని పేర్కొన్నారు నటి పవిత్రా లోకేష్.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

'కాన్ సిటీ' పోస్టర్

అర్జున్ దాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కాన్ సిటీ'. హరీష్ దురైరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో అన్నా బెన్, యోగి బాబు, వడివుకరసి, చైల్డ్ ఆర్టిస్ట్ అకిలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవర్ హౌస్ పిక్చర్స్ నిర్మాణంలో రూపొందుతోన్న 'కాన్ సిటీ' టైటిల్, ఫస్ట్ లుక్‌ని డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ విడుదల చేశారు. ''మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో మనసుని హత్తుకునే కథాంశంతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'కాన్ సిటీ'. ఈ సినిమా చిత్రీకరణ 80శాతం పూర్తయింది. ఈ మూవీని తమిళ, తెలుగు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి: అరవింద్ విశ్వనాథన్, సంగీతం: సీన్ రోల్డాన్.

వినోదాల డుం డుం

సమంత, గవిరెడ్డి శ్రీను, బ్రిగిడా సాగా

'శుభం' మూవీ ఫేమ్ గవిరెడ్డి శ్రీను హీరోగా, బ్రిగిడా సాగా హీరోయిన్‌గా 'చీన్ టపాక్ డుం డుం' అనే మూవీ షురూ అయింది. వై.ఎస్. లోహిత్ దర్శకత్వంలో విలేజ్ టాకీస్ పతాకంపై శ్రీను నాగులపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు సోమవారం హైదరాబాద్‌లో జరిగాయి. దర్శకుడు మల్లిడి వశిష్ఠ కెమెరా స్విచ్చాన్ చేయగా, ముహూర్తపు సన్నివేశానికి నటి–నిర్మాత సమంత క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కి దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహించారు. దర్శకురాలు నందినీ రెడ్డి, రచయిత బీవీఎస్ రవి, గౌతమి కలిసి.. స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందించి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''ప్రేక్షకులను అలరించే పూర్తి వినోదాత్మక చిత్రం 'చీన్ టపాక్ డుం డుం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: పీఆర్.

అందమైన ప్రేమకథ

మృణాల్, సిద్ధాంత్

సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా నటించిన రొమాంటిక్ లవ్‌స్టోరీ సినిమా 'దో దివానే షహర్ మే'. ఈ చిత్రంలో జాయ్ సేన్‌గుప్తా, అయేషా రజా, విరాజ్ గెహ్లానీ, సందీప, దీప్రాజ్, అంచిత్ కౌర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. రవి ఉడయార్ దర్శకత్వంలో సంజయ్‌లీలా భన్సాలీ, ప్రేరణా సింగ్, ఉమేష్ కుమార్ భన్సాల్, భరత్ కుమార్ రంగ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 20న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. కాగా, సోమవారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 1977లో వచ్చిన హిందీ చిత్రం 'ఘరౌండా'లోని క్లాసిక్ సాంగ్ 'దో దివానే షహర్ మే' పాటతో ఈ సినిమా టీజర్ సాగుతుంది. ''ముంబై నేపథ్యంతో సాగే మోడ్రన్ లవ్‌స్టోరీ ఇది. పర్‌ఫెక్ట్‌గా లేని ఓ అమ్మాయి, అబ్బాయిల మధ్య జరిగే పర్‌ఫెక్ట్ లవ్‌స్టోరీగా ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	324	83,246
నిఫ్టీ ▽	109	25,585

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	23,515	▽	15
డోజోన్స్	49,359	▽	83
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,189	▽	45
డాక్స్	25,026	▽	270
షాంఘై	4,114	△	12
నికాయ్	53,584	▽	353

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.30	91.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	120.10	123.10
€	యూరో	ఎస్‌బీఐ	104.10	106.96
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.85	58.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	58.58	62.50
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	68.48	72.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.35	24.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.86	25.12
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.18	14.00

ఐఫోన్ అయితే వాడినా ఓకే

మొబైల్ మార్కెట్‌లో సైలెంట్ రివల్యూషన్

- రీఫర్బిష్డ్ ఫోన్లకు డిమాండ్
- కొత్త ఫోన్ల రేట్లు పెరుగుతుండటమే కారణం
- 2025లో రీఫర్బిష్డ్ మార్కెట్ 8 శాతం వృద్ధి

దేశీయంగా కొత్త డివైజ్‌ల రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో సెకండ్‌హ్యాండ్ స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ నెలకొంది. దీంతో రీఫర్బిష్డ్ ఫోన్ల మార్కెట్ గణనీయంగా విస్తరిస్తోంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రకారం 2025లో 7–8 శాతం మేర వృద్ధి చెందిన సెకండరీ మార్కెట్ ఈ ఏడాది కూడా అదే జోరు కనబర్చవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడుతుండటం, ఆన్‌లైన్–ఆఫ్‌లైన్ మాధ్యమాల ద్వారా నేరుగా కస్టమర్లకు మరింత అందుబాటు స్థాయిలో లభిస్తుండటంలాంటి అంశాలు రీఫర్బిష్డ్ ఫోన్ల విక్రయాలు పెరిగేందుకు దోహదపడగలవని పేర్కొన్నారు.

కొత్త వ్యూహాలు.. థర్డ్ పార్టీలు రీఫర్బిష్ చేసి, అమ్మే డివైజ్‌లలో నాణ్యత సరిగ్గా లేకపోవడం, రిటర్నులు ఎక్కువగా వస్తుండటంతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి దిగ్గజాలు గతేడాది ఈ విభాగం నుంచి తప్పుకున్నప్పుడు కొంతకాలం అమ్మకాలు నెమ్మదించినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సదరు ప్లాట్‌ఫాంలపై ఆధారపడిన విక్రేతల వ్యాపారం తాత్కాలికంగా దెబ్బతిందని వివరించాయి. దీనితో నేరుగా వినియోగదారులను చేరుకునే వ్యూహాలకు క్యాషిఫై, కంట్రోల్‌జెడ్‌లాంటి సంస్థలు పదును పెట్టాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను, ఆఫ్‌లైన్ రిటైల్ నెట్‌వర్క్‌లను విస్తరించాయి.

ప్రభావం ఇంకా తెలియడం లేదు.. చాలామటుకు బ్రాండ్స్ దగ్గర 60–90 రోజుల వరకు సరిపడేంత నిల్వలు ఉండటం వల్ల రేట్ల పెంపు ప్రభావం పూర్తి స్థాయిలో ఇంకా తెలియడం లేదు. కొత్త డివైజ్‌ల రేట్లు 15–20 శాతం పెరిగాయంటే చాలు, కోవిడ్‌కాలంలో లాగా రీఫర్బిష్డ్ ఫోన్లకు డిమాండ్ భారీగా పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అప్పట్లో సరఫరాపరమైన సవాళ్ల వల్ల కొత్త ఫోన్లకు కొరత ఏర్పడి, కొనుగోలుదార్లు సెకండ్‌హ్యాండ్ డివైజ్‌ల వైపు మళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం కూడా మెమరీ, చిప్‌ల వ్యయాలు పెరిగి కొత్త డివైజ్‌ల రేట్లు గణనీయంగా పెరుగుతున్నాయని క్యాషిఫై వర్గాలు వివరించాయి.

ఎంట్రీ లెవెల్ షాక్.. అత్యధిక మార్కెట్ వాటా ఉండే ఎంట్రీ లెవెల్ స్మార్ట్‌ఫోన్ల విభాగంలో రేట్ల పెంపు షాక్ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రూ. 10,000గా ఉన్న హ్యాండ్‌సెట్స్ రేటు వచ్చే ఆరు నెలల్లో దాదాపు 50 శాతం పెరిగి రూ. 15,000కు చేరొచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇదే అతి పెద్ద సెగ్మెంట్ కావడంతో తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని, దీనితో కస్టమర్లు రీఫర్బిష్డ్ డివైజ్‌ల వైపు డిమాండ్ మళ్లొచ్చని ఆశిస్తున్నట్లు వివరించాయి. అయితే, రేట్లు పెరగడమనేది మరో ప్రతికూల పరిణామానికి కూడా దారి తీయొచ్చని భావిస్తున్నారు. యూజర్లు తమ పాత డివైజ్‌లను మరింత కాలం అట్టే పెట్టుకునేందుకు ప్రాధాన్యతనివ్వొచ్చని, ఫలితంగా మార్కెట్లో సరఫరా తగ్గొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏటా అమ్ముడయ్యే ఫోన్లలో దాదాపు 50 శాతం డివైజ్‌లు రీఫర్బిష్డ్ లేదా ఎక్స్చేంజ్ మార్కెట్లోకి రావడానికి అనువైనవిగానే ఉంటున్నాయి. కానీ ఇందులో సగం మాత్రమే మార్కెట్లోకి వస్తున్నాయి. మిగతా వాటిని యూజర్లు నిరుపయోగంగా డ్రాలలో పడేయడమో లేక తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఇవ్వడమో చేస్తున్నారు. ఈ–వ్యర్థాలు, పాత డివైజ్‌ల విక్రయ విలువ గురించి అవగాహన లేకపోవడమే ఇందుకు కారణంగా ఉంటోంది.

ఐఫోన్లే కావాలి.. రీఫర్బిష్ చేసిన యాపిల్ ఐఫోన్లకు భారీగా డిమాండ్ నెలకొంది. వాటి లభ్యత కూడా పెరుగుతోంది. దీనితో 2019లో సుమారు 2 శాతంగా ఉన్న ఐఫోన్ల మార్కెట్ వాటా ఇప్పుడు 9 శాతానికి చేరుకుంది. రీఫర్బిష్డ్ సంస్థల మొత్తం అమ్మకాల్లో వీటి వాటా దాదాపు 60 శాతంగా ఉంటోందని పరిశ్రమ అంచనా. లేటెస్ట్ డివైజ్‌ల ప్రారంభ ధర ఎక్కువగా ఉండటంతో, యాపిల్ డివైజ్‌లను మొదటిసారిగా వాడే వారు, వేరే బ్రాండ్స్ బదులుగా దాదాపు అదే రేటుకో అంతకన్నా కాస్త తక్కువ రేటుకో లభించే పాత ఐఫోన్లనే తీసుకోవడంవైపు మొగ్గుచూపుతున్నారు. యాపిల్‌లో ఎంట్రీ లెవెల్ మోడల్ లేకపోవడంతో ఈ ధోరణి కొనసాగవచ్చని భావిస్తున్నారు. ఆండ్రాయిడ్‌లో ఏడాది, రెండేళ్ల పాత ఫోన్లతో పోలిస్తే నాలుగైదేళ్ల పాతబడ్డ యాపిల్ ఫోన్లకు కూడా డిమాండ్ బాగా ఉంటోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

– సాక్షి బిజినెస్ డెస్క్

హిందుస్తాన్ జింక్ లాభం హైజంప్

- క్యూ3లో రూ. 3,916 కోట్లు
- ఆదాయం రూ. 11,273 కోట్లు

ముంబై: వేదాంతా గ్రూప్ మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 46 శాతం జంప్ చేసి రూ. 3,916 కోట్లను తాకింది. ఇందుకు మెరుగైన కమోడిటీ ధరలు, ఉత్పత్తి పుంజుకోవడం, డాలరు బలపడటం దోహదపడ్డాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,678 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,832 కోట్ల నుంచి రూ. 11,273 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 5,305 కోట్ల నుంచి రూ. 6,068 కోట్లకు పెరిగాయి. పటిష్ట ఫండమెంటల్స్, నిర్వహణ సామర్థ్యాలను ప్రతిబింబిస్తూ క్యూ3 రికార్డ్ లాభాలు సాధించినట్లు కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా పేర్కొన్నారు. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఉత్పత్తిని సైతం సాధించినట్లు వెల్లడించారు. జింక్ తయారీ వ్యయాలు సైతం గత ఐదేళ్లలోనే అతితక్కువగా టన్నుకి 940 డాలర్లకు చేరినట్లు తెలియజేశారు. 2025 డిసెంబర్ 31కల్లా స్థూల పెట్టుబడులు, నగదు నిల్వలు రూ. 9,342 కోట్లకు చేరగా.. రూ. 9,013 కోట్ల రుణ భారం నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3.5 శాతం జంప్‌చేసి రూ. 660 వద్ద ముగిసింది.

వెండి@ రూ. 3 లక్షలు

- ఒక్క రోజులో ఏకంగా రూ. 10 వేలు అప్
- పసిడి మరో కొత్త రికార్డు
- రూ. 1,48,100కు జంప్

న్యూఢిల్లీ: దేశ, విదేశాల్లో భారీ డిమాండ్ దన్నుతో వెండి రేటు ఆగకుండా పరుగులు తీస్తూనే ఉంది. సోమవారం ఏకంగా రూ. 3 లక్షల మార్కును దాటేసి కొత్త రికార్డు సృష్టించింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ. 10,000 ఎగిసి రూ. 3,02,600 పలికింది. ఫ్యూచర్స్ మార్కెట్లోనూ సిల్వర్ జోరు కొనసాగుతోంది. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజీ (ఎంసీఎక్స్)లో వెండి ధర రూ. 16,438 పెరిగి రూ. 3,04,200 వద్ద ట్రేడయ్యింది. గత వారం రోజుల్లో సిల్వర్ ఫ్యూచర్స్ రేటు సుమారు 14 శాతం (దాదాపు రూ. 35,037) ఎగిసింది. ఇక 2026 ప్రారంభం నుంచి చూస్తే రూ. 68.499 మేర పెరిగింది. డిసెంబర్ 31న వెండి రేటు రూ. 2,35,701గా నమోదైంది.

పసిడి పరుగు.. సిల్వర్‌కి దీటుగా బంగారం ర్యాలీ కూడా కొనసాగుతోంది. 99.9% స్వచ్ఛత గల పది గ్రాముల పసిడి రేటు న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో రూ. 1,900 పెరిగి సరికొత్త రికార్డు స్థాయి రూ. 1,48,100కి చేరింది. ఎంసీఎక్స్‌లో రూ. 2,983 మేర పెరిగి రూ. 1,45,500 వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా కామెక్స్‌లో సిల్వర్ ఫ్యూచర్స్ మార్చ్ కాంట్రాక్టు రేటు ఔన్సుకి (31.1 గ్రాములు) 5.81 డాలర్లు పెరిగి 94.35 డాలర్లకు చేరింది. ఫిబ్రవరి డెలివరీ పసిడి ధర 102.6 డాలర్లు పెరిగి 4,698 డాలర్లకు ఎగిసింది.

ఎగదోస్తున్న అనిశ్చితి.. భౌగోళిక-రాజకీయ అనిశ్చితి కొనసాగుతుండటం, డాలరు బలహీనత, సరఫరాపరమైన ఆందోళన, ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ నెలకొనడం మొదలైన అంశాలు వెండి, పసిడి పరుగుకు కారణమవుతున్నాయని కొటక్ ఎంఎఫ్ ఫండ్ మేనేజర్ సతీష్ దొండపాటి చెప్పారు. గ్రీన్‌ల్యాండ్ వివాదం కారణంగా కొన్ని యూరప్ దేశాలపై అమెరికా టారిఫ్‌లు వేయడం కూడా రేట్లను ఎగదోస్తోందని పేర్కొన్నారు. పరిశ్రమల్లోనూ వినియోగించే వెండికి సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐ–డేటా సెంటర్లు తదితర రంగాల నుంచి గణనీయంగా డిమాండ్ నెలకొందని చాయిస్ బ్రోకింగ్ కమోడిటీ అనలిస్ట్ ఆమిర్ మక్డా తెలిపారు.

దెబ్బకొట్టిన బ్లూచిప్ షేర్లు

- సెన్సెక్స్ 324 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 109 పాయింట్లు మైనస్

ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(–3%), ఐసీఐసీఐ బ్యాంకు(–2.26%), ఎటర్నల్(–2%) షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్ నష్టపోయింది. అంతర్జాతీయ వాణిజ్య సుంకాల ఆందోళనలు, భౌగోళిక ఉద్రిక్తతలు, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనం సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 324 పాయింట్లు నష్టపోయి 83,246 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109 పాయింట్లు కోల్పోయి 25,585 వద్ద నిలిచింది. సూచీలు ఉదయమే బలహీనంగా ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఒక దశలో సెన్సెక్స్ 672 పాయింట్లు క్షీణించి 82,898 వద్ద, నిఫ్టీ 200 పాయింట్లు పతనమై 25,494 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. దిగువ స్థాయిల్లో ఎఫ్‌ఎంసీజీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంతవరకు నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి.

➤ భారత్ కోకింగ్ కోల్ ఇండియా షేరు లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.23)తో పోలిస్తే 97% ప్రీమియంతో రూ.45 వద్ద లిస్టయ్యింది. ఈక్విటీ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితుల ప్రభావంతో ఒక దశలో అమ్మకాల ఒత్తిడికి లోనైంది. చివరికి 77% లాభంతో రూ.41 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.18,935 కోట్లుగా నమోదైంది.

➤ రూపాయి విలువ జీవితకాల కనిష్ట ముగింపు స్థాయి(90.93)కి కేవలం మూడు పైసల దూరంలో నిలిచింది. డాలర్ మారకంలో సోమవారం 12 పైసలు బలహీనపడి 90.90 వద్ద స్థిరపడింది. మెటల్ దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌పై నాల్కో ఫోకస్

భువనేశ్వర్: ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, రెన్యువబుల్స్, ఎలక్ట్రిక్ వాహనాల్లో ఉపయోగించే ఇతరత్రా విలువైన ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్‌ఈఈ) విభాగాల్లోకి కూడా కార్యకలాపాలను విస్తరించే దిశగా ప్రభుత్వ రంగ నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా దేశీయంగా ఆర్‌ఈఈలు, మెగ్నీషియం, క్రోమైట్ బ్లాక్‌ల వేలంలో పాల్గొనే అవకాశాలను పరిశీలిస్తోంది. గనుల లాభదాయకత, వేలంలో పాల్గొనడానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను బిడ్ అడ్వైజర్ మదింపు చేస్తారని కంపెనీ సీఎండీ బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. అలాగే, జాయింట్ వెంచర్ ఖనిజ్ బిదేశ్ ఇండియా ద్వారా ఆస్ట్రేలియాలో లిథియం గనిలో వాటా కొనుగోలుపై కూడా కసరత్తు జరుగుతోందని ఆయన వివరించారు. దీనితో లిథియం దిగుమతులకు సంబంధించి హామీ లభిస్తుందని, అంతర్జాతీయంగా కొరత నెలకొన్న నేపథ్యంలో దేశీయంగా ఈవీ బ్యాటరీలు, రెన్యువబుల్స్‌కి సరఫరాను పెంచేందుకు ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత వృద్ధి అంచనాలను పెంచిన ఐఎంఎఫ్
పీఎన్‌బీ లాభం పటిష్టం

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

సెంట్రల్ యూనివర్సిటీల్లో యూజీకి మార్గం

» సీయూఈటీ-యూజీ 2026 షెడ్యూల్ విడుదల
» ఒకే ఎంట్రన్స్‌తో 48 కేంద్రీయ వర్సిటీల్లో ప్రవేశాలు
» ఆర్ట్స్, సైన్స్, హ్యూమానిటీస్ అభ్యర్థులకు చక్కటి అవకాశం
» తెలుగు రాష్ట్రాల్లో 6 యూనివర్సిటీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు

ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ట్రెడిషనల్ డిగ్రీ కోర్సులను.. ప్రముఖ వర్సిటీల్లో చదవాలనుకునే వారికి చక్కటి మార్గం.. సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)-యూజీ. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా.. దేశంలోని మొత్తం 48 కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోని బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. తాజాగా సీయూఈటీ-యూజీ 2026 నోటిఫికేషన్ వెలువడింది. 2026-27 విద్యా సంవత్సరంలో సెంట్రల్ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ప్రామాణికం కానుంది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ -యూజీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం 48 సెంట్రల్ వర్సిటీలు

సీయూఈటీ యూజీ స్కోర్ ఆధారంగా ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న 48 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇలా అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు ఒకే ఉమ్మడి పరీక్ష విధానం ఫలితంగా విద్యార్థులకు.. ఆర్థిక భారం, సమయాభావం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా సీయూఈటీలో ఎంచుకున్న పేపర్ ఆధారంగా ఏ ఒక్క డిగ్రీ గ్రూప్‌కో పరిమితం అవ్వకుండా.. అర్హత ఉన్న ప్రోగ్రామ్‌లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు

- 10+2/ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** ఎలాంటి వయో పరిమితి నిబంధన లేదు.

సీయూఈటీ-యూజీ ఇలా

సీయూఈటీ–యూజీ పరీక్ష మొత్తం 37 సబ్జెక్ట్/లాంగ్వేజ్ విభాగాల్లో జరుగుతుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానం(సీబీటీ)లో పరీక్ష నిర్వహిస్తారు. మొత్తంగా 13లాంగ్వేజ్‌లు, 23 డొమైన్ సబ్జెక్ట్స్, ఒక జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటాయి. అభ్యర్థులు లాంగ్వేజ్, జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ పేపర్స్‌తో కలిపి గరిష్టంగా అయిదు సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. ప్రతి టెస్ట్ పేపర్‌లో 50 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి ఒక గంట. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

టెస్ట్ సబ్జెక్ట్‌ల వివరాలు

- మొత్తం అందుబాటులో ఉన్న 37 లాంగ్వేజ్/డొమైన్/జనరల్ ఆప్టిట్యూడ్ సబ్జెక్ట్‌ల వివరాలు..
- ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాలం, మరాఠి, ఒడియా,పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ, అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయోలాజికల్ స్టడీస్/బయోటెక్/బయో కెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్,కెమిస్ట్రీ,ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్, ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోమ్‌సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇండియా, మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్, మ్యాథమెటిక్స్/అప్లైడ్ మ్యాథమెటిక్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ (యోగా, స్పోర్ట్స్), ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్.

వర్సిటీల స్వీయ ప్రవేశ విధానం

సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగా.. మలి దశలో సెంట్రల్ యూనివర్సిటీలు స్వీయ ప్రవేశ విధానాన్ని అనుసరిస్తాయి. ఈ స్కోర్‌తో విద్యార్థులు ఆయా సెంట్రల్ యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అందుబాటులో ఉన్న సీట్లు, సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేస్తారు.

ఇంటర్మీడియెట్‌లో 50 శాతం

సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో కనీసం యాభై శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందేలా చూసుకోవాలి. వాస్తవానికి సీయూఈటీ–యూజీకి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సరిపోతుందని ఎన్‌టీఏ వర్గాలు పేర్కొన్నాయి. కానీ..సెంట్రల్ యూనివర్సిటీలు మాత్రం మలి దశ ప్రవేశ ప్రక్రియ, దరఖాస్తు సమయంలో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి అని పేర్కొంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు ముందుగానే ఆయా వర్సిటీల ప్రవేశ అర్హతల నిబంధనలపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

తెలుగు రాష్ట్రాల్లో 6

- సీయూఈటీ యూజీ–2026 స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో మొత్తం 48 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశ అవకాశం లభిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో.. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీలు ఉన్నాయి.
- తెలంగాణలో.. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీల్లో సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నారు.
- వీటితోపాటు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఎన్‌ఐఐటీ యూనివర్సిటీ, బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ తదితర మరో 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలు కూడా సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగానే గత ఏడాది ప్రవేశాలు కల్పించాయి.

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

- జాతీయ స్థాయిలో నిర్వహించే సీయూఈటీకి లక్షల సంఖ్యలో పోటీ నెలకొంది. దీంతో అభ్యర్థులు మంచి స్కోర్ సాధించేందుకు ముందు నుంచే పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాల్సి ఉంటుంది.
- తొలుత పదో తరగతి, ఇంటర్మీడియెట్ అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి.
- డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌ల కోసం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయాలి.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా.. రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీపై పట్టు సాధించాలి.

జనరల్ టెస్ట్

ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థ గణిత అంశాలు, కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2026, జనవరి 30
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు
- **సీయూఈటీ–యూజీ పరీక్ష తేదీలు:** మే 11 నుంచి 31 వరకు
- **వెబ్‌సైట్:** https://cuet.nta.nic.in

విద్య, ఉద్యోగ సమాచారం

యూకో బ్యాంక్‌లో.. జనరలిస్ట్, స్పెషలిస్ట్ ఆఫీసర్స్

ప్రభుత్వ రంగ సంస్థ.. యూకో బ్యాంకు జనరలిస్ట్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా జేఎంజీఎస్-1, ఎంఎంజీఎస్-1 స్కేల్‌లలో రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 173
» **పోస్టుల వివరాలు:** ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్–30, ట్రెజరీ ఆఫీసర్–10, చార్టర్డ్ అకౌంటెంట్(జేఎంజీఎస్-1)–50, చార్టర్డ్ అకౌంటెంట్(ఎంఎంజీఎస్-2)–25, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్–05, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్–03, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్–03,సాఫ్ట్‌వేర్ డవలపర్–15,మురెక్స్ డవలపర్–05, ఫినాకల్ డవలపర్–05, క్లౌడ్ ఇంజనీర్–03, ఏఐ/ఎంఎల్ ఇంజనీర్–02, డేటా అనలిస్ట్–02, డేటా సైంటిస్ట్–02, డేటా సెక్యూరిటీ ఆఫీసర్–03, డేటా ప్రైవసీ కాంప్లియన్స్ ఆఫీసర్–02, డేటా అనలిస్ట్–03, డేటా సైంటిస్ట్–03, డేటా ఇంజనీర్–02.
» **అర్హతలు:** ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎమ్మెస్సీ/ఎంబీఏ/సీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** జేఎంజీఎస్ పోస్టులకు 20–30 ఏళ్లు, ఎంఎంజీఎస్ పోస్టులకు 22–35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు జేఎంజీఎస్ పోస్టులకు రూ.48,480–రూ.85,920; ఎంఎంజీఎస్ పోస్టులకు రూ.64,820–రూ.93,960 వేతన శ్రేణి లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాత పరీక్ష, స్క్రీనింగ్/గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 13.01.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 02.02.2026
» **వెబ్‌సైట్:** https://uco.bank.in., https://uco.bank.in/jobopportunities

సమీర్‌లో ప్రాజెక్టు ఇంజనీర్ పోస్టులు

భారత ప్రభుత్వ రంగ సంస్థ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన ముంబయిలోని సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్ (సమీర్).. ఒప్పంద ప్రాతిపదికన 147 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 147
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్టు ఇంజనీర్–71, ప్రాజెక్టు అసోసియేట్–05, ప్రాజెక్టు సైంటిఫిక్ అసిస్టెంట్–34, ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ (ఏ అండ్ బీ): 37.
» **విభాగాలు:** ఆర్ఎఫ్ అండ్ ఎండబ్ల్యూ, ఎలక్ట్రానిక్స్, సీఎస్/ఐటీ, సేఫ్టీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ హెచ్‌వీఏసీ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్, అట్మాస్ఫియరిక్ సైన్స్, మెడికల్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఐటీఐ సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణత ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్, ప్రాజెక్టు అసోసియేట్ పోస్టులకు రూ.34,000; ప్రాజెక్టు సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు రూ.23,500; ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ –ఏకు రూ.21,000; ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ బికు రూ.23,500.
» **వయసు:** ప్రాజెక్టు ఇంజనీర్, ప్రాజెక్టు అసోసియేట్ పోస్టులకు 28ఏళ్లు, ప్రాజెక్టు సైంటిఫిక్ అసిస్టెంట్, ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ ఏకు 25ఏళ్లు, ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు మించరాదు.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి రాత పరీక్ష/స్కిల్/ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.01.2026
» **వెబ్‌సైట్:** https://recruitment.sameer.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: భౌతిక శాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ భూగోళ శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్

కంటెంట్ క్రియేటర్లకు మొబైల్ ఫోనే ఆధారం

ప్రణాళిక, షూటింగ్, ఎడిటింగ్, పబ్లిషింగ్ సైతం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తృత వినియోగం



స్మార్ట్‌ఫోన్లోనే క్రియేటివిటీ

సామాజిక మాధ్యమాలు ప్రాచుర్యంలోకి వచ్చాక ప్రపంచ వ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చారు. టెక్ట్స్, ఇమేజ్, వీడియో, ఆడియో.. కంటెంట్ రూపం ఏదైనా క్రియేటర్లలో అత్యధికులకు సోషల్ మీడియానే జీవనాధారం. అయితే మొబైల్ ఫోన్ సాయంతో వీరు తమ క్రియేటివిటీని 'తెర'మీదకు తెస్తున్నారు. భారత్‌లో అయితే క్రియేటివ్ స్టూడియోలుగా ఈ చిన్న ఉపకరణం అవతరించడం విశేషం. పైగా వ్యాపారం, ఫాలోవర్లను పెంచుకునే లక్ష్యంగా కృత్రిమ మేధను సాధనంగా మలుచుకుంటున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్.. ప్రపంచ వ్యాప్తంగా ఈ సామాజిక మాధ్యమాల్లో 560 కోట్ల మంది విహరిస్తున్నారు. ఇక కంటెంట్ క్రియేటర్లు సుమారు 30 కోట్ల మంది ఉన్నట్టు అంచనా. వీరిలో మన దేశం నుంచి 10 కోట్ల మంది ఉంటారు. తద్వారా ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ క్రియేటర్లతో భారత్ టాప్‌లో నిలిచింది. ఫొటోలు, వీడియోలు తీయడానికే స్మార్ట్‌ఫోన్లను వీరు ఉపయోగిస్తారనుకుంటే పొరపడ్డట్టే. ప్రణాళిక, షూటింగ్, ఎడిటింగ్, పబ్లిషింగ్ సైతం ఫోన్లోనే కానిచ్చేస్తున్నారు. మన దేశంలో 80 శాతానికిపైగా క్రియేటర్లు పూర్తిగా స్మార్ట్‌ఫోన్ కేంద్రంగా తమ సృజనాత్మకతను ప్రపంచం ముందుకు తెస్తున్నారు. మొబైల్ ఫోన్లలోని ఫీచర్స్ మరింత శక్తివంతంగా, సహజంగా మారుతున్నాయి. దాదాపు 90 శాతం మంది రాబోయే కాలంలో మొబైల్ ఆధారిత కంటెంట్ పెంచాలని భావిస్తున్నారని సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎడోబ్ నివేదిక వెల్లడించింది.

వేగంగా పనులు..

వృద్ధి, సృజనాత్మకత, విస్తరణకు కీలక సాధనంగా జనరేటివ్ ఏఐ అవతరించింది. భారత్, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, యూరప్ సహా ప్రధాన మార్కెట్లకు చెందిన 16,000 మందికిపైగా క్రియేటర్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించింది. క్రియేటివ్ ఏఐని వేగంగా స్వీకరించే దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. జనరేటివ్ ఏఐ ఉత్పాదకత సాధనంగా మాత్రమే కాకుండా ఆదాయాన్ని పునర్నిర్మించే శక్తిగా భారతీయ క్రియేటర్లు భావిస్తున్నారు. పనులు వేగంగా పూర్తి చేస్తున్నట్టు చెబుతున్నారు.

అసాధ్యం సుసాధ్యం..

ప్రయోగ సాధనంగా మొదలై ప్రస్తుతం రోజువారీ కార్యాచరణగా జనరేటివ్ ఏఐ మారింది. సర్వేలో పాలుపంచుకున్న భారతీయ క్రియేటర్లు కంటెంట్ రూపకల్పనలో ఏదో ఒక రూపంలో జనరేటివ్ ఏఐని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. తమ వ్యాపారం, ఫాలోవర్ల సంఖ్య వృద్ధిని వేగవంతం చేయడంలో కృత్రిమ మేధ సహాయపడిందని 95% మంది వెల్లడించారు. ఇది అసాధ్యంగా ఉండే కంటెంట్‌ను సృష్టించడానికి వీలు కల్పిస్తుందని 85% మంది నమ్ముతున్నారు. ఆదాయం పెరుగుదల విషయంలో ఈ సాంకేతికత సానుకూల ప్రభావాన్ని చూపిందని 97% మంది భావిస్తున్నారు. కంటెంట్ రూపకల్పనలో తమదే తుది నిర్ణయమని, ఏఐ ఒక సహాయకారిగా మాత్రమే ఉంటుందన్నది వారి మాట.

విభిన్న ఏఐ టూల్స్

ఎడిటింగ్, నాణ్యత, కంటెంట్ మెరుగుదలకై అత్యంత సాధారణ వినియోగ సాధనంగా ఏఐ అవతరించింది. ఆలోచనల మెరుగు, మరింత విజువల్ ఎఫెక్ట్స్ కోసమూ వీటిని వాడుతున్నారు. ఒకే ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడటానికి బదులుగా కంటెంట్ క్రియేటర్లు విభిన్న జనరేటివ్ ఏఐ టూల్స్ ఉపయోగిస్తున్నారు. పదిలో తొమ్మిది మంది ఇటువంటి వారి జాబితాలో ఉండడం విశేషం. తమ సమ్మతి లేకుండా ఏఐ మోడళ్లకు శిక్షణ ఇవ్వడానికి వారి కంటెంట్ ఉపయోగించే అవకాశం ఉందని దేశీయ క్రియేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖర్చు, అస్థిరమైన అవుట్‌పుట్ నాణ్యత, ఏఐ మోడల్స్ ఎలా శిక్షణ పొందుతాయనే అంశంపై స్పష్టత లేకపోవడం విస్తృతస్థాయిలో ఏఐ స్వీకరణకు అతిపెద్ద అడ్డంకులుగా క్రియేటర్లు భావిస్తున్నారు.

డైట్ లెక్చరర్ల సీనియార్టీ తుది జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 13 డైట్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్ల సీనియార్టీ తుది జాబితాను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. తాత్కాలిక సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు పరిశీలించిన అనంతరం 20 మందితో తుదిజాబితా విడుదల చేసింది. వీరిని సీనియారిటీ ప్రకారం డైట్ ప్రిన్సిపల్స్, జిల్లా విద్యాశాఖ అధికారులుగా పదోన్నతి కల్పించనుంది.

2నుంచి ఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించిన ఆర్‌సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిబ్రవరి 2 నుంచి 6వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి తిరుపతిరావు సోమవారం తెలిపారు. ఆంధ్రా వర్సిటీ, శ్రీవేంకటేశ్వర, నాగార్జున, శ్రీపద్మావతి వర్సిటీ, జేఎన్‌టీయూ కాకినాడ, జేఎన్‌టీయూ అనంతపురంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. పూర్తి వివరాలను మంగళవారం ఏపీఆర్‌సెట్–2024, ఏపీ ఎస్‌సీహెచ్ఈ వెబ్‌సైట్‌లో పెడతామని పేర్కొన్నారు.

యువతిని మోసం చేసిన ఎస్ఐకి పదేళ్ల జైలుశిక్ష

గుంటూరు లీగల్: యువతిని మోసం చేసిన ఎస్ఐకి పదేళ్ల జైలు శిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ గుంటూరు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శరత్ బాబు సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం తుమ్రకోట గ్రామానికి చెందిన యువతి బీఎస్సీ నర్సింగ్ కోచింగ్ తీసుకుంటూ గుంటూరులో నివాసం ఉంటుంది. నగరంపాలెం పోలీసు స్టేషన్ ఎస్ఐగా కుంచాల రవితేజ విధులు నిర్వహించిన సమయంలో యువతిని ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన

బాధిత యువతి 2023 మే 20న నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఎస్ఐ కుంచాల రవితేజకు జైలు శిక్ష విధించి, యువతికి నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. బాధిత యువతి తరపున పబ్లిక్‌ప్రాసిక్యూటర్ షేక్ ముబీనా బేగం వాదనలు వినిపించారు. కాగా రవితేజ ప్రస్తుతం బాపట్ల జిల్లా అమృతలూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

- భయాందోళనకు గురవుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులు

కాగతి పాఠశాలలో క్షుద్రపూజల ఆనవాళ్లు

చౌడేపల్లె: అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలోని కాగతి ప్రాథమికోన్నత పాఠశాలలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. పాఠశాలలో 94మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. సంక్రాంతి సెలవులు ముగియడంతో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చారు. ఆదివారం రాత్రి మౌని అమావాస్య సందర్భంగా గ్రామంలోని కొందరు పాఠశాల వంట గది సమీపంలో ముగ్గుపోసి, నిమ్మకాయలు కోసి, తాంబూలం పెట్టి, అక్షింతలు, పసుపు, కుంకుమ చల్లి తాంత్రిక పూజలు చేసినట్లు గుర్తించి భయాందోళనకు గురయ్యారు. 6 నెలలుగా గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గదుల వరండాలో మల, మూత్ర విసర్జన చేయడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. గ్రామస్తులు, యువత సహకారంతో పాఠశాలకు సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

గాయపడ్డ పరిమి కోటమ్మ

చికిత్స పొందుతున్న ఎస్తేరురాణి

చికిత్స పొందుతున్న చినఅంకయ్య

వినుకొండ బస్టాండ్‌లో తొక్కిసలాట

- నలుగురికి తీవ్ర గాయాలు
- బస్సు ప్లాట్‌ఫాంపైకి వస్తుండగానే ఎక్కేందుకు వందలాది మంది ప్రయత్నం
- బస్సు డోరు తగిలి ఒకరిపై ఒకరు పడిపోయిన ప్రయాణికులు
- పండుగకు ప్రత్యేక బస్సులు లేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రయాణికుల ఆగ్రహం

వేలాది మంది ప్రయాణికులతో కిక్కిరిసిన వినుకొండ ఆర్టీసీ బస్టాండ్

ప్రభుత్వం, ఆర్టీసీ వైఫల్యం వల్లే...

సంక్రాంతి పండుగ సెలవుల అనంతరం ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా ప్రత్యేక బస్సులు నడపడంలో చంద్రబాబు ప్రభుత్వం, ఆర్టీసీ ఘోరంగా విఫలమయ్యాయని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. సెలవుల అనంతరం తీవ్ర రద్దీ ఉంటుందని తెలిసినా కూడా అదనపు సర్వీసులు నడపకపోవడం వల్లే వినుకొండ డిపోలో తొక్కిసలాట జరిగిందని ప్రయాణికులు మండిపడ్డారు.

వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ ఆర్టీసీ డిపోలో సోమవారం బస్సు ఎక్కేందుకు ఒకేసారి వందలాది మంది ప్రయాణికులు పోటీ పడటంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సంక్రాంతి సెలవులు ముగియడంతో సోమవారం ఉదయం దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు పెద్దసంఖ్యలో వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. పది గంటల సమయంలో వేలాది మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది. అదే సమయంలో ఆర్టీసీ గ్యారేజీ నుంచి విజయవాడకు వెళ్లే బస్సు ప్లాట్‌ఫాంకు వస్తుండగా.. ఒక్కసారిగా వందలాది ప్రయాణికులు గ్యారేజీ వైపునకు వెళ్లి బస్సు ఎక్కేందుకు ప్రయత్నించారు. బస్సు కదులుతూ ఉండగానే సీటు కోసం తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా డోరు తగిలి పలువురు ఒకరిపై ఒకరు కిందపడిపోయి తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ చిన్న అంకయ్య, నూజెండ్ల మండలం కొత్త నాగిరెడ్డిపల్లికి చెందిన పరిమి కోటమ్మకు చేతులు విరిగిపోయాయి. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ఎండపల్లికి చెందిన ఎస్తేరురాణి, పుల్లలచెరువు తండాకు చెందిన బాణావత్ మంత్రిబాయికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ప్రైవేటు వాహనంలో పట్టణంలోని వివిధ వైద్యశాలలకు తరలించారు.

ఎస్వీయూ తీరుపై ఉన్నత స్థాయి విచారణ చేయించండి

గవర్నర్‌కు పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ)లో అకడమిక్ కేలండర్ నిర్వహణ అస్తవ్యస్థంగా మారిందని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై గవర్నర్, వర్సిటీల చాన్స్‌లర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సోమవారం లేఖ రాసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం తెలిపారు. తన ప్రాథమిక బాధ్యతలను నిర్వర్తించడంలో ఎస్వీయూ విఫలమవుతోందని పేర్కొన్నారు. సెమిస్టర్ పరీక్షలు నిర్ణీత సమయానికి నిర్వహించడం లేదని, పరీక్షలు రాసిన 45 రోజుల్లోపు ఫలితాలివ్వాలనే నిబంధన ఉన్నా నెలల తరబడి వెల్లడించడం లేదని మండిపడ్డారు. వర్సిటీ వైఫల్యంతో పరీక్షల నిర్వహణ ఆలస్యమైనా, విద్యార్థుల నుంచి 'లేట్ ఫీజు' పేరుతో భారీ మొత్తంలో వసూలు చేస్తోందని పేర్కొన్నారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందని, వారి ఫలితాలు, సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. వర్సిటీ లోపాలతో ఫలితాలు ఆలస్యమైతే, విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించేలా లేదా తదుపరి ఫీజులో రాయితీ ఇచ్చేలా నిబంధనలు మార్చాలని కోరారు. పరీక్షల వాల్యుయేషన్, కోడింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంచాలని, వర్సిటీలో అవకతవకలు, వాల్యుయేషన్ ప్రక్రియపై ఉన్నత స్థాయి విచారణ చేయించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

విమానాల రాకపోకలకు పొగమంచు ఆటంకం

విమానాశ్రయం(గన్నవరం): కొన్నిరోజులుగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) పరిసరాల్లో కురుస్తున్న పొగమంచు కారణంగా విమానాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. సోమవారం కూడా రెండు విమాన సర్వీస్‌లు రద్దుకాగా, మరో నాలుగు ఆలస్యంగా నడిచాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు దట్టమైన పొగమంచు విమానాశ్రయ ప్రాంతాన్ని కప్పివేసింది. దీంతో న్యూఢిల్లీ నుంచి ఉదయం 9.30 గంటలకు వచ్చిన ఎయిరిండియా విమానం రన్‌వే విజిబులిటీ లేకపోవడంతో సుమారు అరగంట పాటు గాలిలో చక్కర్లు కొట్టింది. అనంతరం రన్‌వేపై సురక్షితంగా దిగింది. ఉదయం విశాఖపట్నం–విజయవాడ మధ్య తిరిగే రెండు విమాన సర్వీస్‌లను రద్దు చేశారు. చెన్నై నుంచి ఉదయం 7.10కు రావాల్సిన విమానం 11.20కు, హైదరాబాద్ నుంచి ఉదయం 7.10కు రావాల్సిన విమానం 10.52, బెంగళూరు నుంచి ఉదయం 9గంటలకు రావాల్సిన విమానం 10.58 గంటలకు వచ్చాయి. న్యూఢిల్లీ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరి వెళ్లింది. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగమంచు ప్రభావం తగ్గే వరకు విమానాల రాకపోకల్లో అంతరాయం కొనసాగుతుందని ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

యూరియా కొరత తీర్చాలి

• ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రస్తుత రబీ సీజన్‌లో అదునుకు, అవసరమైన యూరియా అందుబాటులో లేక రైతులు నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఎన్టీఆర్, నెల్లూరు, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల్లో యూరియా కొరత ఎక్కువగా ఉందన్నారు. వెంటనే యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగవ్వాలి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్యం, మంచినీటి వసతులు మరింత మెరుగవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ అన్నారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. హాస్టళ్లలో ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారమే ఆహారం వడ్డించాలని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళలకు భద్రతపై అవగాహన కార్యక్రమాల కోసం జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పోలీసు శాఖను ఆదేశించారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ఏపీ నుంచే తొలి నామినేషన్

సాక్షి, న్యూఢిల్లీ : బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి తొలి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగానే జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ మేరకు సోమవారం ఏపీ భవన్‌లో కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జాతీయ కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి మాధవ్ మీడియాతో మాట్లాడారు. అక్షర క్రమంలో భాగంగా తాము తొలి నామినేషన్‌ను వేయనున్నట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ పేరును ప్రతిపాదిస్తూ.. జాతీయ కౌన్సిల్ సభ్యులు 10 మంది, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సంతకాలతో కూడిన రెండు నామినేషన్ సెట్లను రిటర్నింగ్ అధికారి కె. లక్ష్మణ్‌కు అందజేయనున్నట్లు మాధవ్ తెలిపారు.

కడప 'ఇస్తేమా' కు రూ.1.25 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: కడపలో మూడు రోజులపాటు జరగనున్న ఇస్తేమా కార్యక్రమం ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా రూ.1.25 కోట్లు విడుదల చేసిందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొప్పర్తి పారిశ్రామికవాడ సమీపంలో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో జాతీయ స్థాయి తబ్లిగి జమాతే ఇస్తేమా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఇస్తేమాకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఐదు లక్షల మంది తరలివస్తున్నట్లు చెప్పారు.

ఏపీజెన్‌కో ఎండీగా పుల్లారెడ్డి అదనపు బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న పి.పుల్లారెడ్డి ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్‌గా సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) స్వీకరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సామర్థ్య అభివృద్ధి సంస్థ (ఏపీసీడ్కో) మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు చేపట్టారు.

'సర్వజన' కష్టాలు!

ఆసుపత్రిలో ఆగిపోయిన ఐపీ భవన నిర్మాణ పనులు

కర్నూలు పెద్దాసుపత్రిలో వరండాలోనే వైద్యం

- పూర్తికాని ఐపీ భవన నిర్మాణం
- ఏడాది ఆపరేషన్ థియేటర్లకు మరమ్మతులు
- వాయిదా పడుతున్న శస్త్రచికిత్సలు
- వార్డులు సరిపోక రోగుల ఇబ్బందులు
- నిధులివ్వని చంద్రబాబు ప్రభుత్వం

కర్నూలు (హాస్పిటల్): రోజూ వేలాది మంది పేదలకు వైద్యసేవలు అందించే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పెద్ద కష్టం వచ్చింది. రోగులు వరండాలో వైద్యం పొందాల్సిన దుస్థితి తలెత్తింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐపీ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. చంద్రబాబు సర్కార్‌లో 19 నెలలుగా ఒక్క ఇటుకా కదలడం లేదు. నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వలేదు. అలాగే కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వకుండా పరోక్షంగా బెదిరించి వెనక్కి పంపారు. భవన నిర్మాణం ఆగిపోవడంతో అవసరమైన వసతులు, సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు ఏడాదిన్నరగా ఇదిగో ప్రారంభిస్తామని చెబుతూ కాలం నెట్టుకొస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

వైద్యరంగానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాడు–నేడు కార్యక్రమం కింద రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సర్వజన వైద్యశాలలు, మెడికల్ కాలేజీలు అత్యున్నత స్థానంలో ఉంచేందుకు కృషి చేసింది. ఈ మేరకు కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలల అభివృద్ధికి రూ.500కోట్ల నిధులకు అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ ఇచ్చింది. ఇందులో రూ.350కోట్లు భవనాలకు, రూ.150కోట్లు పరికరాలకు కేటాయించింది. వీటిలో ఆసుపత్రిలో ఇన్ పేషంట్ డిపార్ట్‌మెంట్ భవనం(ఐపీ భవనం), అవుట్ పేషంట్ డిపార్ట్‌మెంట్, అధునాతన క్యాజువాలిటి, మాడరన్ మార్చురీ, బయోమెడికల్ వేస్ట్ షెడ్డు, కర్నూలు మెడికల్ కాలేజిలో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, లెక్చరర్ గ్యాలరీల నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో ఆసుపత్రిలో ఐపీ భవనం, మెడికల్ కళాశాలలో ఎగ్జామినేషన్ హాల్, లెక్చరర్ గ్యాలరీల నిర్మాణాలు ప్రారంభించారు.

దాతల కోసం ఎదురు చూపు

ఆసుపత్రిలోని ఐపీ భవనం నిర్మాణం ఆగిపోవడం, ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, పనులు తిరిగి ప్రారంభం కాకపోవడంతో అధికారులు, వైద్యులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగా భవనాన్ని పాక్షికంగానైనా పూర్తి చేయించేందుకు కార్పొరేట్ సంస్థలను సంప్రదించి సీఎస్ఆర్ కింద నిధులు కేటాయించాలని కోరేందుకు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. అలాగే ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సైతం నిధుల కోసం దాతలను సంప్రదించాలని చర్చిస్తున్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనిని దాతల సహాయంతో చేయించడమేమిటని మరికొందరు వైద్యులు నోరెళ్లబెడుతున్నారు. ఇది ఒక విధంగా ప్రభుత్వానికే తలవంపులు తెస్తుందని వారు భావిస్తున్నారు.

జనరల్ మెడిసిన్ వార్డులో వరండాలో చికిత్స పొందుతున్న రోగులు

ఒకవైపు నిర్మాణం... మరోవైపు నిధులు

గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో రెండేళ్ల సమయం కోవిడ్‌తో వెళ్లిపోయింది. మిగిలిన మూడేళ్లలో పనులను వేగంగా కొనసాగించారు. ఇందులో భాగంగా ఒకవైపు ఆసుపత్రిలో ఐపీ భవన నిర్మాణ పనులు వేగంగా సాగాయి. ఖర్చయిన రూ.60.5కోట్లలో రూ.42కోట్లు చెల్లించారు. ఇంకా రూ.18.5 కోట్లు మాత్రమే బకాయి ఉంది. దీంతో పాటు కళాశాలలో లెక్చరర్ గ్యాలరీకి, ఎగ్జామినేషన్ హాలుకు పనులు జరుగుతుండగానే బిల్లులు చెల్లించారు.

నిర్మాణాలకు 'చంద్ర' గ్రహణం

చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి వరకు వేగంగా సాగుతున్న నిర్మాణ పనులు అర్ధరంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వంలో కొనసాగిన నిర్మాణాలు వెంటనే ఆపేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఐపీ భవనంతో పాటు మెడికల్ కాలేజిలో ఎగ్జామినేషన్ హాలు, లెక్చరర్ గ్యాలరీ నిర్మాణాలు ఆగిపోయాయి. ఐపీడీకి రూ.21కోట్లు, లెక్చరర్ గ్యాలరీకి 2.95కోట్లు, ఎగ్జామినేషన్ హాలుకు రూ.79లక్షలు బిల్లులు బకాయిలు మిగిలాయి. వీటితో పాటు పనులు పూర్తయిన కాలినరోగుల వార్డుకు రూ.50లక్షలు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.5కోట్లు, ఆపరేషన్ థియేటర్ మరమ్మతులు రూ.35లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదిగా అడుగుతున్నా ఇప్పటి వరకు ఈ నిధులు విడుదల చేయలేదు. ఒక్క పనీ తిరిగి ప్రారంభం కాలేదు. ఈ విషయమై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆసుపత్రి అధికారులు ప్రతి సమావేశంలో చెబుతున్నా ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. ఏడాదిన్నర దాటినా ఇందుకు సంబంధించి ఒక్క పనీ పునఃప్రారంభం కాలేదు. గత హెచ్‌డీఎస్ సమావేశంలో ప్రస్తావన వచ్చినా పక్కకు పెట్టేశారు.

ఆగిపోయిన లెక్చరర్ గ్యాలరీ పనులు

ఇవీ ఇబ్బందులు

- ఆసుపత్రిలో ఐపీడీ భవనం నిర్మాణం చేసేందుకు అప్పట్లో ఆపరేషన్ థియేటర్లు, పోస్టు ఆపరేటివ్ విభాగాలు, జనరల్ మెడిసిన్ విభాగాలు, సర్జికల్ వార్డులు, డ్రగ్స్, సర్జికల్ స్టోర్, ఆక్సిజన్, ఇతర స్టోర్‌లను ఇతర విభాగాల్లో సర్దుబాటు చేశారు. ప్రస్తుతం ఇవన్నీ వసతులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- జనరల్ మెడిసిన్ విభాగంలో కొంత భాగం ట్రామాకేర్ భవనంలో సర్దుబాటు చేశారు. అక్కడ వసతులు సరిపోక ఆరుబయట, వరండాలో పడకలు వేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు.
- ఆపరేషన్ థియేటర్లు మరమ్మతులు చేస్తుండటంతో రోగులకు సకాలంలో శస్త్రచికిత్సలు జరగడం లేదు. ఈ విషయమై జిల్లా కలెక్టరే ప్రత్యేకంగా దృష్టి సారించినా పనులు ముందుకు సాగడం లేదు.
- న్యూరోసర్జరీ విభాగం రోగులకు ఎంసీహెచ్ భవనంలో ఉండే ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీలు జరగాల్సి ఉండటంతో రోగులను తరలించే సమయంలో నరకయాతన అనుభవిస్తున్నారు.
- డ్రగ్ స్టోర్ అయితే ఒక్కో విభాగం ఒక్కో మూలకు ఉండటంతో సిబ్బంది అటూ ఇటూ తిరగలేక ముప్పుతిప్పలు పడుతున్నారు.

ఐపీ భవనం పూర్తి చేయాలని కోరుతున్నాం

ఆసుపత్రిలో ఐపీ భవనం నిర్మాణం ఆగిపోవడంతో ఇబ్బందులు అంతా ఇంతా కాదు. దీనివల్ల అటు రోగులు, ఇటు వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనరల్ మెడిసిన్, సర్జికల్, డ్రగ్ స్టోర్, వాహనాల పార్కింగ్, ఆపరేషన్ థియేటర్లకు స్థలం లేక అవస్థలు పడుతున్నాం. ఐపీ భవనం పూర్తయితే ఈ సమస్యలన్నీ తీరిపోతాయి. భవనం పూర్తి చేయాలని ఆసుపత్రి, కళాశాలల్లో నిర్వహించే పలు సమావేశాలు, కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను కోరుతున్నాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

తుది దశకు ధాన్యం కొనుగోళ్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం సేకరణపై ఆయన సోమవారం విజయవాడలో పౌరసరఫరాల సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు వంటి కొన్ని జిల్లాల్లో ఇంకా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నట్లు వివరించారు. ఈ సీజన్‌లో గుర్తించిన లోపాలపై సమీక్షించి వచ్చే రబీలో ధాన్యం సేకరణకు తగిన విధంగా సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ ఎండీ ఎస్.ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు 104 తరహాలో వైద్యసేవలు : మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి/రామవరప్పాడు : రాష్ట్రంలో పశుపోషకులకు లబ్ధి చేకూర్చేలా 104 తరహాలో మొబైల్ అంబులేటరీ వాహన సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు పశుసంవర్ధక శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. గన్నవరం, మైలవరం, తిరువూరు, నందిగామ, పెనమలూరు నియోజకవర్గాలకు కేటాయించిన గ్రామ సందర్శన కార్యక్రమ వాహనాలను సోమవారం విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో జెండా ఊపి మంత్రి అచ్చెన్న ప్రారంభించారు. అనంతరం విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి రైతులతో మాట్లాడారు. ఈ నెల 19 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,254 పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కమీషన్ల కక్కుర్తితో అర్హతల్లేని సంస్థలకు పెద్దపీట

- అధిక ధరలకు వైద్య పరికరాల కొనుగోళ్లలో అక్రమాలెన్నో
- అమ్మకం, పంపిణీ లైసెన్స్‌లేని కంపెనీ వ్యాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్ల కొనుగోలుకు నిర్ణయం

సాక్షి, అమరావతి: వైద్య పరికరాల కొనుగోళ్లలో పెద్దఎత్తున కమీషన్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోంది. కమీషన్లు ముట్టజెప్పేలా డీల్ కుదుర్చుకున్న సంస్థలపై వచ్చిన ఆరోపణలన్నింటినీ తొక్కిపెట్టడంతో పాటు, అర్హతలను పరిశీలించడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కంటే రెండు రెట్ల అధిక ధరకు వ్యాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్ల కొనుగోళ్ల వ్యవహారంలోనూ భారీ అవకతవకలు ఉన్నాయని తెలుస్తోంది. తయారీ సంస్థ మెడిసిల్ గతంలో రూ.1.04 లక్షలకు సరఫరా చేసిన పరికరాన్ని ఏకంగా రూ.3.13 లక్షలకు కొనుగోలు చేయడం ద్వారా భారీ మొత్తంలో కమీషన్లు పొందేలా ఉన్నతాధికారులు, నేతలు స్కామ్‌కు తెరలేపారు. అయితే, ఈ కంపెనీకి సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) జారీచేసే క్లాస్–ఏ, బీ వైద్య పరికరాల అమ్మకం, పంపిణీ లైసెన్స్ లేదని విశ్వసనీయ సమాచారం. కేవలం టెస్టింగ్ నిమిత్తం వైద్య పరికరాల తయారీ లైసెన్స్ మాత్రమే ఆ సంస్థకు సీడీఎస్‌సీఓ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. కోరినంతా కమీషన్లు వస్తున్నాయనే కారణంతో తయారీ సంస్థ అర్హతలను కూడా వైద్య శాఖాధికారులు పరిగణలోకి కూడా తీసుకోలేదన్న విమర్శలు హోరెత్తుతున్నాయి.

ఇతర పరికరాల విషయంలోనూ ఇంతే..

అంతేకాక.. వ్యాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్లు సరఫరా కాంట్రాక్టు దక్కించుకున్న విశాఖ హెల్త్‌కేర్ సంస్థకు ఇతర పరికరాల విషయంలోను అధికారులు అడ్డదారుల్లో మేలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వైద్య కళాశాలలకు వివిధ పరికరాల కోసం గతేడాది టెండర్లు పిలిచిన ఎంఎస్ఐడీసీ అధికారులు చిన్న పిల్లల నాసల్ కాన్యులా సరఫరాకు ఓ సంస్థ బిడ్ వేయగా, సదరు ప్రొడక్టు చైనా మేక్ అంటూ ఆ బిడ్‌ను తిరస్కరించారు. కానీ, గుండెపోటు, శ్వాసకోశ వైఫల్యం వంటి అత్యవసర సమయాల్లో రోగులకు ఆక్సిజన్ సరఫరా కోసం వాడే అంబుబ్యాగ్‌లను చైనా తయారీ రకాన్ని సరఫరా చేసే విశాఖ హెల్త్‌కేర్ బిడ్‌ను మాత్రం ఆమోదించారు. దీంతో పాటు.. ఈఎన్‌టీ వైద్యసేవల్లో వాడే లారింగోస్కోపి సరఫరాకు సంబంధించి సదరు సంస్థ చూపిన పూర్వ అనుభవం సర్టిఫికెట్ల పైనా తీవ్రమైన ఫిర్యాదులొచ్చాయి. వీటన్నింటినీ ఎంఎస్ఐడీసీ అధికారులు తొక్కిపెట్టారన్న ఆరోపణలున్నాయి.

వచ్చేనెల 9న వైద్య మండలి ఎన్నికలు

సాక్షి, అమరావతి : రాష్ట్ర వైద్య మండలి (ఏపీ మెడికల్ కౌన్సిల్)లో 13 మంది సభ్యుల ఎన్నిక కోసం వచ్చేనెల 9న ఓటింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్), ఎన్నికల నిర్వహణాధికారి చక్రధర్‌బాబు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సోమవారం ఆయన మీడియాకు వెల్లడించారు. 55,504 మంది వైద్యులకు ఇందులో ఓటు హక్కు ఉందన్నారు. వీరు ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా ఓటు వేయొచ్చని తెలిపారు. కౌన్సిల్ సభ్యత్వం ఉండి.. రాష్ట్రంలో ఐదేళ్లు పైబడి ఉన్న వైద్యులు పోటీకి అర్హులన్నారు. ఇక ఎన్నికల్లో పోటీచేయాలనుకునే వారు ఈనెల 27లోపు నామినేషన్ దాఖలు చేయాలని.. 28, 29 తేదీల్లో ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు.

రెవెన్యూ వ్యవస్థలో ప్రక్షాళన అవసరం: బీజేపీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలో ప్రక్షాళన అవసరమని బీజేపీ రాష్ట్ర శాఖ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేరుతో పార్టీ కార్యాలయం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. రెవెన్యూ సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని మాధవ్ ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములు రీసర్వే చేసి సంవత్సరం పూర్తి అయినా ఆన్‌లైన్ చేయక పోవడం వల్ల భూముల క్రయ, విక్రయాలు నిలిచి పోయాయనీ, ఈ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మనసు దోచే జలపాతాలు

వైఎస్సార్‌సీపీ పాలనలో రోప్ వే బ్రిడ్జిల కోసం రూ.60 లక్షల కేటాయింపు


మండలంలోని ఉప్పరిల్ల సమీపంలోని జలపాతం

రెడ్డికుంకాల సమీపంలోని జలపాతం

• పశ్చిమ మన్యంలో ఆకట్టుకుంటున్న అందాలు

బుట్టాయగూడెం: పశ్చిమ గోదావరి ఏజెన్సీ ప్రాంతంలో అనేక అద్భుత జలపాతాలు ఉన్నాయి. బయట ప్రపంచానికి తెలిసినవి కొన్ని మాత్రమే ఉండగా తెలియనివి అనేకం ఉన్నాయి. ప్రకృతి ప్రేమికుల మదిని దోచే కొండకోనలు ఈ ప్రాంతం సొంతం. ప్రభుత్వాలు, పాలకులు ఈ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే ఆదాయంతోపాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మన్యంలో అద్భుత జలపాతాలు

బుట్టాయగూడెం మండలం ముంజులూరు సమీపంలో ఏనుగుతోగు జలపాతం, ఉప్పరిల్ల జలపాతం, పాపికొండల అభయారణ్యంలో జలతారు వాగు జలపాతాలు బయట ప్రపంచానికి తెలిసినవి. ఈ జలపాతాలకు వారాంతంలో, పండుగల పర్వదినాల్లో పర్యాటకులు తరలివస్తారు. బయట ప్రపంచానికి తెలియని అనేక జలపాతాలు ఉన్నాయి. గిన్నేపల్లి, గడ్డపల్లికి మధ్యలో సాగరాల వాటర్‌ఫాల్స్, పోలవరం మండలం రెడ్డికుంకాల సమీపంలోని జలపాతంతో పాటు అటవీ ప్రాంతంలో అనేక జలపాతాలు ఉన్నాయి.

పర్యాటక ప్రదేశాల్లో కనిపించని అభివృద్ధి

ఏజెన్సీ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలకు వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చి సందడి చేస్తున్నప్పటికీ ఆయా ప్రదేశాల్లో ఎలాంటి అభివృద్ధి లేదు. దీంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళా పర్యాటకుల ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వం, పాలకులు పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

రోప్ వే బ్రిడ్జిల ఏర్పాటుకు నిధుల మంజూరు

బుట్టాయగూడెం మండలం మారుమూల అటవీప్రాంతంలో ఉన్న ఏనుగుతోగు జలపాతానికి సందర్శకులు ఎక్కువగా వస్తుంటారు. ముంజులూరు శివారు నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. రహదారి వెంట పచ్చని చీర పరిచినట్లుగా అడవి తల్లి అందాలు కనువిందు చేస్తుంటాయి. రహదారి పొడవునా ఒకే కొండకాల్వ 9 సార్లు కనిపిస్తుంది. ఈ కాల్వపై సుమారు 9 రోప్ వే బ్రిడ్జిల ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.40 లక్షలు మంజూరు చేసింది. జలపాతం సమీపంలో మహిళలు దుస్తులు మార్చుకోవడానికి రూంలు, మరుగుదొడ్ల ఏర్పాటుకు మరొక రూ.20 లక్షలు మంజూరు చేసింది. టెండర్‌లు పిలిచే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు నిలిచాయి.

ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం

ముంజులూరు జలపాతంకు వెళ్ళే దారిలోని కాల్వ

పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చేయాలి

పశ్చిమ మన్యం ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం, పాలకులు కృషి చేయాలి. ఈ ప్రదేశాలను చూసేందుకు ఇప్పటికే వేలాదిమంది పర్యాటకులు ఈ ప్రాంతానికి వస్తున్నారు. అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి.

– షేక్ ముత్తూ సాహెబ్, పులిరామిడుగూడెం, బుట్టాయగూడెం మండలం

మనసు దోచే అందాలు

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో మనసు దోచే జలపాతాలతోపాటు ఎత్తైన కొండలు, అడవితల్లి అందాలు, పర్యాటకులకు మధురానుభూతిని కలిగిస్తాయి. ఈ ప్రాంతానికి సెలవురోజుల్లో, ప్రతి ఆదివారం అనేక మంది పర్యాటకులు వస్తుంటారు. వీటిని అభివృద్ధి చేసి వసతులు కల్పిస్తే ప్రభుత్వానికి ఆదాయంతోపాటు ఈ ప్రాంత యువకులకు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి.

– కొండేపాటి రామకృష్ణ, బుట్టాయిగూడెం

సాక్షి ప్లస్ హెల్త్
మంగళవారం ॥ 20-1-2026

వీకెండ్ అన్నది ఎప్పుడూ సంతోషదాయకమూ, ఆనందకరమే కాకపోవచ్చు. శని, ఆదివారాలు ఎలాగూ సెలవురోజులేగా కాస్తంత ఎంజాయ్ చేద్దాం అనే భావన ఒక్కోసారి ఆరోగ్యానికి చేటు తెచ్చిపెట్టవచ్చు. అందుకే వాటిని వీకెండ్ సమస్యలుగా చెబుతుంటారు. అయితే అవి తప్పకుండా వీకెండ్ రోజుల్లోనే వస్తాయని కాదు... ఎప్పుడైనా రావచ్చుగానీ... వీకెండ్ రోజుల్లో దొరికే సెలవల కారణంగా శని, ఆదివారాల్లో సదరు ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చేందుకు అవకాశమున్నందున వాటిని వీకెండ్ ఆరోగ్య సమస్యలుగా చెబుతుంటారు. అంతేకాదు... వాటిల్లో కొన్నింటికి వారాంతపు రోజైన 'శాటర్ డే' పేరు కూడా ఉండటం విశేషం. అలా వారాంతపు వ్యవహారాలతో వచ్చే ఆరోగ్య సమస్యలేమిటి, వాటికి పరిష్కారాలేమిటన్న విషయాలేమిటో చూద్దాం...

● వారాంతపు వేడుకలో జాగ్రత్త

హెల్త్‌కిది... వీక్... ఎండ్!

సాధారణంగా వారంలోని మిగతా రోజుల్లో ఆఫీసు పనులూ లేదా బిజినెస్ పనుల మీద అందరూ బిజీగా ఉంటారు. ఇక ఆదివారం రోజు సెలవు కావడంతో శనివారం నుంచే రిలాక్స్ కావడాన్ని చాలామంది మొదలుపెడుతుంటారు. దాంతో మర్నాడు సెలవే కదా అన్న ఉద్దేశంతో కాస్త ఆటవిడుపు ఫీలవుతుంటారు. దాంతో వీకెండ్ పేరిట ఉన్న కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను తెలుసుకుందాం.

పెద్దల్లో (అడల్ట్స్‌లో) వచ్చే సమస్యలివి...

శాటర్‌డే నైట్ పాల్సీ : రాత్రి కుర్చీలో కూర్చుని అతిగా మద్యం తాగుతూ ఉండి అలాగే నిద్రపోయే అవకాశాలెక్కువ. అలాంటప్పుడు తల బరువంతా భుజం మీద ఆనడం... నిద్రకారణంగా ఆ బరువు చాలాసేపు అలాగే ఉండటంతో చేతి ప్రధాన నరమైన.. 'రేడియల్ నర్వ్'పై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. దాంతో అది చచ్చుబడినట్లుగా అవు



తుంది. ఇది కూడా ఒక రకం నరాలకు సంబంధించిన సమస్య (న్యూరోపతి)గా చెప్పవచ్చు. అయితే పేరును బట్టి ఇది కేవలం శనివారం రాత్రి మద్యం తీసుకున్నందు వల్ల వచ్చే పరిణామం మాత్రమే కాదు. నిజానికి ఏ రోజైనా రావచ్చు. కానీ వీకెండ్‌లో 'మద్యం పార్టీలు' ఎక్కువగా నిర్వహించుకుంటూ ఉంటారు కాబట్టి ఈ సమస్యకు 'శాటర్‌డే నైట్ పాల్సీ' లేదా 'శాటర్ డే నైట్స్ పెరాలసిస్' అని పేరు.

అల్నార్ పాల్సీ : వారాంతం వరకు కంప్యూటర్ మీద చాలా ఎక్కువ సేపు పనిచేయడం వల్ల వారాంతానికి వేళ్లను కదపడానికి

కూడా వీల్లేనంత బలహీనంగా మారిపోతాయి. ఇలా వారాంతం వరకు పనిచేయడం వల్ల ముఖ్యంగా చేతి వేళ్లలో బలహీనంగా ఉండేవైన చిటికెనవేలు, ఉంగరపు వేళ్లు కదల్లేనంతగా అలసిపోవచ్చు. అవి తిమ్మిరిగా ఉండి, మొద్దుబారి, పనిచేయలేని స్థితికి చేరితే ఆ కండిషన్‌ను అల్నార్ పాల్సీ అంటారు.

ఫుట్ డ్రాప్ : అలా అదేపనిగా కూర్చుని ఉండటంతో కాలిని కదిలించలేని కండిషన్‌తో పాటు కాలి వేళ్ల చివర తిమ్మిరి, మొద్దుబారినట్లుగా ఉండే కండిషన్‌ను ఫుట్‌డ్రాప్ అంటారు. సాధారణంగా డాక్టర్లు వీటిని శనివారం సమస్యలుగా పేర్కొంటుంటారు.

ఇక పెద్దల్లో మద్యం అలవాటుతో...

ఇప్పుడు వారాంతం వస్తే చాలు దాదాపుగా అన్ని రకాల కుటుంబాలూ బయటే తినడానికే ఆసక్తి చూపుతుంటారు. ఇక ఐటీ రంగానికి చెందిన ఉద్యోగులు తమ తమ బిజీ ఉద్యోగాల్లోంచి ఆటవిడుపుకోసం బయట తినడానికి మొగ్గు చూపుతుంటారు. దీంతోపాటు మునపటితో పోలిస్తే ఇటీవల వీకెండ్ మద్యం పార్టీలు మరీ ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ వారాంతపు ఆరోగ్యపు అనర్థాలతో చాలా వరకు ఆల్కహాల్‌తోనే వస్తుండటం విశేషం.

ఆల్కహాల్‌తో అంతా అనర్థమే:

మితిమీరిన ఆల్కహాల్ చేటు చేస్తుందని తెలిసినప్పటికీ శనివారాలు మద్యం తీసుకునేవారి సంఖ్య తక్కువేమీ కాదు. పైగా ఇందుకు ఓ సాకు / జస్టిఫికేషన్ కూడా ఉంటుంది. ''మనం మద్యం తీసుకునేది వీకెండ్ రోజే కదా... సోమవారం రోజు ఆఫీసు ఉంటుందనే కారణంతో ఆదివారమూ రిలాక్స్ కాలేము కదా'' అంటూ శనివారాలు చాలామంది మద్యం పార్టీలు పెట్టుకుంటూ ఉంటారు. మర్నాడు ఎలాగూ ఆదివారమే కదా అంటూ చాలామంది పెద్దగా పరిమితి కూడా పాటించరు.

ఆల్కహాల్ కారణంగా దాంతో ముడిపడిన అనేక సమస్యలు కనిపిస్తుంటాయి. ఆల్కహాల్ రక్తంలో కలుస్తుండగానే అది రక్తపోటును, నాడీ వేగాన్ని (పల్స్ రేటును) పెరిగేలా చేస్తుంది. ఈ రెండు అంశాలూ... గుండెకు ముప్పు తెచ్చిపెట్టేవే. ఒక కరంగా చూస్తే గుండెపోటు తాలూకు రిస్క్ ఫ్యాక్టర్లుగా చెప్పవచ్చు.

ఆల్కహాల్ తీసుకోగానే రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. దాంతో రక్తం వేగంగా పరుగులెత్తుతుంది. దీనికి తోడు హృదయ స్పందనల వేగం కూడా బాగా పెరుగుతుంది. హృదయ స్పందనలు పెరగడంతో మళ్లీ అది రక్తపోటు పెరుగుదలకు దారితీస్తుంది. ఇక రక్తపోటు, హృదయస్పందనలు బాగా పెరిగినప్పుడు తక్షణం కలిగే ప్రమాదం గుండెపోటు. ఇది ఒక్కోసారి చాలా ప్రమాదకరమైన పరిస్థితికి అంటే... మరణానికి దారితీసే ప్రమాదమూ లేకపోలేదని గ్రహించాలి. ప్రతి మద్యం పార్టీతోనూ గుండెపోటు ముప్పు తప్పక వస్తుందని చెప్పలేనప్పటికీ... ప్రతిసారీ ఆల్కహాల్ తాగినప్పుడల్లా కాలేయంపై మాత్రం తీవ్రమైన ప్రతికూల ప్రభావం మాత్రం తప్పక పడుతుంది. అంతేకాదు... రక్తనాళాల్లో రక్తం ప్రవాహవేగం పెరిగినందువల్ల అది మూత్రపిండాలనూ దెబ్బతీయవచ్చు. ఇలా మద్యాన్ని సేవించడమన్నది ప్రతిసారీ మూత్రపిండాలపై అంతో ఇంతో ప్రతికూల ప్రభావాన్ని తప్పక చూపుతుందని చెప్పవచ్చు.

రక్తనాళాల్లో వేగం పెరగడం వల్ల ఒక్కోసారి అది రక్తనాళాలు చిట్లడం వంటి ప్రమాదాలకూ దారితీయవచ్చు. అతి సున్నితమైన కంటి రక్తనాళాల్లోనూ రక్తప్రవాహ వేగం పెరిగితే... అరుదుగానైనా అది అంధత్వం వంటి పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉండవచ్చు.

అన్ని అవయవాలకూ ముప్పు తెచ్చిపెట్టే వీకెండ్ పార్టీలు

మద్యం మనపై చూపే దీర్ఘకాలిక సమస్యలు చాలా ఎక్కువే. శరీరంలోని అన్ని అవయవాలపై మద్యం తన దుష్ప్రభావం చూపుతుంది. దాని వల్ల నష్టపోని వ్యవస్థలు, కీలక భాగాలు ఉండవంటే అతిశయోక్తి కాదు. కేవలం వారానికి ఒకసారి తాగే వీకెండ్ పార్టీ వల్లనే ఈ ముప్పు వస్తుందా అంటే కేవలం ఎప్పుడో ఒకసారి తాగినప్పటికీ మద్యం వల్ల వచ్చే ముప్పు చాలా తీవ్రంగా ఉంటుంది. మద్యం దాదాపు మన శరీరంలో ఉండే అన్ని అవయవాలపై చూపే దుష్ప్రభావాలు ఇవీ...



*** జీర్ణకోశ వ్యవస్థ :** మద్యం వల్ల అసిడిటీ సమస్య, గ్యాస్ట్రయిటిస్, కడుపులో పేగులో పుండ్లు (అల్సర్స్), అరుగుదలలో లోపాలు, జీర్ణమైన ఆహారం ఒంటికి పట్టక పోవడం (మాల్ అబ్జార్ప్షన్ సిండ్రోమ్), ఎన్నో రకాల క్యాన్సర్లు, హెమరాయిడ్స్, కాలేయం దెబ్బతినడం, పాంక్రియాస్ గ్రంథి సమస్యలు... జీర్ణవ్యవస్థకు సంబంధించి ఇలాంటి ఎన్నో రకాల సమస్యలు కనిపిస్తాయి.

*** పోషకాలు అందకపోవడం :** మద్యం తాగినప్పుడు ఒక్కోసారి ఆకలి మందగించడం లేదా మద్యంతో పాటు తినే చిరుతిండ్ల వల్ల ఆహారం సరిగా తీసుకోకపోవడంతో సరిగ్గా ఆహారం తీసుకోరు. దాంతో దేహానికి అవసరమైన అన్ని రకాల పోషకాలు అందకపోవడంతో అది పోషకాహార లోపంతో వచ్చే కొన్ని రకాల సమస్యలకు ఆస్కారం ఇవ్వవచ్చు.

*** గుండె :** ఆల్కహాల్ కార్డియోమయోపతి (గుండె కండరం పెరగడం), గుండె స్పందనలూ గుండె లయల్లో మార్పులు (అరిథ్మియా) వంటి సమస్యలు రావచ్చు. రక్తనాళాలు తమ మృదుత్వాన్ని కోల్పోయి, గట్టిగా మారే అథెరోస్క్లిరోసిస్ సమస్యలతో పాటు... చివరకు గుండెపోటుతో ప్రాణాలకు ముప్పు వాటిల్లడం వంటి తీవ్రమైన సమస్యలకూ దారితీసే ప్రమాదం లేకపోలేదు.



*** మెదడు / నాడీ వ్యవస్థలో లోపాలు :** జ్ఞాపకశక్తి లోపించడం, అనేక మానసిక వ్యాధులకు లోనుకావడం, చేతి వేళ్ల చివర్లు లేదా కాలి వేళ్ల చివర్లు స్పర్శ కోల్పోవడం, తిమ్మిర్లు, పక్షవాతం వంటి సమస్యలు రావచ్చు. దీర్ఘకాలంలో జ్ఞాపకాలన్నీ మాసిపోయే అల్జైమర్స్ సమస్యతో పాటు కొందరిలో చేతులూ చేతివేళ్లు వణుకుతూ ఉండే పార్కిన్‌సన్ డిసీస్ వంటి ముప్పులకూ ఆల్కహాల్ ఒక కారణం.



*** సెక్స్ సమస్యలు :** సామర్థ్యం తగ్గడం, అంగస్తంభన సమస్యలు రావచ్చు.

*** మహిళలకు మరింత ప్రమాదం :** మహిళలు మరీ ముఖ్యంగా గర్భిణులు ఆల్కహాల్ తాగడం వల్ల కేవలం వారికి మాత్రమే కాకుండా... ఒకవేళ వారు గర్భవతులైతే పుట్టబోయే పిల్లలకు బుద్ధిమాంద్యం, అవయవాలు సరిగ్గా ఎదగకపోవడం సహా పుట్టబోయే చిన్నారుల్లో అనేక వైకల్యాలు కనిపించడానికి అవకాశాలెక్కువ.



మద్యం తాగిన ఆ మర్నాడూ కొనసాగే ప్రతికూల ప్రభావాలు...

ఆల్కహాల్ తాగినరోజే కాకుండా ఆ మర్నాడు కూడా అది ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలనే చూపుతుంది. మద్యం తాగిన తర్వాతి రోజున అది చూపే ప్రభావాలను 'హ్యాంగోవర్'గా చెబుతుండటం చాలామందికి తెలిసిందే. అంటే... ఆల్కహాల్ తాగిన వారు మర్నాడు చాలా నీరసంగా ఉంటం, ఆ నిస్సత్తువతో ఏ పనులూ చేసుకోలేకపోవడం, దేనిపైనా దృష్టి నిలపలేకపోవడం, పనిపై దృష్టి కేంద్రీకరణ శక్తి తగ్గడం (ఫోకస్‌డ్‌గా పనిచేయలేకపోవడం), కొందరిలో తీవ్రమైన తలనొప్పి, మరికొందరిలో మైగ్రేన్ ప్రేరేపితం కావడం వంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయి. దాంతో... అంటే ఆ ప్రతికూల ప్రభావాలతో చేస్తున్న పనిపై ఆసక్తి తగ్గడం, సరిగా / నిర్దుష్టంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి అనర్థాలు ఏర్పడతాయి.

అధిగమించడం ఎలా?

ఆల్కహాల్‌ను పూర్తిగా మానేయడం తప్పనిసరి. అయితే కొంత మంది మద్యాన్ని రెండు పెగ్గులకు పరిమితం చేసుకుంటే మంచిదేననీ, డాక్టర్లే ఆ మేరకు పర్వాలేదనీ చెబుతుంటారని కొందరు వాదిస్తుంటారు. కానీ ఎప్పుడో ఓసారే అయినా ఒక్క పెగ్ ఆల్కహాల్ అయినప్పటికీ దానితో ఆరోగ్యానికి నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనమూ ఉండదనేది డాక్టర్ల మాట. ఇక మద్యం ఎంత పరిమితమైన మొత్తంలో తీసుకున్నప్పటికీ.... ఆల్కహాల్ తీసుకుని ఎలాంటి పరిస్థితుల్లోనూ వాహనం నడపకూడదు.

● **బింజ్ డ్రింక్ వద్దు :** కొందరు వారంలో ఎప్పుడూ తాగరు. కానీ వారాంతం రోజున చాలా ఎక్కువగా తాగేస్తారు. అలా కూర్చుండిపోయి తాగడమే పనిగా పెట్టుకుని చాలాసేపటి వరకు అలా తాగుతూనే ఉంటారు. ఇలా తాగడాన్నే 'బింజ్ డ్రింకింగ్' అంటారు. రోజూ తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతగా నష్టం చేకూరుతుందో... వారంలో కేవలం ఒక్కరోజున తాగే 'బింజ్ డ్రింకింగ్'తోనూ అంతకంటే ఎక్కువగానే అనర్థాలు చేకూరతాయని అర్థం చేసుకుని, బింజ్ డ్రింకింగ్‌కు దూరంగా ఉండాలి.

ఆహారం విషయంలో : వారాంతపు పార్టీలతో మద్యం మాత్రమే కాదు... మితిమీరి తీసుకునే ఆహారంతోనూ ఆరోగ్యానికి అనర్థం తప్పదు. వారాంతపు పార్టీలలో అనారోగ్యాలు తెచ్చిపెట్టే ఫాస్ట్‌ఫుడ్స్, అధికంగా రిఫైన్ చేసిన పిండి పదార్థాలతో తయారు చేసే శ్నాక్స్, సూపర్ రిఫైన్డ్ రైస్‌తో వండిన మసాలాలతో కూడిన స్పెషల్ వంటకాలతో రక్తంలో చక్కెర మోతాదులు బాగా పెరిగిపోతాయి. ఇది డయాబెటిస్ బాధితుల్లోని రక్తంలో చక్కెరను అమాంతం పెంచేస్తుంది. ఒక్కసారిగా చక్కెర మోతాదులు పెరగడం వల్ల అది కీటోఎసిడోసిస్ అనే కండిషన్‌కు దారితీసి, ఒక్కోసారి బాధితుల్ని కోమాలోకి తీసుకుపోయే ప్రమాదమూ లేకపోలేదు.

డాక్టర్ శివరాజు
సీనియర్ ఫిజీషియన్

అధిగమించడం ఎలా? వీకెండ్ పార్టీల్లో సూపర్ రిఫైన్డ్ ఆహారం లేదా శ్నాక్స్ తీసుకునే సమయంలో అంతే మొత్తంలోగానీ లేదా వీలైతే అంతకుమించిగానీ సలాడ్స్ తీసుకోవడం మంచిది. సలాడ్స్‌లో భాగంగా దోస, క్యారట్, బీట్‌రూట్ ముక్కలు తీసుకుంటుంటే అది కార్బోహైడ్రేట్లు తీసుకోవడాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు.. దేహంలోకి తగినన్ని పీచుపదార్థాలు వెళ్తాయి.

ఇక్కడ మద్యం తీసుకునే వారికీ, ఆహారం ఎక్కువగా తీసుకునేవారికి... మధ్య పండ్ల రసాల విషయంలో ఒక తేడా పాటించాల్సి ఉంటుంది. అదేమిటంటే... మద్యం తీసుకునే వారు రెండు పెగ్గుల తర్వాత తప్పనిసరిగా నిమ్మజాతి పండ్లరసాలు తీసుకోవడం మంచిదైతే... ఆహార ప్రియులు మాత్రం పండ్ల రసాలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే... పండ్లరసాలు రక్తంలోని చక్కెర మోతాదులను మరింతగా, అందునా అమాంతంగా పెంచేస్తాయి.

కొందరు కాళ్లూ, చేతుల్లో కీళ్లనొప్పులు... గౌట్ వ్యాధితో బాధపడుతూ ఉంటారు. ఇలాంటివారు తమ ఆహారంలో ప్రోటీన్ మోతాదులు అంటే మాంసాహారం, పప్పులు బాగా తగ్గించుకోవాలి.

అధిగమించడం ఎలా: ఈ వీకెండ్ ఆరోగ్య సమస్యలను నివారించడానికి ఈ కింద పేర్కొన్న సూచనలు చాలావరకు మేలు చేస్తాయి. అవి...

● పార్టీల్లో గడపడం కంటే పార్క్ వంటి చోట్లలో సోషల్ గ్యాదరింగ్స్‌కు వెళ్లడం చాలా మేలు చేస్తుంది. పార్టీలకు వెళ్లేవారితో పోలిస్తే... పార్క్‌లో కుటుంబ సభ్యులతో గడిపేవారు, గార్డెనింగ్ చేసేవారు... ఎక్కువ సంతోషంగానూ, ఆరోగ్యంగానూ ఉంటారని చాలా అధ్యయనాల్లో తేలింది.

● **వీకెండ్ యోగా :** వారమంతటా ఎడతెరిపిలేకుండా చేస్తున్న పని వల్ల కలిగిన ఒత్తిడిని తొలగించడానికి వీకెండ్స్‌లో పార్టీల కంటే వీకెండ్ యోగా వంటి కార్యక్రమాలు మేలు చేస్తాయని అధ్యయనాల్లో తేలింది.



● **బరువు చెక్ చేసుకుంటూ ఉండటం :** వీకెండ్ తర్వాత సోమవారంనాడు రోజును ప్రారంభిస్తున్నప్పుడు మొదట చేయాల్సిన పని... తమ బరువు చెక్ చేసుకోవడం. దీనివల్ల మనం చేస్తున్న పనుల ప్రతికూల ప్రభావాలను తెలుసుకుంటూ... ఆమేరకు జాగ్రత్త తీసుకోవాలన్న స్పృహ అందరిలోనూ పెరుగుతుంది.

పిల్లలకూ ఇబ్బందే...

కేవలం పెద్దల ఆరోగ్యమే కాదు... వారాంతపు రోజుల్లో చిన్నారుల ఆరోగ్యమూ దెబ్బతినే అవకాశాలు లేకపోలేదు. అయితే ఇందుకు కారణాలు మాత్రం పెద్దలూ, పిల్లల విషయంలో వేర్వేరుగా ఉంటాయి. వారం పొడవునా అన్ని రోజులూ స్కూల్‌కు వెళ్లడంతో మర్నాడు సెలవు కావడంతో ఆటవిడుపుగా భావించి మితిమీరి ఆడుకుంటూ ఉంటారు. దీనివల్ల ఒక్కోసారి కాళ్లనొప్పులు రావచ్చు. ఇది కేవలం తాత్కాలికమైన ఇబ్బంది మాత్రమే. అయితే దీనికంటే మించిన ఇబ్బంది ఆహారంతో వస్తుంటుంది.

కొందరు పెద్దలు వారాంతపు రోజుల్లో పిల్లలను తమతో పాటు పార్టీకి తీసుకెళ్లడం చేస్తుంటారు. ప్రతివారం అక్కడ మితిమీరి ఆహారం తీసుకోవడంతో పిల్లల్లో స్థూలకాయం వచ్చే ముప్పు ఉంటుంది. ఇక మర్నాడు ఎలాగూ సెలవురోజు కావడం వల్ల వారాంతపు రోజున ఎక్కువసేపు టీవీ చూడటం, రాత్రంతా నిద్రపోకుండా ఓటీటీలో సినిమాలు చూడటం, వీడియోగేమ్స్ ఆడటం వంటివి చేస్తుంటారు. వీటివల్ల ఆరుబయట ఆటలాడటమూ తగ్గుతుంది. పైగా ఇలా టీవీలూ, సినిమాలూ చూసే సమయంలో ఏదైనా తింటూ ఉండటం వల్ల (బింజ్ ఈటింగ్ వల్ల) స్థూలకాయం రిస్క్ మరింత పెరుగుతుంది. ఇది దీర్ఘకాలంలో వారి ఆరోగ్యం విషయంలో దుష్పరిణామాలకు దారితీస్తుంది. అందుకే సెలవు రోజుల్లో పిల్లలకు ఆరోగ్యకరమైన వ్యాపకాలు నేర్పడం పెద్దలు చేయాల్సిన పని. ●

నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో కోనె రీజనల్ కార్యాలయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలివేటర్లు, ఎస్కలేటర్ల తయారీ దిగ్గజం కోనె తాజాగా హైదరాబాద్‌లో తమ సెంట్రల్ రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభించింది. కోనె ప్రెసిడెంట్ ఫిలిప్ డెలోర్మ్, కోనె ఇండియా ఎండీ అమిత్ గోస్సైన్ దీన్ని ప్రారంభించారు. ఇది తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మార్కెట్లలో కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగపడుతుందని ఫిలిప్ తెలిపారు. ఎత్తైన భవంతులు, ఐటీ పార్కుల నుంచి రిటైల్ కేంద్రాలు, రవాణా మౌలిక సదుపాయాల వరకు సురక్షితమైన ఎలివేటర్లు, ఎస్కలేటర్లకు డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో స్థానికంగా మరింత వేగంగా సర్వీసులు అందించేందుకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు.

కార్యకలాపాల విస్తరణలో బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్

హైదరాబాద్: డిజిటల్ సేవల సంస్థ బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ తెలంగాణవ్యాప్తంగా తమ బిజినెస్ కరెస్పాండెంట్ (బీసీ) నెట్‌వర్క్‌ను రాబోయే రోజుల్లో 3,000–4,000కు పెంచుకోనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం 400 టచ్‌పాయింట్లు ఉన్నాయని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లోకనాథ్ పండా తెలిపారు. దీనితో పెద్ద సంఖ్యలో గ్రామాలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని వారికి సంఘటిత బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి రాగలవని ఆయన చెప్పారు. ఏజెంట్లకు లాభదాయకంగా ఉంటూ, కస్టమర్లకు విశ్వసనీయమైన విధంగా సర్వీసులు అందించేలా బీసీ టచ్ పాయింట్లు ఉంటున్నాయని పండా చెప్పారు.

ఒప్పో నుంచి రెనో15 సిరీస్ ఫోన్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్స్ దిగ్గజం ఒప్పో ఇండియా తాజాగా ప్రీమియం రెనో15 సిరీస్ ఫోన్లను ప్రవేశపెట్టింది. రెనో15 ప్రో మినీ, ప్రో, రెనో 15 పేరిట మూడు వేరియంట్లలో ఇవి లభిస్తాయి. ట్రావెల్ ఫొటోగ్రఫీకి మరింత ఉపయోగకరంగా ఉండేలా ప్రో, ప్రో మినీల్లో 20 ఎంపీ కెమెరా, ప్యూర్‌టోన్ ఇమేజింగ్ టెక్నాలజీ, ఏఐఎడిటింగ్ టూల్స్ మొదలైన ఫీచర్స్ ఉంటాయి. పరిశ్రమలోనే తొలిసారిగా హోలోఫ్యూజన్ టెక్నాలజీని ప్రవేశపెడుతున్నట్లు సంస్థ తెలిపింది. వేరియంట్‌ని బట్టి ధర రూ. 45,999 నుంచి ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఒప్పో ప్యాడ్5 (రేటు రూ. 26,999 నుంచి ప్రారంభం), ఎన్‌కో బడ్స్3 ప్రో+ని (ధర రూ. 2,499) కూడా కంపెనీ ఆవిష్కరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-1-2026

విశాఖ	500–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDIGO	4,937.00	4.16
TECHM	1,710.40	2.39
HINDUNILVR	2,414.40	2.29
KOTAKBANK	427.5	2.22
MARUTI	16,182.00	2.04

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	245.5	-8.21
RELIANCE	1,413.20	-3.07
ETERNAL	279.45	-2.87
TMPV	343.55	-2.84
MAXHEALTH	1,011.00	-2.51

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,898
ఎన్ఎస్ఈ	1,11,003
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,12,620
ఎఫ్ఐఐ	- 1,500
డీఐఐ	+ 1,182

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	59.27	$	59.34
బ్రెంట్	63.99	$	64.14

భారత వృద్ధి అంచనాలు పెంపు

2025-26లో 7.3 శాతం

- 2026-27లో 6.4 శాతం
- అంచనాలను మించి పనితీరు
- ఐఎంఎఫ్ తాజా నివేదిక

న్యూఢిల్లీ: భారత్ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–6) 7.3 శాతం వృద్ధిని సాధిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో వేసిన అంచనా కంటే ఇది 0.7 శాతం అధికం. భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు అంచనాలకు మించి ఉండడమే సవరణకు దారితీసినట్టు పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026–27) సంబంధించి వృద్ధి అంచనాను సైతం 6.2 శాతం నుంచి 6.4 శాతానికి పెంచింది. సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి అంచనాల కంటే బలంగా నమోదు కావడంతోపాటు, డిసెంబర్ త్రైమాసికంలోనూ కార్యకలాపాలు బలంగా ఉన్నట్టు ఐఎంఎఫ్ తన తాజా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అవుట్‌లుక్‌లో తెలిపింది. జాతీయ గణాంక కార్యాలయం అంచనా ప్రకారం 2025–26 సెప్టెంబర్ త్రైమాసికంలో 8 శాతం వృద్ధి రేటు నమోదు కావడం తెలిసిందే. అంతేకాదు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతంగా ఉంటుందని ప్రభుత్వం తన ముందస్తు అంచనాల్లో పేర్కొనడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉంది.

ద్రవ్యోల్బణం పెరుగుతుంది..

ద్రవ్యోల్బణం 2025లో కనిష్ట స్థాయిలకు తగ్గగా.. ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతం స్థాయికి చేరుకోవచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. మరీ ప్రతికూల పరిస్థితుల్లో ద్రవ్యోల్బణం 4 శాతానికి ఎగువ, దిగువ వైపు 2 శాతం మించకుండా (2–6 శాతం) చూడాలన్నది ఆర్‌బీఐ లక్ష్యంగా ఉంది. ఇక 2026లో అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి రేటు 3.3 శాతంగా ఉంటుందని, 2027లో ఇది 3.2 శాతానికి పరిమితం అవుతుందని ఐఎంఎఫ్ తెలిపింది. 2025 అక్టోబర్ అంచనాలతో పోల్చి చూస్తే వీటిల్లో పెద్ద మార్పు లేదు. వర్ధమాన ఆర్థిక వ్యవస్థల్లో వృద్ధి రేటు 2026, 2027లో 4 శాతం ఎగువన ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. చైనా వృద్ధి రేటును 0.2 శాతం పెంచి 5 శాతం చేసింది. అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం 2025లో ఉన్న 4.1 శాతం నుంచి 2026లో 3.8 శాతానికి పరిమితం అవుతుందని, 2027లో 3.4 శాతానికి దిగొస్తుందని పేర్కొంది.

ఈక్విటీలపై పన్ను భారాన్ని తగ్గించాలి

- క్యాపిటల్ మార్కెట్ భాగస్వాముల డిమాండ్
- బడ్జెట్‌కు ముందు కీలక సూచనలు

న్యూఢిల్లీ: ఈక్విటీ పెట్టుబడులపై పన్ను భారాన్ని తగ్గించాలని క్యాపిటల్ మార్కెట్ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. 2026–27 బడ్జెట్‌లో దీర్ఘకాల మూలధన లాభంపై పన్ను (ఎల్‌టీసీజీ) తగ్గించడంతోపాటు, పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలని సూచించాయి. దీనివల్ల రిటైల్, దీర్ఘకాల పెట్టుబడిదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నాయి. సెక్యూరిటీ లావాదేవీల పన్నును (ఎస్‌టీటీ) మరింత పెంచకుండా ఉండాలని కోరాయి. వచ్చే ఆర్థిక సంత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న మంత్రి సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుండడం తెలిసిందే.

ఎల్‌టీసీజీ మినహాయింపు పెంచాలి..

ఈక్విటీ పెట్టుబడులపై దీర్ఘకాల లాభం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలు మించకపోతే ప్రస్తుతం ఎలాంటి పన్ను లేదు. ఇంతకు మించిన మొత్తంపై 12.5 శాతం పన్ను చెల్లించాలి. రూ.2 లక్షల వరకు లాభంపై పన్ను మినహాయింపును పెంచాలని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రభుత్వానికి సూచించింది. దీర్ఘకాలం అన్న నిర్వచనాన్ని ఈక్విటీలకు 12 నెలలు ఉండగా.. డెట్, బంగారం, రియల్ ఎస్టేట్ ఇలా అన్ని సాధనాలకు ఒకే విధంగా అమలు చేయాలని కోరింది. దీనివల్ల పన్నులపై స్పష్టత పెరిగి, సంక్లిష్టత తగ్గుతుందని పేర్కొంది. మూలధన నష్టాన్ని ఇతర ఆదాయంతోనూ సర్దుబాటుకు అవకాశం కల్పించాలని కోరింది.

ఎస్‌టీటీ తక్కువగా ఉండాలి..

స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను నిరుత్సాహపరిచి, దీర్ఘకాల పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా.. డెరివేటివ్స్ కంటే ఈక్విటీ ట్రేడ్లపై ఎస్‌టీటీ తక్కువగా ఉండాలని ప్రభుత్వానికి సూచించినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీఈవో, ఎండీ ధీరజ్ రెల్లి వెల్లడించారు. షేర్ల బైబ్యాక్‌లో కేవలం లాభంపైనే పన్ను ఉండాలన్నారు. ఎస్‌టీటీని మరింత పెంపునకు ప్రభుత్వం దూరంగా ఉండాలని ఫయర్స్ సీఈవో తేజాస్ ఖోడే పేర్కొన్నారు. దీర్ఘకాల, స్వల్పకాల మూలధన లాభం పన్నును 10 శాతానికి తగ్గించినట్టయితే రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం మరింత పెరుగుతుందన్నారు. బంగారం, వెండిపై దిగుమతుల సుంకాన్ని ప్రభుత్వం మరింత పెంచకపోవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

మొబైల్ విడిభాగాలపై సుంకాల్లో కోత పెట్టాలి

- దేశీ తయారీకి ప్రోత్సాహం
- లేదంటే సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంది
- కేంద్రానికి ఐసీఈఏ సూచన



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ విడిభాగాలైన మైక్రోఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, వేరబుల్స్‌పై దిగుమతి సుంకాలు తగ్గించాలంటూ పరిశ్రమ ప్రభుత్వాన్ని కోరింది. బడ్జెట్‌లో ఈ మేరకు చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేసింది. అలాగే, దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ వ్యయాన్ని తగ్గించేందుకు గాను క్యాపిటల్ గూడ్స్, ఇతర విడిభాగాలపై టారిఫ్‌లను సవరించాలని ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. లేదంటే ఇటీవల చైనా విధించిన నియంత్రణ చర్యలు దేశీ మొబైల్ ఫోన్ల తయారీకి ముప్పుగా మారతాయని పేర్కొంది. ఐసీఈఏలో యాపిల్, ఫాక్స్‌కాన్, డిక్సన్, షావోమీ, వివో, ఒప్పో తదితర సంస్థలు సభ్యులుగా ఉన్నాయి. ''తయారీ మెషినరీ ఎగుమతులపై చైనా ఇటీవల విధించిన ఆంక్షలు సరఫరా పరమైన సమస్యలను పెంచుతాయి. దిగుమతి పరికరాలపై భారత్ ఆధారపడి ఉండడం వ్యూహాత్మక బలహీనతగా మారింది. కనుక అన్ని రకాల విడిభాగాలు, సబ్ అసెంబ్లీలు, అసెంబ్లీల దిగుమతులపై జీరో సుంకం ప్రయోజనాన్ని వర్తింపజేయాలి''అని ఐసీఈఏ సూచించింది. దీని ఫలితంగా స్వావలంబన పెరుగుతుందని, అంతర్జాతీయంగా భారత్ పోటీతత్వం ఇనుమడిస్తుందని అభిప్రాయపడింది.

రూ.6.76 లక్షల కోట్లకు ఉత్పత్తి..

దేశీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ 25 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండడం గమనార్హం. దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 75 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఐసీఈఏ అంచనా. ఇందులో 30 బిలియన్ డాలర్లు మేర ఎగుమతులు ఉంటాయని పేర్కొంది. 2024–25లో రూ.5.5 లక్షల కోట్ల మొబైల్ ఫోన్ల తయారీ నమోదు కాగా, ఇందులో ఎగుమతులు రూ.2 లక్షల కోట్లుగా ఉన్నాయి. కొన్ని రకాల సంక్లిష్టమైన, ప్రత్యేకమైన మెషినరీ అవసరం మొబైల్ ఫోన్లు, లిథియం అయాన్ సెల్ తయారీకి అవసరమని పేర్కొంటూ.. అయినప్పటికీ ఇవి కస్టమ్స్ డ్యూటీ మినహాయింపులకు దూరంగా ఉన్నట్టు ప్రభుత్వం దృష్టికి పరిశ్రమ తీసుకెళ్లింది. ఈ మెషినరీ దేశీయంగా తయారు కావడం లేదని, దిగుమతుల కోసం పెద్ద మొత్తంలో సుంకాలు చెల్లించాల్సి వస్తున్నట్టు.. ఫలితంగా మూలధన వ్యయాలు 7.5–20 శాతం మధ్య అధికంగా వెచ్చించాల్సి వస్తున్నట్టు వివరించింది.

ఇండోఫాస్ట్ ఎనర్జీ, నెక్సస్ సెలెక్ట్ మాల్స్ జట్టు

బెంగళూరు: బ్యాటరీ–స్వాపింగ్ సొల్యూషన్స్ సంస్థ ఇండోఫాస్ట్ ఎనర్జీ తాజాగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్‌తో జట్టు కట్టింది. నెక్సస్‌కి చెందిన షాపింగ్ మాల్స్‌లో బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. దీని ప్రకారం బెంగళూరులోని నెక్సస్ శాంతినికేతన్, నెక్సస్ వైట్‌ఫీల్డ్‌లో క్విక్ ఇంటర్‌చేంజ్ స్టేషన్లను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఈ భాగస్వామ్యాన్ని హైదరాబాద్, చండీగఢ్, పుణె తదితర ప్రాంతాలకు కూడా విస్తరించనున్నట్లు ఇండోఫాస్ట్ ఎనర్జీ సీఈవో అనంత్ బడ్జాత్యా తెలిపారు. డిశ్చార్జ్ అయిపోయిన బ్యాటరీలను నిమిషాల వ్యవధిలోనే మార్చేసేందుకు తమ ఆటోమేటెడ్ టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పారు. దీనితో చార్జింగ్ కోసం సుదీర్ఘ సమయం వేచి ఉండటం, రేంజి (మైలేజీ) గురించి ఆందోళన చెందే పరిస్థితి తప్పుతుందని వివరించారు. వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా 40 పైగా నగరాల్లో 10,000 బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఇండోఫాస్ట్ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

భారత్‌లో బీమా వృద్ధికి భరోసా

- 2030 వరకు ఏటా 6.9 శాతం
- చైనా, యూఎస్ కంటే ముందు
- స్విస్ ఆర్ఈ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్ మార్కెట్లో బీమా ప్రీమియం వృద్ధి 2026–2030 మధ్యకాలలో 6.9 శాతానికి (ఏటా) పెరుగుతుందని అంతర్జాతీయ రీఇన్సూరెన్స్ సంస్థ స్విస్ ఆర్ఈ తెలిపింది. చైనా (4 శాతం), యూఎస్ (2 శాతం), పశ్చిమ యూరప్ దేశాల వృద్ధిని భారత బీమా మార్కెట్ అధిగమిస్తుందని.. బలమైన ఆర్థిక మూలాలు, డిమాండ్ పెరుగుతుండడం, నియంత్రణల్లో మార్పులను సానుకూలంగా ప్రస్తావించింది. 2025లో 3.1 శాతం వృద్ధికి ఇది రెట్టింపు అవుతుందని పేర్కొంది. భారత బీమా రంగం బలమైన మధ్యస్థ వృద్ధి పథంలోకి అడుగు పెట్టిందని తెలిపింది. వచ్చే ఐదేళ్లలో భారత్ ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తుందని పేర్కొంది. జీఎస్‌టీ సంస్కరణలు, వ్యక్తిగత ఆదాయపన్నులో మినహాయింపులు మధ్యాదాయ కుటుంబాల్లో బీమాకు డిమాండ్‌ను పెంచుతాయని విశ్లేషించింది. బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తీసుకొచ్చిన సంస్కరణలు, ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన మార్పులు మరింత పారదర్శకతను తీసుకొస్తాయని.. పరిశ్రమ మరింత వృద్ధిని సాధించే దిశగా అనుకూలిస్తాయని వివరించింది. బీమా రంగంలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించడాన్ని ప్రస్తావించింది. దీంతో కొత్త మూలధన నిధులకు మార్గం సుగమం అవుతుందని, బీమా విస్తరణ పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. గతేడాది సెప్టెంబర్ 22 నుంచి జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్‌టీని తొలగించడం తెలిసిందే.

జీవిత బీమా జోరు..

జీవిత బీమా పరంగా భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్టు స్విస్ ఆర్ఈ నివేదిక వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో ఏటా 6.8 శాతం వృద్ధి సాధ్యమేనని పేర్కొంది. రిటైర్మెంట్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండడం, పంపిణీ నెట్‌వర్క్ విస్తరణ ఇందుకు అనుకూలిస్తుందని తెలిపింది. నియంత్రణపరమైన మార్పులు, వైద్య ద్రవ్యోల్బణం కారణంగా నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్ సమీప కాలంలో సవాళ్లను ఎదుర్కోనున్నట్టు అంచనా వేసింది. మధ్యకాలానికి మాత్రం మెరుగైన వృద్ధిరేటును చూస్తుందని తెలిపింది. 2026–2030 మధ్యకాలంలో ఏటా 7.2 శాతం చొప్పున ప్రీమియం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. ముఖ్యంగా ఈ కాలంలో మోటారు బీమాలో 7.5 శాతం వృద్ధి నమోదవుతుందని పేర్కొంది.

క్యూ3 ఫలితాలు

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం డీలా

- క్యూ3లో రూ. 971 కోట్లు
- ఆదాయం రూ. 10,781 కోట్లు
- 1,511 మందికి ఉద్యోగాలు

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ ఎల్‌టీఐమైండ్‌ట్రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షికంగా 11 శాతం క్షీణించి రూ. 971 కోట్లకు పరిమితమైంది. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ. 590 కోట్లమేర చేపట్టిన వన్‌టైమ్ కేటాయింపులు ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,085 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 12 శాతం ఎగసి రూ. 10,781 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 9,661 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 31 శాతం క్షీణించగా.. ఆదాయం 4 శాతం పుంజుకుంది. కాగా.. 1,511 మంది ఉద్యోగులు కొత్తగా జత కలవడంతో 2025 డిసెంబర్31 కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 87,958కు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.6 శాతం లాభంతో రూ. 6,405 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ లాభం పటిష్టం

క్యూ3లో రూ. 5,100 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం ఎగసి రూ. 5,100 కోట్లను తాకింది. ఇది బ్యాంక్ చరిత్రలోనే అత్యధికంకాగా.. మొండి రుణాలు తగ్గడం ఇందుకు సహకరించింది. ఇకపై ప్రతి క్వార్టర్‌లోనూ ఇదేస్థాయిలో లాభాలు ఆర్జించడంపై దృష్టి పెట్టనున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో అశోక్ చంద్ర పేర్కొన్నారు. కాగా.. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 4,508 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,752 కోట్ల నుంచి రూ. 37,253 కోట్లకు బలపడింది. అయితే నికర వడ్డీ ఆదాయం రూ. 11,032 కోట్ల నుంచి రూ. 10,503 కోట్లకు క్షీణించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.09 శాతం నుంచి 3.19 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.41 శాతం నుంచి 0.32 శాతానికి దిగివచ్చాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 318 కోట్ల నుంచి రూ. 1,341 కోట్లకు భారీగా పెరిగాయి. ఈసీఎల్ మార్గదర్శకాలకు అనుగుణంగా రూ. 955 కోట్ల అదనపు కేటాయింపులు చేపట్టినట్లు చంద్ర వెల్లడించారు. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.77 శాతంగా నమోదైంది. ఒక భారీ మొండి రుణ ఖాతా నుంచి రికవరీ కారణంగా రికవరీలు రూ. 823 కోట్ల నుంచి రూ. 1,956 కోట్లకు ఎగశాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 128 వద్ద ముగిసింది.

టాటా క్యాపిటల్ లాభం జూమ్

క్యూ3లో రూ. 1,285 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం టాటా క్యాపిటల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 39 శాతం జంప్‌చేసి రూ. 1,285 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 922 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 33 శాతం ఎగసి రూ. 3,594 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 2,711 కోట్ల టర్నోవర్ సాధించింది. నికర వడ్డీ ఆదాయం 26 శాతం మెరుగుపడి రూ. 2,936 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 2,323 కోట్ల వడ్డీ ఆదాయం అందుకుంది. కంపెనీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 26 శాతం వృద్ధితో రూ. 2,34,114 కోట్లకు చేరాయి. గత క్యూ3లో ఏయూఎం రూ. 1,86,404 కోట్లుగా నమోదైంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.6 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.6 శాతానికి చేరాయి. కంపెనీ 2025 అక్టోబర్‌లో లిస్టయ్యాక రెండోసారి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.3 శాతం లాభపడి రూ. 360 వద్ద ముగిసింది.

బీహెచ్ఈఎల్ లాభం దూకుడు

క్యూ3లో రూ. 390 కోట్లు

ముంబై: విద్యుత్ పరికరాల ప్రభుత్వ రంగ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(బీహెచ్ఈఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు దూసుకెళ్లి రూ. 390 కోట్లను అధిగమించింది. కీలక విభాగాల నుంచి ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 135 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 18 శాతం వృద్ధితో రూ. 8,692 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 7,385 కోట్ల టర్నోవర్ సాధించింది. ప్రధానంగా విద్యుత్ విభాగం ఆదాయం రూ. 5,585 కోట్ల నుంచి రూ. 6,322 కోట్లకు ఎగసింది. ఇండస్ట్రీ విభాగం ఆదాయం రూ. 1,689 కోట్ల నుంచి రూ. 2,151 కోట్లకు జంప్‌చేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 263 వద్ద ముగిసింది.

హావెల్స్ లాభం ప్లస్

- క్యూ3లో రూ. 300 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్

ముంబై: కన్జూమర్ ఎలక్ట్రికల్ గూడ్స్ దిగ్గజం హావెల్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం పుంజుకుని రూ. 300 కోట్లను అధిగమించింది. ఇందుకు కేబుళ్లు, వైర్ల బిజినెస్ పురోభివృద్ధి దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 278 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 5,588 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 4,889 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 13 శాతం పెరిగి రూ. 5,189 కోట్లను దాటాయి. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 13 శాతం ఎగసి రూ. 5,631 కోట్లకు చేరింది. కాగా.. కొత్త కార్మిక చట్టాల అమలు నేపథ్యంలో రూ. 45 కోట్లు అసాధారణ కేటాయింపులుగా నమోదు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. విభాగాలవారీగా స్విచ్‌గేర్ల ఆదాయం 8 శాతం వృద్ధితో 624 కోట్లను తాకగా.. కేబుళ్ల బిజినెస్ 33 శాతం జంప్‌చేసి రూ. 2,241 కోట్లకు చేరింది. లైటింగ్ తదితరాల నుంచి 4 శాతం తక్కువగా రూ. 423 కోట్లు సాధించింది. ఎలక్ట్రికల్ కన్జూమర్ ఉత్పత్తుల బిజినెస్ 4 శాతం పుంజుకుని రూ. 1,151 కోట్లయ్యింది. లాయిడ్ కన్జూమర్ ఆదాయం 7 శాతం నీరసించి రూ. 694 కోట్లకు పరిమితంకాగా.. ఇతర ఆదాయం 22 శాతం ఎగసి రూ. 310 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం లాభంతో రూ. 1,445 వద్ద ముగిసింది.

జొకోవిచ్ 'సెంచరీ'

- ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 100వ విజయం సాధించిన సెర్బియా దిగ్గజం
- మూడు 'గ్రాండ్‌స్లామ్' టోర్నీల్లో 100 విజయాల మైలురాయి దాటిన ఏకైక టెన్నిస్ ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు

మెల్‌బోర్న్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ లక్ష్యంగా ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో దిగిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 10 సార్లు చాంపియన్ జొకోవిచ్ 6-3, 6-2, 6-2తో పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్)పై గెలిచి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. ఓవరాల్‌గా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్‌కిది 100 విజయం కావడం విశేషం. ఫెడరర్ (స్విట్జర్లాండ్-102) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ 'సెంచరీ' విజయాలు సాధించిన రెండో ప్లేయర్‌గా ఈ సెర్బియా స్టార్ గుర్తింపు పొందాడు. అంతేకాకుండా మూడు వేర్వేరు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 100 అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల్లో గెలిచిన ఏకై క ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 101 మ్యాచ్‌ల్లో... వింబుల్డన్‌లో 102 మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అత్యధికసార్లు ఆడిన ప్లేయర్‌గా ఫెడరర్ (21 సార్లు) పేరిట ఉన్న రికార్డును సమం చేసిన జొకోవిచ్... అత్యధిక గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో (81 సార్లు) ఆడిన ప్లేయర్లుగా ఫెడరర్, ఫెలిసియానో లోపెజ్ (స్పెయిన్) పేరిట ఉన్న రికార్డునూ అందుకున్నాడు. పెడ్రో మార్టినెజ్‌తో 2 గంటల్లో ముగిసిన మ్యాచ్‌లో జొకోవిచ్ 14 ఏస్‌లు సంధించాడు. ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. 49 విన్నర్స్ కొట్టిన అతను 21 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని ఈ సెర్బియా యోధుడు ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు.

వావ్రింకా బోణీ...

ఈ ఏడాది తర్వాత టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించిన 2014 చాంపియన్, స్విట్జర్లాండ్ స్టార్ వావ్రింకా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో వావ్రింకా 5-7, 6-3, 6-4, 7-6 (7/4)తో లాస్లో జెరె (సెర్బియా)పై గెలిచాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజయం సాధించిన రెండో అతిపెద్ద వయస్కుడిగా వావ్రింకా (40 ఏళ్ల 296 రోజులు) గుర్తింపు పొందాడు. ఈ రికార్డు ఇవో కార్లోవిచ్ (క్రొయేషియా-40 ఏళ్ల 326 రోజులు) పేరిట ఉంది. మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడుసార్లు రన్నరప్‌గా నిలిచిన మెద్వెదెవ్ (రష్యా) కూడా గెలుపు బోణీ కొట్టాడు. తొలి రౌండ్‌లో 11వ సీడ్ మెద్వెదెవ్ 7-5, 6-2, 7-6 (7/2)తో జెస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)పై నెగ్గాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) 6-2, 6-2, 6-3తో మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై, 12వ సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6-1, 6-2, 6-4తో మటియా బెలూచి (ఇటలీ)పై, 13వ సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-4, 6-2, 6-3తో మటియో అర్నాల్డి (ఇటలీ)పై, 14వ సీడ్ డేవిడోవిచ్ ఫొకీనా (స్పెయిన్) 6-2, 6-3, 6-3తో ఫిలిప్ మిసోలిచ్ (ఆస్ట్రియా)పై గెలిచారు.

స్వియాటెక్ శుభారంభం

మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) తొలి రౌండ్ దాటడానికి శ్రమించింది. స్వియాటెక్ 7-6 (7/5), 6-3తో చైనీస్ తైపీ క్వాలిఫయర్ యువాన్ యువెపై గెలిచింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధిస్తే స్వియాటెక్ కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసుకుంటుంది. నాలుగుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన ఈ పోలాండ్ స్టార్ ఒక్కోసారి వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లలో విజేతగా నిలిచింది. మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), నాలుగో సీడ్ అమండ అనిసిమోవా (అమెరికా), ఆరో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), ఎనిమిదో సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా) కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో కోకో గాఫ్ 6-2, 6-3తో కామిల్లా రఖిమోవా (ఉజ్బెకిస్తాన్)పై, అనిసిమోవా 6-3, 6-2తో సిమోనా వాల్టెర్ట్ (స్విట్జర్లాండ్)పై, పెగూలా 6-2, 6-1తో అనస్తాసియా జఖరోవా (రష్యా)పై, ఆంద్రీవా 4-6, 6-3, 6-0తో డొనా వెకిచ్ (క్రొయేషియా)పై గెలిచారు. మరోవైపు 2020 చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా) వరుసగా ఐదో ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. పీటన్ స్టియర్న్స్ (అమెరికా) 6-3, 6-2తో సోఫియా కెనిన్‌పై విజయం సాధించింది.

అర్జున్-గుకేశ్ గేమ్ 'డ్రా'

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ వరుసగా రెండో 'డ్రా' నమోదు చేశాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌తో సోమవారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను అర్జున్ 34 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన గేమ్‌ను అరవింద్ చిదంబరం (భారత్) 42 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు.

పోరాడి ఓడిన రష్మిక

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నీలో భారత రెండో ర్యాంకర్, తెలంగాణకు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'కు చేరుకోవడంలో విఫలమైంది. బహ్రెయిన్‌లోని మనామా పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో రష్మిక 7-6 (8/6), 6-7 (5/7), 1-6తో యానా కొలోడిన్‌స్కా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక 7 ఏస్‌లు సంధించి, 12 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన తొలి సర్వీస్‌లో 40 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 25 పాయింట్లు సాధించింది. తన సర్వీస్‌ను ఎనిమిదిసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన రష్మిక రెండో రౌండ్‌లో గెలిచిఉంటే మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించేది.

నేటి నుంచి ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ

జకార్తా: బ్యాడ్మింటన్ సీజన్‌లో మూడో టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ జరగనుంది. భారత్ నుంచి పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో కిడాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జి, లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ఆయుశ్ శెట్టి... మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో పీవీ సింధు, తన్వీ శర్మ, మాళవిక బన్సోద్ పోటీపడనున్నారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్; తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జోడీలు బరిలో ఉన్నాయి. మంగళవారం క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. బుధవారం నుంచి మెయిన్ 'డ్రా' మ్యాచ్‌లు మొదలవుతాయి.

'కోహ్లిని చూసి నేర్చుకోండి'

భారత ఆటగాళ్లకు గావస్కర్ సూచన

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లలో సరైన ఆరంభాలు లేకపోవడం భారత్ సిరీస్ కోల్పోయేందుకు కారణమని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. భారీ లక్ష్యాలను ఛేదించే సమయంలో ఇన్నింగ్స్‌లు ఎలా నిర్మించాలో విరాట్ కోహ్లిని చూసి సహచరులు నేర్చుకోవాలని ఆయన సూచించారు. 'కోహ్లికి సరైన సహకారం లభించకపోతే లక్ష్య ఛేదన చాలా కష్టమని అర్థమైపోయింది. చివరకు అదే జరిగింది. నిజంగా చెప్పాలంటే ఈ సిరీస్‌లో మనకు సరైన ఆరంభాలు లభించలేదు. అదే జరిగితే సగం పని సులువయ్యేది. రాహుల్ లాంటి బ్యాటర్ అవుటైన తర్వాత నితీశ్, హర్షిత్‌లాంటి ఆటగాళ్ల నుంచి ఎలాంటి ప్రదర్శన వస్తుందో ఎవరూ అంచనా వేయలేరు. అందుకే పరిస్థితి ఇబ్బందికరంగా మారిపోయింది' అని గావస్కర్ విశ్లేషించారు. సెంచరీతో చివరి వరకు పోరాడిన కోహ్లిపై సన్నీ ప్రశంసలు కురిపించారు. 'కోహ్లి ఆలోచనధోరణి, అతని నిలకడను అందరూ అందిపుచ్చుకోవాలి. ఒకే శైలికి కట్టుబడకుండా పరిస్థితులకు తగినట్లుగా కోహ్లి తన ఆటను మార్చుకున్నాడు. చివరి వరకు ఓటమిని అంగీకరించకుండా అతను ప్రయత్నించాడు. ఇది యువ ఆటగాళ్లకు మంచి పాఠం అవుతుంది' అని దిగ్గజ క్రికెటర్ పేర్కొన్నారు.

సెనెగల్ జిగేల్...

- రెండోసారి ఆఫ్రికా కప్ ఫుట్‌బాల్ టైటిల్ సొంతం
- ఫైనల్లో మొరాకోపై 1-0తో విజయం
- మొరాకో జట్టుకు 'పెనాల్టీ' ఇవ్వడంపై అభిమానుల గొడవ
- 14 నిమిషాలు నిలిచిపోయిన ఆట
- పెనాల్టీని వృథా చేసిన మొరాకో స్టార్ డియాజ్
- సెనెగల్‌ను గెలిపించిన పాపె గుయె గోల్

రబాట్ (మొరాకో): నాటకీయ పరిణామాల మధ్య ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో సెనెగల్ జట్టు పైచేయి సాధించింది. రెండోసారి ఆఫ్రికా కప్ ఫుట్‌బాల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఫైనల్లో సెనెగల్ 1-0 గోల్ తేడాతో ఆతిథ్య మొరాకో జట్టును ఓడించింది. 2021లో తొలిసారి సెనెగల్ ఆఫ్రికా కప్ టైటిల్‌ను సాధించింది. ఈ ఓటమితో 50 ఏళ్ల తర్వాత మళ్లీ ఆఫ్రికా చాంపియన్‌గా నిలవాలని ఆశించిన మొరాకో జట్టుకు నిరాశే ఎదురైంది. మ్యాచ్ రెండో అర్ధభాగం స్టాపేజ్ సమయంలో మొరాకో జట్టుకు రిఫరీ పెనాల్టీ ఇవ్వడంపై దుమారం చెలరేగింది. 'డి' ఏరియా లోపల మొరాకో ప్లేయర్ బ్రహిమ్ డియాజ్‌ను సెనెగల్ ప్లేయర్ ఎల్ హాద్జి మలిక్ డియాఫ్ తోసేశాడు. దాంతో రిఫరీ జీన్ జాక్వెస్ మొరాకో జట్టుకు పెనాల్టీ కిక్‌ను ప్రదానం చేశాడు. ఈ నిర్ణయంతో సెనెగల్ ఆటగాళ్లతోపాటు మైదానంలోని ఆ జట్టు అభిమానులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. రెండు జట్ల ఆటగాళ్ల మధ్య కొంచెంసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. కొందరు అభిమానులు మైదానంలోకి దూసుకొచ్చారు. రిఫరీ నిర్ణయాన్ని నిరసిస్తూ సెనెగల్ ఆటగాళ్లు మైదానాన్ని కూడా వీడారు. టీవీ రిప్లేలు చూశాక మొరాకో జట్టుకు రిఫరీ పెనాల్టీ ఇవ్వడం సరైనదేనని తేలింది. దాంతో 14 నిమిషాల తర్వాత మళ్లీ సెనెగల్ ఆటగాళ్లు మైదానంలోకి వచ్చారు. పెనాల్టీని గోల్‌గా మలిచి, కొన్ని నిమిషాలు సెనెగల్‌ను నిలువరిస్తే మొరాకో ఖాతాలో 50 ఏళ్ల తర్వాత ఆఫ్రికా కప్ చేరేది. కానీ అలా జరగలేదు. ఈ టోర్నీలో 5 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచిన మొరాకో స్టార్ బ్రహిమ్ డియాజ్ పెనాల్టీని తీసుకోవడానికి వచ్చాడు. తీవ్రమైన ఒత్తిడిలో డియాజ్ బంతిని నేరుగా కొట్టడం... సెనెగల్ గోల్‌కీపర్ ఎడువార్డో మెండీ దానిని నిలువరించడం జరిగిపోయింది. దాంతో మొరాకో సువర్ణావకాశం చేజారింది. స్టాపేజ్ సమయం ముగియడంతో మ్యాచ్ అదనపు సమయానికి దారి తీసింది. అదనపు సమయంలోని నాలుగో నిమిషంలో కెప్టెన్ ఇద్రిసా గుయె అందించిన పాస్‌ను 'డి' ఏరియా లోపల అందుకున్న పాపె గుయె లక్ష్యానికి చేర్చడంతో సెనెగల్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత స్కోరును సమం చేసేందుకు మొరాకో ఆటగాళ్లు చేసిన ప్రయత్నాలను సెనెగల్ సమర్థంగా అడ్డుకొని టైటిల్‌ను ఖాయం చేసుకుంది.

రూ. 90 కోట్ల 86 లక్షలు

ఆఫ్రికా కప్ టైటిల్ సాధించిన సెనెగల్ జట్టుకు 1 కోటి డాలర్ల (రూ. 90 కోట్ల 86 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. రన్నరప్‌గా నిలిచిన మొరాకో జట్టు ఖాతాలో 40 లక్షల డాలర్లు (రూ. 36 కోట్ల 34 లక్షలు) చేరాయి. మూడో స్థానం పొందిన నైజీరియా జట్టుకు 25 లక్షల డాలర్లు (రూ. 22 కోట్ల 71 లక్షలు), నాలుగో స్థానంలో నిలిచిన ఈజిప్ట్ జట్టుకు 13 లక్షల డాలర్లు (రూ. 11 కోట్ల 81 లక్షలు) లభించాయి. క్వార్టర్ ఫైనల్లో ఓడిన మాలి, ఐవరీకోస్ట్, అల్జీరియా, కామెరూన్ జట్లకు 8 లక్షల డాలర్ల (రూ. 7 కోట్ల 26 లక్షలు) చొప్పున అందజేశారు.

121

మొత్తం 24 జట్ల మధ్య గత డిసెంబర్ 21 నుంచి జనవరి 18 వరకు జరిగిన ఆఫ్రికా కప్ టోర్నీలో మొత్తం 52 మ్యాచ్‌లు జరిగాయి. 121 గోల్స్ నమోదయ్యాయి. మొరాకో ప్లేయర్ బ్రహిమ్ డియాజ్ 5 గోల్స్‌తో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టోర్నీ 'ఉత్తమ ప్లేయర్' అవార్డును సెనెగల్‌కు చెందిన సాదియోమానె గెల్చుకోగా... 'ఉత్తమ గోల్‌కీపర్'గా మొరాకోకు చెందిన యాసిన్ బునుయ్ నిలిచాడు.

2027లో ఎక్కడంటే....

తదుపరి ఆఫ్రికా కప్ టోర్నీకి తొలిసారి మూడు దేశాలు ఉమ్మడిగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 2027లో జరిగే ఈ టోర్నీ కెన్యా, టాంజానియా, ఉగాండా దేశాల్లో జరుగుతుంది. 69 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో రెండుసార్లు మాత్రమే రెండు దేశాలు సంయుక్తంగా (2000లో ఘనా-నైజీరియా; 2012లో ఈక్వెటోరియల్ గినీ-గాబోన్) ఆతిథ్యమిచ్చాయి.

గిల్

'రంజీ' బరిలో గిల్

న్యూఢిల్లీ: భారత టెస్టు, వన్డే జట్ల కెప్టెన్ శుబ్‌మన్ గిల్ విశ్రాంతి తీసుకోకుండా వెంటనే రంజీ ట్రోఫీ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. గిల్ సారథ్యంలోని టీమిండియా 1-2తో తొలిసారి భారత గడ్డపై న్యూజిలాండ్‌కు వన్డే సిరీస్‌ను కోల్పోయింది. ఆదివారమే కివీస్‌తో ఈ సిరీస్ ముగిసింది. రోజుల వ్యవధిలోనే గురువారం నుంచి సౌరాష్ట్రతో తలపడే పంజాబ్ తరఫున రంజీ మ్యాచ్ బరిలోకి దిగేందుకు గిల్ సై అంటున్నాడు. 26 ఏళ్ల ఈ కెప్టెన్ విశ్రాంతి గురించి ఆలోచించడం లేదని, రాజ్‌కోట్‌లో జరిగే రంజీ పోరు కోసం ఇండోర్ నుంచి నేరుగా అక్కడికే పయనమవుతాడని పంజాబ్ జట్టు వర్గాలు తెలిపాయి. గత సీజన్‌లో మాదిరిగా ఈసారి కూడా రంజీ ట్రోఫీకి మధ్యలో విరామమిచ్చారు. ముస్తాక్ అలీ టి20, విజయ్ హజారే వన్డే టోర్నీల కోసం రంజీలకు బ్రేక్ ఇచ్చారు. ఈ రెండు పరిమిత ఓవర్ల ఈవెంట్లు ముగియడంతో గురువారం నుంచి దేశవ్యాప్తంగా మిగిలిన రెండు రౌండ్‌ల రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్ని కొనసాగించనున్నారు. మొత్తం ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో పంజాబ్ ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లాడింది. ఒక మ్యాచ్ గెలిచి మరో మ్యాచ్ ఓడింది. మిగతా మూడింటిని 'డ్రా' చేసుకున్న పంజాబ్ 11 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో ఇంకా మూడే లీగ్ మ్యాచ్‌లున్నాయి. నాకౌట్ దశకు అర్హత సాధించాలంటే ఈ మూడు మ్యాచ్‌ల్నీ తప్పకుండా గెలవాల్సి ఉంటుంది. గిల్ రాకతో పంజాబ్ పటిష్టంగా మారింది.

జార్జియా దేశం పొకా వద్ద ఉన్న పరావనీ సరస్సులో ఎపిఫనీ పండుగ రోజు సంప్రదాయం ప్రకారం మంచునీటిలో ఓ క్రైస్తవుడి స్నానం

రష్యాలోని నోవోసిబిర్స్క్ నగరంలో ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీలకు పడిపోయినా ఓబ్ నదిలో ప్రయాణిస్తున్న స్టాండప్ పెడల్ బోర్డర్లు

బిహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లా మోతిహారీలోని విరాట్ రామాయణ్ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన 33 అడుగుల ఎత్తు, 210 టన్నుల శివలింగం

చైనా జనాభా మరింత తగ్గింది!

2025లో జననాలు 79.2 లక్షలే!
- 2024తో పోలిస్తే 34 లక్షలు తగ్గుదల
- 17 శాతం పడిపోయిన జననాల రేటు
- వరుసగా నాలుగో ఏడాది తగ్గిన జనాభా

బ్యాంకాక్: చైనాలో జనాభా తగ్గుదల క్రమంగా సంక్షోభ స్థాయికి చేరుతోంది. గత ఏడాది కాలంలో దేశంలో జనాభా 33.9 లక్షల మేరకు తగ్గి 140.4 కోట్లకు చేరింది. 2025లో దేశంలో జననాల రేటు ఏకంగా 17 శాతం మేరకు పడిపోయింది. ఇక జననాల సంఖ్య కేవలం 79.2 లక్షలుగా నమోదైంది. 2024తో పోలిస్తే 16.2 లక్షల మేరకు తగ్గింది. ఇక 2025లో చైనాలో మరణాల సంఖ్య 1.131 కోట్లుగా నమోదైంది. గత ఐదు దశాబ్దాల్లో ఇదే అత్యధికం కావడం విశేషం! చైనా నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ఎన్‌బీఎస్) సోమవారం విడుదల చేసిన తాజా జనాభా లెక్కల్లో ఈ వివరాలను పొందుపరిచింది. ఆ దేశంలో జననాల సంఖ్యలో తగ్గుదల నమోదవడం ఇది వరుసగా నాలుగో ఏడాది! ఈ పరిణామం షీ జిన్‌పింగ్ సర్కారుకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే 2100 నాటికి చైనా జనాభా 63.3 కోట్లకు పడిపోతుందని ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం అంచనా వేసింది. చైనా దశాబ్దాల పాటు ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా కొనసాగడం, 2023లో ఆ స్థానాన్ని భారత్‌కు కోల్పోవడం తెలిసిందే.

పెళ్లీ వద్దు, పిల్లలూ వద్దు!

చైనాలో జనాభా తగ్గుదల సమస్యకు ప్రధాన కారణం పిల్లల్ని కనడం పట్ల చైనీయుల్లో వ్యక్తమవుతున్న తీవ్ర నిరాసక్తతే. చుక్కలనంటుతున్న జీవన వ్యయం, భరించలేని ఒత్తిళ్ల నడుమ పిల్లల్ని కని పెంచడం తమవల్ల కాదంటూ సగటు చైనీయులు చేతులెత్తేస్తున్నారు. జీవనవ్యయం ఊహాతీతంగా పెరిగిపోతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. యువతీ యువకుల్లో చాలామంది అసలు పెళ్లి మాటే ఎత్తడం లేదు. వీలైనంత కాలం సింగిల్‌గానే బతుకు బండి లాగించడానికి ఇష్టపడుతున్నారు. దాంతో కొన్నేళ్లుగా చైనాలో పెళ్లిళ్ల సంఖ్యలో కూడా భారీగా తగ్గుదల నమోదవుతోంది. 2024లో దేశవ్యాప్తంగా జరిగిన పెళ్లిళ్లు కేవలం 61 లక్షలే! 2023తో పోలిస్తే ఏకంగా 20 శాతం తగ్గుదల! అంతేకాదు, గత 45 ఏళ్లలో అత్యల్పం కూడా!! దేశవ్యాప్తంగా పెళ్లిళ్ల సంఖ్య గత పదేళ్లుగా తగ్గుతూనే వస్తోంది. అయితే 2025లో మాత్రం చైనాలో పెళ్లిళ్ల సంఖ్య 8.5 శాతం పెరుగుదల నమోదైంది.

పెరుగుతున్న వృద్ధులు

వృద్ధుల సంఖ్య క్రమంగా పెరిగిపోతుండటం చైనా నాయకత్వాన్ని మరింత ఆందోళనకు గురి చేస్తున్న అంశం. ప్రస్తుతం అక్కడ వృద్ధుల సంఖ్య 32.3 కోట్లు. మొత్తం జనాభాలో ఇది ఏకంగా 23 శాతం! అక్కడ వృద్ధుల సంఖ్య ఏటా పెరుగుతూనే వస్తోంది. అదేసమయంలో పనిచేసే వయసువారి సంఖ్యలో తగ్గుదల నమోదవుతోంది. 2035 నాటికి చైనాలో వృద్ధుల సంఖ్య 40 కోట్లు దాటుతుందని అంచనా. కార్మికుల లభ్యత భారీగా తగ్గుతుండటంతో రిటైర్మెంట్ వయసును పురుషులకు 60 నుంచి 63 ఏళ్లకు, మహిళలకు 55 నుంచి 58 ఏళ్లకు చైనా పెంచేసింది.

'పాము' కారణమేనా?

చైనాలో జననాలు భారీగా తగ్గడానికి మరో గమ్మత్తైన కారణం కూడా తెరపైకి రావడం విశేషం. అదే... స్నేక్ ఇయర్! చైనా క్యాలెండర్ ప్రకారం 2025 వుడ్ స్నేక్ నామ సంవత్సరం. పాము పేరిట వచ్చే ఏడాది పిల్లల్ని కనేందుకు అస్సలు అనువైనది కాదన్నది చైనీయుల నమ్మకం. ఈ కారణంగా కూడా గతేడాది జననాల రేటు బాగా తగ్గిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చైనాలో సంవత్సరాలకు జంతువుల పేర్లు పెట్టడం వేల ఏళ్లనాటి సంప్రదాయం. 12 ఏళ్లకు 12 జంతువుల పేర్లుంటాయి.

వన్ చైల్డ్ పాలసీ

జనాభా నియంత్రణకు దశాబ్దాల పాటు చైనా అనుసరించిన కఠిన నిబంధనలు కూడా ప్రస్తుత పరిస్థితికి మరో ప్రధాన కారణంగా మారాయి. ఒక్కరి కంటే ఎక్కువ మందిని ఇకనేందుకు వీల్లేదన్న నిబంధనను 1980 ఉంచి చైనా అత్యంత కఠినంగా అమలు చేయడం తెలిసిందే. జనాభా తగ్గుదల నేపథ్యంలో పదేళ్ల క్రితం ఈ నిబంధనను ఎత్తేసినా లాభం లేకపోయింది. దంపతులు ఇద్దరు పిల్లల్ని కనొచ్చంటూ 2015లో నిబంధనలను చైనా ప్రభుత్వం సడలించింది. ఐదేళ్లయినా పెద్దగా ఫలితం లేకపోవడంతో 2021లో దాన్ని ముగ్గురు పిల్లలకు పెంచింది. అయినా జనం మాత్రం ఎక్కువ మందిని దేవుడెరుగు, ఒక్కర్ని కూడా కనేందుకు ఇష్టపడటం లేదు! ఒక్కో కాన్పుకు 3,600 యువాన్లు (500 డాలర్లు) ఇస్తామన్న ప్రకటన కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. అంతేగాక ప్రతి పిల్లాడికీ పెంపకం నిమిత్తం ఏటా 1,534 డాలర్లు ఇస్తామన్నా జనం అంతగా పట్టించుకోలేదు. ఇలా కాదని ప్రభుత్వం కండోమ్‌ల వాడకాన్ని తగ్గించే చర్యలకు దిగింది. అందులో భాగంగా వాటిపై, గర్భనిరోధక మాత్రలపై ఎడాపెడా పన్నులు పెంచేసింది. కండోమ్‌లపై అయితే జనవరి 1 నుంచి పన్నులను మరో 13 శాతం పెంచేసింది! అంతేగాక డే కేర్ సెంటర్లు, కేజీ స్కూళ్లకు పలు పన్ను మినహాయింపులు వంటి పలు చర్యలకు కూడా దిగింది. అయినా జనాభా పెరుగుదల విషయంలో ఆశించిన ఫలితాలు పెద్దగా కనిపించడం లేదని తాజా గణాంకాలు మరోసారి తేల్చేశాయి. ఒక దేశంలో జనాభా పెరగాలంటే మహిళల సగటు సంతాన సాఫల్య రేటు కనీసం 2.1, అంతకు మించి ఉండాలి. కానీ చైనాలో మాత్రం అది 2020 నాటికే ఏకంగా 1.3కి తగ్గిపోయింది! ఇక 2025లోనైతే ఆ దేశంలో జననాల రేటు ప్రతి 1,000 మంది జనాభాకు ఏకంగా 5.63 శాతానికి తగ్గిపోయింది. 1949లో మావో జె డాంగ్ సారథ్యంలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచీ ఆ దేశ చరిత్రలో ఇప్పటిదాకా ఇదే అత్యల్పం! చైనాతో పాటు తైవాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి పలు తూర్పు ఆసియా దేశాల్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తూ వస్తోంది!!

రష్యాలో అమెరికా పౌరుడికి జైలు శిక్ష

మాస్కో: అక్రమంగా ఆయుధాలను సరఫరా చేస్తున్న ఆరోపణలపై అమెరికా పౌరుడొకరికి రష్యా కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అమెరికాకు చెందిన ఛార్లెస్ వేన్ జిమ్మెర్‌మ్యాన్ అనే వ్యక్తిని గతేడాది జూన్‌లో నల్ల సముద్రంలో పడవలో ప్రయాణిస్తూ తీర నగరం సోచి చేరుకున్నాడు. రష్యా కస్టమ్స్ అధికారులు అతడి పడవలో ఉన్న ఒక రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై జిమ్మెర్‌మ్యాన్‌పై కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన మహిళ కోసమే తాను సోచి వచ్చానని, ఆత్మరక్షణ కోసం రైఫిల్‌ను కొనుగోలు చేశానని అతడు తెలిపాడు. ఆయుధం కలిగి ఉండటం నేరమనే విషయం తనకు తెలియదని వాదించాడు. విచారణ జరిపిన సోచిలోని న్యాయస్థానం అతడికి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. దీనిపై అమెరికా అధికారులు స్పందించలేదు.

చర్చిలపై సాయుధుల దాడి.. 168 మంది కిడ్నాప్

అబుజా: నైజీరియాలో సాయుధ ముఠాలు ఏకకాలంలో వేర్వేరు చోట్ల ఉన్న మూడు చర్చిలపై దాడులు జరిపి 168 మందిని బందీలుగా పట్టుకెళ్లారు. కుదునా రాష్ట్రంలోని కజురు ఏరియాలో ఆదివారం ప్రార్థనల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాయుధులు మొత్తం 177 మందిని బెదిరించి తీసుకెళ్లారని, వీరిలో 11 మంది తిరిగి వచ్చారని అధికారులు తెలిపారు. మరో 168 మంది జాడ తెలియాల్సి ఉందన్నారు. దీనిపై బాధ్యతంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. ఘటనపై పోలీసులు స్పందించలేదు.

దక్షిణాఫ్రికాలో రోడ్డు ప్రమాదం..

13 మంది బాలలు మృతి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో స్కూలు బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 13 మంది బాలలు చనిపోయారు. జొహన్నెస్‌బర్గ్ సమీపంలోని గౌటెంగ్ ప్రావిన్స్‌లో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. బాధితులందరూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన బాలలు. వీరిని తీసుకెళ్తున్న ప్రైవేట్ మినీ బస్సు ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రక్కును ఢీకొట్టింది. ఘటనలో అక్కడికక్కడే 11 మంది బాలలు చనిపోగా, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని అధికారులు తెలిపారు. గాయపడిన మరో ఏడుగురు విద్యార్థులను ఆస్పత్రులకు తరలించారు.

26కు పెరిగిన పాక్ మాల్ మృతుల సంఖ్య

50కి పెరిగే అవకాశం

కరాచీ: పాకిస్తాన్‌లోకి కరాచీలో జనసమ్మర్థ గుల్ ప్లాజా షాపింగ్ మాల్‌లో శనివారం రాత్రి జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో మృతుల సంఖ్య సోమవారానికి 26కు పెరిగింది. దాదాపు 60 మంది మంది జాడ గల్లంతైంది. మంటలను ఆదివారం రాత్రి అదుపులోకి తెచ్చారు. దీంతో భారీ హోల్‌సేల్, రిటైల్ దుకాణాల సముదాయమైన ఈ షాపింగ్ మాల్‌లోకి సోమవారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది ప్రవేశించి శిథిలాలను తొలగిస్తున్నారు. మరికొందరి మృతదేహాలు లభ్యమవడంతో మరణాల సంఖ్య పెరిగింది. ఇంకా పలువురు ఆచూకీ తెలియాల్సి ఉందని 'రెస్క్యూ 1122'అధికార ప్రతినిధి హసన్ ఉల్ హసీబ్‌ఖాన్ చెప్పారు. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో మరణాల సంఖ్య 50 దాటవచ్చని కరాచీ కమిషనర్ హసన్ నక్వీ అభిప్రాయపడ్డారు. ఘటనపై సింధ్ ముఖ్యమంత్రి మురాద్ అలీ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలో కోటి పాకిస్తాన్ రూపాయలను ఆయన ఎక్స్‌గ్రేషియాగా ప్రకటించారు. ప్రమాదంలో షాపింగ్‌మాల్‌లోని దాదాపు 300 కోట్ల పాక్ రూపాయల సరకు బుగ్గిపాలైందని అంచనావేస్తున్నారు. భవనం చాలా గంటలపాటు కాలిపోవడంతో నిర్మాణం బాగా దెబ్బతిన్నదని, దాదాపు భవనం మొత్తాన్ని నేలమట్టం చేయాల్సి రావొచ్చని అధికారులు అంచనావేస్తున్నారు. కరాచీలో సరైన రక్షణ, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, అధిక విద్యుత్ లోడు, అక్రమ నిర్మాణాల కారణంగా గతంలో పలు షాపింగ్ మాల్స్ ప్రమాదాల బారిన పడ్డాయి.

తీవ్రంగా దెబ్బతిన్న మాల్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

అప్పుడు చట్టబద్ధ హామీ ఇప్పుడు మోదీ ఇచ్చే మిఠాయి

ఉపాధి హామీ పథకం మార్పుపై ఖర్గే, రాహుల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: రెండు దశాబ్దాలపాటు గ్రామీణులకు కోట్లాది పనిదినాలు కల్పించి ఉపాధిని అందించిన విఖ్యాత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఎంజీనరేగా)ను పక్కకుతోసి మోదీ సర్కార్ లోపభూయిష్ట వీబీ–జీ రామ్‌జీ చట్టాన్ని తీసుకొచ్చిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో జనవరి 10న మొదలెట్టిన ఎంజీనరేగా బచావో సంగ్రామ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖర్గే, రాహుల్ గ్రామీణులకు ఒక లేఖ రాశారు. ''20 ఏళ్ల క్రితం నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎంజీనరేగా పథకం ద్వారా గ్రామీణులకు ఉపాధిని చట్టబద్ధ హామీగా అందించారు. పథకం 180 కోట్ల పనిదినాలు అందించింది. దీంతో గ్రామాల్లో నీళ్లట్యాంక్‌లు, రోడ్లు, చెరువుల పునరుద్ధరణ ఇలా 10 కోట్ల ఆస్తుల సృష్టి జరిగింది. కోవిడ్ సంక్షోభం కాలంలో గ్రామీణులకు ఉపాధిని కల్పించి గ్రామీణ భారత ఆర్థికానికి జీవనాడిగా మారింది. అలాంటి ఎంజీనరేగా ఆత్మను మోదీ సర్కార్ ప్రణాళిక ప్రకారం చంపేస్తోంది. గతంలో గ్రామపంచాయతీ పరిధిలో పని అడిగిన 15 రోజుల్లోపు ఇచ్చే అవకాశం ఉండేది. ఇప్పుడు పని అనేది మోదీ ఇచ్చే మిఠాయి లాంటిది. మోదీ సర్కార్ నిర్ణయిస్తేనే పని దొరుకుతుంది. ఈ పథకంలో ఏ గ్రామ పంచాయతీకి పని ఇవ్వాలనేది మోదీ నిర్ణయిస్తారు. గతంలో పనికి కనీస వేతనం దక్కేది. ఏటా వేతన సవరణ ఉండేది. ఇప్పుడు ఏటా సవరణ అనే దానికి గ్యారెంటీ లేదు. పంటకోత కాలంలో ఇకపై పని ఉండదు. దీంతో కనీస వేతనం అందుకున్నా బలవంతంగానైనా ఏ పనినైనా కార్మికులు చేయాల్సి ఉంటుంది ''అని ఆ లేఖలో ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు.

అధికారాన్ని బీజేపీ కేంద్రీకృతం చేయాలని చూస్తోంది

మహాపంచాయత్‌లో రాహుల్ విమర్శ

కొచ్చి: దేశంలో అధికారాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌లు కేంద్రీకృతం చేయాలని కుట్ర పన్నుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. కేరళలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన నేతలతో సోమవారం కొచ్చిలో జరిగిన 'మహాపంచాయత్' కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ''73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు మూడంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థను తీసుకొచ్చాయి. కాంగ్రెస్‌కు వికేంద్రీకరణపై అపార విశ్వాసం. కానీ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు కేంద్రీయపాలన అంటే మక్కువ ఎక్కువ. రాజ్యాంగాన్ని పరిరక్షించడమంటే గ్రామాల స్థాయి నుంచే వికేంద్రీయ పరిపాలనను పరిరక్షించడం. జనం మౌనంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోంది. తద్వారా దేశ సంపదపై కొన్ని కార్పొరేట్ సంస్థలకే గుత్తాధిపత్యం కట్టబెట్టాలని ఆశపడుతోంది. భారత్‌పై ఆశపడే వాళ్ల మాటలనే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వింటున్నాయిగానీ భారతీయుల గొంతుకను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వినదల్చుకోలేదు పంచాయతీల వంటి స్థానిక స్వపరిపాలనా సంస్థలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఎంజీనరేగావంటి పథకాలనై ఎన్‌డీఏ ప్రభుత్వం దాడిచేసి వాటిని కనుమరుగుచేస్తోంది. ఇలాంటి పెడధోరణిని కేరళ ప్రజలు ఏమాత్రం సహించరు. మౌనంగా ఉండబోరు. వచ్చే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు ద్వారా కేరళ ప్రజలు తమ మనోగతాన్ని సూటిగా చెప్పబోతున్నారు. ఇటీవల స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్(యూడీఏఫ్) కూటమి అద్భుతమైన ఫలితాలను సాధించింది. స్థానిక ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకం నాకుంది. అయితే కేరళలో నిరుద్యోగిత అనేది పెద్ద సమస్యగా ఉంది. దీనికి యూడీఏఫ్, కాంగ్రెస్ పరిష్కారం చూపుతాయని ఆశిస్తున్నా''అని రాహుల్ అన్నారు.

ఢిల్లీ హైకోర్టులో సెంగర్‌కు చుక్కెదురు

- ఉన్నావ్ కేసు బాధితురాలి తండ్రి 'కస్టడీ'మరణం కేసులో..
- పదేళ్ల శిక్ష రద్దు అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు

న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌లో ఉన్నావ్‌లో అత్యాచార బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన ఉదంతంలో దోషిగా తేలిన బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కస్టడీ మరణం కేసులో 2020 మార్చి 13న తనకు పడిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దుచేయాలన్న అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ కేసును ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రవీందర్ దుదేజా సోమవారం విచారించారు. ''గతంలోనే దోషిగా తేలిన పిటిషనర్ ఇప్పటికే ఏడున్నర సంవత్సరాలు జైలు జీవితం పూర్తిచేసుకున్న విషయం మాక్కూడా తెలుసు. ఈ ఏడున్నరేళ్లలో ఆయన తన శిక్ష రద్దు కోసం పిటిషన్లను ధర్మాసనం వినలేదు. ఎందుకంటే ఆయన శిక్షను రద్దుచేయాలంటూ చాలాసార్లు మధ్యంతర పిటిషన్లు దాఖలుచేశారు. ఇవి చాలవన్నట్లు బెయిల్ పొడిగింపు కోసం ఇంకొన్ని, మొత్తం శిక్ష రద్దు కోరుతూ మరికొన్ని పిటిషన్లు వేశారు. ఇన్ని పిటిషన్లు దాఖలుచేయడం వల్లే అసలైన పిటిషన్ విచారణకు నోచుకోలేదు. శిక్షరద్దు కోరుతూ వేసిన పిటిషన్‌లో ఎలాంటి పస లేదు. అందుకే ఆయన అభ్యర్థనను తిరస్కరిస్తున్నాం. గత శిక్ష రద్దుకు సంబంధించిన న్యాయ సూత్రాలు ఈయనకు వర్తించవు. ఈ ఉదంతంలో వాస్తవాలు, తదనంతర పరిణామాలను పరిగణనలోకి తీసుకుని పిటిషనర్ శిక్ష రద్దుకు మేం సమ్మతి నిరాకరిస్తున్నాం. మిగతా శిక్ష నుంచి పిటిషనర్‌కు మినహాయింపు ఇచ్చేందుకు ఎలాంటి బలమైన సహేతుక కారణాలు లేవు. ఏడున్నర సంవత్సరాల కారాగార శిక్ష అనుభవించిన పిటిషనర్‌కు కేసులో విచారణ ఆలస్యమైందన్న కారణంగా ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వలేం. ఈ అంశాన్ని ఫిబ్రవరి మూడో తేదీన తిరిగి విచారిస్తాం'' అని జడ్జి చెప్పారు.

తీర్పుపై సంతోషం వ్యక్తంచేసిన బాధితురాలు

పదేళ్ల శిక్ష రద్దు అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించడంపై ఉన్నావ్ బాధితురాలు సంతృప్తి వ్యక్తంచేశారు. ''కోర్టు నిర్ణయంతో నేనెంతో సంతృప్తిగా ఉన్నా. మా నాన్న ఆత్మ కూడా శాంతిస్తుంది. దోషులందరికీ మరణశిక్ష అమలయ్యాకే నిజంగా ఆయన ఆత్మ శాంతిస్తుంది. ఇది కేవలం నా యుద్ధం కాదు. న్యాయం, సత్యం కోసం పోరాటం. నా తుది శ్వాసదాకా పోరాడతా''అని ఆమె వ్యాఖ్యానించారు.

ఇది ప్రచార ప్రయోజనాల వ్యాజ్యం

న్యాయ సంస్కరణలకు దాఖలైన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్

న్యూఢిల్లీ: న్యాయ సంస్కరణలపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అది ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం కాదని.. ప్రచార ప్రయోజనాల వ్యాజ్యమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యాకాంత్ అన్నారు. న్యాయ వ్యవస్థలో మార్పుల కోసం కోర్టును వేదికగా వాడుకోవడం సరికాదని, పిటిషనర్ కావాలంటే సూచనలు లిఖితపూర్వకంగా తనకు రాసి పంపాలని సూచించారు. ప్రతి కేసును 12 నెలల వ్యవధిలో పరిష్కరించాలని, న్యాయ సంస్కరణలను పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి తోసిపుచ్చారు. బయట ఉన్న కెమెరాల ముందు మాట్లాడటానికి పిటిషన్లు దాఖలు చేయవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒక సంవత్సరంలోపు తీర్పు వెలువరించాలని మీరు కోరుతున్నారు. అలాగైతే మీకు ఎన్ని కోర్టులు కావాల్సి ఉంటుంది? అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేయండి, అదనపు కోర్టులను ఏర్పాటు చేయండని కోరతారు. ఈ కోర్టులను ఎక్కడ నుంచి ఏర్పాటు చేస్తారు?'అని ఆయన ప్రశ్నించారు. పిటిషనర్‌కు ఆసక్తి ఉంటే.. న్యాయ సంస్కరణల కోసం పరిపాలనా అంశాలపై సూచనలు ఏవైనా ఉంటే, ప్రధాన న్యాయమూర్తికి లేఖగా సమర్పించవచ్చని, అలాంటి సూచనలను స్వాగతిస్తామని పేర్కొన్నారు.

నీడలేని మానసిక వికలాంగులకు ఆశ్రయం కల్పించండి

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: నిలువ నీడ లేని మానసిక వికలాంగుల సంక్షేమంపై సుప్రీంకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్న అటువంటి వారి పునరావాసం కోసం నిర్దిష్టమైన ప్రామాణిక నిర్వహణ విధానా(ఎస్‌వోపీ)లను రూపొందించేందుకు కేంద్రప్రభుత్వానికి ఆఖరు అవకాశం ఇస్తున్నట్లు తెలిపింది. మానసిక సంబంధ రుగ్మతలతో బాధపడే అభాగ్యుల రక్షణ కోసం ప్రత్యేక విధానాలను రూపొందించాలని కోరుతూ లాయర్ గౌరవ్ బన్సల్ వేసిన పిల్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ ఛహర్ అందుబాటులో లేనందున సమాధానమిచ్చేందుకు మరింత సమయం కావాలని కేంద్ర తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నచికేత్ జోషి కోరారు. 'ఇది చాలా సున్నితమైన అంశం. ఎస్‌వోపీల అమలే ఇందులో కీలకం. ఇప్పటికే రెండు అవకాశాలిచ్చాం. ఇప్పుడు ఆఖరి ఛాన్సు ఇస్తున్నాం'అని పేర్కొన్న ధర్మాసనం తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదావేసింది.

ప్రణయ్ రాయ్‌కి ఐటీ నోటీసులను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ఎన్‌డీటీవీ వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌లకు 2016లో ఆదాయ పన్ను శాఖ ఇచ్చిన నోటీసులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ నోటీసులు ఏకపక్షం, ప్రాథమిక, రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకమని వ్యాఖ్యానించిన అత్యున్నత న్యాయస్థానం..ఇద్దరికీ రూ. లక్ష చొప్పున చెల్లించాలని ఆదాయపన్ను శాఖను ఆదేశించింది. ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌లను ఒకే విధమైన లావాదేవీకి సంబంధించి ఒకే అంశంపై రెండుసార్లు మదింపు చేయడం అధికారుల పరిధికి మించిన చర్యగా జస్టిస్ వినోద్ మెహతా, జస్టిస్ వినోద్ కుమార్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు అనవసరమైన వేధింపులకు, అరాచకత్వానికి కూడా దారితీస్తాయని వ్యాఖ్యానించింది. ఆదాయ పన్ను శాఖ అధికారుల చర్య ఏకపక్షం, చట్ట విరుద్ధం, ప్రాథమిక నిబంధనలకు వ్యతిరేకం'అని పేర్కొన్న ధర్మాసనం ఐటీ నోటీసులను కొట్టివేసింది.

ఎమ్మెల్యే భార్య గృహ హింస కేసును తేల్చండి

ఢిల్లీ హైకోర్టుకు సుప్రీం నాలుగు నెలల గడువు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే రఘురాం ప్రతాప్ సింగ్ అలియాస్ రాజా భయ్యాపై ఆయన భార్య వేసిన గృహ హింస కేసును నాలుగు నెలల్లోగా తేల్చాలని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ హైకోర్టును ఆదేశించింది. కేసు ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో ఉన్నందున, వేరుగా విచారణ చేపట్టలేమంటూ రాజా భయ్యా భార్య భన్వీ సింగ్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశం ఫిబ్రవరి 12వ తేదీన ఢిల్లీ హైకోర్టు ముందుకు రానుందని తెలిపిన ధర్మాసనం, ఆరోజున విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరే హక్కు పిటిషనర్‌కు ఉంటుందని పేర్కొంది. అందుకే, నాలుగు నెలల పరిమితి విధించినట్లు తెలిపింది. రాజా భయ్యాపై ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఎన్‌క్లేవ్ పోలీస్ స్టేషన్‌లో గృహ హింస చట్టం కింద కేసు నమోదైంది. ఈ మేరకు అతడిపై చర్యలు తీసుకోవాలని దిగువ కోర్టు ఆదేశించగా, హైకోర్టు స్టే విధించింది. భర్తతోపాటు, అత్త తనను శారీరకంగా, మానసికంగా ఏళ్లుగా వేధిస్తున్నారని, తాళలేక వేరుగా ఉంటున్నట్లు భన్వీ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమెరికాలో త్రుటిలో తప్పిన విమాన ప్రమాదం

ఓర్లాండో: అమెరికాలోని ఓర్లాండో అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన ప్రమాదం త్రుటిలో తప్పింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం క్రాష్ ల్యాండింగ్‌ను తప్పించుకుంది. షికాగోలోని ఓహేర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యునైటెడ్ ఫ్లైట్ 2323, ఎయిర్‌బస్ 321 ఉదయం 8.55 గంటలకు బయలుదేరింది. మధ్యాహ్నం 12.35గంటలకు ఓర్లాండోకు వచ్చిన విమానంలో 200 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ల్యాండింగ్ సమయంలో సాంకేతిక లోపంతో ముందు చక్రం ఊడిపోయింది. ఎట్టకేలకు విమానాన్ని పైలట్ ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా దించేసి.. ఎయిర్‌బస్‌ను రన్‌వే పైనుంచి తొలగించారు. ఈ సంఘటనతో విమాన రాకపోకలకు ఆలస్యం అయ్యింది. సాంకేతిక లోపానికి కారణాలు తెలియరాలేదు. అయితే, వాతావరణం ఒక కారణం కావచ్చని భావిస్తున్నారు. గాలులతో కూడిన వాతావరణం నేపథ్యంలో, ఫ్లోరిడా తూర్పు తీరం వెంబడి బ్రెవార్డ్ కౌంటీలోని అనేక ప్రాంతాలకు వాతావరణ కేంద్రం అధిక గాలి హెచ్చరికను జారీ చేసింది.

వ్యత్యాసాలున్న వాళ్ల జాబితా విడుదల చేయండి

- వాటిని గ్రామపంచాయతీల్లో ప్రదర్శించండి
- బెంగాల్ సర్కార్‌కు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా కొనసాగించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముసాయిదా జాబితాలో మేరకు పేర్లలో అక్షర క్రమ తప్పులు(స్పెల్లింగ్), తల్లిదండ్రుల పేర్లు సరిపోలకపోవడం, ఓటర్‌కు తల్లితండ్రుల వయసు వ్యత్యాసం మరీ తక్కువగా 15 ఏళ్లు ఉండటం లేదా మరీ ఎక్కువగా 50 ఏళ్లు ఉండటం వంటి తార్కిక వ్యత్యాసాలున్న వారి పేర్లతో సిద్ధంచేసిన విడి జాబితాను తక్షణం ఓటర్లకు అందుబాటు ఉంచాలని, వాటిని గ్రామపంచాయతీ భవన్‌లలో ప్రదర్శించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ''ఈ తార్కిక వ్యత్యాసాలపై వివరణ ఇచ్చేందుకు, తగు డాక్యుమెంట్లు, పత్రాలను సమర్పించేందుకు ఆయా ఓటర్లకు అవకాశం ఇవ్వండి. ఈ తార్కిక వ్యత్యాసాల జాబితాను వెంటనే పశ్చిమబెంగాల్‌లోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, బ్లాక్ ఆఫీస్‌లలో ఓటర్లకు అందుబాటులో ఉంచండి. డాక్యుమెంట్ల సమర్పణకు, అభ్యంతరాల వెల్లడికి అవకాశం కల్పించండి''అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం సోమవారం ఈసీకి ఆదేశాలిచ్చింది. ''తార్కిక వ్యత్యాసాల జాబితాలో ఏకంగా 1.25 కోట్ల మంది ఓటర్ల పేర్లు ఉన్నాయి. ఇంత మంది అందించే భారీ స్థాయి అర్జీలు, డాక్యుమెంట్లను స్వీకరించేందుకు సరిపడా సహాయక సిబ్బందిని ఈసీ కోసం పశ్చిమబెంగాల్ రాష్ట్ర సర్కార్ కేటాయించాలి. పెద్ద సంఖ్యలో ఓటర్లు గ్రామపంచాయతీ భవన్‌లకు తమ పత్రాలను పోటెత్తే అవకాశం ఉండటంతో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సరిపడా స్థాయిలో పోలీస్ సిబ్బందిని మోహరించాలి''అని కోర్టు సూచించింది.

సమాజ శాస్త్ర పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

భారతీయ సమాజం
సమాజ శాస్త్ర మౌలికాంశాలు - కులం

1. 'సమాజ శాస్త్రం' (Sociology) అనే పదాన్ని మొదట రూపొందించిందెవరు?
ఎ) సోక్రటీస్ బి) అరిస్టాటిల్
సి) ఆగస్ట్ కోమ్ట్ డి) దుర్ఖ్‌హైమ్
2. 2011 జనాభా లెక్కల ప్రకారం కింది వాటిని జతపరచండి?
1) హిందువులు ఎ) 79.8 శాతం
2) ముస్లింలు బి) 14.2 శాతం
3) క్రైస్తవులు సి) 2.3 శాతం
4) సిక్కులు డి) 1.7 శాతం
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
బి) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
డి) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి
3. సమాజ శాస్త్రం పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) దుర్ఖ్ హైమ్ బి) మాక్స్ వెబర్
సి) అరిస్టాటిల్ డి) ఆగస్ట్ కోమ్ట్
4. భారతీయ సమాజం వివిధ జాతుల ప్రదర్శన శాల (Ethnological Museum) అని పేర్కొన్నవారు?
ఎ) వి.ఎ.స్మిత్ బి) జిమ్మెల్
సి) పరేటో డి) మాకియవెల్లీ
5. సమాజ శాస్త్రం శాస్త్రీయంగా దేన్ని అధ్యయనం చేస్తుంది?
ఎ) మానవుడిని
బి) మానవ సంఘాలను
సి) వ్యక్తుల మధ్య ఉన్న సామాజిక సంబంధాలను
డి) పౌరుల హక్కులు, విధులను
6. భారత రాజ్యాంగం ఎన్ని భాషలను గుర్తించింది?
ఎ) 22 బి) 24
సి) 25 డి) 26
7. ది పీపుల్ ఆఫ్ ఇండియా గ్రంథాన్ని ఎవరు రచించారు?
ఎ) మలినో విస్కీ బి) బి.ఎస్. గుహా
సి) రిస్లీ డి) హెడన్
8. సమాజ శాస్త్రం (Sociology) అనే పదం లాటిన్ భాషలోని సొసైటస్(Societus), గ్రీకు భాషలోని లోగోస్(Logos) అనే పదాల నుంచి ఉద్భవించింది. దీని అర్థం?
ఎ) సమాజం, శాస్త్రం
బి) సమాజం, సూత్రాలు
సి) సామూహిత, శాస్త్రం
డి) సామాహికత, శాస్త్రం
9. కింది వాటిలో దక్షిణ భారత సాంస్కృతిక అంశం కానిది?
ఎ) హిందుస్తానీ సంగీతం
బి) జల్లికట్టు సి) యక్షగానం
డి) భరతనాట్యం
10. 'మానవుడు సామాజిక జంతువు' అని చెప్పిన వారు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) దుర్ఖ్ హైమ్
సి) హెర్బర్ట్ స్పెన్సర్ డి) అరిస్టాటిల్
11. సమాజం అంటే 'సామాజిక సంబంధాల అల్లిక' అని చెప్పిందెవరు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) మెక్ ఐవర్ డి) మాక్స్ వెబర్
12. పరిణామ సిద్ధాంతాన్ని మొదట ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) దుర్ఖ్ హైమ్ డి) చార్లెస్ డార్విన్
13. 'ది సోషల్ సిస్టమ్' గ్రంథ రచయిత?
ఎ) మెర్టన్ బి) పార్సన్స్
సి) కార్ల్‌మార్క్స్ డి) ఆగస్ట్ కోమ్ట్
14. సోషల్ థియరీ అండ్ సోషల్ స్ట్రక్చర్ గ్రంథ రచయిత?
ఎ) రాబర్ట్ కె మర్టన్ బి) రాబర్ట్ పార్క్
సి) రాడ్‌క్లిఫ్ బ్రౌన్ డి) దుర్ఖెయిమ్
15. 'ఎక్కడైతే జీవితం ఉందో, అక్కడ సమాజం ఉంది' అని చెప్పింది?
ఎ) మెక్ ఐవర్ బి) కింగ్స్‌లీ డేవిస్
సి) దుర్ఖ్ హైమ్ డి) మాక్స్ వెబర్
16. సంస్కృతి అంటే?
ఎ) వేషభాషలు, నడవడి విధానం, మతం, కళలు మొదలైన వాటి సమ్మేళనం
బి) శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధి
సి) ఒక సముదాయం సాధించిన ఉన్నత అంశాలు
డి) పైవన్నీ
17. 'సోషల్ చేంజ్ ఇన్ మోడర్న్ ఇండియా' అనే గ్రంథ రచయిత?
ఎ) రామ్ అహుజా బి) కుప్పుస్వామి
సి) కేట్కార్ డి) ఎం.ఎన్. శ్రీనివాస్
18. 'ద సోషల్ కాంట్రాక్ట్' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) టానీస్ బి) రూసో
సి) అరిస్టాటిల్ డి) ప్లేటో

19. 'ఇంత వరకు ఉన్న సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాట చరిత్రయే' అని పేర్కొన్నవారు? (గ్రూప్-2, 2000 బ్యాగ్‌లాగ్ పోస్ట్)
ఎ) లెనిన్ బి) మావో
సి) కార్ల్ మార్క్స్ డి) హిట్లర్
20. కులం అభివ్యక్తీకరణల్లో అస్పృశ్యతను అతినికృష్టమైందిగా పరిగణించిన వారు? (సీడీపీవో-2013)
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్
బి) సర్దార్ పటేల్
సి) నెహ్రూ డి) గాంధీ
21. 'క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) హట్టన్ బి) ఘుర్యే
సి) కుప్పుస్వామి
డి) ఎం.ఎన్. శ్రీనివాస్
22. ఉన్నత అంతస్తును సాధించడానికి తొలిమెట్టుగా...ఉన్నత కులాల వారి ఆచారాలు, నమ్మకాలను నిమ్న కులాల వారు సమష్టిగా అవలంభించే ప్రక్రియను ఏ పేరుతో పిలుస్తారు? (సీడీపీవో-2013)
ఎ) ఆధునికీకరణ బి) సంస్కృతీకరణ
సి) పాశ్చాత్యీకరణ డి) నగరీకరణ
23. గ్రామాల్లో కులాల మధ్య సంబంధాలను నియంత్రించే వ్యవస్థ ఏది? (సీడీపీవో-2013)
ఎ) బంధుత్వం
బి) వర్గం సి) స్నేహం
డి) జాజ్‌మాని(Jajmani)
24. బ్రహ్మ ఏ అవయవం నుంచి క్షత్రియులు ఆవిర్భవించారు? (సీడీపీవో-2013)
ఎ) పాదాలు బి) తొడలు
సి) చేతులు డి) భుజాలు
25. కుల క్రమానుగత శ్రేణిలో అన్నిటికంటే పై శ్రేణిలో ఉండేవారు? (సీడీపీవో-2013)
ఎ) వైశ్యులు బి) బ్రాహ్మణులు
సి) శూద్రులు డి) క్షత్రియులు
26. 'ది అన్‌టచబుల్స్' అనే గ్రంథాన్ని రాసిందెవరు?
ఎ) శ్రీనివాస్ బి) అంబేద్కర్
సి) ఘుర్యే డి) గాంధీ
27. అస్పృశ్యులను 'హరిజనులని' సంబోధించింది? (సీడీపీవో-2013)
ఎ) లాల్ బహదూర్ శాస్త్రి
బి) అంబేద్కర్
సి) విద్యాసాగర్ డి) గాంధీ
28. కింది వాటిలో ఏది కుల లక్షణం కాదు?
ఎ) అంతర్వివాహం
బి) వృత్తి అనుబద్ధత
సి) ఛాయ(Colour)
డి) సహపంక్తి భోజన కట్టుబాటు
29. ఒక వ్యక్తి కుల సభ్యత్వం దేని ఆధారంగా నిర్ణయిస్తారు?
ఎ) అంతస్తు బి) సంపద
సి) పుట్టుక డి) ఆరోగ్యం
30. కులం ఒకే _____ సమూహం.
ఎ) బహిర్వివాహిత బి) సంవృత
సి) అంతర్వివాహిత డి) అనివార్య
31. కులం, వర్గం, అధికారం(Caste, Class and Power) గ్రంథం రచించింది ఎవరు?
ఎ) పి.వి.బెయిలీ
బి) అంద్రె బీటెల్లీ
సి) ఎం.ఎన్. శ్రీనివాస్
డి) హట్టన్
32. ఎలాంటి అంటరానితనాన్ని అయినా నిషేధించే ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్-14 బి) ఆర్టికల్-17
సి) ఆర్టికల్-16 డి) ఆర్టికల్-18
33. కుల వ్యవస్థకు ___ స్వభావం ఉంటుంది?
ఎ) క్రమానుగత శ్రేణి(Hierarchical)
బి) సౌష్ఠవ(Symmetrical)
సి) పరస్పర వ్యతిరేక(Contradictory)
డి) సహకార(Co-operative)
34. కిందివాటిలో కులవ్యవస్థను బలహీన పరచని కారణాలేవి?
ఎ) పారిశ్రామికీకరణ, నగరీకరణ
బి) రవాణా సౌకర్యాలు పెరగడం
సి) రాజ్యాంగం
డి) రిజర్వేషన్ పాలసీ
35. కింది వాటిలో కుల వ్యవస్థ లక్షణం కానిది?
ఎ) శుచి- అశుచి
బి) క్రమానుగత శ్రేణి ఆరాధన
సి) క్రమానుగత శ్రేణి
డి) వారసత్వ రీత్యా వచ్చే ప్రత్యేకీకరణ
36. కులస్తరీకరణకు ఇది ఆధారం?
ఎ) పునర్జన్మ
బి) వర్ణాశ్రమ వ్యవస్థ - చతుర్వర్ణాలు
సి) పురుషార్థాలు
డి) మత విభాగం
37. రుగ్వేదంలో పేర్కొనని వర్ణాలు ఏవి?
ఎ) ఆర్య, శూద్ర వర్ణాలు
బి) ఆర్య, దాస వర్ణాలు
సి) బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు
డి) క్షత్రియ, శూద్ర వర్ణాలు
38. భారతీయ కులవిధానం గురించి ప్రస్తావన మొట్టమొదట దేనిలో కనిపిస్తుంది?
ఎ) మహాభారతం బి) ఉపనిషత్తులు
సి) వేదాలు డి) రామాయణం
39. క్యాస్ట్(Caste)అనే పదం ఏ భాషలోని కాస్టా (Casta) అనే పదం నుంచి ఆవిర్భవించింది?
ఎ) స్పానిష్, పోర్చుగీసు బి) జర్మన్
సి) లాటిన్ డి) ఏదీకాదు
40. అస్పృశ్యులు ముందంజ వేయక పోవడానికి కారణం?
ఎ) విజ్ఞాన లేమి బి) నిరక్షరాస్యత
సి) అల్పులమనే భావన
డి) సంప్రదాయ ధోరణులు
41. కుల వ్యవస్థలో లేని అంశం?
ఎ) ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం
బి) శ్రామికులు గతిశీలతను తిరస్కరించడం
సి) వ్యక్తులకు వృత్తులను ఇవ్వడం
డి) సహకారాన్ని అందించడం
42. కుల వ్యవస్థను బ్రాహ్మణులే, బ్రాహ్మణుల కోసం సృష్టించారని పేర్కొన్నవారు?
ఎ) ఆబె దుబాయ్(Abbe Dubois)
బి) జి.ఎస్. ఘుర్యే(G. S. Ghurye)
సి) కేట్కర్ డి) ఎం.ఎన్. శ్రీనివాస్
43. భారతీయ సమాజంలోని స్తరీకరణ రూపం?
ఎ) సామాజిక వర్గం
బి) అంతస్తు సమూహం
సి) ఎస్టేట్ డి) కులం
44. 'ఒకే పేరును కలిగి, ఒకే పూర్వీకుడి సంతతి అని భావిస్తూ ఒకే సజాతీయ సముదాయంగా మెలుగుతూ ఉండే కొన్ని కుటుంబాల మొత్తమే కులం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్ బి) హెర్బర్ట్ రిస్లే
సి) మెకైవర్ డి) హట్టన్
45. వెలికి గురైనవారు (Out castes).. కుల వ్యవస్థాపన ఫలితమే. కుల వ్యవస్థను నిర్మూలిస్తే తప్ప వారిని స్వతంత్రులను చేయలేమని భావించిన వారు?
ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
బి) మహాత్మాగాంధీ సి) కామరాజ్
డి) బి.ఆర్.అంబేద్కర్
46. సరైన క్రమాన్ని తెల్పండి?
1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
3) వైశ్యులు 4) శూద్రులు
ఎ) 1, 2, 3, 4 బి) 4, 3, 2, 1
సి) 4, 3, 1, 2 డి) 2, 1, 3, 4
47. సంస్కారపరమైన అశుచి (Ritual Pollution) కి ఆధారాలు?
ఎ) జన్మ బి) శరీరం నుంచే వచ్చే వాసనలు
సి) మరణం
డి) జనన, మరణాలు
48. కింది వాటిలో సరికానిది?
ఎ) కులం సంస్కృతి వాహకంగా పనిచేస్తుంది
బి) కులం సామాజిక గతిశీలతను ప్రోత్సహిస్తుంది
సి)కులం రాజకీయాలతో ముడిపడి ఉంటుంది
డి) కులం సామాజిక జీవనానికి కావలసిన ప్రకార్యాలను తీరుస్తుంది.

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) ఎ; 5) సి; 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి; 11) సి; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ; 16) డి; 17) డి; 18) బి; 19) సి; 20) సి; 21) డి; 22) బి; 23) డి; 24) డి; 25) బి; 26) బి; 27) డి; 28) సి; 29) సి; 30) సి; 31) బి; 32) బి; 33) ఎ; 34) బి; 35) బి; 36) బి; 37) బి; 38) సి; 39) ఎ; 40) సి; 41) ఎ; 42) ఎ; 43) డి; 44) బి; 45) డి; 46) ఎ; 47) ఎ; 48) బి.

బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?

గ్రహాలు

మాదిరి ప్రశ్నలు

1. గ్రీకు భాషలో ప్లానెట్ అనే పదం దేన్ని సూచిస్తుంది?
ఎ) విశ్వంలో ఒక వస్తువు
బి) ఎల్లప్పుడూ తిరుగుతున్న వస్తువు
సి) స్వయం ప్రకాశకత్వం
డి) ఉపగ్రహాలను కలిగింది
2. సూర్యుడు ఏ రకమైన నక్షత్రం?
ఎ) పెద్ద పరిమాణం ఉన్న నక్షత్రం
బి) చిన్న పరిమాణం ఉన్న నక్షత్రం
సి) మరుగుజ్జు నక్షత్రం
డి) మధ్యతరహా పరిమాణం ఉన్న నక్షత్రం
3. సూర్యుడి తర్వాత దగ్గరగా ఉన్న నక్షత్రం?
ఎ) ప్రాక్సిమా సెంటారీ బి) సీరియస్
సి) QBI-352 డి) మెఘాలినిక్ మేఘం
4. సౌరకుటుంబం కలిగిన మన పాలపుంతకు భారతీయులు పెట్టిన పేరు?
ఎ) శివగంగ బి) పాతాళగంగ
సి) ఆకాశగంగ డి) హిమగంగ
5. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) కోపర్నికస్ బి) టాలమీ
సి) భాస్కరాచార్యుడు డి) న్యూటన్
6. సౌరకుటుంబాన్ని మొదట పరిశీలించినవారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఐన్‌స్టీన్ డి) పొల్సన్
7. భూమిపై ఉన్న ప్రతి వస్తువుపైనా గురుత్వ బలం సమానంగా ఉంటుందని నిరూపించిన వారు?
ఎ) కోపర్నికస్ బి) జిల్లెట్
సి) గెలీలియో డి) డాప్లర్
8. బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) జార్జియస్ లైమెట్రీ బి) హబుల్
సి) గెలీలియో డి) న్యూటన్
9. ప్రస్తుతం సౌరకుటుంబంలో గుర్తించిన గ్రహాల సంఖ్య?
ఎ) 7 బి) 8 సి) 9 డి) 10
10. భూమికి దగ్గరగా ఉన్న ఖగోళ వస్తువు?
ఎ) సూర్యుడు బి) అంగారకుడు
సి) చంద్రుడు డి) బుధుడు
11. సూర్యుడి నుంచి గ్రహాలకు మధ్య దూరాన్ని కొలవడానికి ఉపయోగించే ప్రమాణం?
ఎ) కాంతి సంవత్సరం
బి) ఖగోళ ప్రమాణం సి) పార్-సెక్
డి) పైవన్నీ
12. సూర్యుడి చుట్టూ గ్రహాలు ఏ మార్గంలో పరిభ్రమిస్తున్నాయి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

ఎ) సరళరేఖ బి) వృత్తాకార
సి) దీర్ఘవృత్తాకార డి) వక్రమార్గం
13. సూర్యుడికి దగ్గరగా ఉన్న గ్రహం?
ఎ) శుక్రుడు బి) బుధుడు
సి) భూమి డి) శని
14. ధ్రువ నక్షత్రం పేరు?
ఎ) జొడాయిక్ బి) ఎప్సిలాన్ అరిగా
సి) పొలారిస్ డి) ఆండ్రోమెడ్
15. హేలీ తోకచుక్క ఎన్నేళ్లకు ఒకసారి కనిపిస్తుంది?
ఎ) 66 బి) 76
సి) 86 డి) 100
16. కిందివాటిలో ఏ గ్రహం పగలు ఎక్కువ వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది?
ఎ) శుక్రుడు బి) అంగారకుడు
సి) బృహస్పతి డి) బుధుడు
17. సౌరకుటుంబంలో పరిమాణంలో భూమి ఏ స్థానంలో ఉంది?
ఎ) 1 బి) 2
సి) 4 డి) 5
18. సౌరకుటుంబంలోని గ్రహాల చలనాలను పరిశీలించిన దేశస్థులు?
ఎ) భారతీయులు బి) చైనీయులు
సి) గ్రీకులు డి) జపనీయులు
19. రెండు గ్రహాల మధ్య దూరం రెండింతలు అయినప్పుడు వాటి మధ్య విశ్వగురుత్వాకర్షణ బలం?
ఎ) రెండు రెట్లు తగ్గుతుంది
బి) రెండు రెట్లు పెరుగుతుంది
సి) నాలుగు రెట్లు పెరుగుతుంది
డి) నాలుగు రెట్లు తగ్గుతుంది
20. ఒక ఇనుపగోళం, అల్యూమినియం గోళాలను ఒకే ఎత్తు నుంచి శూన్యంలో ఒకేసారి జారవిడిచినప్పుడు ఏది ముందుగా కిందికి చేరుతుంది?
ఎ) ఇనుపగోళం
బి) అల్యూమినియం గోళం
సి) రెండూ ఒకేసారి కిందికు చేరుతాయి
డి) రెండూ పైకి వెళ్తాయి
21. ఒక వస్తువు భారం ఎక్కడ ఎక్కువగా ఉంటుంది?
ఎ) భూమి కేంద్రం వద్ద
బి) భూమధ్యరేఖ వద్ద
సి) ధ్రువాల వద్ద
డి) పైవన్నీ
22. ప్రదేశాన్ని బట్టి ఒక వస్తువుకు చెందిన ఏ భౌతికరాశి మారుతుంది?
ఎ) ద్రవ్యరాశి బి) ఘనపరిమాణం
సి) ఆకారం డి) భారం
23. చంద్రుడిపై గురుత్వ త్వరణం విలువ?
ఎ) $9.8ms^{-2}$ బి) $9.8cms^{-2}$
సి) $1.67cms^{-1}$ డి) $1.67ms^{-2}$
24. భూమిపై పలాయన వేగం?
ఎ) $11.2\ kms^{-1}$ బి) $11.2\ ms^{-1}$
సి) $11.2\ cms^{-1}$ డి) $1.12\ ms^{-1}$
25. విశ్వగురుత్వాకర్షణ నియమాన్ని ప్రతిపాదించిన వారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) అరిస్టాటిల్ డి) కోపర్నికస్
26. భూస్థిర ఉపగ్రహం ఆవర్తన కాలం?
ఎ) 24 సెకన్లు బి) 24 నిమిషాలు
సి) 24 గంటలు డి) 24 రోజులు
27. ఇప్పటివరకు కనుగొన్న ఉపగ్రహాల్లో అతి పెద్దది?
ఎ) చంద్రుడు బి) గనిమెడ
సి) యూరోపా డి) ఫోబోస్
28. భూమిని పోలిన ఉపగ్రహం?
ఎ) చంద్రుడు బి) ఫోబోస్
సి) టైటాన్ డి) పైవన్నీ
29. శాస్త్రవేత్తలు ఇటీవల భూమిని పోలిన గ్రహాన్ని కనుగొన్నారు. దానిపేరు?
ఎ) సూపర్ నోవా బి) సూపర్ ఎర్త్
సి) సుప్రీం ఎర్త్ డి) న్యూ ఎర్త్ గ్లోబ్
30. ప్లూటో ఉపగ్రహం చరాన్ గురించి పరిశోధించడానికి ప్రయోగించిన అంతరిక్ష నౌక పేరు?
ఎ) న్యూహారిజాన్ బి) కేసిని
సి) హ్యూగన్స్ డి) స్పిట్జర్
31. మరుగుజ్జు గ్రహం హోదా పొందిన గ్రహం?
ఎ) బుధుడు బి) అంగారకుడు
సి) భూమి డి) ప్లూటో
32. భూమిపై సముద్రంలో ఆటుపోటులు ఏర్పడటానికి కారణం?
ఎ) భూమి, సూర్యుడికి మధ్య ఉన్న విశ్వ గురుత్వార్షణ బలం
బి) భూమి, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వ గురుత్వాకర్షణ బలాలు
సి) సూర్యుడు, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
డి) భూమి, అంగారకుడి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
33. విశ్వం గురించి అధ్యయనం చేయడాన్ని ఏమంటారు?
ఎ) కాస్మాలజీ బి) ఆస్ట్రానమీ
సి) స్పేస్ డి) జియాలజీ
34. భూమికి ఇతర వస్తువులను ఆకర్షించే గురుత్వాకర్షణ బలం ఉందని వివరించిన తొలి భారతీయ శాస్త్రవేత్త?
ఎ) ఆర్యభట్ట బి) భాస్కరాచార్యుడు
సి) బ్రహ్మగుప్తుడు డి) వరాహమిహిరుడు
35. సూర్యుడిలో పొరలు ఏవి?
ఎ) ఫొటోస్ఫియర్ బి) క్రోమోస్ఫియర్
సి) కరోనా డి) పైవన్నీ
36. ఏ గ్రహాన్ని ఉదయతార, సాయంత్రం తారగా పిలుస్తారు?
ఎ) అంగారకుడు బి) శుక్రుడు
సి) శని డి) యురేనస్
37. అరుణ గ్రహం అని దేన్ని పిలుస్తారు?
ఎ) శని బి) భూమి
సి) అంగారకుడు డి) బృహస్పతి
38. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహం స్థానాన్ని కింది కక్ష్య నుంచి పై కక్ష్యవరకు పెంచినప్పుడు దాని కక్ష్యావేగం?
ఎ) పెరుగుతుంది
బి) తగ్గుతుంది సి) మారదు
డి) రెండు రెట్లు పెరుగుతుంది
39. బృహస్పతి ఉపగ్రహం పేరు?
ఎ) గనిమెడ బి) యూరోపా
సి) కెలిస్టో డి) పైవన్నీ
40. సౌరకుటుంబంలో గరిష్ఠ సాంద్రత ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) శని
సి) బృహస్పతి డి) బుధుడు
41. సంవత్సర కాలవ్యవధి తక్కువగా ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) బుధుడు
సి) యురేనస్ డి) శని
42. భూస్థిర ఉపగ్రహాలను భూమి కేంద్రం నుంచి ఎన్ని కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెడతారు?
ఎ) 3,600 కి.మీ. బి) 36,000 కి.మీ.
సి) 42,400 కి.మీ. డి) 56,500 కి.మీ.
43. మన పాలపుంత వ్యాసం సుమారు ఎన్ని కాంతి సంవత్సరాలు?
ఎ) 102 బి) 103
సి) 104 డి) 105
44. కాస్మిక్ సంవత్సరం దేని ప్రమాణం?
ఎ) దూరం బి) కాలం
సి) ద్రవ్యరాశి డి) పరిమాణం
45. భూ కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు?
ఎ) టాలమీ బి) కోపర్నికస్
సి) గెలీలియో డి) న్యూటన్
46. గ్రహం ఏ భౌతికరాశిపై పలాయనవేగం ఆధారపడి ఉంటుంది?
ఎ) ద్రవ్యరాశి బి) వ్యాసార్థం
సి) గురుత్వ త్వరణ విలువ
డి) ఆకారం
47. చంద్రుడిపై పలాయన వేగం?
ఎ) $2.42\ ms^{-1}$ బి) $2.42\ kms^{-1}$
సి) $2.42\ cms^{-1}$ డి) $11.2\ kms^{-1}$
48. సౌరకుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలకు కావలసిన అభికేంద్రక బలాన్ని అందించేవి?
ఎ) విద్యుత్ బలాలు
బి) విశ్వగురుత్వాకర్షణ బలాలు
సి) అయస్కాంత బలాలు
డి) పైవన్నీ
49. సంవత్సర కాలవ్యవధి గరిష్ఠంగా ఉన్న గ్రహం?
ఎ) శని బి) బృహస్పతి
సి) నెప్ట్యూన్ డి) శుక్రుడు
50. భూమికి అతిచేరువలో పరిభ్రమిస్తోన్న కృత్రిమ ఉపగ్రహ ఆవర్తన కాలం (సుమారుగా)?
ఎ) 24 గంటలు బి) 10 గంటలు
సి) 500 సెకన్లు డి) 5000 సెకన్లు

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) సి; 5) ఎ; 6) బి; 7) సి; 8) ఎ; 9) బి; 10) సి; 11) బి; 12) సి; 13) బి; 14) సి; 15) బి; 16) డి; 17) డి; 18) సి; 19) డి; 20) సి; 21) సి; 22) డి; 23) డి; 24) ఎ; 25) ఎ; 26) సి; 27) బి; 28) సి; 29) బి; 30) ఎ; 31) డి; 32) సి; 33) ఎ; 34) సి; 35) డి; 36) బి; 37) సి; 38) బి; 39) డి; 40) ఎ; 41) బి; 42) సి; 43) డి; 44) బి; 45) ఎ; 46) డి; 47) బి; 48) బి; 49) సి; 50) డి.

విద్య, ఉద్యోగ సమాచారం

టీఐఎఫ్‌ఆర్, ముంబైలో ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్‌ఆర్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:**2
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్ల లోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,000 నుంచి 49,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.01.2026
» **వెబ్‌సైట్:** https://www.tifr.res.in

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం 2026-28 విద్యాసంవత్సరంలో ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ అర్హతతో పాటు క్యాట్ 2025, మ్యాట్ 2025, సీమ్యాట్ 2026కు హాజరైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **కోర్సు:** రెండేళ్ల ఎంబీఏ ఫుల్‌టైమ్ కోర్సు
» **మొత్తం సీట్ల సంఖ్య:** 75
» **అర్హతలు:** ఏదైనా డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణత.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 09.01.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**31.01.2026
» **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

యూసీఎస్ఎల్‌లో అప్రెంటిస్‌లు

కర్ణాటక రాష్ట్రంలో ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 05.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-03, డిప్లొమా అప్రెంటిస్‌లు-02.
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:**22.12.2025 నాటికి 18ఏళ్లు ఉండాలి
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15,000, డిప్లొమా అప్రెంటిస్‌కు13,200.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.01.2026
» **వెబ్‌సైట్:** https://udupicsl.com

ఆదిలాబాద్‌లో పశ్చిమ కనుమలను ఏ పేరుతో పిలుస్తారు?

తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ఎత్తైన కొండలు, గుట్టలతో; ఎగుడు, దిగుడులతో శిలాప్రాంతంగా ఉండేది. కొన్ని మిలియన్ ఏళ్ల కాలంలో క్రమక్షయానికి గురై వికోశీకరణ చెంది అవశిష్ట పీఠభూమిగా ఏర్పడింది. నదుల కోతల వల్ల అక్కడక్కడా సమతల ప్రదేశాలతో పెనిప్లేన్లు ఏర్పడ్డాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ భూగోళ శాస్త్రం

తెలంగాణ నైసర్గిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం పురాతన గోండ్వానా ప్రాంతం నుంచి విడిపోయిన ద్వీపకల్ప భారతదేశంలో భాగం. ఇది దక్కన్ పీఠభూమి ప్రాంతానికి చెందింది. సముద్రమట్టానికి 150–600 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పీఠభూమి:

- ❖ దక్కన్ పీఠభూమి మీసోజోయిక్ కాలానికి చెందింది. ఈ పీఠభూమిలో అగ్నిమయ ఉదర విచ్ఛేదనం వల్ల లావా పెల్లుబుకి, ఘనీభవించడం ద్వారా బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.
- ❖ తెలంగాణ పీఠభూమిలో హైదరాబాద్.. సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది రాష్ట్ర రాజధాని.
- ❖ పడమటి పీఠభూమి ఆర్కియన్ శిలలతో ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి 450 నుంచి 600 మీటర్ల వరకు ఎత్తు ఉంది.
- ❖ తెలంగాణ పీఠభూమి ఉత్తరాన ఆదిలాబాద్‌లోని నిర్మల్ గుట్టల నుంచి దక్షిణాన మహబూబ్‌నగర్‌లోని అమ్రాబాద్ గుట్టల వరకు వ్యాపించి ఉంది.
- ❖ ఉత్తర భాగంలో గోదావరి నదీలోయలో గోండ్వానా శిలలు ఉన్నాయి.
- ❖ గోండ్వానా శిలల్లో ప్రధాన ఖనిజం–బొగ్గు.

తెలంగాణ పీఠభూమిలో

2 రకాల శిలలు ఉన్నాయి. అవి.

1. గోండ్వానా శిలలు
2. దక్కన్ శిలలు

గోండ్వానా శిలలు: పురాతన యుగం తర్వాత ప్రకృతి ఉత్పాతాల వల్ల ఏర్పడిన వృక్ష సంబంధిత అవక్షేప శిలలను 'గోండ్వానా శిలలు' అంటారు. ఈ శిలల్లో అత్యధికంగా దొరికే ఖనిజం – బొగ్గు.

దక్కన్ శిలలు: అగ్ని పర్వత ఉద్భేదనం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఇవి తెలంగాణలోని గోదావరి నది పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

- ❖ ఉత్తర తెలంగాణ (ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం)లో గొండ్వానా శిలలతో బొగ్గు నిక్షేపాలు ఏర్పడ్డాయి. ఇవి గోదావరి నది వెంబడి ఉన్నాయి.
- ❖ హైదరాబాద్‌లో దక్కన్ పీఠభూమి సముద్రమట్టానికి 600 మీటర్ల ఎత్తులో, కృష్ణా–తుంగభద్ర నదీ లోయల మధ్య 350–450 మీటర్ల ఎత్తులో, భీమా–గోదావరి నదుల మధ్య 730 మీటర్ల ఎత్తులో ఉంది.
- ❖ మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య ఈ పీఠభూమి 600–900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పర్వతాలు (కొండలు, గుట్టలు):

తెలంగాణ ప్రాంతంలో అనేక రకాల కొండలు, గుట్టలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పర్వత శ్రేణులకు సంబంధించిన ముఖ్యాంశాలు..

- ❖ పడమటి కనుమలు లేదా సహ్యాద్రి పర్వతాలు అజంతా శ్రేణి నుంచి విడిపోయి ఆగ్నేయ దిశగా తెలంగాణ ప్రాంతంలోకి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఈ పర్వతాలు కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల వరకు విస్తరించాయి.

ఈ పర్వతాలను కింద చూపిన విధంగా వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

జిల్లా పేరు	పర్వతాల స్థానిక పేరు
ఆదిలాబాద్	నిర్మల్ గుట్టలు
కరీంనగర్	రాఖీ గుట్టలు
వరంగల్	కందికల్ గుట్టలు
ఖమ్మం	పాపి కొండలు

తెలంగాణ పీఠభూమిలో తూర్పు కనుమలు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించి, రంగారెడ్డి, నల్గొండ వరకు విస్తరించాయి. వీటిని కూడా వివిధ జిల్లాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు.

జిల్లా	పర్వతాలు
మహబూబ్‌నగర్ అమ్రాబాద్ కొండలు	నల్లమల కొండలు,
రంగారెడ్డి	అనంతగిరి గుట్టలు, రాచకొండ గుట్టలు
నల్గొండ	నంది కొండలు, యాదగిరి గుట్ట.

- ❖ తెలంగాణ పీఠభూమి సముద్రమట్టానికి 531 మీ. ఎత్తులో లేదా 1741 అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది.
- ❖ హైదరాబాద్ – సికింద్రాబాద్ జంట నగరాలను హుస్సేన్‌సాగర్ వేరు చేస్తోంది. దీన్ని మూసీ ఉపనది అయిన కల్వలేరు నదికి అడ్డుకట్ట వేసి నిర్మించారు. హిమాయత్‌సాగర్ లేదా ఉస్మాన్‌సాగర్‌ను మూసీ ఉపనది అయిన ఈసా వాగుపై నిర్మించారు. ఇది హైదరాబాద్ నగరానికి పశ్చిమాన 25 కి.మీ. దూరంలో ఉంది.
- ❖ పోచారం సరస్సును మంజీరా ఉపనది అయిన ఆలేరు పాయపై నిర్మించారు. ఇది నిజామాబాద్ జిల్లాలో ఉంది.
- ❖ ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ హస్తకళలకు, పెయింటింగ్స్‌కు ప్రఖ్యాతి చెందింది. అదే జిల్లాలోని కడెం నదిపై 45 మీటర్ల ఎత్తులో కుంతాల జలపాతం ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం.
- ❖ మల్లూరు ఉగ్రనరసింహస్వామి దేవాలయం వరంగల్ జిల్లాలోని మంగపేటలో ఉంది.
- ❖ కంచర్ల గోపన్న నిర్మించిన భద్రాచలం దేవాలయం ఖమ్మం జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉంది.
- ❖ 1980లో మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు మారిన తెలుగు ఫిలిం కల్చర్ (టాలీవుడ్ ఇండస్ట్రీ) దేశంలోనే రెండో అతిపెద్ద సినీ పరిశ్రమ.

తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రదేశాలు

- **ఓరుగల్లు:** నాటి కాకతీయ రాజధాని. నేడు ఖిలా వరంగల్‌గా పేర్కొంటున్నారు. 12వ శతాబ్దంలో మట్టికోట, రాతి కోటలను నిర్మించారు. వీటి మధ్యలో కాకతీయుల చిహ్నంగా నిలిచిన కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్‌లు ఉన్నాయి.
  - ❖ ఇక్కడ భద్రకాళీ దేవాలయం, రుద్రేశ్వర ఆలయం (వెయ్యి స్తంభాల గుడి) వంటి చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి.
  - ❖ దీనికి సమీపంలో రామప్ప ఆలయం అద్భుత శిల్పకళా సౌందర్యానికి ప్రతీక.
- **పిల్లల మర్రి:** మహబూబ్‌నగర్‌లో సుమారు మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న మహావృక్షం. దీని మొదలు, కొమ్మక్కెడో గుర్తించడానికి వీలు లేకుండా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇది పట్టణ కేంద్రానికి సుమారు 4 కి.మీ.ల దూరంలో ఉంది.
- **మెదక్ చర్చి:** ఆసియాలోనే అతి పెద్దదైన మెదక్ డయాసిస్‌లో ఈ చర్చిని గోథిక్ నిర్మాణ శైలిని అనుసరిస్తూ 1914లో నిర్మించారు. ఈ చర్చి టవర్ ఎత్తు దాదాపు 173 అడుగులు. ఇక్కడ ఒకేసారి 5000 మంది ప్రార్థన చేసుకోవచ్చు.
- **వేములవాడ:** కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం.. రాజరాజేశ్వర దేవాలయానికి ప్రసిద్ధి. ఈ ఆలయాన్ని దక్షిణ కాశీ అంటారు. ఇది తెలంగాణలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే, అత్యధిక భక్తులు దర్శించే ఆలయాల్లో ఒకటి.
- **కొలనుపాక జైన మందిరం:** ఇది హైదరాబాద్–వరంగల్ రోడ్డుపై ఆలేరు దగ్గరలోని కొలనుపాకలో ఈ దేవాలయం ఉంది. ఇది తెలంగాణలోని అత్యంత ప్రాశస్తి కలిగిన జైన మందిరం.
- **జ్ఞాన సరస్వతీ దేవాలయం:** ఇది ఆదిలాబాద్‌లోని బాసరలో ఉంది. దేశంలో ఉన్న రెండు సరస్వతీ దేవాలయాల్లో ఇది ఒకటి. ఆదిలాబాద్ నుంచి సుమారు 157.6 కి.మీ. దూరంలో ఉంది.
- **శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం:** ఇది నల్గొండ జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

మాదిరి ప్రశ్నలు

1. రాఖీ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా?
   1) ఆదిలాబాద్
   2) కరీంనగర్
   3) వరంగల్
   4) ఖమ్మం
2. కుంతాల జలపాతం ఏ జిల్లాలో ఉంది?
   1) వరంగల్
   2) కరీంనగర్
   3) ఆదిలాబాద్
   4) ఖమ్మం
3. తెలంగాణలో 'దక్షిణ కాశీ'గా పేరొందిన దేవాలయం?
   1) వేములవాడ రాజరాజేశ్వరాలయం
   2) బాసర సరస్వతీ ఆలయం
   3) యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి
   4) ఆలంపూర్ నవబ్రహ్మ ఆలయం
4. పిల్లలమర్రి ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్
   2) రంగారెడ్డి
   3) నల్గొండ
   4) మహబూబ్‌నగర్
5. హైదరాబాద్ సముద్ర మట్టానికి సుమారుగా ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
   1) 200 మీ. 2) 450 మీ.
   3) 600 మీ. 4) 1000 మీ.
6. పశ్చిమ కనుమలు తెలంగాణ రాష్ట్రంలోకి ఏ జిల్లాలో మొదట ప్రవేశిస్తాయి?
   1) నిజామాబాద్
   2) రంగారెడ్డి
   3) మహబూబ్‌నగర్
   4) ఆదిలాబాద్
7. ఆదిలాబాద్ జిల్లాలో పశ్చిమ కనుమలను ఏ పేరుతో పిలుస్తారు?
   1) కందికల్ గుట్టలు 2) నిర్మల్ గుట్టలు
   3) రాచ కొండలు 4) పాపి కొండలు
8. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య దక్కన్ పీఠభూమి ఎంత ఎత్తులో విస్తరించి ఉంది?
   1) 600-900 మీటర్లు
   2) 350-450 మీటర్లు
   3) 700-850 మీటర్లు
   4) 200-375 మీటర్లు
9. అనంతగిరి పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
   1) నల్గొండ
   2) మెదక్
   3) రంగారెడ్డి 4) కరీంనగర్
10. అమ్రాబాద్ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
    1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
    3) నల్గొండ 4) ఆదిలాబాద్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 3; 6) 4; 7) 2; 8) 1; 9) 3; 10) 2.

Model Questions

USB in data cables stands for?

BANK EXAMS

COMPUTER AWARENESS

1. To make the number keypad act as directional arrows you press the ________ key.
   a) Num lock b) Caps lock
   c) Arrow lock d) Shift
   e) None of these
2. The skill to find an individual item in a file instantly ___ is used
   a) File allocation table
   b) Directory
   c)Sequential access
   d) Direct access
   (e) None of these
3. _____ memory improves processing by acting as a temporary high-speed holding area between the memory and the CPU.
   a) RAM
   b) ROM
   c) Cache memory
   d) Flash memory
   e) EPROM
4. A DVD is an example of a(n) _____
   a) Hard disk b) Optical disc
   c) Output device
   d) Solid-state storage device
   e) None of these
5. A ___ is a resourcefully designed "empty" document that can be adapted to the user's needs
   a) File b) Guide
   c) Template d) User guide file
   e) None of these
6. The hardware device normally referred to as the 'brain' of the computer is the___
   a) RAM chip b) Data input
   c) CPU
   d) Secondary storage
   e) None of these
7. One of the oldest calculating devices was
   a) Arithmometer
   b) Ready reckoner
   c) Abacus d) All of these
   e) None of these
8. All formula in Excel start with
   a) % b) +
   c) = d) – e) None of these
9. The Recycle Bin stores discarded items until _______
   a) Another user logs on
   b) The computer is shut down
   c) The end of the day
   d) You empty it
   e) None of these
10. Which of the following special effects can you use for the slide background?
    a) Gradient b) Texture
    c) Picture d) All of these
    e) None of these
11. Which of the following is not a valid formula in Microsoft Excel?
    a) = A2 + A1 b) = A2 + 1
    c) = A1 + A3 d) = 1A + 2
    e) = A1 + A2
12. What does the acronym ISP stands for?
    a) Internal Service Provider
    b) International Service Provider
    c) Internet Service Provider
    d) Internet Service Providing
    e) Internet Service Provision
13. What is the full form of WWW?
    a) Work Wide Web
    b) World Wide Web
    c) World with Wet
    d) World Wide Wet
    e) World Weak Web
14. Which of the following is hardware?
    a) Assembler b) Server
    c) Compiler d) Interpreter
    e) OS
15. USB in data cables stands for?
    a) Unicode Smart Bus
    b) Universal Structural Bus
    c) Unicode Serial Bus
    d) Universal Smart Bus
    e) Universal Serial Bus
16. Which of the following is not a binary number?
    a) 11101 b) 110 c) 233
    d) 1001 e) 100110
17. ___ is approximately one billion bytes.
    a) Megabyte b) Kilobyte
    c) Terabyte d) Gigabyte
    e) Bit
18. A normal compiler takes source code as input and produces ___ as output
    a) Machine code
    b) Object code
    c) Assembly code
    d) C++
    e) None of these
19. ____ is an internet forum to discuss spacious range of topics like current news, articles and current affairs, etc.
    a) E-Learning b) Chatting
    c) E-Discussions
    d) Newsgroup e) None of these
20. A technique in which a number of similar items or transactions to be processed are grouped and processed in a designated sequence during a machine run is
    a) Batch processing
    b) Online processing
    c) Real time processing
    d) All of these e) None of these
21. Ada is a/an _______
    a) High-level programming language for the development of defense
    b) Structured programming language
    c) Association of data processing
    d) All of the above
    e) None of the above
22. What is the number of bit patterns provided by a 7-bit code?
    a) 256 b) 128 c) 64
    d) 512 e) All of these
23. Regarding a VDU, which statement is more correct?
    a) It is a peripheral device
    b) It is an input device
    c) It is an output device
    d) It is a hardware item
    e) None of the above
24. Which printer is very commonly used for desk top publishing?
    a) Dot matrix printer
    b) Ink Jet Printer
    c) Daisy wheel printer
    d) Laser printer
    e) None of these
25. The radix of a hexadecimal system is:
    a) 8 b) 3 c) 16
    d) 2 e) 10
26. Which of the following are types of sound files?
    a) LOG files b) DAT files
    c) WAV files d) DAV files
    e) None of these
27. Permanent Memory in computer is called
    a) RAM b) Auxiliary storage
    c) CPU d) CD ROM
    e) None of these
28. Apple Macintoshes (Macs) and PCs use different CPU's to process data and different__
    a) Languages b) Methods
    c) Operating system
    d) Storage devices
    e) None of these
29. Smaller and less expensive PC based servers are replacing

today ________ in many businesses
    a) Super computers
    b) Clients
    c) Laptops
    d) Mainframes
    e) None of the above
30. After a picture has been taken with a digital camera and processed appropriately, the actual print of the picture is considered
    a) Data b) Output
    c) Input d) The process
    e) None of these
31. _____ is the science that attempts to produce machines that display the same type of intelligence that humans do.
    a) Nanoscience
    b) Nanotechnology
    c) Simulation
    d) Artificial intelligence
    e) None of the above
32. SMTP, FTP and DNS are applications of the ____ layer.
    a) Data link b) Network
    c) Transport d) Application
    e) None of these
33. ____ provides a common address space and routes the packets of data across the entire internet?
    a) IP b) TCP c) UDP
    d) ALU e) None of these
34. ____ was the precursor to internet as we know it today?
    a) ARPANET b) USENET
    c) TELNET d) DBMS
    e) None of these
35. Hardware that adds two numbers is:
    a) The control unit
    b) An internal CPU register
    c) Arithmetic Unit
    d) Browser
    e) None of these
36. What is the decimal from of 3b4?
    a) 846 b) 848 c) 946
    d) 948 e) None of these
37. The term _______ designate equipment that might be added to a computer system to enhance its functionality.
    a) Digital device
    b) System add
    c) Disk pack
    d) Peripheral device
    e) None of these
38. A device designed to read information encoded onto a small plastic card is..
    a) Light pen
    b) Pun chard card
    c) Magnetic tape
    d) Magnetic e) Badge reader
39. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is
    a) Generalization
    b) Inheritance c) Encapsulation
    d) Information hiding
    e) None of these
40. This part of operating system manages the essential peripherals, such as the keyboard, screen, disk drives, and parallel and serial ports_____
    a) Basic input / output system
    b) Secondary input / output system
    c) Peripheral input / output system
    d) Marginal input / output system
    e) None of these
41. Which of the following is not a type of key?
    a) Alphabetic Keys
    b) Numeric keys
    c) Function keys
    d) Toggle keys
    e) None of these
42. What is gutter margin?
    a) Margin that is added to the left margin when printing
    b) Margin that is added to right margin when printing
    c) Margin that is added to the binding side of page when printing
    d) Margin that is added to the outside of the page when printing
    e) None of these
43. To insert a new slide in a presentation, press_____
    a) CTRL+N b) CTRL+M
    c) CTRL+O d) CTRL+S
    e) CTRL+F
44. ______ is a combination of software and hardware
    a) Firmware b) Shareware
    c) Freeware d) Netware
    e) Software
45. Memory which forgets everything when you switch off the power is known as
    a) Corrupted
    b) Volatile
    c) Non-Volatile
    d) Non - Corrupted
    e) None
46. Format command is used to create_____
    a) Sector b) Memory
    c) Tracks d) Tracks and sector
    e) None of these

KEY

1) a 2) d 3) c 4) b 5) c 6) c 7) a 8) c 9) d 10) d 11) d 12) c 13) b 14) b 15) e 16) c 17) d 18) b 19) d 20) a 21) d 22) b 23) a 24) d 25) c 26) c 27) b 28) c 29) d 30) b 31) d 32) d 33) a 34) a 35) c 36) d 37) d 38) e 39) b 40) a 41) e 42) c 43) b 44) a 45) b 46) d